www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

బుధవారం | 17-7-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 92 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, గ్రీష్మఋతువు, ఆషాఢమాసం, శుక్లపక్షం, తిథి: ఏకాదశి రా. 9.03 తదుపరి ద్వాదశి; నక్షత్రం: అనూరాధ తె. 3.13 తదుపరి జ్యేష్ఠ; వర్జ్యం: ఉ.6.23-8.04; దుర్ముహూర్తం: ఉ.11.55-12.47; అమృతఘడియలు: సా.4.23-6.03; రాహుకాలం: మ.12.00-1.30; సూర్యోదయం: 5.53; సూర్యాస్తమయం: 6.48 | హైదరాబాద్ సిటీ *

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

జమ్మూకశ్మీర్‌లో ఎన్‌కౌంటర్.. నలుగురు జవాన్ల మృతి


మృతి చెందిన జవాన్లకు నివాళి అర్పిస్తున్న సహచరులు

మృతుల్లో ఏపీకి చెందిన డొక్కరి రాజేశ్, ఆర్మీ కెప్టెన్ బ్రిజేశ్ థాపా

ఉగ్రవాదుల కోసం తనిఖీలు చేస్తుండగా కాల్పులు జరిపిన దుండగులు

డీజీపీని మార్చాలన్న మెహబూబా ముఫ్తీ

పాక్‌కు వ్యతిరేకంగా స్థానికుల ఆందోళన

2



జస్టిస్ నర్సింహారెడ్డిని తప్పించండి!

విద్యుత్ అక్రమాలపై యథావిధిగా విచారణ

కమిషన్ చైర్మన్‌గా మరొకర్ని నియమించండి.. మీడియా ముందు అభిప్రాయాలు చెప్పారు

వ్యక్తి గౌరవానికి భంగం కలిగే అవకాశం.. వాంఛనీయం కాని పద్ధతిలో వ్యవహరించారు

హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తిపై సుప్రీం ఆగ్రహం.. జస్టిస్ నర్సింహారెడ్డి రాజీనామా

వారంలో కొత్త చైర్మన్‌ను నియమిస్తామన్న సర్కారు.. కమిషన్ రద్దు విజ్ఞప్తిపై కేసీఆర్‌కు నిరాశే

న్యూఢిల్లీ, జూలై 16(ఆంధ్రజ్యోతి): విద్యుత్ ఒప్పందాలపై విచారణ జరుపుతున్న ఏకసభ్య కమిషన్ చైర్మన్ జస్టిస్ ఎల్.నరసింహారెడ్డిని ఆ బాధ్యతల నుంచి తప్పించాలని సుప్రీంకోర్టు తెలంగాణ ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఆయన తన ముందు విచారణకు వచ్చిన అంశాలపై విలేకరుల సమావేశంలో అభిప్రాయాలను చెప్పడాన్ని తీవ్రంగా తప్పుబట్టింది. ఆయనకు ప్రత్యామ్నాయంగా మరొకరిని వారం రోజుల్లో చైర్మన్‌గా నియమించాలని

మిగతా 3వ పేజీలో...

అనుమానమే తప్ప సుప్రీం తప్పుపట్టలే

మీడియా ముందు నేను అభిప్రాయం చెప్పలేదు

ఊహాజనిత కథనాల వల్లే మాట్లాడాల్సి వచ్చింది

విలేకరులతో జస్టిస్ నర్సింహారెడ్డి వ్యాఖ్యలు

12


కోటీశ్వర్‌సింగ్ మహదేవన్

సుప్రీంకోర్టులో తొలిసారిగా మణిపూర్ జడ్జి

ఆ రాష్ట్రానికి చెందిన జస్టిస్ కోటీశ్వర్‌సింగ్ న్యాయమూర్తిగా నియామకం

మరో జడ్జిగా జస్టిస్ ఆర్ మహదేవన్

బీసీ సామాజికవర్గానికి అవకాశం

వైవిధ్యతకు కొలీజియం పెద్దపీట

34కు చేరుకోనున్న న్యాయమూర్తుల సంఖ్య.. పూర్తి సామర్థ్యంతో సుప్రీంకోర్టు

2

కవితకు అస్వస్థత

ఆస్పత్రిలో చికిత్స అనంతరం తిరిగి జైలుకు

న్యూఢిల్లీ, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణం కేసులో అరెస్టయి తిహాడ్ జైలులో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత అస్వస్థతకు గురయ్యారు. కొంతకాలంగా గైనిక్ సమస్యతో బాధపడుతున్న ఆమెకు రెండు రోజులుగా జ్వరం వస్తోంది. మంగళవారం ఆమె అస్వస్థతకు గురికావడంతో జైలులోని వైద్యుల సూచన మేరకు ఆమెను దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్ హాస్పిటల్‌కు తరలించారు. సుమారు రెండు గంటలపాటు వైద్యులు అక్కడ కవితకు చికిత్స చేశారు. పలు రకాల వైద్యపరీక్షలు నిర్వహించి.. ఆమె ఆరోగ్యం నిలకడగానే ఉందని ప్రకటించారు. వైద్యుల సూచనల మేరకు కవితను అధికారులు తిరిగి తిహాడ్ జైలుకు తరలించారు. కాగా.. కవితకు తీవ్ర అస్వస్థత అనే వార్తలు మీడియాలో రావడంతో ఆమె కుటుంబ సభ్యులతోపాటు బీఆర్ఎస్ కార్యకర్తలు ఆందోళన చెందారు. ఆమె ఆరోగ్యం నిలకడగానే ఉందని వైద్యులు ప్రకటించడంతో ఊపిరి పీల్చుకున్నారు. బుధవారం కవితను ఆమె సోదరుడు కేటీఆర్ పరామర్శించే అవకాశం ఉన్నట్టు తెలిసింది.


సచివాలయంలో జిల్లా కలెక్టర్లతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమావేశం. హాజరైన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు, సీఎస్

లక్ష మాఫీ రేపే!

తొలి విడతగా రూ.లక్ష వరకు రుణాలకు వర్తింపు.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటన

పాస్‌బుక్ ఉన్న ప్రతి రైతు ఖాతాలో

కుటుంబాన్ని గుర్తించడానికే రేషన్‌కార్డు

రేషన్ కార్డుల్లేని 6.36 లక్షల మందికీ మాఫీ

బ్యాంకులు ఇతర ఖాతాల్లో జమ చేస్తే చర్యలు

అర్హులకు 'ఆరోగ్యశ్రీ'.. ప్రతి ఒక్కరికీ హెల్త్ ప్రొఫైల్

నెలలోపు 'ధరణి' సమస్యలు పరిష్కరించాలి

ప్రభుత్వ భూములకు జియో ట్యాగింగ్ చేయాలి

ఒకే చోట ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు

ప్రభుత్వానికి కళ్లు చెవులు కలెక్టర్లే: సీఎం

కలెక్టర్లు, పోలీసు కమిషనర్లు, ఎస్పీలతో సదస్సు

ఉదయం 9.30 నుంచి రాత్రి 7.20 వరకు భేటీ

హైదరాబాద్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): పంట రుణాల మాఫీపై రైతులకు సీఎం రేవంత్‌రెడ్డి మరో శుభవార్త చెప్పారు. ఊహించిన దానికన్నా ముందే ఈ నెల 18 నుంచే అమలు చేస్తామని ప్రకటించారు. రూ.లక్షలోపు ఉన్న రుణాల సొమ్మును ఆ రోజు సాయంత్రం కల్లా రైతుల ఖాతాల్లో వేస్తామన్నారు. భూమి పట్టాదారు పాస్‌పుస్తకంపై రుణం ఉన్న ప్రతి రైతు కుటుంబానికీ రూ.2 లక్షల మాఫీ వర్తిస్తుందని చెప్పారు. కుటుంబాన్ని నిర్ధారించేందుకు మాత్రమే రేషన్ కార్డును పరిగణనలోకి తీసుకుంటామన్నారు. రాష్ట్రంలో 90 లక్షల కార్డులుండగా.. రుణాలు ఉన్న రైతు ఖాతాల సంఖ్య 70 లక్షలు మాత్రమేనని పేర్కొన్నారు. రేషన్ కార్డులు లేని 6.36 లక్షల మందికీ రుణాలు ఉన్నాయని, వారికి కూడా రుణమాఫీ వర్తిస్తుందని తెలిపారు. రేషన్ కార్డులు లేనంత మాత్రాన ఆ రైతులకు అన్యాయం జరగనివ్వబోమని

మిగతా 13వ పేజీలో...

డ్రగ్స్, సైబర్ నేరాలపై ఉక్కుపాదం

డీజీపీ నుంచి కానిస్టేబుల్ వరకు క్షేత్రస్థాయిలో ఉండాలి: ముఖ్యమంత్రి

త్వరలో నేను పర్యటిస్తా: డీజీపీ

13

రేపు రైతుల ఖాతాల్లోకి రూ. 6,800 కోట్లు!

11.5 లక్షల మంది ఖాతాల్లో జమ

4వ తరగతి చిరుద్యోగులు, రూ.10 వేలలోపు పెంఛన్‌దారులకు కూడా రుణమాఫీ: మంత్రి తుమ్మల

సాగు చేయని భూములపై ఆరా!

పైలట్ ప్రాజెక్టుగా ఐదు జిల్లాల్లో వివరాల సేకరణ

ఏఈవోలు, పంచాయతీ కార్యదర్శుల క్షేత్రస్థాయి పరిశీలన

రైతుభరోసా పథకం అమలు కోసమేనని రైతుల్లో చర్చ



హైదరాబాద్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వ్యవసాయ భూములుగా నమోదై.. సాగు చేయకుండా ఉన్న భూములపై ప్రభుత్వం సమగ్ర సర్వే చేయిస్తోంది. తొలుత ఐదు జిల్లాల్లో పైలట్ ప్రాజెక్టుగా ఈ కార్యక్రమం చేపట్టింది. కామారెడ్డి, హనుమకొండ, ఖమ్మం, కరీంనగర్, సంగారెడ్డి జిల్లాల్లో వ్యవసాయ విస్తరణాధికారులు (ఏఈవోలు), పంచాయతీ కార్యదర్శులు, అందుబాటులో ఉన్న డీఆర్‌డీఏ సిబ్బంది ఈ వివరాలు సేకరిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా పథకాన్ని అమలు చేసేందుకు అభిప్రాయ సేకరణ చేస్తున్న నేపథ్యంలో.. సాగుచేయని భూములపై ఆరా తీస్తుండడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇప్పటికే ప్రతి

మిగతా 12వ పేజీలో...

ప్రైవేటు ఉద్యోగాల్లో 75% స్థానికులకే!

కర్ణాటక ప్రభుత్వ నిర్ణయం.. ఆమోదించిన రాష్ట్ర క్యాబినెట్

రాష్ట్రంలోని పరిశ్రమల్లో రిజర్వేషన్.. మేనేజ్‌మెంట్ ఉద్యోగాలైతే 50%

గ్రూపు సీ, డీ ఉద్యోగాలన్నీ కన్నడిగులకే.. రేపు అసెంబ్లీ ముందుకు బిల్లు

ఇతర రాష్ట్రాల వారి ఉపాధికి దెబ్బ.. ఐటీ సంస్థల్లో భారీగా తెలుగువారు



బెంగళూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో ఐటీ సహా ప్రైవేటు సంస్థలు, పరిశ్రమలు, కర్మాగారాల్లో ఇక ఇతర రాష్ట్రాలవారికి ఉద్యోగాలు తగ్గిపోయే అవకాశాలు కనిపిస్తున్నాయి. వాటిలో 50 శాతం నుంచి వంద శాతం వరకు స్థానికులకే రిజర్వేషన్ కల్పించాలని ఆ రాష్ట్ర కేబినెట్ ఓ బిల్లును ఆమోదించింది. మేనేజ్‌మెంట్ ఉద్యోగాల్లో 50 శాతం, నాన్-మేనేజ్‌మెంట్ ఉద్యోగాల్లో 75 శాతం స్థానికులకు ఇవ్వాలని అందులో నిర్దేశించారు. గురువారం ఈ బిల్లును శాసనసభలో ప్రవేశపెట్టనున్నారు. కర్ణాటకలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణలకు చెందిన అనేక మంది ప్రజలు నివసిస్తున్నారు. ముఖ్యంగా బెంగళూరులో ఐటీ సహా పలు ప్రైవేటు సంస్థల్లో పెద్దసంఖ్యలో ఉద్యోగాలు చేస్తున్న సంగతి తెలిసిందే. అయితే తమ రాష్ట్రంలోని సంస్థల్లో స్థానికులకే ఉపాధి అవకాశాలివ్వాలని కన్నడ సంఘాలు చాలాకాలంగా డిమాండ్ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో సోమవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో ప్రైవేటు ఉద్యోగాల్లో స్థానికులకు రిజర్వేషన్ కల్పిస్తూ సీఎం సిద్దరామయ్య నేతృత్వంలోని

మిగతా 2వ పేజీలో...


రిపబ్లికన్ పార్టీ ఉపాధ్యక్ష అభ్యర్థి వాన్స్‌తో ఉష

అమెరికా ఎన్నికల్లో తెలుగు బంధం

రిపబ్లికన్ పార్టీ ఉపాధ్యక్ష అభ్యర్థి వాన్స్ భార్య ఉషా చిలుకూరుకు ఆంధ్రప్రదేశ్ మూలాలు

అమెరికాలో న్యాయ సలహాదారుగా ఉష సుదీర్ఘ సేవలు

ఆమె డెమోక్రాట్.. భర్త రిపబ్లికన్ పార్టీ నేత

వాషింగ్టన్, జూలై 16 : అమెరికాలో తెలుగు మూలాలు ఉన్న ఓ కుటుంబం ఇప్పుడు అనూహ్యంగా ప్రాచుర్యంలోకి వచ్చింది. రిపబ్లికన్ల నాయకుడు డొనాల్డ్ ట్రంప్ ఒకవేళ ఎన్నికల్లో గెలిస్తే ఈ కుటుంబానికి చెందిన వ్యక్తే ఉపాధ్యక్ష పదవిని చేపడతారు. అదే జరిగితే తెలుగు మూలాలు ఉన్న కుటుంబానికి చెందిన నేత అమెరికా చరిత్రలోనే తొలిసారి అత్యున్నత పదవిని అధిష్ఠించినట్టు అవుతుంది. ఇంతలా వార్తల్లో నిలుస్తున్న ఆ వ్యక్తి జేడీ వాన్స్ ఒహాయో సెనేటర్. రిపబ్లికన్ పార్టీ తరఫున ట్రంప్ అభ్యర్థిత్వం మిల్వాకీలో జరిగిన పార్టీ

మిగతా 2వ పేజీలో...

24న తెలుగు రాష్ట్రాలతో కేంద్రం సమావేశం.. విభజన సమస్యలపై చర్చించే అవకాశం

13

కాళేశ్వరానికి సీడబ్ల్యూసీ అనుమతులంటూ తప్పుడు ప్రచారం!

బ్యారేజీ నిర్మాణానికి మేడిగడ్డ ఎంపికే సరికాదు

కాళేశ్వరం డిజైన్, నిర్మాణం, నిర్వహణలో కేసీఆర్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది

జస్టిస్ ఘోష్ కమిటీకి శ్రీరాం వెదిరె వివరణ

14

అంగన్‌వాడీలకు రిటైర్మెంట్ ప్రయోజనాలు

12

టీచర్లకు రూ.2 లక్షలు, ఆయాలకు రూ.లక్ష వరకు: మంత్రి సీతక్క

స్విగ్గీ, జొమాటోలతో మద్యం హోం డెలివరీ!

తొలుత బీర్, వైన్ సరఫరా

2

ఆంధ్రజ్యోతి

అమెరికా ఎన్నికల్లో తెలుగు బంధం


(మొదటి పేజీ తరువాయి)

సమావేశంలో ఖరారైంది. ఆయన వైస్ ప్రెసిడెంట్‌గా జేడీ వాన్స్ పేరును ప్రకటించారు. జేడీ వాన్స్.. తెలుగు మూలాలు (ఆంధ్రప్రదేశ్) కలిగిన యువతి, న్యాయవాది ఉషా చిలుకూరికి భర్త. అధికార డెమొక్రటిక్ పార్టీ నాయకురాలు, భారతీయ మూలాలు ఉన్న కమలా హారిస్ ఉపాధ్యక్షురాలిగా ఉన్న విషయం తెలిసిందే. ఏపీ నుంచి అమెరికాకు వలస పోయిన కుటుంబంలో ఉష జన్మించారు. కాలిఫోర్నియోలోని శాన్‌డియాగోలో ఉషా పెరిగి పెద్దయ్యారు. మౌంట్ కార్మెల్ హైస్కూలులో చదివారు. మొదటి నుంచీ మంచి చదువరి అని, కష్టించి పనిచేసే తత్వం ఆమెకు ఉన్నదని సన్నిహితులు చెబుతున్నారు. యేల్ యూనివర్సిటీలో చరిత్ర విభాగంలో 2007లో బ్యాచులర్ డిగ్రీ, కేంబ్రిడ్జ్‌లో 2009లో ఫిలాసఫీలో మాస్టర్స్ చేశారు. యేల్ లా జర్నల్‌కు మేనేజింగ్ ఎడిటర్‌గా సుదీర్ఘకాలం పనిచేశారు పలు ప్రతిష్ఠాత్మక సంస్థలకు న్యాయ సలహాదారుగా పనిచేశారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తుల వద్ద విధులు నిర్వహించారు. ఉదారభావాలు కలిగిన ఉషా.. వామపక్ష రాజకీయాలను ఇష్టపడేవారు. దీనికి భిన్నంగా జేడీ వాన్స్ రిబిప్లకన్ పార్టీలో ఉండటం గమనార్హం. ట్రంప్‌కు ఆయన వీర విధేయుడు. జేడీ వాన్స్ కూడా యేల్ యూనివర్సిటీలోనే న్యాయశాస్త్రం అభ్యసించారు. అక్కడే వాన్స్, ఉషాలకు పరిచయమై అది ప్రేమగా మారింది. 2014లో కెంటకీలో హిందూ పూజారి సమక్షంలో వారిద్దరు ఒక్కటయ్యారు. వారికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. జేడీ వాన్స్ రాసిన 'హిల్‌బిలీ ఎలెజీ' అనే పుస్తకం బహుళ ప్రాచుర్యం పొందింది. గ్రామీణ శ్వేత అమెరికన్లపై కొనసాగుతున్న సామాజిక వివక్షను విశ్లేషించిన ఆ పుస్తక రచనలో వాన్స్‌కు ఉషా సహకరించారు. ఈ పుస్తకం 2020లో సినిమాగా కూడా వచ్చింది. జేడీ వాన్స్ ఒహాయోలోని మిడిల్‌టౌన్‌లో జేమ్స్ డొనాల్డ్ బౌమన్, బెన్ వాన్స్ దంపతులకు జన్మించారు. మత్తుకు ఆయన తల్లి బానిస కావడంతో తండ్రి వారిని వదిలి వెళ్లిపోయాడు. దీంతో చిన్నారి వాన్స్ తాతయ్య ఇంట పెరిగి పెద్దయ్యారు. కాగా, ఉపాధ్యక్షునిగా వాన్స్ పేరును ట్రంప్ ప్రకటించిన తర్వాత నుంచి వాన్స్ దంపతుల వివరాలు సోషల్‌మీడియాలో విస్తృతంగా వైరల్ అవుతున్నాయి.

జెడి వాన్స్, ఆయన సతీమణి ఉష చిలుకూరి పెళ్లినాటి ఫొటోను ప్రముఖ పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్ర ఎక్స్‌లో పోస్టు చేశారు. 'ఇది గుర్తుండిపోయే మరొక గొప్ప భారతీయ వివాహం' అని వ్యాఖ్యానించారు.


ఆనంద్ మహీంద్ర పోస్టు చేసిన ఉష పెళ్లి ఫొటో

లోకం తీరు



ట్రంప్‌కే రిపబ్లికన్ల జై

అధ్యక్ష అభ్యర్థిత్వం లాంఛనంగా ఖరారు..'ఉపాధ్యక్షుడి'గా జేడీ వాన్స్ పేరు ప్రకటన

» వాన్స్ భార్య ఉష తెలుగు సంతతి మహిళ

మిల్వాకీ, జూలై 16: అమెరికా అధ్యక్ష ఎన్నికలకు సంబంధించి ప్రతిపక్ష రిపబ్లికన్ పార్టీ ఓ లాంఛనం పూర్తిచేసింది. హత్యాయత్నం నుంచి ప్రాణాలతో బయటపడిన మాజీ అధ్యక్షుడు ట్రంప్(78)ను తన అభ్యర్థిగా ప్రకటించింది. భారత కాలమానం ప్రకారం మంగళవారం విస్కాన్సిన్ రాష్ట్రంలోని మిల్వాకీ నగరంలో ఆ పార్టీ జాతీయ సదస్సు జరిగింది. అన్ని రాష్ట్రాలకు చెందిన రిపబ్లికన్ ప్రతినిధులు ట్రంప్ అభ్యర్థిత్వానికే మొగ్గుచూపారు. ఈ ఏడాది నవంబరు 5న జరిగే ఈ ఎన్నికల్లో రిపబ్లికన్ అభ్యర్థిత్వం ఖరారుకు మొత్తం 2,429 మంది ప్రతినిధులకు గాను 1,215 మంది మద్దతు అవసరం కాగా.. ఆయనకు ఏకంగా 2,388 మంది ఓటేశారు. 41 మంది ఓటింగ్‌కు గైర్హాజరయ్యారు. దాంతో ట్రంప్‌ను రిపబ్లికన్ అభ్యర్థిగా ప్రకటించారు. ప్రైమరీ ఎన్నికలు పూర్తయ్యే నాటికే 2,243 మంది ప్రతినిధులు ఆయనకు మద్దతిచ్చారు. తాజాగా మిగతా సభ్యులు కూడా మద్దతుగా నిలిచారు. ట్రంప్ అంతకుముందే తన ఉపాధ్యక్షుడిగా ఒహాయో సెనేటర్ జేడీ వాన్స్(39)ను ప్రకటించారు. వాన్స్ భార్య ఉషా చిలుకూరి అమెరికన్ తెలుగు సంతతికి చెందిన మహిళ కావడం విశేషం. ఉపాధ్యక్ష అభ్యర్థిత్వం కోసం పోటీపడిన వారిలో ఫ్లోరిడా సెనేటర్ మార్కో రుబియో, నార్త్ డకోటా గవర్నర్ డగ్ బర్గమ్ కూడా ఉన్నారు. 'వారందరి టాలెంట్‌పై సుదీర్ఘంగా చర్చించాక ఉపాధ్యక్ష పదవికి ఒహాయో సెనేటర్ జేడీ వాన్స్ తగిన వ్యక్తిగా నిర్ణయించాను' అని ట్రంప్ తన ట్రూత్ సోషల్ నెట్‌వర్క్‌లో సోమవారమే వెల్లడించారు. పార్టీ సదస్సు ఆయన నిర్ణయాన్ని హర్షధ్వానాలతో స్వాగతించింది. పార్టీగా, దేశంగా మనందరం ఐక్యంగా ఉండాలని రిపబ్లికన్ పార్టీ చైర్మన్ మైకేల్ వాట్లీ ఈ సమావేశంలో పిలుపిచ్చారు. అమెరికాను ఉజ్వల భవిష్యత్ దిశగా నడిపేందుకు.. హత్యాయత్నం నుంచి చెవిగాయంతో బయటపడిన ట్రంప్ మాదిరిగా శక్తిసామర్థ్యాలనుప్రదర్శించాలని కోరారు.



భారతీయ అమెరికన్ల హవా..

ఈసారి రిపబ్లికన్ కన్వెన్షన్‌లో భారతీయ అమెరికన్లు కీలక పాత్ర పోషించారు. పెద్దసంఖ్యలో హాజరయ్యారు. ట్రంప్‌కు పూర్తి మద్దతు ప్రకటించడం నుంచి సిక్కు మతసంప్రదాయంలో ప్రార్థనలు చేసేవరకు అంతా వారిదే హడావుడి. ఈ సదస్సు నాలుగు రోజులు జరుగనుంది. ట్రంప్‌కు తన రాష్ట్రానికి చెందిన ప్రతినిధులంతా మద్దతిస్తున్నట్లు టెక్సాస్ రిపబ్లికన్ పార్టీ చైర్మన్‌గా గత మే నెలలో ఎన్నికైన భారతీయ అమెరికన్ అబ్రహం జార్జ్ సభలో ప్రకటించారు. ట్రంప్ విజయం సాధించాలని సదస్సు జాతీయ కమిటీ సభ్యురాలు హర్మీత్ ధిల్లాన్ (కాలిఫోర్నియా) గురునానక్‌ను ప్రార్థించారు. జేడీ వాన్స్‌ను ఉపాధ్యక్షుడిగా ఖరారుచేసే సమయంలో ఆయన భార్య ఉష సభలోనే ఉన్నారు. ఒహాయో రాష్ట్ర సెనేటర్ నీరజ్ అంతానీ, రిపబ్లికన్ పార్టీ సభ్యుడు డాక్టర్ సంపత్ శివాంగి ఆ రాష్ట్ర రిపబ్లికన్ ప్రతినిధులుగా హాజరయ్యారు. అధ్యక్ష అభ్యర్థిత్వాన్ని అధికారికంగా అంగీకరిస్తూ గురువారం రాత్రి సదస్సునుద్దేశించి ట్రంప్ ప్రసంగిస్తారు. ఆయన బరిలో నిలవడం ఇది మూడోసారి. 2016 ఎన్నికల్లో గెలిచిన ఆయన 2020లో జరిగిన ఎన్నికల్లో ఓడిపోయారు.

మస్క్ నెలనెలా రూ.376 కోట్ల విరాళం

ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ సంచలన ప్రకటన చేశారు. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ తరఫున బరిలో ఉన్న మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు నెల నెలా రూ.376 కోట్ల(45 మిలియన్ డాలర్లు) విరాళం ఇవ్వనున్నట్టు తెలిపారు. ఈ నిధులను నేరుగా ట్రంప్ రాజకీయ వ్యవహారాలు చూస్తున్న పొలిటికల్ యాక్షన్ కమిటీ(పీఏసీ)కి ఇవ్వనున్నట్టు మస్క్ ప్రకటించారు.

ట్రంప్‌పై హత్యాయత్నం వెనుక ఉక్రెయిన్?

మాస్కో, జూలై 16: అమెరికా మాజీ అధ్యక్షుడు, 2024 ప్రెసిడెన్షియల్ రేసులో దూసుకుపోతున్న డోనాల్డ్ ట్రంప్‌పై హత్యాయత్నం వెనుక ఉక్రెయిన్ ఆర్మీ హస్తం ఉందా? ప్రముఖ సెక్యూరిటీ అనలిస్టు మార్క్ సెల్బోడా.. ఉక్రెయిన్ ఆర్మీ హస్తం ఉందనే అభిప్రాయపడుతున్నారు. రష్యాకు చెందిన స్పుత్నిక్ వార్తాసంస్థ నిర్వహించిన 'ద క్రిటికల్ అవర్ ప్రోగ్రామ్'లో ఆయన మాట్లాడారు. ట్రంప్‌పై హత్యాయత్నం జరిగిందన్న విషయం తెలియగానే ఉక్రెయిన్‌కు చెందిన 79వ ఎయిర్ అసాల్ట్ బ్రిగేడ్ సోషల్ మీడియా వేదికగా సంతోషం తెలిపిందని.. ఇది తమ సొంత ఇంటెలిజెన్స్ వ్యవస్థల పనేనని వారు భావిస్తున్నారని ఆయన వివరించారు. ట్రంప్‌పై కాల్పుల వెనుక ఉక్రెయిన్ హస్తం ఉందనడానికి ఇప్పటివరకూ ఎలాంటి ఆధారాలూ లేవు. అయినప్పటికీ.. తాను గెలిస్తే ఉక్రెయిన్‌కు సైనిక సాయాన్ని నిలిపివేస్తానని ట్రంప్ ప్రకటించినందునే ఇలాంటి ఊహాగానాలు వినిపిస్తున్నాయని మరికొందరు విశ్లేషిస్తున్నారు. ఇదిలా ఉండగా.. అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్, బైడెన్లలో ఎవరు గెలిచినా వారితో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామని జెలెన్‌స్కీ తెలిపారు.

ఉక్రెయిన్‌తో యుద్ధం వద్దని పుతిన్‌కు చెప్పండి

» భారత్‌ను కోరిన అమెరికా

మిల్వాకీ, జూలై 16: రష్యాతో భారత్‌కు ఉన్న దీర్ఘకాల స్నేహ సంబంధాలను ఉక్రెయిన్‌పై రష్యా అధ్యక్షుడు పుతిన్ సాగిస్తోన్న అక్రమ యుద్ధం ముగించేందుకు ఉపయోగించాలని అమెరికా కోరింది. అమెరికా ప్రభుత్వ అధికార ప్రతినిధి మాథ్యూ మిల్లర్ తన రోజువారీ విలేకరుల సమావేశంలో సోమవారం ఈ మేరకు పేర్కొన్నారు. జూలై 9న ప్రధాని మోదీ రష్యా పర్యటన ముగించుకుని వెనుదిరిగినప్పుడు కూడా మిల్లర్ ఇదేవిధమైన వ్యాఖ్యలు చేశారు. ఉక్రెయిన్ సమస్యకు యుద్ధభూమిలో పరిష్కారం దొరకదని, బాంబులు, బుల్లెట్ల మధ్య శాంతి ప్రయత్నాలు ఫలించవని జూలై 9న పుతిన్‌తో జరిపిన భేటీలో మోదీ పేర్కొన్నారు.

పాక్ సైనిక స్థావరంపై ఆత్మాహుతి

» 8 మంది జవాన్ల మృతి

పెషావర్, జూలై 16: పాకిస్థాన్‌లోని ఓ సైనిక స్థావరంపై ఉగ్రవాదులు జరిపిన ఆత్మాహుతి దాడిలో 8 మంది జవాన్లు మరణించారు. ఈ ఘటన ఖైబర్ ప్రావిన్స్‌లోని బన్నూ కంటోన్మెంట్‌లో జరిగింది. "సోమవారం బన్నూ కంటోన్మెంట్‌లోకి 10 మంది ఉగ్రవాదులు చొరబడ్డారు. తొలుత కొందరు ముష్కరులు పేలుడు పదార్థాలు ఉన్న వాహనంతో కంటోన్మెంట్ గోడను కూల్చి లోనికి ప్రవేశించారు. వారు జరిపిన దాడిలో 8 మంది సైనికులు మరణించారు. అనంతరం మరికొందరు ఉగ్రవాదులు లోనికి వచ్చి దాడులకు పాల్పడ్డారు. ఈ క్రమంలో జవాన్లు సైతం ఎదురుదాడి చేయడంతో మొత్తం 10 మంది ఉగ్రవాదులు మృతి చెందారు" అని ఆర్మీ అధికారులు తెలిపారు. ఈ దాడి తమ పనేనని హాఫీజ్ గుల్ బహదూర్ గ్రూప్ ఉగ్ర సంస్థ ప్రకటించింది.

పూజను శిక్షణ నుంచి రిలీవ్ చేయండి

» ముస్సోరికి పంపేయండి.. కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు

» నేరం రుజువయ్యే వరకూ నేను దోషిని కాదు: పూజ

పుణె, న్యూఢిల్లీ, జూలై 16: వివాదస్పద ట్రైనీ ఐఏఎస్ పూజా ఖేద్కర్‌పై చర్యలు మొదలయ్యాయి. తక్షణం ఆమెను జిల్లా శిక్షణ కార్యక్రమం నుంచి రిలీవ్ చేయాలని మహారాష్ట్ర ప్రభుత్వాన్ని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. తక్షణం ఆమెను ముస్సోరీలోని ఐఏఎస్ అకాడమీకి పంపించాలని స్పష్టం చేసింది. ఈ మేరకు అదనపు ప్రధాన కార్యదర్శి నితిన్ గాడ్రె మహారాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాశారు. పూజ సమర్పించిన దృష్టి లోపానికి సంబంధించిన మెడికల్ సర్టిఫికెట్లు, ఓబీసీ రిజర్వేషన్‌కు సంబంధించిన సర్టిఫికెట్లపై ఆరోపణలు వెల్లువెత్తుతున్న సంగతి తెలిసిందే. అయితే, తనపై వస్తున్న ఆరోపణల నిగ్గు తేల్చాల్సింది కేంద్ర ప్రభుత్వం నియమించిన కమిటీయేనని, మీడియా, ప్రజలు దాన్ని తేల్చలేరని పూజా వ్యాఖ్యానించారు. నేరం నిరూపితమయ్యే వరకూ ఎవరినీ దోషిగా పేర్కొనరాదని పూజ అన్నారు. మరోవైపు, తనను వేధిస్తున్నారంటూ పుణె కలెక్టర్ సుహాస్ దివాసేపై పూజా ఖేద్కర్ కేసు పెట్టారు. వాసిం పోలీసు స్టేషన్‌కు చెందిన మహిళా పోలీసులు సోమవారం పూజా ఇంటికి వెళ్లిన సంగతి తెలిసిందే. ఆ సమయంలోనే కలెక్టర్ సుహాస్ తనను వేధిస్తున్నారంటూ పూజా ఫిర్యాదు చేశారు. అంతకుముందు పోలీసులు ఆమె ఇంటికి వెళ్లడంపై అనేక కథనాలు ప్రచారంలోకి వచ్చాయి. అయితే, కొన్ని పనులు ఉండడంతో తానే మహిళా పోలీసులను ఇంటికి రమ్మన్నానని పూజ వెల్లడించారు.

మంచి కోసం స్టింగ్ ఆపరేషన్లు ఓకే: కేరళ హైకోర్టు

తిరువనంతపురం, జూలై 16: ప్రజలకు వాస్తవాలను తెలియజేసే సదుద్దేశంతో మీడియా జరిపే స్టింగ్ ఆపరేషన్లకు.. చట్టపరమైన విచారణ నుంచి రక్షణ కల్పించవచ్చని కేరళ హైకోర్టు అభిప్రాయపడింది. కేరళలో సంచలనం సృష్టించిన సోలార్ విద్యుత్తు కుంభకోణంలో జైలు పాలైన జొప్పన్ అనే నిందితుడిపై.. 2013 జూలైలో జైలులోనే 'రిపోర్టర్' అనే టీవీ ఛానల్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులు స్టింగ్ ఆపరేషన్ నిర్వహించారు. జైలు నిబంధనలను ఉల్లంఘించి.. తమ వెంట రహస్యంగా సెల్‌ఫోన్ తీసుకెళ్లి జొప్పన్ చెప్పిన వివరాలు రికార్డు చేశారు. అనంతరం వాటిని బహిరంగపరచటంతో అవి ప్రకంపనలు సృష్టించాయి. ఈ నేపథ్యంలో, టీవీ ఛానల్ వ్యక్తులపై జైలు నిబంధనలను ఉల్లంఘించినట్లుగా కేసు నమోదైంది. దీనిపై విచారణ సందర్భంగా కేరళ హైకోర్టు.. మీడియా ప్రాధాన్యాన్ని వివరించింది. ప్రజోపయోగ పనుల కోసం గుర్తింపు పొందిన మీడియాగానీ, దర్యాప్తు సంస్థలుగానీ స్టింగ్ ఆపరేషన్లు నిర్వహించవచ్చని పేర్కొంటూ కేసును కొట్టేసింది.

ఏ పోలింగ్ బూత్.. ఏ ఈవీఎంనైనా ఎంచుకోండి!

» పరిశీలన కోసం ఓడిన అభ్యర్థులకు ఈసీ అవకాశం

న్యూఢిల్లీ, జూలై 16: లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం ఈవీఎంల ట్యాంపరింగ్‌కు సంబంధించి తనిఖీకి ఆదేశించాలని కోరుతూ సుప్రీంకోర్టును ఆశ్రయించిన ఎనిమిది మంది అభ్యర్థులకు ఎన్నికల కమిషన్(ఈసీ) వివిధ ఆప్షన్లు ఇచ్చింది. మాక్ పోలింగ్, వీవీప్యాట్ స్లిప్పుల లెక్కింపు తదితరాల కోసం అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలోని ఏ పోలింగ్ బూత్ నుంచైనా ఈవీఎంలను ఎంపిక చేసుకొనే అవకాశం కల్పించింది. ఎన్నికల ఫలితాల్లో రెండు, మూడు స్థానాల్లో నిలిచిన అభ్యర్థుల కోసం ర్యాండమ్ తనిఖీలను సూచిస్తూ మంగళవారం స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్‌ను ఈసీ విడుదల చేసింది. పోలింగ్ బూత్‌లో ఏదేని బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వీవీప్యాట్‌ను తనిఖీకి ఎంచుకున్న దరఖాస్తుదారు.. అదే బూత్‌లోని మరో యూనిట్‌ను తనిఖీకి ఎంచుకునేందుకు అనుమతించబోమని పేర్కొంది. అభ్యర్థికి తనిఖీ నిమిత్తం గరిష్ఠంగా 1,400 ఓట్ల వరకు మాక్ పోలింగ్‌కు అనుమతిస్తారు.

నీట్ లీక్ కేసులో మరో ఇద్దరి అరెస్ట్

న్యూఢిల్లీ, జూలై 16: నీట్ ప్రశ్నపత్రం లీకేజీ కేసు దర్యాప్తు చేస్తున్న సీబీఐ మరో ఇద్దరు కీలక నిందితులను అరెస్ట్ చేసింది. ఝార్ఖండ్‌లోని హజారీబాఘ్‌లో జాతీయ టెస్టింగ్ ఏజెన్సీకి చెందిన ట్రంకుపెట్టె నుంచి ప్రశ్నపత్రాన్ని దొంగిలించిన ఆరోపణలపై వారిని అదుపులోకి తీసుకున్నట్టు అధికారులు తెలిపారు. దీంతో ఈ కేసులో ఇప్పటిదాకా అరెస్టయినవారి సంఖ్య 14కు చేరింది. సీబీఐ అరెస్టు చేసిన వారిలో ఒకరు పంకజ్‌కుమార్. ఈయన జంషెడ్‌పూర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి చెందిన 2017 బ్యాచ్ సివిల్ ఇంజనీర్. ఎన్‌టీఏ ట్రంకుపెట్టెలోంచి పేపర్‌ను దొంగిలించింది ఇతడేనని.. ఇతణ్ని పట్నాలో అదుపులోకి తీసుకున్నామని అధికారులు వెల్లడించారు. ఈ పనిలో అతడికి సహకరించడమే కాక, దొంగిలించిన ప్రశ్నపత్రాన్ని తమ గ్యాంగులోని ఇతర సభ్యులకు చేరవేసినందుకు రాజు సింగ్ అనే మరో వ్యక్తిని హజారీబాఘ్‌లో అరెస్ట్ చేసినట్టు వివరించారు.

ఇల్లు మీదని తెలియదు.. నన్ను క్షమించండి!

» దోచుకోవడానికెళ్లిన ఇల్లు రచయితదని తెలిసి దొంగ క్షమాపణ

ముంబై, జూలై 16: ఓ దొంగ తాను చోరీ చేసిన ఇల్లు ప్రముఖ రచయితదని తెలుసుకుని దోచుకున్న సొమ్మును అక్కడే వదిలి క్షమించండంటూ లేఖ రాసి వెళ్లాడు. ప్రముఖ మరాఠీ రచయిత నారాయణ్ సర్వేకు మహారాష్ట్ర రాయ్‌గఢ్ జిల్లాలోని నేరళ్‌లో ఓ ఇల్లు ఉంది. ఆయన 2010లోనే కన్నుమూశారు. ప్రస్తుతం ఆ ఇంట్లో తన కూతురు, అల్లుడు నివసిస్తున్నారు. వారు పది రోజుల క్రితం విరార్‌లో నివసిస్తున్న తమ కొడుకును చూసేందుకు వెళ్లగా ఓ దొంగ ఆ ఇంట్లోకి దూరి ఎల్‌ఈడీ టీవీతో పాటు పలు ఖరీదైన వస్తువులను దోచుకుని వెళ్లాడు. మరుసటి రోజు చోరీకి అదే ఇంటికి వెళ్లగా అతనికి నారాయణ్ సర్వే ఫొటో కనిపించింది. ఆ ఇల్లు ఆయనదని తెలిసిన వెంటనే సదరు దొంగ తాను ముందు రోజు దొంగిలించిన వస్తువులతో పాటు ఆ రోజు చోరీ చేసినవి తిరిగి అక్కడే పెట్టి క్షమించండంటూ లేఖ రాసి గోడకు అంటించి వెళ్లాడు.

ప్రైవేటు ఉద్యోగాల్లో 75% స్థానికులకే!

(మొదటి పేజీ తరువాయి)

కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఎవరు స్థానికులో ఈ బిల్లులో నిర్వచించారు. కర్ణాటకలో జన్మించినవారు.. 15 ఏళ్లుగా ఆ రాష్ట్రంలోనే నివసిస్తున్నవారు.. కన్నడ భాషలో మాట్లాడే, చదివే, రాసే నైపుణ్యం ఉండి.. రాష్ట్ర నోడల్ ఏజెన్సీ నిర్వహించే అర్హత పరీక్షలో నెగ్గినవారిని స్థానిక అభ్యర్థిగా పరిగణిస్తారు. కన్నడం ఓ భాషగా ఉన్న ఎస్ఎస్‌సీ సర్టిఫికెట్‌ను ఉద్యోగార్థులు కలిగి ఉండాలి. లేదంటే ప్రభుత్వ నోడల్ ఏజెన్సీ నిర్వహించే కన్నడ ప్రావీణ్య పరీక్షలో పాసవ్వాలి. అర్హతలున్న స్థానిక అభ్యర్థులు దొరక్కపోతే.. చట్ట నిబంధనల సడలింపునకు ప్రైవేటు పరిశ్రమలు, సంస్థలు ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకోవాలి. తగు విచారణ తర్వాత ప్రభుత్వం సముచిత ఉత్తర్వులు జారీచేస్తుంది. అవే ఫైనల్. అర్హతలున్న స్థానికులు లేకపోతే.. ఆయా సంస్థలు సర్కారు సహకారంతో మూడేళ్లలో స్థానిక అభ్యర్థులకు శిక్షణ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలి. నిబంధనలు ఉల్లంఘించిన సంస్థలకు రూ.10 వేల నుంచి రూ.25 వేల వరకు జరిమానా విధిస్తామని బిల్లులో పేర్కొన్నారు. కాగా.. ప్రైవేటు పరిశ్రమల్లోని గ్రూపు సీ, డీ ఉద్యోగాలను వంద శాతం స్థానికులకే ఇవ్వాలని కేబినెట్ భేటీలో తీర్మానించినట్లు సిద్దరామయ్య మంగళవారం 'ఎక్స్'లో పేర్కొన్నారు. కన్నడిగులు తమ రాష్ట్రంలో సౌకర్యవంతమైన జీవనం సాగించాలని.. మాతృభూమిలో వారికి ఉపాధి దూరం కారాదన్నది తమ ప్రభుత్వ అభిలాష అని తెలిపారు. 'మాది కన్నడ అనుకూల ప్రభుత్వం. వారి సంక్షేమానికే మా ప్రాధాన్యం' అని వెల్లడించారు. మరోవైపు.. ఏడో వేతన కమిషన్ సిఫారసులకు అనుగుణంగా ప్రభుత్వ ఉద్యోగులకు వేతనం పెంచుతూ కర్ణాటక కేబినెట్ నిర్ణయం తీసుకుంది.

సుప్రీంకోర్టులో తొలిసారిగా మణిపూర్ జడ్జి

న్యూఢిల్లీ, జూలై 16: దేశ అత్యున్నత న్యాయస్థానంలో ఈశాన్య రాష్ట్రమైన మణిపూర్‌కు తొలిసారిగా ప్రాతినిధ్యం లభించనుంది. ఆ రాష్ట్రానికి చెందిన జస్టిస్ నాంగ్‌మీకపమ్ కోటీశ్వర్‌సింగ్ సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. ఆయనతో పాటు, మద్రాసు హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ ఆర్ మహదేవన్ కూడా సుప్రీంకోర్టు జడ్జిగా నియమితులయ్యారు. వీరితో ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ చంద్రచూడ్ గురువారం ప్రమాణం చేయించనున్నారు. ఇద్దరు న్యాయమూర్తుల నియామకంతో సుప్రీంకోర్టు జడ్జిల సంఖ్య (సీజేఐతో కలిపి) 34కు చేరుకోనుంది. ఇది సుప్రీంకోర్టుకు కేటాయించిన గరిష్ఠ న్యాయమూర్తుల సంఖ్య. సీజేఐ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల సుప్రీంకోర్టు కొలీజియం.. ఇద్దరు జడ్జిల నియామకాలను ఈ నెల 11న కేంద్రప్రభుత్వానికి సిఫార్సు చేసింది. జస్టిస్ కోటీశ్వర్‌సింగ్ నియామకంతో సుప్రీంకోర్టులో తొలిసారిగా మణిపూర్ రాష్ట్రానికి ప్రాతినిధ్యం లభించనున్న విషయాన్ని కొలీజియం ప్రముఖంగా ప్రస్తావించింది. మరోవైపు, జస్టిస్ మహదేవన్ పేరును కొలీజియం సిఫార్సు చేస్తూ.. 'తమిళనాడుకు చెందిన జస్టిస్ మహదేవన్ బీసీ సామాజిక వర్గానికి చెందినవారు. మద్రాస్ హైకోర్టుతోపాటు ఇతర హైకోర్టుల్లో పని చేస్తున్న న్యాయమూర్తుల సీనియారిటీ పరంగా ఆయన మూడో స్థానంలో ఉన్నప్పటికీ.. బీసీ సామాజిక వర్గానికి ప్రాతినిధ్యం లభించాలన్న ఉద్దేశంతో ఆయన పేరును సిఫార్సు చేస్తున్నాం' అని పేర్కొంది. జస్టిస్ మహదేవన్ నియామకం ద్వారా సుప్రీంకోర్టు ధర్మాసనానికి వైవిధ్యం సమకూరుతుందని తెలిపింది.

4 వారాల్లోగా రేషన్ కార్డులివ్వండి

» ఈ- శ్రమ్‌లో రిజిస్టరైన వలస కూలీలకు జారీ చేయండి.. రాష్ట్రాలకు సుప్రీం ఆదేశం

న్యూఢిల్లీ, జూలై 16: ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకున్న వలస కార్మికుల వివరాలను పరిశీలించి నాలుగు వారాల్లోగా రేషన్ కార్డులు జారీ చేయాలని రాష్ట్రాలను సుప్రీం కోర్టు ఆదేశించింది. తాము ఆదేశాలిచ్చి నాలుగు నెలలైనా ఇప్పటివరకు ప్రక్రియను పూర్తి చేయని రాష్ట్రాలపై ఆగ్రహం వ్యక్తం చేసింది. దీనిని దురదృష్టకరం అని అభివర్ణించింది. మరో రెండు నెలలు గడువు కోరడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. తాజాగా తాము పేర్కొన్న వ్యవధిలోగా పరిశీలన పూర్తి చేయకుంటే ఆయా రాష్ట్రాల కార్యదర్శులకు సమన్లు జారీ చేస్తామని హెచ్చరించింది. ఈ-శ్రమ్‌లో దరఖాస్తు చేసుకున్న 8 కోట్ల మందికి రెండు నెలల్లో రేషన్ కార్డులు జారీ చేయాలని రాష్ట్రాలను ఆదేశించింది. కానీ, తెలంగాణ, బిహార్ రాష్ట్రాలు మాత్రమే దరఖాస్తుల తనిఖీని పూర్తి చేశాయి. మిగతా రాష్ట్రాలు ఇంకా ప్రక్రియను ముగించలేదని, కొన్ని కసరత్తును ప్రారంభించలేదని పిటిషనర్ల తరఫు సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ సుప్రీం దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై మంగళవారం జస్టిస్ సుధాంశు ధూలియా, జస్టిస్ అహ్సనుద్దీన్ అమానుల్లాలతో కూడిన బెంచ్ విచారణ జరిపింది. వివరాలు పూర్తిస్థాయిలో తనిఖీ చేసిన రాష్ట్రాలకు రేషన్ మంజూరు చేయాలని కేంద్రాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను ఆగస్టు 27కు వాయిదా వేసింది.

జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాద కాల్పులు.. నలుగురు జవాన్ల దుర్మరణం

» మృతుల్లో ఏపీకి చెందిన డొక్కరి రాజేశ్

» ఆర్మీ కెప్టెన్ బ్రిజేశ్ థాపా కూడా

జమ్మూ, సంతబొమ్మాళి/నందిగాం(శ్రీకాకుళం), జూలై 16: జమ్మూకశ్మీర్‌లో భద్రతాబలగాలే లక్ష్యంగా ఉగ్రవాదులు మరోమారు తెగబడ్డారు. సోమవారం రాత్రి తనిఖీల్లో ఉన్న జవాన్లపైకి కాల్పులు జరిపారు. ప్రతిస్పందించిన జవాన్లు, రాష్ట్ర పోలీసులు ఎదురుకాల్పులు జరిపారు. ఉగ్రవాదుల కాల్పుల్లో ఒక ఆర్మీ కెప్టెన్, ఒక నాయక్, ఇద్దరు సిపాయిలు దుర్మరణంపాలయ్యారు. మృతుల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఆర్మీ నాయక్ డొక్కరి రాజేశ్ ఉన్నారు. దోడా జిల్లా దేసా అటవీ ప్రాంతంలో ఉన్న ధరీగోటె ఉడార్‌బాగిలో ఉగ్రవాదులు నక్కి ఉన్నట్లు ఉప్పందుకున్న సైన్యం, జమ్మూకశ్మీర్ రాష్ట్రీయ రైఫిల్స్ బలగాలతో కలిసి సోమవారం సాయంత్రం 7 గంటల సమయంలో కట్టడిముట్టడి తనిఖీలు(కార్డాన్ అండ్ సెర్చ్) నిర్వహించాయి. ఈ క్రమంలో చీకట్లో నక్కిన ఉగ్రవాదులు.. బలగాలపైకి కాల్పులు జరిపారు. భద్రతాబలగాలు ఎదురుకాల్పులకు దిగాయి. దీంతో.. ఉగ్రవాదులు కాల్పులు జరుపుతూ అక్కడి నుంచి పారిపోయారు. వారిని వెంబడిస్తూ వెళ్లిన బలగాలు.. రాత్రి 9 గంటల సమయంలో ఉగ్రవాదులను గుర్తించాయి. మరోమారు ఇరువైపులా కాల్పులు జరిగాయి. ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో ఆర్మీ కెప్టెన్ బ్రిజేశ్ థాపా, తెలుగువాడైన ఆర్మీ నాయక్– డొక్కరి రాజేశ్, రాజస్థాన్‌కు చెందిన సిపాయిలు బిజేంద్ర, అజయ్ అమరులయ్యారు. ఆ వెంటనే ఆర్మీ కమాండోలు, రాష్ట్ర సాయుధ బలగాలు అటవీ ప్రాంతంలో ముమ్మరంగా తనిఖీలు చేపట్టాయి. అటు లద్దాఖ్‌లో కూడా సైన్యం అప్రమత్తమై తనిఖీలను ముమ్మరం చేసింది. కాగా.. గడిచిన 32 నెలల్లో ఉగ్రవాదులు జరిపిన దాడుల్లో 48 మంది సైనికులు ప్రాణాలను కోల్పోయారు. జమ్మూకశ్మీర్‌లో సుమారు 60 మంది ఉగ్రవాదులు క్రియాశీలంగా ఉన్నట్లు పోలీసులు చెబుతున్నారు. సైనికుల మృతిపట్ల కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ, జమ్మూకశ్మీర్ మాజీ సీఎం మెహబూబా ముఫ్తీ తీవ్రంగా ఖండించారు. కేంద్ర ప్రభుత్వం తన విధానాలతో జవాన్ల జీవితాలతో ఆటలాడుకుంటోందని రాహుల్‌గాంధీ మండిపడ్డారు. జమ్మూకశ్మీర్ డీజీపీ రాజకీయాల్లో బిజీగా ఉన్నారని, ఆయనను మారిస్తే.. ఇలాంటి ఘటనలు తగ్గుతాయని ముఫ్తీ అభిప్రాయపడ్డారు. మరోవైపు ఉగ్రవాదుల దాడులను నిరసిస్తూ స్థానిక ప్రజలు దోడాలో పాకిస్థాన్ దిష్టిబొమ్మను దహనం చేశారు.


బ్రిజేశ్, బిజేంద్ర, అజయ్ కుమార్, రాజేశ్

శ్రీకాకుళంలో విషాదఛాయలు

ఉగ్రవాదుల కాల్పుల్లో మరణించినవారిలో ఏపీలోని శ్రీకాకుళం జిల్లా టెక్కలి నియోజకవర్గానికి చెందిన నాయక్ డొక్కరి రాజేశ్ ఉండడం.. రెండ్రోజుల క్రితం జమ్మూకశ్మీర్‌లోని అనంతనాగ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో హవల్దార్ జగదీశ్వరరావు అమరుడవ్వడంతో మృతుల స్వగ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. వారి కుటుంబ సభ్యులు, బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు. సంతబొమ్మాళి మండలం చెట్లతాండ్ర గ్రామానికి చెందిన రాజేశ్(25)ది కడుపేద కుటుంబమని ఆయన బంధుమిత్రులు తెలిపారు. రాజేశ్ 2018లో సైన్యంలో చేరారు. జగదీశ్వర్‌రావుది నందిగామ మండలం వల్లభరాయుడు పేట. ఆయన 2003లో సైన్యంలో చేరారు.

స్విగ్గీ, జొమాటోలతో మద్యం హోం డెలివరీ!

» ఆలోచనలో పలు రాష్ట్రాలు.. త్వరలోనే పైలట్ ప్రాజెక్టు

» ఇప్పటికే ఒడిశా, బెంగాల్‌లో మద్యం హోం డెలివరీ

» 20 నుంచి 30% పెరిగిన అమ్మకాలు



న్యూఢిల్లీ, జూలై 16: స్విగ్గీ, జొమాటో, బిగ్ బాస్కెట్, బ్లింకిట్ లాంటి హోం డెలివరీ యాప్‌ల ద్వారా మద్యాన్ని కూడా హోం డెలివరీ చేసేందుకు అనుమతించాలని ఢిల్లీ, కర్ణాటక, హరియాణా, పంజాబ్, తమిళనాడు, గోవా, కేరళ రాష్ట్రాలు భావిస్తున్నాయి. ఇందుకోసం పైలట్ ప్రాజెక్టుకు కూడా రూపకల్పన చేస్తున్నాయి. ఈ మేరకు జాతీయ వార్తా సంస్థ ఎకనామిక్ టైమ్స్ ఓ కథనంలో వెల్లడించింది. పరిశ్రమ వర్గాలు ఈ విషయాన్ని తెలిపినట్లు అందులో పేర్కొంది. ఆయా రాష్ట్రాల అధికారులు ఇప్పటికే ఫుడ్ డెలివరీ యాప్‌లతో, మద్యం తయారీ సంస్థలతో సంప్రదింపుల్లో ఉన్నారని, మద్యం హోం డెలివరీ వల్ల కలిగే లాభనష్టాలపై అంచనా వేస్తున్నారని పేర్కొంది. పైలట్ ప్రాజెక్టు కింద తొలుత బీర్, వైన్ లాంటి తక్కువ ఖరీదైన మద్యాన్ని హోం డెలివరీ చేసేందుకు అనుమతినిచ్చే అవకాశం ఉందని తెలిపింది. నగరాల్లో జీవనశైలి మారుతోందని, పురుషులతో పాటు చాలా మంది మహిళలు మద్యం సేవిస్తున్నారని, వైన్ షాపులకు వెళ్లి మద్యం కొనలేని మహిళలకు హోం డెలివరీ నిర్ణయం ఉపకరిస్తుందని వివరించింది. ఒడిశా, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల్లో ఇప్పటికే మద్యం హోం డెలివరీ వెసులుబాటు ఉంది. బెంగాల్‌లో స్విగ్గీ, స్పెన్సర్స్ రిటైల్ సంస్థలు మద్యాన్ని ఇంటికి సరఫరా చేస్తున్నాయి. హోం డెలివరీ సేవలు ప్రారంభించాక ఈ రెండు రాష్ట్రాల్లో మద్యం అమ్మకాలు 20-30% పెరిగినట్లు అంచనా. ఇదిలా ఉండగా, హోం డెలివరీకి అన్ని నిబంధనలు పాటిస్తామని, వయసును ధ్రువీకరించుకొన్న తర్వాతే, పరిమితి మేరకే డెలివరీ ఉంటుందని స్విగ్గీ కార్పొరేట్ అఫైర్స్ వైస్ ప్రెసిడెంట్ దినకర్ వశిష్ఠ్ చెప్పినట్లు ఎకనామిక్ టైమ్స్ తన కథనంలో ప్రస్తావించింది.

సముద్రంలో నౌక మునిగి 16 మంది గల్లంతు

» వారిలో 13 మంది భారతీయులు

మస్కట్, జూలై 16: ఒమన్ తీరానికి సమీపంలో ఒక ఆయిల్ ట్యాంకర్(నౌక) సోమవారం సముద్రంలో మునిగి 16 మంది సిబ్బంది గల్లంతయ్యారు. వారిలో 13 మంది భారతీయులు, ముగ్గురు శ్రీలంక వాసులు. ఈమేరకు ఒమన్ తీరరక్షక దళం మంగళవారం వెల్లడించింది. సముద్రంలో ఆ నౌక తిరగబడి కనిపిస్తోందని తెలిపింది. అయితే దానిలోంచి ఆయిల్ లీకవుతోందా.. లేదా అనే విషయంపై స్పష్టత ఇవ్వలేదు. ఎడెన్ ఓడరేవుకు వెళుతోన్న ఈ నౌక ఒమన్‌కు చెందిన పారిశ్రామిక ఓడరేవు దక్మ్‌కు సమీపంలో సముద్రంలో మునిగింది.

ఒమన్‌లో ఉగ్ర కాల్పులు.. భారతీయుడి మృతి

మస్కట్, జూలై 16: ఒమన్ రాజధాని మస్కట్‌లో షియాల మసీదు వద్ద సోమవారం రాత్రి జరిగిన కాల్పుల ఘటనలో ఆరుగురు మృతి చెందగా 28 మంది గాయాలపాలయ్యారు. మృతి చెందిన వారిలో ఒకరు భారతీయుడు, మరొకరు పోలీసు. ఒమన్‌లోని భారత ఎంబసీ భారతీయుడి మృతిని ధ్రువీకరించింది. కాల్పులకు పాల్పడ్డ ముగ్గురు వ్యక్తులను భద్రతా సిబ్బంది కాల్చి చంపారు. ఈ ఘటన వెనుక ఇస్లమిక్ తీవ్రవాద సంస్థ ఐఎస్ ఉన్నట్లు భావిస్తున్నారు. గతంలో పలు దేశాల్లో షియా ముస్లింలు లక్ష్యంగా వారు పండుగలు చేసుకొనే సమయంలో ఐఎస్ దాడులు జరిపింది.

మట్టి చరియలు విరిగిపడి ఐదుగురి దుర్మరణం

బెంగళూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో భారీ వర్షాలతో ఉత్తరకన్నడ జిల్లా అంకోలాలో జాతీయ రహదారి 66పై మట్టిచరియలు విరిగిపడి ఐదురుగు మృతిచెందారు. మరో నలుగురు మట్టిలో కూరుకుపోయినట్లు భావిస్తున్నారు. గంగావళి నది సమీపాన ఉండే రహదారి పక్కన టీస్టాల్ ఉంది. ఇదే ప్రాంతంలో హైవే విస్తరణ పనులు సాగుతున్నాయి. భారీ వర్షాలకు మట్టి చరియలు ఒక్కసారిగా విరిగి పడటంతో టీస్టాల్ వద్ద పలువురు మట్టిలో కూరుకుపోయారు. ఐదుగురి మృతదేహాలను బయటకు తీశారు. మృతుల్లో ఇద్దరు పిల్లలు ఉన్నారు. కాగా, మట్టి చరియలు పడటంతో టీస్టాల్ వద్ద ఆగిన ఓ గ్యాస్ ట్యాంకర్ బోల్తా పడింది. మరో లారీ మట్టిలో ఇరుక్కుపోయింది. ఈ రెండు వాహనాల డ్రైవర్లు, క్లీనర్లు మట్టిలో ఇరుక్కుపోయి ఉంటారని అనుమానిస్తున్నారు.

రూ.500 బోనస్ జాబితాలోని సన్న రకాలివే!

» ఉత్తర్వులు విడుదల చేసిన వ్యవసాయ శాఖ

» సన్నాల జాబితాపై గత నెలలోనే 'ఆంధ్రజ్యోతి' కథనం

హైదరాబాద్, జూలై 16(ఆంధ్రజ్యోతి): ఈ వానాకాలం సీజన్ నుంచి సన్న రకాలకు రూ.500 చొప్పున బోనస్ చెల్లిస్తామని ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం.. దీనికి సంబంధించి 33 సన్న రకాల జాబితాను విడుదల చేసింది. దీనిపై జీవో నం.27ను ఇటీవల జారీచేసినప్పటికీ మంగళవారం సర్క్యులేట్ చేశారు. కెర్నల్ పొడవు 6 మి.మీ. కంటే తక్కువ, ఎల్‌బీ నిష్పత్తి 2.5, వెడల్పు 2 మి.మీ. కంటే ఎక్కువ లేని విత్తనాలను సన్నాల జాబితాలో చేర్చారు. యూనివర్సిటీ శాస్త్రవేత్తలు, వ్యవసాయశాఖ అధికారుల కమిటీ కసరత్తు చేసి వీటిని ఖరారు చేసింది. ఈ జాబితాలోని సన్నాలకు మాత్రమే కనీస మద్దతు ధరపై క్వింటాకు అదనంగా రూ.500 చెల్లిస్తారు. కాగా, ఈ అంశంపై జూన్ 26న 'సన్నాల జాబితా సిద్ధం!' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి' కథనాన్ని ప్రచురించింది.

సన్నాల జాబితా: సిద్ధి (వరంగల్- 44), కంపాసాగర్ వరి-1(కేపీఎస్ 2874), సాంబ మసూరి (బీపీటీ-5204), జగిత్యాల వరి-3(జేజీఎల్-27356) జగిత్యాల వరి-2(జేజీఎల్- 28545), వరంగల్ సాంబ(డబ్ల్యూజీఎల్-14), వరంగల్ సన్నాలు (డబ్ల్యూజీఎల్-32100), జగిత్యాల మసూరి (జేజీఎల్-11470), పొలాస ప్రభ (జేజీఎల్- 384), కృష్ణా (ఆర్ఎన్ఆర్-2458), మానేరు సోనా (జేజీఎల్-3828), తెలంగాణ సోనా (ఆర్ఎన్ఆర్-15048), వరంగల్ వరి- 119, కూనారం వరి-2(కేఎన్ఎం- 1638), వరంగల్ వరి- 2 (డబ్ల్యూజీఎల్- 962), రాజేంద్రనగర్ వరి-4 (ఆర్ఎన్ఆర్-21278), కూనారం వరి-1(కేఎన్ఎం- 733), జగిత్యాల సన్నాలు (జేజీఎల్-1798), జగిత్యాల సాంబ(జేజీఎల్- 3844), కరీంనగర్ సాంబ (జేజీఎల్- 3855), అంజన (జేజీఎల్- 11118), నెల్లూరు మసూరి (ఎన్ఎల్ఆర్-34449), ప్రత్యుమ్న (జేజీఎల్- 17004), సుగంధ సాంబ (ఆర్ఎన్ఆర్-2465), శోభిని (ఆర్ఎన్ఆర్- 2354), సోమనాథ్ (వరంగల్- 347), ఆర్ఎన్ఆర్- 31479 (పీఆర్‌సీ), కేపీఎస్- 6251 (పీఆర్‌సీ), జేజీఎల్- 33124 (పీఆర్‌సీ), హెచ్ఎంటీ సోనా, మార్టేరు సాంబ (ఎంటీయూ- 1224), మార్టేరు మసూరి(ఎంటీయూ-1262), ఎంటీయూ 1271.

300 కోట్లతో నైపుణ్య అభివృద్ధి కేంద్రాలు

» ముందుకొచ్చిన పది ప్రఖ్యాత విశ్వవిద్యాలయాలు : దుద్దిళ్ల

హైదరాబాద్, జూలై 16 (ఆంధ్రజ్యోతి):తెలంగాణలో రూ.300 కోట్లతో నైపుణ్య అభివృద్ధి కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు, ఇందుకు పది ప్రఖ్యాత విశ్వవిద్యాలయాలు ముందుకొచ్చాయని ఐటీ మంత్రి డి.శ్రీధర్ బాబు తెలిపారు. మంగళవారం ఆయన సచివాలయంలో అంతర్జాతీయ స్టార్టప్ ఫౌండేషన్ (ఐఎస్ఎఫ్), స్టార్టప్ రన్‌వే సంస్థల ప్రతినిధులతో సమావేశం అయ్యారు. హైదరాబాద్ కేంద్రంగా 25 దేశాల్లో కార్యకలాపాలు నిర్వహించే అంతర్జాతీయ స్టార్టప్ ఫౌండేషన్, టెక్సాస్ కేంద్రం గా పనిచేస్తున్న స్టార్టప్ రన్ వే సంస్థలతో అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్, యూకేలోని లండన్ బిజినెస్ స్కూల్‌తో నైపుణ్య శిక్షణకు సంబంధించిన ఒప్పందం ఉందన్నారు. సెప్టెంబరు 25-28 తేదీల్లో హైదరాబాద్ కేంద్రంగా నిర్వహించనున్న అంతర్జాతీయ స్టార్టప్ ఫౌండేషన్ సదస్సులో 10 ప్రఖ్యాత వర్సిటీల ప్రతినిధులు పాల్గొంటున్నారని తెలిపారు. కాగా, పరిశ్రమల అవసరాల కోసం కేటాయించిన రూ. కోట్ల విలువచేసే వందల ఎకరాల ప్రభుత్వ భూములను ఆక్రమిస్తున్నా పట్టించుకోని అధికారులపై కఠినచర్యలు తప్పవని మంత్రి హెచ్చరిం చారు. ఈమేరకు అధికారులకు మంగళవారం ఆయన లేఖలు రాశారు.

ప్రభుత్వాలు మారుతున్నా దక్కని 'క్షమాభిక్ష'!

» 26 ఏళ్లుగా జైల్లోనే గణేశ్.. వయోభారం, అనారోగ్యంతో ఇబ్బందులు

హైదరాబాద్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ఖైదీల ఎంపికపై సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినా.. రాష్ట్ర ప్రభుత్వాలు తాత్సారం చేస్తున్నాయి. ఫలితంగా క్షమాభిక్షకు అర్హులైన వారు జైళ్లలోనే మగ్గిపోతున్నారు. ఏపీలోని ప్రకాశం జిల్లా మాజీ ఎంపీ మాగుంట సుబ్బరామిరెడ్డి హత్య కేసులో శిక్ష అనుభవిస్తున్న పీటీవీ గణేశ్ ఉదంతమే దీనికి నిదర్శనం. గణేశ్ విద్యార్థి దశలో 1985లో మావోయిస్టు పార్టీలో చేరారు. మాగుంట హత్య కేసులో 1995 డిసెంబరులో ఆయన్ను అరెస్టు చేశారు. ఆగస్టు 4, 2000లో కోర్టు శిక్ష ఖరారు చేసింది. గణేశ్ 26 ఏళ్లుగా జైల్లోనే ఉన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఇటీవల 200 మందికిపైగా ఖైదీలకు క్షమాభిక్ష ప్రసాదించింది. ఆ జాబితాలో గణేశ్ పేరు ఉన్నట్లు చెప్పిన జైలు అధికారులు.. ఖైదీల విడుదలకు కొద్ది సమయం ముందు లేదన్నారు. గతంలో పలుమార్లు గణేశ్‌కు ఇలాగే నిరాశ మిగిలింది. ఏదైనా కేసులో సీబీఐ దర్యాప్తు జరుగుతున్న నిందితులపై మోపిన అభియోగాల మేరకు క్షమాభిక్షకు అనర్హులని, అయితే రాష్ట్ర ప్రభుత్వం విచక్షణ మేరకు నిర్ణయం తీసుకొని విడుదల చేయవచ్చన్న సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం.. గణేశ్ విషయంలో రాష్ట్రప్రభుత్వం నిర్ణయం తీసుకోవచ్చు. అయినా ఉమ్మడి ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో జైల్లోనే ఉండాల్సి వస్తోంది. అప్పుడప్పుడు పెరోల్‌పై బయటకొస్తున్నా షరతులతో కాలం వెళ్లదీస్తున్నారు. వయోభారం, అనారోగ్యంతో బాధపడుతున్న గణేశ్.. క్షమాభిక్షపై నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నారు. దీనిపై కవులు,కళాకారులు పలుమార్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు న్యాయం చేయండి

» కేంద్ర మంత్రి బండి సంజయ్‌కి మంత్రి పొన్నం లేఖ

కరీంనగర్ అర్బన్, జూలై 16: తెలంగాణ రాష్ట్రానికి, ప్రత్యేకంగా కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గానికి కేంద్ర బడ్జెట్‌లో తగినంత కేటాయింపులు జరిగేలా చూడాలని కేంద్ర మంత్రి బండి సంజయ్‌కి రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ బహిరంగ లేఖ రాశారు. నియోజకవర్గంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని.. మిడ్ మానేరు, గౌరవెల్లి ప్రాజెక్ట్ భూ నిర్వాసిత కుటుంబాలకు సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు పెట్టించాలని, శాతవాహన వర్సిటీకి రూ.200 కోట్ల ఆర్థిక సాయం అందించేలా, కరీంనగర్-తిరుపతి బై వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలు రోజూ నడిచేలా చర్యలు తీసుకోవాలన్నారు. కరీంనగర్- షిర్డీ మధ్య రైల్వే డబ్లింగ్‌ను వేగవంతం చేయాలని, హుస్నాబాద్‌లో మెడికల్ కాలేజ్ మంజూరు చేయాలని, కొత్తపల్లి నుంచి జనగామకు జాతీయ రహదారి నిర్మించాలని, వేములవాడ, కొండగట్టు ఆలయాల అభివృద్ధికి నిధులు తేవాలని పొన్నం కోరారు.

జస్టిస్ నర్సింహారెడ్డిని తప్పించండి!

(మొదటి పేజీ తరువాయి)

ఆదేశించింది. కొత్త ఛైర్మన్‌తో, అవే విధివిధానాలతో కమిషన్ విచారణను యథాతథంగా కొనసాగించవచ్చని స్పష్టత ఇచ్చింది. అదే సమయంలో అసలు కమిషన్‌కు చట్టబద్ధత లేదని, కమిషన్ విచారణను రద్దు చేయాలని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన విజ్ఞప్తిని మాత్రం సుప్రీంకోర్టు పట్టించుకోలేదు. సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో నరసింహారెడ్డి అప్పటికప్పుడు విచారణ కమిషన్ బాధ్యతల నుంచి తప్పుకున్నారు. తనన్యాయవాది ద్వారా ఈ సమాచారాన్ని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనానికి చేరవేశారు. జస్టిస్ నర్సింహారెడ్డి తప్పుకోవడంతో ఈ మొత్తం వ్యవహారాన్ని తీర్పులో ప్రస్తావిస్తూ ధర్మాసనం పిటిషన్‌పై విచారణను ముగించింది. మంగళవారం ధర్మాసనంలో విచారణ సందర్భంగా నాటకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఇరుపక్షాల వాదనల మధ్యలో జస్టిస్ నర్సింహారెడ్డి విలేకరుల సమావేశం ప్రస్తావన వచ్చింది. దీనిపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. "న్యాయం జరిగినట్లు కనిపించాలి. ఆయన రహస్యంగా జరగాల్సిన విచారణ కమిషన్‌కు నేతృత్వం వహిస్తున్నారు. విచారణలో భాగంగా తన ముందుకు వచ్చిన అంశాలపై విలేకరుల సమావేశంలో స్వేచ్ఛగా అభిప్రాయాలను వెల్లడించారనే భావన ఉంది. ఆయన్ను మార్చడానికి రాష్ట్ర ప్రభుత్వానికి ఒక అవకాశం ఇస్తున్నాం. మరో జడ్జిని నియమించండి" అని జస్టిస్ చంద్రచూడ్ మధ్యాహ్న భోజన విరామానికి ముందు విచారణలో వ్యాఖ్యానించారు. "చెప్పిన విధానంలో పొరపాటు పక్షపాతానికి సంకేతం కాదు" అని రాష్ట్ర ప్రభుత్వం తరఫున వాదించిన న్యాయవాది అభిషేక్ సింఘ్వీ అన్నారు. విచారణే పూర్తి కాకుండా కమిషన్ ఛైర్మన్ తన ముందుకు వచ్చిన అంశాల విషయ యోగ్యత(మెరిట్స్ ఆఫ్ ద మేటర్) మీద అభిప్రాయాలను వెల్లడించడం సరికాదని ధర్మాసనం అభిప్రాయపడింది. "విధివిధానాలు పాటించామని చెప్పడం కోసం ఫలానా వారిని కూడా విచారణకు



పిలిచామన్నంత వరకు చెబితే సమస్యేలేదు. జడ్జిగా పని చేసిన ఆయన స్థాయికి ఇది కొద్దిగా తగని వ్యవహారం. తప్పొప్పులు ఎంచకుండా ఉంటే అసలు మేం జోక్యం చేసుకొనే వాళ్లమే కాదు. విచారణాంశంపై ఆయన వ్యాఖ్యలు చేయడమే సమస్య. ఆయన వ్యాఖ్యలకు చట్టబద్ధత లేనప్పటికీ ఆ వ్యాఖ్యల తర్వాత విచారణ కమిషన్ నివేదిక తప్పకుండా ఒక వ్యక్తి గౌరవానికి భంగం కలిగించే విధంగా ఉంటుంది" అని జస్టిస్ చంద్రచూడ్ చెప్పారు. ఛైర్మన్‌ను మార్చాలని ధర్మాసనం సూచించగా, విచారణ చివరి దశకు చేరిందని సింఘ్వీ విన్నవించారు. ఇన్ని రోజులు జరిగిన విచారణనే కొత్త ఛైర్మన్ కొనసాగిస్తారని ధర్మాసనం స్పష్టత ఇచ్చింది. ఛైర్మన్‌గా మరొకరిని నియమించే అవకాశం రాష్ట్ర ప్రభుత్వానికే ఇస్తున్నట్టు సీజేఐ తెలిపారు. భోజన విరామం తర్వాత జస్టిస్ నరసింహారెడ్డి రాజీనామా లేఖ కాపీని సీనియర్ న్యాయవాది గోపాల్ శంకర నారాయణన్ ధర్మాసనానికి అందజేశారు. దీంతో ఇప్పటికే ఇచ్చిన నోటిఫికేషన్ ప్రకారమే కమిషన్‌ను నియమించాలని సుప్రీంకోర్టు తెలిపింది. సోమవారం లోపు నూతన ఛైర్మన్‌ను నియమిస్తామని తెలంగాణ ప్రభుత్వం తెలుపగా, ధర్మాసనం అంగీకరించింది. జస్టిస్ నర్సింహారెడ్డి గతంలో పాట్నా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా వ్యవహరించారు.

హైకోర్టులో ప్రతికూల తీర్పు

చట్ట విరుద్ధంగా కమిషన్‌ను ఏర్పాటు చేశారని, వెంటనే విచారణ నిలిపివేస్తూ ఆదేశాలు ఇవ్వాలని ఇటీవల కేసీఆర్ తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్‌ను హైకోర్టు కొట్టేసింది. హైకోర్టు తీర్పును కేసీఆర్ సుప్రీంలో సవాల్ చేశారు. ఆ పిటిషన్‌పై సోమవారమే విచారణ జరగాల్సి ఉండగా సీనియర్ న్యాయవాది రాలేదని, పాస్ ఓవర్ కావాలని కేసీఆర్ తరఫు న్యాయవాది మోహిత్‌రావు కోరారు. మంగళవారం జస్టిస్ చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. కేసీఆర్ తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ, తెలంగాణ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాదులు అభిషేక్ మనుసింఘ్వీ, సిద్ధార్థ్ లూథ్రా, కమిషన్ తరఫున సీనియర్ న్యాయవాది గోపాల్ శంకర నారాయణన్ సుదీర్ఘ వాదనలు వినిపించారు.

కక్ష సాధింపే

విద్యుత్ కమిషన్ ఏర్పాటు పూర్తిగా రాజకీయ కక్ష సాధింపు చర్యలో భాగమేనని కేసీఆర్ తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ ఆరోపించారు. ప్రభుత్వం మారిన ప్రతిసారి కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం మాజీ ముఖ్యమంత్రులపై కేసులు పెడుతోందని, ఇది సరికాదన్నారు. రాష్ట్ర విభజన తర్వాత అత్యవసర పరిస్థితుల్లో పక్క రాష్ట్రాల నుంచి విద్యుత్ కొనుగోలు చేయాల్సి వచ్చిందని చెప్పారు. ఛత్తీస్‌గఢ్‌తో విద్యుత్ కొనుగోలు ఒప్పందం పూర్తిగా చట్టబద్ధంగా జరిగిందని చెప్పారు. అప్పటి మార్కెట్ ధర కంటే తక్కువ రేటుకే విద్యుత్ కొనుగోలు చేసినట్టు తెలిపారు. యూనిట్‌కు రూ.3.90 చొప్పున కొనుగోలు చేశామన్నారు. బహిరంగ వేలానికి ఎందుకు వెళ్లలేదని సుప్రీంకోర్టు ప్రశ్నించగా, అత్యవసర సమయంలో అలా వెళ్లే అధికారం ప్రభుత్వానికి ఉందని బదులిచ్చారు. కమిషన్ నియామకమూ చట్ట ప్రకారం జరగలేదని చెప్పారు. ట్రిబ్యునళ్లు ఉండగా విద్యుత్ కొనుగోలు ఒప్పందాలపై న్యాయ విచారణకు ఎలా ఆదేశిస్తారని ప్రశ్నించారు. ఛైర్మన్ తీరు ఏకపక్షంగా ఉందని ఆరోపించారు. విచారణ పూర్తి కాకుండానే ఛైర్మన్ మీడియా సమావేశం నిర్వహించి, కేసీఆర్ తప్పు చేశారని తేల్చేశారని అన్నారు. విద్యుత్ కొన్నది, విద్యుత్ ప్లాంట్లకు సాంకేతిక పరిజ్ఞానం తీసుకున్నదీ ప్రభుత్వరంగ సంస్థల నుంచేనని గుర్తు చేశారు. కమిషన్‌ను రద్దు చేయాలని కోరారు. హైకోర్టులో పిటిషన్‌ను విచారించకుండానే కొట్టేశారన్నారు.

రికార్డుల్లో విషయాలేవీ చెప్పలేదు

విద్యుత్ కమిషన్ ఎక్కడా పరిధి దాటి ప్రవర్తించలేదని రాష్ట్ర ప్రభుత్వం తరఫున వాదనలు వినిపించిన అభిషేక్ సింఘ్వీ అన్నారు. విద్యుత్ ఒప్పందాలన్నీ నిబంధనల ప్రకారం జరిగితే మాజీ చీఫ్ జస్టిస్ నేతృత్వంలో విచారణ జరిగితే నష్టమేంటని ప్రశ్నించారు. ఏప్రిల్ 11న కేసీఆర్‌తో పాటు 25 మందికి కమిషన్ నోటీసులు జారీ చేసిందని చెప్పారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో జూన్ 30 వరకు కేసీఆర్ గడువు అడిగారన్నారు. జూన్ 15 వరకు కమిషన్ గడువు ఇచ్చిందన్నారు. కేవలం విచారణ ఎంతవరకు వచ్చిందనే విషయాన్ని మాత్రమే జస్టిస్ నరసింహారెడ్డి మీడియాకు చెప్పారని వెల్లడించారు. విచారణ కమిషన్ తరఫు న్యాయవాది గోపాల్ శంకరనారాయణన్ కలుగజేసుకుని, కేసీఆర్ సమాధానం ఇవ్వలేదని, అదనపు సమయం కోరారని మాత్రమే నరసింహారెడ్డి మీడియాకు చెప్పారన్నారు. రికార్డులో ఉన్న విషయాలేమీ మీడియాతో చర్చించలేదని తెలిపారు. దేశవ్యాప్తంగా పవర్ ప్రాజెక్టులన్నీ సూపర్ క్రిటికల్ టెక్నాలజీతో నిర్మిస్తుంటే, భద్రాద్రి మాత్రమే సబ్ క్రిటికల్ టెక్నాలజీతో నిర్మించారని సింఘ్వీ తెలిపారు. దాంతో రాష్ట్ర ప్రభుత్వ ఖజానాపై భారం పడిందని చెప్పారు. విచారణ చివరి దశలో ఉందని, మరికొన్ని రోజుల్లో అసలు వాస్తవాలేమిటో బహిర్గతం అవుతాయని సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా అన్నారు. ఈ దశలో కమిషన్‌ను రద్దు చేయాలని కోరడం సరికాదని చెప్పారు.

ప్రైవేటు పాఠశాలల్లో.. పేద పిల్లలకు ఎన్ని ఉచిత సీట్లు ఇచ్చారు?

» విద్యా హక్కు చట్టం అమలుపై వివరణ ఇవ్వండి

» ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు

హైదరాబాద్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): విద్యాహక్కు చట్టంలోని సెక్షన్ 12(1)(సీ)లో పేర్కొన్న విధంగా ప్రైవేటు పాఠశాలల్లో పేద విద్యార్థులకు 25 శాతం ఉచిత సీట్లు ఎన్ని ఇచ్చారు..? చట్టం అమలుకు ఎలాంటి చర్యలు తీసుకున్నారో వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. 2009లో ఈ చట్టం అమలులోకి వచ్చినా ఇప్పటికీ 25 శాతం ఉచిత సీట్లను ఇవ్వడం లేదని 2020లోనే హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. మంగళవారం ఈ పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ ఆలోక్ అరాధే, జస్టిస్ అనిల్ కుమార్ ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. రాష్ట్రంలో ఈ చట్టం అమలుకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని, మార్గదర్శకాలు లేవని పేర్కొన్నారు. దీంతో విద్యాహక్కు చట్టంలోని సెక్షన్ 2 (ఎన్)లో పేర్కొన్న ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలల్లో ఎన్ని ఉచిత సీట్లు ఇచ్చారో చెప్పాలని ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది రాహుల్‌రెడ్డిని ధర్మాసనం ప్రశ్నించింది. సెక్షన్ 12(1)(సీ) అమలుపై రెండు వారాల్లో నివేదిక సమర్పించకపోతే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

ఐటీడీఏ పీవోకు సివిల్ కేసులు పరిష్కరించే అధికారం ఉందా?

» ఉట్నూరు ఐటీడీఏ పీవోను వివరణ కోరిన హైకోర్టు

హైదరాబాద్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఐటీడీఏ పీవోకు సివిల్ వివాదాలు పరిష్కరించే అధికారం ఉందా..? అని హైకోర్టు ప్రశ్నించింది. ఏ చట్టం కింద పీవోలు సివిల్ కేసులను స్వీకరిస్తున్నారో వివరించాలని ఉట్నూర్ ఐటీడీఏ పీవోకు ఆదేశాలు జారీచేసింది. తెలంగాణ ఏజెన్సీ రూల్స్-1924 అమలుకు ప్రభుత్వం జారీ చేసిన జీవో 274లో కలెక్టర్లు లేదా గవర్నమెంట్ ఏజెంట్, ఏజెన్సీ డివిజన్ ఆఫీసర్, ఆర్డీవోలకు అధికారాలు ఉన్నాయే తప్ప గవర్నమెంట్ అడిషనల్ ఏజెంట్ లేదా ఐటీడీఏ పీవోలకు ఎలాంటి అధికారాలు ఇవ్వలేదని జస్టిస్ కాజా శరత్ ఓ సివిల్ వివాదం విచారణ సందర్భంగా వ్యాఖ్యానించారు. ఆదిలాబాద్, కొమ్రంభీం అసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల జిల్లాలకు సంబంధించి ఎన్ని సివిల్ కేసులు పీవో వద్ద పెండింగ్‌లో ఉన్నాయో నివేదిక ఇవ్వాలని పేర్కొన్నారు.

తీవ్ర జ్వరం, వైద్యం వికటించి.. గురుకుల విద్యార్థిని మృతి

» సూర్యాపేట జిల్లా దోసపహాడ్‌లోని పాఠశాలలో ఘటన



సరస్వతి (ఫైల్)

పెన్‌పహాడ్, జూలై 16: సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలం దోసపహాడ్‌లోని బీసీ వెల్ఫేర్ బాలికల గురుకుల పాఠశాలలో ఓ విద్యార్థిని మరణించింది. తీవ్ర జ్వరంతో బాధపడుతున్న బాలికకు చేసిన వైద్యం వికటించడంతో ప్రాణాలు కోల్పోయినట్టు తెలుస్తోంది. నూతనకల్ మండలం మాచినపల్లికి చెందిన కొంపెల్లి సరస్వతి(10) దోసపహాడ్‌లోని బీసీ వెల్ఫేర్ బాలికల గురుకుల పాఠశాలలో ఐదో తరగతి చదువుతోంది. సరస్వతి సోమవారం రాత్రి జ్వరంతో బాధపడుతుండగా ఉపాధ్యాయులు దోసపహాడ్‌లోని ఓ ఆర్ఎంపీ వద్దకు తీసుకెళ్లగా ఇంజక్షన్ చేశారు. ఆ తర్వాత పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారడంతో సూర్యాపేట జనరల్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు సరస్వతి అప్పటికే మరణించిందని తెలిపారు. బాలిక తండ్రి కొంపెల్లి సోమయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. విద్యార్థిని మృతి విషయం తెలుసుకున్న మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొన్నం ప్రభాకర్ సమగ్ర విచారణకు ఆదేశించారు. బాధిత కుటుంబానికి రూ.2 లక్షలు ఇస్తామని మంత్రి కోమటిరెడ్డి ప్రకటించగా సరస్వతి ఇంట్లో ఒకరికి బీసీ గురుకులంలో ఉద్యోగ అవకాశం కల్పిస్తామని పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. సరస్వతి తల్లిదండ్రులతో మాట్లాడిన గురుకుల పాఠశాల అధికారులు బీసీ వెల్ఫేర్ నుంచి రూ.2లక్షలు, ప్రిన్సిపాల్ నుంచి రూ.2లక్షలు ఇప్పిస్తామని హామీ ఇచ్చారు.

పిల్లల పాపం.. పెద్దల సహకారం!

బాలికను రేప్ చేసి చంపేసిన ముగ్గురు మైనర్లు.. మృతదేహానికి రాయి కట్టి నదిలో పారేసిన పెద్దలు

» ముచ్చుమర్రి ఘటనలో పురోగతి

» మైనర్లపై పోక్సో కేసు, జువెనైల్ హోంకు తరలింపు

» ఇద్దరు పెద్దల అరెస్టు, రిమాండ్‌కు తరలింపు

» నంద్యాల ఎస్పీ వెల్లడి

నందికొట్కూరు, జూలై 16: ముచ్చుమర్రిలో పది రోజుల క్రితం కనిపించకుండా పోయిన వాసంతి కేసులో ఎట్టకేలకు పోలీసులు పురోగతి సాధించారు. ఇందుకు సంబంధించిన వివరాలను నంద్యాల కొత్త జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా మంగళవారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. నంద్యాల జిల్లా పగిడ్యాల మండలం ముచ్చుమర్రి గ్రామానికి చెందిన బాలిక ఈనెల 7వ తేదీన పార్కులో ఆడుకుంటూ కనిపించకుండా పోయింది. దీంతో తండ్రి సంగెం మద్దిలేటి ముచ్చుమర్రి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. రంగంలోకి దిగిన పోలీసులు మంగళవారం ముగ్గురు మైనర్ బాలురను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. ఈ కేసులో ముగ్గురు బాలురు (ఒకరు 8వ తరగతి(13), ఇద్దరు బాలురు పదో తరగతి(15) విద్యార్థులు) వాసంతిపై పార్కులోనే అత్యాచారం చేశారు. ఆ తర్వాత చాక్లెట్ కొనిచ్చి, కేసీ కెనాల్ వద్దకు తీసుకెళ్లారు. ఆ తర్వాత హత్యచేసేందుకు పథకం రచించుకుని ముచ్చుమర్రి గ్రామ శివారులో కేసీ కాలువ పక్కనే ఉన్న పొదల్లోకి వాసంతిని తీసుకెళ్లి ముగ్గురూ కలిసి బాలికను చంపేశారు. వారిలో ఒకరు కాళ్లను, మరొకరు చేతులను గట్టిగా పట్టుకోగా మరో బాలుడు గొంతు నులిమి కిరాతకంగా హతమార్చారు. ఆ తర్వాత ఏం చేయాలో తెలియక ఇంట్లోని పెద్దలకు విషయాన్ని చెప్పారు. రాత్రి సమయంలో బాలురులో ఒకరి తండ్రి కాటం యోహాన్, మరో బాలుడి పెదనాన్న బొల్లెద్దుల సద్గురుడు.. బాలిక మృతదేహాన్ని సంచిలో వేసుకొని ద్విచక్రవాహనంపై వనములపాడు మీదుగా ముచ్చుమర్రి మీదుగా, మళ్లీ అక్కడి నుంచి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న కృష్ణానది వద్దకు వెళ్లారు. అక్కడ నదిలో రాత్రి సమయంలో మృతదేహానికి రాయి కట్టి తెప్పలో నదిలో మధ్యలోకి వెళ్లి విసిరేశారు. తర్వాత ఏమీ ఎరుగనట్లు ఇంటికి వచ్చేశారు. కేసు పెద్దలపై రాకుండా మైనర్లను ముందుకు ఉంచారు. మైనర్లు కావడంతో కేసు బలపడదని భావించిన తల్లిదండ్రులు అసలు విషయం బయటకు పొక్కకుండా జాగ్రత్త పడ్డారు.

మృతదేహం కోసం గాలింపు

బాలికపై అత్యాచారం చేసి హత్య చేసిన ముగ్గురు మైనర్లపై పోక్సో చట్టం కింద పోలీసులు కేసు నమోదు చేసి కర్నూలు జువెనైల్ హోంకు తరలించారు. అదేవిధంగా బాలురు చేసిన తప్పును సమర్థిస్తూ బాలిక మృతదేహాన్ని మాయం చేసిన కేసులో యోహాన్, సద్గురుడులను అరెస్టు చేసి, కోర్టు ఆదేశాల మేరకు నందికొట్కూరు సబ్‌జైల్‌లో రిమాండ్‌కు తరలించారు. కాగా, బాలిక మృతదేహం కోసం గాలింపు చర్యలు చేపడుతున్నామని, కేసు బలోపేతం కోసం సాక్ష్యాలను సేకరిస్తున్నట్లు ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా వెల్లడించారు. ఈ కేసులో ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లూ లేవని, కేవలం చిన్నారులు చేసిన తప్పును తల్లిదండ్రులు కప్పిపుచ్చుకునేందుకే మృతదేహాన్ని మాయం చేశారని తెలిపారు. ఈ సమావేశంలో కేసును విచారించిన.. వీఆర్‌కు బదిలీ అయిన ఎస్పీ రఘువీర్‌రెడ్డి, ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

తెరుచుకున్న ఆల్మట్టి గేట్లు

» ప్రాజెక్టుకు లక్ష క్యూసెక్కుల ఇన్ ఫ్లో

» 65 వేల క్యూసెక్కుల నీరు విడుదల

హైదరాబాద్/గద్వాల, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో కర్ణాటకలోని ఆల్మట్టి జలాశయానికి వరద పోటెత్తుతోంది. మంగళవారం సాయంత్రానికి ప్రాజెక్టుకు 1,04,000 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. ఆల్మట్టి సామర్థ్యం 129.72 టీఎంసీలు కాగా, ప్రస్తుతం జలాశయంలో 99.24 టీఎంసీల నీరు ఉంది. పై నుంచి వరద భారీగా వస్తుండటంతో జల విద్యుత్ ఉత్పత్తి ద్వారా 40 వేల క్యూసెక్కులు, 14 గేట్లను ఎత్తి మరో 25 వేల క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. నారాయణపూర్ జలాశయం సామర్థ్యం 37.64 టీఎంసీలు కాగా ప్రాజెక్టులో 28.76 టీఎంసీల నీరు ఉంది. ఇన్‌ఫ్లో 65 వేల క్యూసెక్కులు ఉండటంతో ఒక్క రోజులోనే ఈ ప్రాజెక్టు నిండే అవకాశం ఉంది. ఇప్పటికే జూరాల జలాశయం నిండి ఉండటంతో శ్రీశైలం వైపు కృష్ణమ్మ పరుగులు పెట్టే అవకాశం ఉంది. మరోవైపు, శ్రీశైలం జలాశయానికి 2,496 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ప్రాజెక్టులో జలవిద్యుత్ ఉత్పాదన ద్వారా 32,262 క్యూసెక్కులను నాగార్జున సాగర్‌కు వదులుతున్నారు. తుంగభద్ర పూర్తిస్థాయి నీటిమట్టం 105.79 టీఎంసీలు కాగా ప్రస్తుతం 35.47 టీఎంసీలకు చేరుకున్నది. మంగళవారం ప్రాజెక్టుకు 28,153 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. ఈ నెల 15న జరిగిన త్రిసభ్య కమిటీ సమావేశంలో నిర్ణయాలకు అనుగుణంగా సాగర్ నుంచి తాగునీటి అవసరాలకు నీటిని విడుదల చేయడానికి వీలుగా కృష్ణా బోర్డు మంగళవారం ఆదేశాలు ఇచ్చింది. 4.5 టీఎంసీలను సాగర్ కుడి కాలువ నుంచి ఏపీకి, 5.4 టీఎంసీలను తెలంగాణకు విడుదల చేయాలని బోర్డు ఆదేశించింది. బుధవారం నుంచి 5,500 క్యూసెక్కులను సాగర్ కుడి కాలువ నుంచి ఏపీకి విడుదల చేయాలని బోర్డు నిర్దేశించింది.

కండక్టర్ అసభ్య ప్రవర్తన

» హైదరాబాద్ సిటీ బస్సులో ఓ యువతితో వికృతచేష్టలు

» సోషల్ మీడియా ద్వారా బాధితురాలి ఫిర్యాదు

» విచారణకు ఆర్టీసీ ఆదేశం.. నిందితుడిపై కేసు నమోదు

హైదరాబాద్ సిటీ, జూలై 16 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో భాగంగా ప్రయాణికులతో గౌరవంగా నడుచుకోవాల్సిన ఓ కండక్టర్ ఓ ప్రయాణికురాలితో అత్యంత అసభ్యంగా ప్రవర్తించాడు. ప్రయాణికులతో కిక్కిరిసిన బస్సు కదులుతున్న సమయంలో ఓ యువతిని లైంగికంగా వేధించాడు. హైదరాబాద్‌లో ఓ సిటీబస్‌లో మంగళవారం ఉదయం ఈ దారుణం జరిగింది. తనకు ఎదురైన చేదు అనుభవాన్ని బాధితురాలు సోషల్ మీడియాలో వెల్లడించడంతో విషయం బయటికొచ్చింది. బాధితురాలు ఎక్స్(ట్వీట్)లో చేసిన పోస్ట్ ప్రకారం.. సదరు యువతి(21) మంగళవారం ఉదయం ఎనిమిది గంటల సమయంలో హిమాయత్‌నగర్ వెళ్లేందుకు మణికొండలో టీజీఎస్ఆర్టీసీ సిటీ బస్సు ఎక్కింది. బస్సు ప్రయాణికులతో కిక్కిరిసి ఉండగా, ఇదే అదనుగా భావించిన బస్సు కండక్టర్ బాధితురాలితో అసభ్యంగా ప్రవర్తించాడు. యువతి శరీరంపై తాకరాని చోట చేతులు వేశాడు. బాధితురాలు చేసిన పోస్ట్‌పై స్పందించిన టీజీఎస్ ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ సమగ్ర విచారణకు ఆదేశించారు. సంబంధిత డిపో మేనేజర్ ఇచ్చిన నివేదిక ఆధారంగా కండక్టర్‌పై చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. అలాగే, బాధితురాలు నుంచి ఫిర్యాదును స్వీకరించిన రాయదుర్గం పోలీసులు ఆరోపణలు ఎదుర్కొంటున్న కండక్టర్‌పై కేసు నమోదు చేశారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

వెలిగిన విపక్షం

లోక్‌సభ ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించిన ఇండియా కూటమికి ఇటీవలి ఉప ఎన్నికల విజయాలు మరింత ఉత్సాహాన్నిస్తాయి. ఏడురాష్ట్రాల్లో 13స్థానాలకు జరిగిన ఎన్నికల్లో పదింటిని ఇండియా కూటమి కైవసం చేసుకుంది. హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో చెరో రెండు స్థానాలతో మొత్తం నాలుగుస్థానాలను కాంగ్రెస్ గెలుచుకుంటే, పశ్చిమబెంగాల్‌లో మొత్తం నాలుగింటినీ తృణమూల్ కాంగ్రెస్ ఎగరేసుకుపోయింది. పంజాబ్‌లో జలంధర్ వెస్ట్‌ని ఆమ్ ఆద్మీపార్టీ, తమిళనాడులోని విక్రవందిని డీఎంకె గెలుచుకుంటే, హిమాచల్, మధ్యప్రదేశ్‌లలో చెరొకస్థానంతో మొత్తం రెండుసీట్లను మాత్రమే బీజేపీ సాధించుకుంది. బిహార్‌లో మిగిలిన ఆ ఒక్క స్థానం ఓ స్వతంత్ర అభ్యర్థికి పోయింది.

లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ చేతుల్లో ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల్లో తుడిచిపెట్టుకుపోయిన నెలన్నరకాలంలోనే నాలుగు అసెంబ్లీ స్థానాలను సంపాదించడం కాంగ్రెస్‌కు శక్తినిస్తుంది. మరీ ముఖ్యంగా, మొత్తం నాలుగు లోక్‌సభ సీట్లనూ తన నాయకత్వంలో ఓడిపోయినందుకు గాను పార్టీ అధిష్ఠానం నుంచి తీవ్రంగా విమర్శలు ఎదుర్కొంటున్న హిమాచల్ ముఖ్యమంత్రి సుఖ్‌వీందర్ సింగ్ సుక్కూకు ఈ ఉప ఎన్నికల ఫలితాలు ఉపశమనాన్నిస్తాయి. ముగ్గురు ఇండిపెండెంట్లు రాజీనామా చేసి బీజేపీలో చేరడంతో జరిగిన ఈ ఉపఎన్నికల్లో రెండింటిని గెలుచుకోవడంతో ఆయన ప్రభుత్వం ఇప్పుడు సుస్థిరంగా ఉంది. ఈ ముగ్గురితో పాటు ఆరుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు రాజ్యసభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థికి ఓటువేయడంతో సుక్కూ ప్రభుత్వం ఇటీవల సంక్షోభంలోకి జారుకున్న విషయం తెలిసిందే. కాంగ్రెస్ రాజ్యసభ ఎంపీ అభిషేక్ మనుసింఘ్వీ ఓడిపోవడంతో ఆ ఎమ్మెల్యేలపై అనర్హతవేటుపడింది. లోక్‌సభ ఎన్నికలతో పాటు ఈ ఆరుస్థానాలకు జరిగిన పోలింగ్‌లో నాలుగింటిని కాంగ్రెస్ గెలుచుకుంది. తాజా విజయంతో సుక్కూ ప్రభుత్వానికి ఇక ఢోకాలేనట్టే. మధ్యప్రదేశ్‌లో ఒక స్థానాన్ని బీజేపీకి కోల్పోయినప్పటికీ, ఉత్తరాఖండ్‌లో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం బదరీనాథ్‌ను గెలుచుకోవడం కూడా కాంగ్రెస్‌కు ఊరటనిచ్చే అంశం. అక్కడి ఎమ్మెల్యే బీజేపీలోకి ఫిరాయించినప్పటికీ, ఆ స్థానాన్ని తిరిగి నిలబెట్టుకుంది. మతానికి సంబంధించి తనపై బీజేపీ చేస్తున్న విమర్శలను ప్రజలు నమ్మడం లేదని కాంగ్రెస్ గట్టిగా చెప్పుకోవచ్చు. పంజాబ్ పార్లమెంటరీ ఎన్నికల్లో పదమూడింటిలో మూడు మాత్రమే గెలుచుకున్న ఆప్‌కు కూడా ఇది మంచి పరిణామమే. ఈ పార్టీనుంచి పోయి బీజేపీలో చేరిన సిట్టింగ్ ఎమ్మెల్యేను ఓడించడం ద్వారా ఆప్ నైతికంగా పైచేయి సాధించింది.

ఇక, తృణమూల్, డీఎంకే తమ రాష్ట్రాల్లో సాధించిన విజయాలు ఆ పార్టీలను మరింత బలోపేతం చేస్తాయి. మూడు స్థానాలను బీజేపీనుంచి స్వాధీనం చేసుకొని, రాష్ట్రంలో తనకు తిరుగులేదని టీఎంసీ ఈ ఫలితాల్లో చాటిచెప్పింది. లోక్‌సభ ఎన్నికల్లో ఆశించినస్థాయిలో సీట్లు సాధించలేక, కనీసబలానికి కూడా ఓ అడుగుదూరంలో నిలిచిపోయిన భారతీయ జనతా పార్టీకి ఈ ఫలితాలు మరింత నిరాశకలిగిస్తాయి.

సార్వత్రిక ఎన్నికల అనంతరం అతిసమీపకాలంలో జరిగిన ఈ ఉపఎన్నికల్లోనూ ఫలితాలు అదేరీతిలో ఉండటం విశేషం. పూర్తిగా స్థానిక అంశాలే కారణమని ఇదమిత్థంగా చెప్పలేని రీతిలో, దేశంలోని ఏడు రాష్ట్రాలకు ఈ ఫలితాలు విస్తరించి ఉన్నాయి. బీజేపీ మీద ప్రజాగ్రహం జాతీయ స్థాయిలోనే కాక, అసెంబ్లీ స్థాయిలో కూడా బలంగా ఉన్నదని, గతంలో నెగ్గిన స్థానాలను కూడా అది ఇప్పుడు కోల్పోవడం అందుకు నిదర్శనమని విపక్షాలు గట్టిగా అనగలుగుతున్నాయి. పైగా, అత్యధిక స్థానాలను కూటమి పార్టీలు నేరుగా బీజేపీతో పోటీపడి గెలుచుకోవడం, తమనుంచి చీలి, బీజేపీలో చేరినవారిని ఓటర్లు శిక్షించడం వాటికి ఆనందాన్నిస్తోంది.

కారణాలు ఏమైనప్పటికీ, పదమూడులో పదింటిని సంపాదించి పెట్టిన ఈ ఫలితాలు ఇండియా కూటమికి ఎన్డీయేమీద సభలోపలా బయటా పోరాడే శక్తిని ఇస్తాయి. బీజేపీ కచ్చితంగా ఈ ఫలితాలను విశ్లేషించుకుంటుంది, పరిస్థితులను చక్కదిద్దుకొనేందుకు ప్రయత్నిస్తుంది. సంస్థాగత సామర్థ్యం, సమర్థ నాయకత్వం, నైపుణ్యం దానికి ఉన్నాయి. మరికొద్దినెలల్లో బిహార్, మహారాష్ట్ర, హర్యానా, తదితర రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగబోతున్నాయి. జమ్మూకశ్మీర్‌లో సైతం ఎన్నికలుంటాయని కేంద్రం అంటోంది. రాబోయే రోజుల్లో భారతీయ జనతాపార్టీని నిలువరించాలంటే విపక్షకూటమి మరింత చాకచక్యంగా, బీజేపీ వ్యతిరేక ఓటు చీలకుండా, ఐకమత్యంగా వ్యవహరించాల్సి ఉంటుంది.

దాశరథి శతజయంతి సంవత్సరం
తెలంగాణ ప్రభుత్వం పూనుకోవాలి

తరతరాల బూజు నిజాం రాజు అని నిరసించి, నా తెలంగాణ కోటి రత్నాల వీణ అని నినదించి, జెండా ఒక్కటె మూడువన్నెలది అని ఉద్ఘోషించిన మహాకవి దాశరథి కృష్ణమాచార్య 99వ జయంతి ఈ నెల 22వ తేదీన జరుగుతున్నది. ఆ రోజే, ఆయన శతజయంతి ఉత్సవాలకు కూడా నాంది జరగవలసి ఉన్నది. దాశరథి అభిమానుల ఆధ్వర్యంలో వచ్చే సోమవారం నాడు అక్కడక్కడ కొన్ని కార్యక్రమాలు జరుగుతున్నాయి. దాశరథి శతజయంతి ఉత్సవ కమిటీ కూడా ఏర్పడింది. కానీ, ఇది సాహిత్య బృందాలో, సామాజిక సంస్థలో మాత్రమే చేయవలసిన వేడుక కాదు. తెలంగాణ ప్రభుత్వం స్వయంగా పూనుకుని, శతజయంతి వేడుకలను సంవత్సరం పాటు నిర్వహించవలసి ఉన్నది.

తెలంగాణ అస్తిత్వానికి, సగర్వ సాహిత్య వారసత్వానికి ఒక చిహ్నమైన దాశరథిని స్మరించుకోవడం, ప్రభుత్వానికి, ప్రజలకు గౌరవప్రదమైన బాధ్యత. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి, సాంస్కృతిక వ్యవహారాల శాఖ మంత్రి, అధికార యంత్రాంగం, తక్షణమే మేలుకొని, దాశరథి శతజయంతి సంవత్సర ప్రారంభాన్ని ఈ ఆగస్టు 22వ తేదీన నిర్వహించాలని, ఏడాది పొడవునా చేయవలసిన కార్యక్రమాలను ప్రకటించాలని కోరుతున్నాము.

– పెద్ది శ్రీనివాసరెడ్డి, మిత్రులు, మానుకోట
సముద్రాల నరసింహులు, ముద్దుగల్లు

రెండు ధ్రువాలుగా రాజకీయ భారత్



‘దేశ ప్రజలు కాంగ్రెస్‌ను వ్రేళ్లతో పెకిలించేందుకు నిర్ణయించారు. కాంగ్రెస్ లేకుండా భారత దేశాన్ని విముక్తి చేయాలన్నది బీజేపీ నినాదం మాత్రమే కాదు, ప్రజల సంకల్పం కూడా’ అని పదేళ్ల క్రితం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రకటించారు. పదేళ్లుగా ఆయన అనేకసార్లు కాంగ్రెస్ విముక్త భారత్ గురించి మాట్లాడుతూనే వచ్చారు. కాని పదేళ్ల తర్వాత కూడా ఈ దేశం కాంగ్రెస్ పార్టీ నుంచి విముక్తం కాలేదు. లోక్‌సభలో కాంగ్రెస్ సంఖ్యాబలం వందకు చేరుకుంది. బీజేపీ బలం 240 సీట్లకు తగ్గిపోయింది. గత వారం దేశ వ్యాప్తంగా 13 అసెంబ్లీ స్థానాలకు జరిగిన ఉపఎన్నికల్లో బీజేపీకి 2 సీట్లు మాత్రమే దక్కగా, ఇండియా కూటమికి 11 స్థానాలు దక్కాయి. బిహార్, బెంగాల్, హిమాచల్, ఉత్తరాఖండ్, పంజాబ్, తమిళనాడులో ఈ కూటమి అధిక స్థానాలు గెలుచుకుంది. హిమాచల్‌లో అసెంబ్లీకి రాజీనామా చేసి బీజేపీలో చేరిన ముగ్గురిలో ఇద్దరిని కాంగ్రెస్ ఓడించడం, ఉత్తరాఖండ్‌లో రెండు చోట్లా కాంగ్రెస్ విజయం సాధించడం విస్మరించదగిన విషయం కాదు. ఈ ఫలితాలను బట్టి భారతదేశంలో రాజకీయాలు రెండు బలమైన కూటములుగా విడిపోతున్నాయని చెప్పేందుకు ఆస్కారం కలుగుతున్నది. ఈ ఏడాది అక్టోబర్–నవంబర్‌లో జరిగే హర్యానా, మహారాష్ట్ర, జార్ఖండ్, వచ్చే ఏడాది జరిగే బిహార్, ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు దేశ రాజకీయాల దిశను నిర్దేశించవచ్చు. ఈ అయిదు రాష్ట్రాల్లోనూ ఎన్డీఏకూ, ఇండియా కూటమికీ మధ్య హోరాహోరీ పోరు జరుగుందనడంలో సందేహం లేదు.

2029 నాటికి కేవలం రెండు కూటములే (ఎన్డీఏ, ఇండియా) రంగంలో ఉంటాయా? ఈ కూటములలో లేని పార్టీలు అదృశ్యమవుతాయా అన్న చర్చ జరుగుతోంది. భారతదేశ రాజకీయాలు రెండు ధ్రువాల మధ్య సాగడం ఆరోగ్యకరమా? కాదా? అన్న చర్చ కూడా సాగాల్సిన అవసరం ఉన్నది. ఒకే పార్టీకి అధికారం అప్పజెప్పడం కన్నా ఒక కూటమి పాలన నిర్వహించడం అనేక విధాలుగా శ్రేయస్కరమనడంలో సందేహం లేదు.

గత రెండు సార్వత్రిక ఎన్నికలతో పోలిస్తే కాంగ్రెస్ సంఖ్యాబలం కొంత పెరగడాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోదీ విశ్లేషిస్తూ కాంగ్రెస్ పరాన్నజీవి కనుకే కొన్ని సీట్లను పెంచుకున్నదని అన్నారు. ‘ఇటీవలే జరిగిన లోక్‌సభ ఫలితాలను విశ్లేషిస్తే కాంగ్రెస్ ఒంటరిగా పోటీ చేసిన చోట్ల ఎక్కువ సీట్లు గెలుచుకోలేదు. కాని వేరే పార్టీల భుజాలపై ఎక్కినప్పుడు మాత్రం చెప్పుకోదగిన ఫలితాలు సాధించింది. అంటే కాంగ్రెస్ ఒక పరాన్నజీవిలా తన సహచర పార్టీల ఓట్లను ఆరగిస్తుంది’ అని మోదీ లోక్‌సభలో జూలై 4న ప్రసంగిస్తూ తెలిపారు బీజేపీతో ముఖాముఖి తలపడిన అధిక నియోజకవర్గాల్లో కాంగ్రెస్‌కు పరాభవం ఎదురవుతుందని ఆయన ఎద్దేవా చేశారు. అయినప్పటికీ ఆయన ఈ సారి కాంగ్రెస్ విముక్త భారత్ అన్న పదాన్ని ఉపయోగించలేదు. అది అంత సులభంగా సాధ్యపడదని ఆయన గ్రహించి ఉంటారు.

నిజానికి ఒక దశలో కాంగ్రెస్ విముక్త భారత్ నిజంగా ఏర్పడుతుందా అన్న అనుమానాలు చాలా మందికి కలిగాయి. 2009లో బీజేపీకి, కాంగ్రెస్‌కు మధ్య 171 సీట్లలో ముఖాముఖి పోటీ జరిగితే కాంగ్రెస్ 93 స్థానాల్లోనూ, బీజేపీ 78 స్థానాల్లోనూ విజయం సాధించాయి. 2014లో నరేంద్రమోదీ రంగప్రవేశం తర్వాత పరిస్థితి మారిపోయింది. ఈ ఎన్నికల్లో 189 స్థానాల్లో రెండు పార్టీలు ముఖాముఖి తలపడ్డప్పుడు బీజేపీ 166 సీట్లు, కాంగ్రెస్ 23 సీట్లు గెలుచుకున్నాయి. 2019లో కాంగ్రెస్ పరిస్థితి మరింత దారుణంగా మారింది. బీజేపీ, కాంగ్రెస్ 190 సీట్లలో ముఖాముఖి తలపడితే బీజేపీకి 175, కాంగ్రెస్‌కు 15 దక్కాయి.

కాని 2024 ఎన్నికలు కాంగ్రెస్ పరిస్థితిలో కొంత మార్పు తీసుకువచ్చాయి. ఈ సారి గత మూడు ఎన్నికల్లో కంటే ఎక్కువ సీట్లలో కాంగ్రెస్ బీజేపీతో ముఖాముఖి తలపడింది. ఈ ఎన్నికల్లో 215 సీట్లలో బీజేపీకి, కాంగ్రెస్‌కు ముఖాముఖి పోటీ జరిగితే బీజేపీ 162 సీట్లు, కాంగ్రెస్ 53 సీట్లు గెలుచుకున్నాయి. బీజేపీతో ముఖాముఖి తలపడిన అత్యధిక సీట్లలో కాంగ్రెస్ ఓడిపోయి ఉండవచ్చు కాని గెలిచిన వంద సీట్లలో సగానికి పైగా సీట్లు బీజేపీ నుంచి దక్కించుకున్నవే అన్న విషయం గమనించాల్సి ఉంటుంది. మిగతా సీట్లు ఇతర పార్టీలతో కలిసి పోటీ చేయడం వల్ల సాధించుకున్నవే. అందువల్ల కాంగ్రెస్‌ను పూర్తిగా పరాన్నజీవి అనడానికి వీల్లేదు. అదే సమయంలో ఈ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ కూడా కనీసం 15–20 స్థానాలు మిత్రపక్షాలతో కలిసి పోటీ చేయడం వల్ల దక్కించుకున్నదనేది సత్యదూరం కాదు. అంతేకాక కొన్ని పార్టీలు కలిసి పోటీ చేసినప్పుడు పరస్పర ప్రయోజనాలు లేకపోతే అవి కూటమిగా పోటీ చేసే అవకాశాలు ఉండవన్న విషయం గమనించాలి. మహారాష్ట్ర, బిహార్, ఉత్తరప్రదేశ్‌లో అక్కడి స్థానిక పార్టీలు కాంగ్రెస్‌ను విస్మరించకపోవడానికి ఇదే కారణం.

కాంగ్రెస్ విముక్త భారత్ సాధ్యపడక పోవచ్చు కాని కాంగ్రెస్ నేతృత్వంలో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడడానికి ఇప్పట్లో అవకాశం లేదని కూడా ఈ ఎన్నికల ఫలితాలు నిరూపించాయి. 2029 నాటికి కాంగ్రెస్, బీజేపీల పరిస్థితి ఏ విధంగా ఉంటుందో ఇప్పుడే చెప్పలేం. పదేళ్ల తర్వాత అతి కష్టమ్మీద వంద సీట్లు సాధించిన కాంగ్రెస్ మరింత బలం పుంజుకోవాలంటే బీజేపీతో ముఖాముఖి పోటీ చేసే సీట్లలో కనీసం సగానికి పైగా సాధించాలి. మధ్యప్రదేశ్‌లో ఉప ఎన్నికల్లో కూడా బీజేపీ గెలిచింది. ఉత్తరాదిన గత లోక్‌సభ ఎన్నికల్లో కొన్ని సీట్లు కోల్పోయిన బీజేపీ దెబ్బతిన్న బెబ్బులిలా పుంజుకునేందుకు తీవ్ర యత్నాలు చేయక తప్పదు. తెలంగాణ, కర్ణాటకల్లో కూడా బీజేపీ పుంజుకునేందుకు సన్నాహాలు చేయక మానదు.

ఈ సార్వత్రిక ఎన్నికల్లో బ్రహ్మాండమైన విజయం సాధిస్తామనే ఆత్మవిశ్వాసంతో జమిలి ఎన్నికలకు మోదీ రంగం సిద్ధం చేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లును కూడా ఆమోదింపచేశారు. ఈ ఫలితాల తర్వాత జమిలి ఎన్నికల గురించి ఇప్పుడు బీజేపీ ఆలోచించే మూడ్‌లో ఉన్నట్లు కనపడడం లేదు. వీటన్నిటికి తోడు 2021లో జరగాల్సిన జనాభా లెక్కల సేకరణ ఇంతవరకూ జరగలేదు. 2026 తర్వాత ఈ జనాభా లెక్కల ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన కూడా నిర్వహించాల్సి ఉన్నది. గడచిన ఎన్నికల్లో కుల జనగణన, రిజర్వేషన్లను ప్రతిపక్షాలు ఒక ఎన్నికల అంశంగా మార్చాయి. ఈ అంశాలను విస్మరించి జనాభా లెక్కల సేకరణ, నియోజక వర్గాల పునర్విభజన ఎన్డీఏ ప్రభుత్వం నిర్వహించగలదా అన్న చర్చ కూడా జరుగుతోంది. అందువల్ల 2029 ఎన్నికలు మరింత సంక్లిష్ట సామాజిక పరిస్థితుల్లో జరుగుతాయనడంలో సందేహం లేదు.



■ ఎ. కృష్ణారావు
ఇండియాగేట్

భారతదేశ రాజకీయాల్లో ఎన్నో పార్టీలు జన్మించి మటుమాయమైపోయాయి, ఒకప్పుడు దేశ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించిన స్వతంత్ర పార్టీ ఇప్పుడెక్కడుంది? బిహార్‌లో శోషిత్ దళ్, జనక్రాంతి దళ్, సోషలిస్టు, కాంగ్రెస్ (ఓ) తదితర పార్టీల నేతలు ముఖ్యమంత్రులైన సందర్భాలు ఉన్నాయి. మండల్ కమిషన్ రచయిత అయిన బిపి మండల్, కర్పూరీ ఠాకూర్ అలాంటి నాయకులే. ఈ పార్టీలన్నీ కాలగర్భంలో కలిసిపోయాయి. రకరకాల పార్టీలతో కలిసి ఏర్పడిన జనతా పార్టీ రకరకాల వర్గాలుగా, పార్టీలుగా ముక్కలైపోయింది. ఉత్తరప్రదేశ్‌లో ఒకప్పుడు అధికారాన్ని చలాయించిన బహుజన సమాజ్ పార్టీ కూడా దాదాపు ఉనికి కోల్పోయింది.

తెలంగాణలో ఇటీవలి సార్వత్రిక ఎన్నికల్లో భారత రాష్ట్ర సమితికి ఒక్క సీటు కూడా ఎందుకు రాలేదు అన్న ప్రశ్నకు ఇటీవల ఢిల్లీకి వచ్చిన ఆ పార్టీ నేతలు హరీశ్ రావు, కేటీఆర్ వద్ద స్పష్టమైన సమాధానం లేదు. ప్రజలు లోక్‌సభ ఎన్నికల్లో మోదీకి ఓటు వేయాలని అనుకున్నారు కనుకే తమ ఓటర్లంతా బీజేపీ వైపు మొగ్గు చూపారని ఒకరంటే, ప్రజలు ఎన్డీఏ, ఇండియా కూటమిల మధ్య విడిపోయారని మరొకరు జవాబు చెప్పారు. ఒడిషా, తమిళనాడులో కూడా అదే జరిగింది కదా.. అని వారి అభిప్రాయం. కాని ఈ పరిస్థితుల్లో బీఆర్ఎస్ భవిష్యత్తు ఏమిటో తేలడానికి మరో అయిదేళ్లు పడుతుందని వారికి తెలుసు. రేవంత్ రెడ్డికి మరో అయిదేళ్ల వరకు ఢోకా లేదని వారే చెబుతున్నారు. వారి అభిప్రాయం ప్రకారమే ప్రజలు రెండు కూటముల మధ్య విడిపోయారు కనుక బీఆర్ఎస్ భవిష్యత్ ప్రస్తుతానికి అగమ్య గోచర పరిస్థితిలో పడిందనడంలో సందేహం లేదు. తెలంగాణ ఉద్యమం పేరుతో అధికారంలోకి వచ్చిన టీఆర్ఎస్ తన రంగు, రుచి వాసన కోల్పోయి ప్రజల పార్టీగా ఏర్పడిన ముద్రను తన్ను తానే తొలగించుకున్నదనడంలో అతిశయోక్తి లేదు. ఆంధ్రప్రదేశ్‌లో జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలోని వైసీపీ ఒక రాజకీయ పార్టీగా మనుగడ సాధిస్తుందా అన్న చర్చ జరుగుతోంది. పార్టీలను వ్యక్తి ఆధారితంగా మార్చి గుప్పెడు అస్మదీయులతో నడపాలని ప్రయత్నిస్తే ఏం జరుగుతుందో బీఆర్ఎస్, వైసీపీల అనుభవాలు నిరూపిస్తున్నాయి. ఒడిషాలో వృద్ధనాయకుడైన నవీన్ పట్నాయక్ వచ్చే అయిదేళ్ల వరకు తన పార్టీని ఎంతవరకు బలంగా ఉంచగలుగుతారా అన్న చర్చ జరుగుతోంది. అక్కడ బీజేడీ స్థానంలో బలోపేతం అయ్యేందుకు కాంగ్రెస్ ప్రయత్నాలు చేయక మానదు. తమిళనాడులో ఒక్క లోక్‌సభ సీటు కూడా గెలుచుకోలేని అన్నాడిఎంకే మళ్లీ బీజేపీ దరిచేరే అవకాశాలూ లేకపోలేదు. అక్కడ ఈ సారి బీజేపీ తన ఓటు శాతాన్ని 3.58 నుంచి 11.24 శాతానికి పెంచుకోగలిగింది. ఈ నేపథ్యంలో 2029 నాటికి కేవలం రెండు కూటములే రంగంలో ఉంటాయా, ఈ కూటములలో లేని పార్టీలు అదృశ్యమవుతాయా అన్న చర్చ జరుగుతోంది.

భారతదేశ రాజకీయాలు రెండు ధ్రువాల మధ్య సాగడం ఆరోగ్యకరమా లేదా అన్న చర్చ కూడా సాగాల్సిన అవసరం ఉన్నది. కాని ఒకే పార్టీకి అధికారం అప్పజెప్పడం కన్నా ఒక కూటమి అధికారం నిర్వహించడం ఎప్పుడైనా ఆరోగ్యకరమే. ఈ రెండు ధ్రువాలు, లేదా కూటములు ఆర్థిక, సామాజిక, విదేశాంగ విధానాల్లో సైద్ధాంతిక స్పష్టత నేర్పరుచుకుని ప్రజల ముందుకు వెళ్లడం ఇంకా అవసరం.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

పేద ప్రజల ఆర్థిక ఎజెండాను
అమలు చేయండి!


ప్రజాస్వామ్యంలో పాలకులు అమలు చేసే ఆర్థిక, సామాజిక అభివృద్ధి కార్యక్రమాలు నిత్యం సమాజంలో వ్యక్తమయ్యే ఆకాంక్షలను, అవసరాలను దృష్టిలో పెట్టుకొని రూపొందించాలి. 18వ లోక్‌సభ ఎన్నికల ఫలితాలు ఒక నూతన అధ్యాయానికి నాంది పలికాయి. అధికార పార్టీ అధికారానికి కత్తెర వేయడం, ప్రతిపక్ష పార్టీకి మరింత బలాన్ని చేకూర్చడం ఈ ఎన్నికల సారాంశం. నరేంద్ర మోదీ పదేళ్ళ పాలనలో అమలు జరిపిన తిరోగమన ఆర్థిక విధానాలకు నియంత్రణ పెట్టాలని ఓటర్ల నిర్ణయం చెప్పకనే చెబుతోంది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, బిహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్‌ల సహకారంతో మాత్రమే బీజేపీ 18వ లోక్‌సభలో అధికారం పొంది కొలువు తీరింది. ఈ ప్రజా తీర్పుతో నియంతృత్వ పోకడలను, ప్రజా వ్యతిరేక ఆర్థిక విధానాలను ప్రజలు అంగీకరించలేదని భావించాలి.

పేద ప్రజలను నిత్యం వేధిస్తున్న ఆర్థిక సమస్యలు–ముఖ్యంగా ధరల పెరుగుదల, పెరిగిన పరోక్ష పన్నుల భారం, నిరుద్యోగ సమస్య, పెరుగుతున్న ఆర్థిక అసమానతలు ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేశాయని చెప్పడంలో అతిశయోక్తి లేదు. గత పదేళ్ళల్లో అనేక అత్యవసర వస్తువుల ధరలు వందశాతం పెరిగాయి. విద్య, వైద్య రంగాలను ప్రైవేటీకరణ చేయడం వలన పేద ప్రజలకు నాణ్యమైన విద్య, వైద్యం లభించని దుస్థితి ఏర్పడింది. ధరల పెరుగుదల పరోక్ష పన్నుల భారం పేద ప్రజల నడ్డి విరుస్తున్నదని పాలకులు గుర్తించలేకపోయారు. ప్రపంచ మార్కెట్లో క్రూడ్ ఆయిల్ ధరలు 50 శాతం తగ్గినప్పటికీ మన దేశంలో మాత్రం పెట్రోలు, డీజిలు, వంట గ్యాస్ ధరలు గత పదేళ్ళల్లో 80 శాతానికి పైగా పెరిగాయి. ప్రతి ఏటా వేలాది కోట్ల రూపాయల నికర లాభం ఆర్జించే కార్పొరేట్ సంస్థలపై విధించే కార్పొరేట్ పన్నును తగ్గించారు గానీ పేద మధ్యతరగతి ప్రజలపై మోపుతున్న ప్రత్యక్ష, పరోక్ష పనుల భారం మాత్రం తగ్గడం లేదు.

సరళీకరణ, ప్రైవేటీకరణ ప్రభావంతో దేశ ఆర్థిక వ్యవస్థ కేవలం ఉద్యోగిత లేని వృద్ధిని సాధిస్తున్న విషయం గమనించాలని ప్రజలు ఈ ఎన్నికల ద్వారా అధికార పక్షానికి సూచించారు. కుబేరుల ఆస్తులు పెరగడం ద్వారా భారత్ వికసించవచ్చునేమో గాని పెరుగుతున్న వృద్ధిరేటు పేద వర్గాలకు పంచింది అంతంత మాత్రమే. మనం గత యాభై ఏళ్ళ నుండి పంపిణీ చేస్తున్న ఉచిత బియ్యం పథకం కొనసాగింపే ఇందుకు చక్కటి ఉదాహరణ. కుబేరుల, ధనవంతుల అభివృద్ధి ద్వారా దీర్ఘకాలంలో పేదలకు కూడా ఎంతో కొంత ప్రయోజనం లభిస్తుందని చెప్పే ‘ట్రికిల్ డౌన్’ ఆర్థిక సిద్ధాంతం ప్రకారమే ప్రస్తుత కేంద్ర ప్రభుత్వ ఆర్థిక విధానాలు అమలు అవుతున్నాయి. 76 సంవత్సరాల స్వతంత్ర దేశంలోని పేద ప్రజలకు కనీసం నాణ్యమైన విద్య వైద్యం అందించలేని దుస్థితిలో భారతదేశ అభివృద్ధి సాగుతున్నదని పాలకులు గుర్తిస్తే మన ప్రజాస్వామ్యానికి అర్థం ఉంటుంది.

నూతన ఆర్థిక విధానాల వల్ల వెనుకబడిన ప్రాంతాలు, జిల్లాలు, ఆదివాసీలు, గిరిజన ప్రాంతాలు, ఎలాంటి రాజ్యాంగ భద్రత లేని బహుజన వెనుకబడిన కులాల ప్రజలు ఈ ఉపాధి కొరవడిన వృద్ధిలో భాగస్వామ్యానికి నోచుకోకుండా పోతున్నారు. 55శాతం జనాభా ఉన్న వెనుకబడిన కులాలకు తగిన న్యాయం చేయడానికి అధికార పార్టీ ఎలాంటి చర్యలు చేపట్టలేదు. అంతేకాకుండా సమగ్ర కుల గణనకు, జనాభా లెక్కలకు కూడా ఇష్టపడటం లేదు. ప్రతి ఏటా ఐక్యరాజ్యసమితి డెవలప్‌మెంట్ ప్రోగ్రాం రూపొందించే మానవాభివృద్ధి సూచిక ప్రకారం దాదాపు 180 దేశాల్లో మన దేశం గత పదేళ్ళల్లో 126వ స్థానం నుంచి 134 స్థానానికి దిగజారింది. మానవాభివృద్ధిలో భారతదేశం అనేక తూర్పు ఆసియా దేశాల కంటే మరింత వెనుకబడి ఉన్న విషయం మన పాలకులకు తెలియనిదేమీ కాదు. మెజారిటీ ప్రజలకు కనీసం విద్య, వైద్యం, ఉపాధి ఉద్యోగ అవకాశాలను కల్పించడంలో మోదీ ప్రభుత్వం విఫలమైందని ఇటీవలి ఎన్నికలు ఋజువు చేస్తున్నాయి.

ఒకపక్క ప్రతి వస్తువుపైన విధించిన జీఎస్టీ భారాన్ని, అదేవిధంగా నిత్యం పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలను పేద ప్రజలు భరించలేక కనీస అవసరాలు తీర్చుకోలేక సతమతమవుతున్నారు. ఉపాధి అన్వేషణలో లక్షలాదిమంది యువతీ యువకులు ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, పశ్చిమబెంగాల్, ఒరిస్సా, బిహార్ రాష్ట్రాల నుంచి దక్షిణాది రాష్ట్రాలకు వస్తూ రోజువారి వేతనాలకు శ్రమిస్తున్నారు. ఒక్క తెలంగాణ రాష్ట్రంలోనే ఈ రాష్ట్రాల నుంచి వలస వచ్చిన లక్షలాదిమంది కార్మికులు అష్టకష్టాలు పడుతూ జీవనోపాధిని పొందుతున్నారు. ఇటీవలి ఎన్నికలలో రాజ్యాంగం, రిజర్వేషన్లు, అల్ప సంఖ్యాక వర్గాల హక్కులు మొదలైన అంశాలు విస్తృతంగా చర్చకు వచ్చాయి. కానీ పేద ప్రజలు ఎదుర్కొంటున్న నిరుద్యోగం, ధరల పోకడ, ప్రాంతాల సామాజిక వర్గాల మధ్య పెరుగుతున్న ఆర్థిక అసమానతలు, సామాజిక భద్రత అనే అంశాలు పాక్షికంగానే చర్చకు వచ్చాయి.



సరళీకరణ, ప్రైవేటీకరణ ప్రభావంతో దేశ ఆర్థిక వ్యవస్థ కేవలం ఉద్యోగిత లేని వృద్ధిని సాధిస్తున్న విషయం గమనించాలి. కుబేరుల ఆస్తులు పెరగడం ద్వారా భారత్ వికసించవచ్చునేమో గాని పెరుగుతున్న వృద్ధిరేటు పేద వర్గాలకు పంచింది అంతంత మాత్రమే.

అతిత్వరలోనే మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్ లాంటి పెద్ద రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగవలసి ఉంది. ఎన్నికలలో ప్రజల మనోభావాలను అదేవిధంగా మారుతున్న అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఇప్పటికైనా పేద ప్రజల ఆర్థిక ఎజెండాను అమలు చేయవలసిన అవసరం ఉందని కేంద్ర ప్రభుత్వం, ముఖ్యంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గుర్తించవలసిన అవసరం ఉంది. పేద, మధ్యతరగతి ప్రజలను దృష్టిలో పెట్టుకొని కేంద్రం విధిస్తున్న ఆదాయపు పన్ను, జీఎస్టీ, పెట్రోల్, డీజిల్ గ్యాస్ లాంటి నిత్యవసర వస్తువులపై విధిస్తున్న పరోక్ష పన్నులు సవరించాలి. రాజ్యాంగ వ్యవస్థలను, విలువలను, హక్కులను కాపాడుకుందాం అని ఇటీవలి లోక్‌సభ ఎన్నికలలో ప్రతిపక్షాలు లేవనెత్తిన విషయాలను ప్రజలు ఓటు వేసే సమయంలో నిర్లక్ష్యం చేయలేదని కూడా పాలక పక్షం గుర్తిస్తే మంచిది. పారిశ్రామిక వికేంద్రీకరణ, ప్రాంతీయ అసమానతలు తగ్గించడం, పేద వర్గాలకు పరోక్ష ప్రత్యక్ష బదిలీ పథకాలను అమలు చేయడం మొదలైన అంశాలను త్వరలో లోక్‌సభలో ప్రవేశపెట్టి, వార్షిక బడ్జెట్లో ప్రతిబింబించాలని ప్రజలు ముఖ్యంగా పేద వర్గాలు కోరుకుంటున్నాయి.

● కూరపాటి వెంకట్‌నారాయణ

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్
రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com


పరిశ్రమల గొప్పల వెనక పొంచి ఉన్న ప్రమాదాలు

తెలంగాణ రాష్ట్రంలో ప్రజలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల గురించి మాట్లాడినప్పుడల్లా వ్యవసాయంతో పాటు, పారిశ్రామిక, సేవా రంగాల అభివృద్ధి గురించి చర్చ రావడం సహజం. అయితే ఈ చర్చలు చేసేవాళ్ళలో ఎక్కువ మంది, వ్యవసాయ రంగంలో ఉపాధి అవకాశాలు పూర్తిగా తగ్గిపోయాయనీ, ఆదాయాలు పడిపోయాయనీ, వాటిని పునరుద్ధరించడం కూడా సాధ్యం కాదనీ ముందుగా ఒక నిర్ధారణకు వచ్చి ఉంటారు. కానీ ఈ చర్చను ముందుకు తీసుకుపోవడానికి గ్రామాలలో, ముఖ్యంగా వ్యవసాయంలో ఉపాధి అవకాశాలు ఎందుకు తగ్గిపోయాయో, రైతుల ఆదాయాలు ఎందుకు పడిపోయాయో, ఈ పరిస్థితులు ఏర్పడడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరించిన విధానాలు ఎంత కారణమో ముందు లోతుగా పరిశీలించాలి.

ప్రభుత్వ లెక్కల ప్రకారం తెలంగాణ రాష్ట్రంలో కనీసం కోటి ఇరవై ఐదు లక్షల ఎకరాల నికర సాగు భూమి ఉంది. సన్న జీవాలు కాకుండానే, కోటి పశువులు ఉన్నాయి. వేలాది చేపల చెరువులు ఉన్నాయి. తెలంగాణ గ్రామీణ ప్రాంతంలో ఉన్న రెండున్నర కోట్ల జనాభాకు ఈ సాగు భూమి కానీ, పశువులు కానీ, చేపల చెరువులు కానీ తగిన ఆదాయాన్ని, జీవనోపాధిని ఎందుకు కల్పించలేక పోతున్నాయి? ఇందుకు ప్రధాన కారణం వ్యవసాయ ఉత్పత్తులకు, పశు ఉత్పత్తులకు, మత్స్య సంపదకు మార్కెట్లో సరైన ధరలు లభించకపోవడమే. పంటల సాగు కోసం ఎంత కష్టపడినా 93 శాతం రైతు కుటుంబాలు అప్పుల ఊబిలోనే కూరుకుపోయి ఉన్నాయి.

ఈ పరిస్థితి మారాలంటే ఏం జరగాలి? వాస్తవ సాగుదారులకు సాగు భూములు ఉండాలి. పంట రుణాలు, పెట్టుబడి సహాయం వారికే అందాలి. రైతులు పండించే పంటలకు స్వామినాథన్ కమిషన్ సిఫారసుల ప్రకారం కనీస మద్దతు ధరలు చట్టబద్ధంగా అందాలి. గ్రామీణ కుటుంబాలు ఉత్పత్తి చేసే పాలు, మాంసం, గుడ్లు, చేపలు, అటవీ ఉత్పత్తులకు కూడా న్యాయమైన ధరలు అందాలి. మేకలు, గొర్రెల పోషణకు అవసరమైన మేత భూములు అందుబాటులో ఉండాలి. వ్యవసాయ కూలీలకు కనీస వేతనాలు పెంచాలి. ప్రకృతి వైపరీత్యాలు, అడవి జంతువులతో నష్టపోయిన కుటుంబాలకు బీమా పరిహారం అందాలి. విద్యా వైద్య సౌకర్యాలు ఉచితంగా అందాలి. సాగు నీరు, విద్యుత్, తాగు నీరు ఉచితంగానో, తక్కువ ధరలకో అందాలి. ఇవన్నీ ఒక హక్కుగా గ్రామీణ ప్రజలకు అందితే వారు పట్టణాలకు తరలి రాకుండా గ్రామాలలోనే జీవనోపాధులను ఎంచుకుంటారు. రాష్ట్రంలో 60 శాతం జనాభా గ్రామాలలో, అటవీ ప్రాంతాలలో జీవిస్తున్నప్పుడు, రాష్ట్ర బడ్జెట్లో కూడా ఆ ప్రాంతాలకు 60 శాతం నిధులు కేటాయిస్తే ఇవన్నీ సాధ్యమే. కానీ ప్రభుత్వాలు ఇప్పటి వరకూ సమగ్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి విధానాలను రూపొందించడం లేదు. అమలు చేయడం లేదు. కాబట్టే గ్రామీణ ప్రాంతంలో ఈ సంక్షోభం కొనసాగుతున్నది.

కొత్త పారిశ్రామిక విధానం గురించి రాష్ట్ర ప్రభుత్వం ఆలోచిస్తున్నప్పుడు పాత పారిశ్రామిక ప్రాంతాలను అధ్యయనం చేసి, అక్కడి భూములను, వసతులను అభివృద్ధి చేసి, వినియోగంలోకి తేవాలి. పారిశ్రామికీకరణ పేరుతో వేలాది ఎకరాల భూములను రైతుల నుంచి గుంజుకోకుండా, భూమి వినియోగ విధానం తెచ్చి, అవసరమైన మేరకే పరిశ్రమలకు భూములను కేటాయించాలి.



మరో వైపు, రాష్ట్రంలో గ్రామాలు వదిలి నగరాలకు తరలి వస్తున్న వాళ్ళందరికీ ఉపాధి అవకాశాలు కల్పించడానికి, వారి ఆహారం, తాగు నీరు, ఆదాయం, విద్య, ఆరోగ్యం, నివాసం, రవాణా, పర్యావరణ భద్రతలకు అవసరమైన చర్యలు చేపట్టడానికి ప్రభుత్వాలు పెట్టుబడులతోను బడ్జెట్ కేటాయింపులతోను సిద్ధంగా ఉన్నాయా? గ్రామాల నుంచి నూతన జీవనోపాధిని, అదనపు ఆదాయాలను వెతుక్కుంటూ తరలి వస్తున్న నైపుణ్యంలేని ఈ యువతకు, మహిళలకు రాష్ట్రంలో కొత్తగా ఏర్పడుతున్న సేవా సంస్థలు, పరిశ్రమలు ఉపాధిని కల్పిస్తాయా?

ఏదైనా ఒక పరిశ్రమను, సంస్థను రాష్ట్రంలోకి ఆహ్వానిస్తున్నప్పుడు ప్రభుత్వాలు ప్రధానంగా ఆరు విషయాలను దృష్టిలో ఉంచుకోవాలి: 1. ఆ పరిశ్రమ స్థానికంగా పండే/ దొరికే ఉత్పత్తులను, ముడి సరుకులుగా వినియోగించుకుంటుందా? 2. ఆ ఉత్పత్తిదారులకు న్యాయమైన ధరలు చెల్లిస్తుందా? 3. స్థానికులకే ఉపాధి అవకాశాలు కల్పిస్తుందా? 4. చుట్టూ కాలుష్యం వెదజల్లకుండా ఉంటుందా? 5. ఆ పరిశ్రమలో, సంస్థలో పని చేస్తున్న కార్మికులకు, ఉద్యోగులకు కనీస వేతనాలు, ఇతర కార్మిక హక్కులు కల్పిస్తుందా? 6. స్థానికంగా అప్పటికే అక్కడ ఉన్న చిన్న చిన్న పరిశ్రమల, సంస్థల ఉనికికి ప్రమాదకరంగా మారకుండా ఉంటుందా? ప్రభుత్వాలు రాష్ట్రంలోకి పెద్ద ఎత్తున పరిశ్రమలు తరలివస్తున్నాయని గొప్పగా చెబుతుంటాయి కానీ, పైన చెప్పిన విషయలను పట్టించుకోవడంలేదు.

ఉదాహరణకు విష కాలుష్యం వెదజల్లుతాయని తెలిసినా పాత ప్రభుత్వం ఫార్మా పరిశ్రమలకు అనుమతులను ఇచ్చింది. కొత్త ప్రభుత్వం ఫార్మా సిటీని రద్దు చేసింది కానీ ఫార్మా విలేజెస్ నిర్మిస్తామనే ప్రమాదకరమైన కొత్త మాట వాడుతున్నది. కాలుష్యం లేని ఫార్మా పరిశ్రమ ఇప్పటివరకూ ప్రపంచంలో ఎక్కడా లేదు. అందుకే అమెరికా, యూరప్ దేశాలు, తమ దేశల నుంచి ఫార్మా పరిశ్రమలను తరిమేస్తున్నాయి.


అలాగే గత రాష్ట్ర ప్రభుత్వం వివిధ జిల్లాలలో బియ్యం, మొక్కజొన్న ఆధారిత 10 ఇథనాల్ పరిశ్రమలకు అనుమతులు ఇచ్చింది. నారాయణపేట జిల్లాలో చిత్తనూర్ ఇథనాల్ పరిశ్రమ అనుభవాలు చూస్తే, స్థానిక రైతులకు ఎటువంటి లాభమూ జరగలేదు. పైగా ఆ ప్రాంతం అంతా కాలుష్యమయమై పోయింది. మిగిలిన ప్రాంతాల ప్రజలు కూడా తమ ప్రాంతంలో నెలకొల్పనున్న ఇథనాల్ పరిశ్రమను వ్యతిరేకించి పోరాడుతున్నారు. ఈ దశలో కొత్త ప్రభుత్వం ఇథనాల్ పరిశ్రమలపై తన వైఖరి ప్రకటించి, వాటికి ఇచ్చిన అనుమతులను రద్దు చేయాలి.

రాష్ట్రంలో పారిశ్రామికీకరణ అవసరమే. కానీ ఎంత మూల్యానికి? 1990 దశకం నుంచీ మారిన పారిశ్రామిక విధానాలతో, పాత పారిశ్రామిక వాడల్లో అనేకం ఇప్పుడు మూతపడ్డాయి. ఈ స్థితిలో కొత్త పారిశ్రామిక విధానం గురించి రాష్ట్ర ప్రభుత్వం ఆలోచిస్తున్నప్పుడు పాత పారిశ్రామిక ప్రాంతాలను అధ్యయనం చేసి, అక్కడి భూములను, వసతులను అభివృద్ధి చేసి, వినియోగంలోకి తేవాలి. పారిశ్రామికీకరణ పేరుతో వేలాది ఎకరాల భూములను రైతుల నుంచి గుంజుకోకుండా, భూమి వినియోగ విధానం తెచ్చి, అవసరమైన మేరకే పరిశ్రమలకు భూములను కేటాయించాలి.

బహుళ జాతి కంపెనీ కోకోకోలా పరిశ్రమను కేరళ ప్రజలు తరిమేస్తే, కేసీఆర్ ప్రభుత్వం మాత్రం తెలంగాణలో అనుమతులు ఇచ్చింది. తాగు నీటిని మార్కెట్ చేయడమే ఆ కంపెనీ లక్ష్యం. వేల కోట్లు ఖర్చు పెట్టి మిషన్ భగీరథ అమలు చేసిన రాష్ట్రంలో మళ్ళీ కోకో కోలా నీళ్లకు మార్కెట్ సృష్టించడం అర్థం లేనిది. అలాగే గుజరాత్‌కు చెందిన అమూల్ పాల పరిశ్రమకు తెలంగాణ ప్రభుత్వం గజ్వేల్ దగ్గర వెయ్యి ఎకరాలు కేటాయించింది. అమూల్ పేరుకే సహకార సంఘం కానీ, అది కార్పొరేట్ సంస్థగా మారిపోయింది. ఆ సహకార సంఘంలో గుజరాత్‌కు చెందిన పాడి రైతులు మాత్రమే సభ్యులు. సంస్థ లాభాలను వారికే పంచుతారు. అమూల్ వివిధ రాష్ట్రాలలో మార్కెట్ విస్తరణకు ప్రయత్నం చేస్తున్నది. ఆయా రాష్ట్రాలలో అప్పటికే ఉన్న పాల సహకార సంఘాలను కొనుగోలు చేస్తున్నది. కర్ణాటకలో నందిని సహకార సంఘాన్ని కూడా అమూల్ కబళించాలని చూసినప్పుడు అక్కడి రైతులు, రాజకీయ పార్టీలు వ్యతిరేకించి అమూల్ ప్రవేశాన్ని తిప్పికొట్టారు. కానీ తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన అనుమతులతో గజ్వేల్ దగ్గర వర్గల్‌లో అతి పెద్ద యూనిట్ నిర్మిస్తున్న అమూల్ రాబోయే రోజుల్లో మన రాష్ట్ర పాల రైతుల సహకార సంఘాలను (విజయ, ములకనూరు, నార్మాక్, కరీంనగర్ డైరీలను) కబళించే ప్రమాదం ఉంది. ఈ రెండు సంస్థలతో గత ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలను బయటపెట్టి కొత్త ప్రభుత్వం రాష్ట్ర ప్రయోజనాల రీత్యా కోకోకోలా, అమూల్ పరిశ్రమలకు ఇచ్చిన అనుమతులను రద్దు చేయాలి.

తాజాగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ ఢిల్లీలో విలేఖరులతో మాట్లాడుతూ, హైదరాబాద్ ఓల్డ్ సిటీలో విద్యుత్ పంపిణీ, బిల్లుల వసూలు చేసే బాధ్యతను అదానీ కంపెనీకి ఇస్తామని ప్రకటించారు. ఇది విద్యుత్ రంగ ప్రైవేటీకరణ వైపు వేస్తున్న అత్యంత ప్రమాదకరమైన తొలి అడుగు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1995 నుంచీ విద్యుత్ రంగ ప్రైవేటీకరణను ప్రజలు తిప్పికొడుతున్నారు. ఇప్పుడు కూడా రేవంత్ ప్రభుత్వం ఈ ప్రతిపాదనను వెనక్కు తీసుకోవాలి. దేశంలో అనేక అక్రమాలకు పాల్పడిన గుజరాత్‌కు చెందిన అదానీ తెలంగాణ విద్యుత్ రంగంలో వేలుపెట్టడం ఒక సమస్య అయితే, డిస్కంల ప్రైవేటీకరణ మరో ముఖ్య సమస్య. రెండిటినీ రాష్ట్ర ప్రజలు తిరస్కరించాలి. పరిశ్రమల ఏర్పాటుకు సింగిల్ విండో విధానం అభివృద్ధి చేయడం గురించి మాత్రమే కాదు, ఆయా సంస్థలలో పని చేసే కార్మికుల సంక్షేమానికి కార్మిక శాఖను బలోపేతం చేయడం కూడా ప్రభుత్వ లక్ష్యం కావాలి.


■ కన్నెగంటి రవి
తెలంగాణా పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ



- పత్తాలేని ఏఎల్ఓ, ఫాగింగ్
- నాణ్యత లేని ద్రావకాలతో ప్రభావం శూన్యం
- రోడ్లపైనే చెత్త కుప్పలు, మురుగు నీటినిల్వలు
- గుర్రపు డెక్కతో మరింత అధికం

నగరంలో దోమలు విజృంభిస్తున్నాయి. కాలనీలు, బస్తీలు.. అన్ని ప్రాంతాల్లో జనం దోమల బారిన పడుతూ రోగాలపాలవుతున్నారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో దోమల వృద్ధి ఎక్కువగా ఉన్నప్పటికీ సంబంధిత విభాగపు అధికారులకు చీమ కుట్టినట్టుగా కూడా లేదు. వారానికోమారు యాంటీ లార్వల్ ఆపరేషన్(ఏఎల్ఓ) నిర్వహించాల్సి ఉన్నా.. దోమల తీవ్రత ఆధారంగా ఫాగింగ్ చేయాల్సి ఉన్నా నిమ్మకు నీరెత్తినట్లు ఉంటున్నారు.

దోమలు బాబోయ్ దోమలు



నగరంలో పెరిగిన తీవ్రత

హైదరాబాద్ సిటీ, జూలై 16 (ఆంధ్రజ్యోతి): వర్షాకాల నేపథ్యంలో నీరు నిల్వ ఉన్న ప్రతిచోట దోమల వృద్ధి ఎక్కువగా ఉంది. అదే స్థాయిలో డెంగీ కేసులూ నమోదవుతున్నాయి. పలువురు ఆస్పత్రుల పాలవుతున్నారు. అయినా బల్దియా మొద్దు నిద్ర వీడడం లేదు. టెలీకాన్ఫరెన్స్‌లు, సమీక్షలు తప్ప.. క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలిస్తున్న దాఖలాలు అంతంతమాత్రమే. సాయంత్రమైందంటే పలు ప్రాంతాల్లో తలుపులు, కిటికీలు మూయాల్సిన దుస్థితి నెలకొంది.

సాకులు చెబుతూ..

బల్దియాలో 2,500మంది వరకు ఎంటమాలజీ కార్మికులున్నారు. వారానికోమారు ఏఎల్ఓ నిర్వహించేలా ఇద్దరు, ముగ్గురు కార్మికులకు కలిపి కొన్ని కాలనీలు, బస్తీలు కేటాయించారు. వీరు ఇళ్ల చుట్టూ పరిశుభ్రంగా ఉండేలా.. నీటి నిల్వలు లేకుండా ఎప్పటికప్పుడు తొలగించేలా పౌరులకు అవగాహన కల్పించాలి. డెంగీ, మలేరియా వ్యాధి కారక దోమలు ఎలా వృద్ధి చెందుతాయి.. లార్వా దశలోనే ఎలా నియంత్రించాలన్నది వివరించాలి. ఎన్నికల విధులు.. పోల్ స్లిప్పుల పంపిణీ.. చెరువుల్లో గుర్రపు డెక్క తొలగింపు తదితర కారణాలు చెబుతూ సిబ్బంది కేటాయించిన ప్రాంతాల్లోని ఇళ్లకు వెళ్లడం లేదు.

కరోనా అనంతరం గ్రేటర్‌లోని పలు ప్రాంతాల్లో యాంటీ లార్వల్ ఆపరేషన్ (ఏఎల్ఓ), ఫాగింగ్ ప్రక్రియలు గాడి తప్పారు. గతంలో వారం, పది రోజులకో సారైనా క్షేత్రస్థాయిలో కనిపించే ఎంటమాలజీ కార్మికులు కొన్నాళ్లుగా నెలకు ఒకటి, రెండు పర్యాయాలు కూడా దోమల నివారణ చర్యలు చేపట్టడం లేదు. ఇక ప్రజల్లో అవగాహన కోసం చేస్తున్న కార్యక్రమాలు ఫొటోలకే పరిమితమవుతున్నాయి. ప్రముఖులు ఉండే ప్రాంతాల్లో క్రమం తప్పకుండా ఏఎల్ఓ, ఫాగింగ్ చేస్తోన్న యంత్రాంగం.. పేద, మధ్య తరగతి వర్గాలుండే బస్తీలను మాత్రం దోమలకు వదిలేస్తున్నది.

ప్రభావం చూపని ద్రావకాలు..

కార్మికుల వేతనాలు, రసాయనాల కోసం దోమల నివారణ విభాగం ఏటా రూ.10 కోట్ల వరకు ఖర్చు చేస్తోంది. ఏఎల్ఓ, ఫాగింగ్ కోసం అవసరమైన ద్రావకాలు, డీజిల్ కొనుగోలు చేస్తున్నారు. నాణ్యత లేని రసాయనాలు దోమలపై ఎలాంటి ప్రభావం చూపడం లేదని పలు కాలనీ అసోసియేషన్లు చెబుతున్నాయి. నిర్ణీత స్థాయిలో ద్రావకాలు కలపకపోవడమూ ఇందుకు కారణంగా తెలుస్తోంది. ఫాగింగ్ చేయకుండానే డీజిల్ వినియోగించినట్టు చూపుతూ రూ.లక్షలు కొల్లగొడుతున్నారన్న

మిగతా 8వ పేజీలో..

ఎందుకిలా..?



కొత్తపేట డివిజన్ పరిధి గాయత్రీపురంలో దోమల నివారణ చర్యలు చేపట్టాలి. ఫాగింగ్ వాహనం గతంలో వచ్చేది. ప్రస్తుతం జీహెచ్ఎంసీ సిబ్బంది ఎవరూ దోమల నివారణ మందు పిచికారి చేయడం లేదు. వర్షాలతో అక్కడక్కడా నీరు నిలిచి దోమలు వృద్ధి చెందుతున్నాయి. వాటిల్లోనూ రసాయనాలు చల్లడం లేదు. ఎవరికి చెప్పాలో అర్థం కావడం లేదు. పిల్లలు, వృద్ధులు అనారోగ్యానికి గురవుతున్నారు. ఎవరు బాధ్యత వహిస్తారు. - విద్య, గృహిణి, గాయత్రీపురం

నివారణ చర్యలేవీ..?



గాజులరామారం డివిజన్ దేవేందర్‌నగర్‌లో ఉన్న బస్తీల్లో జీహెచ్ఎంసీ అధికారులు దోమల నివారణ చర్యలు చేపట్టడం లేదు. ఏఎల్ఓ ఫాగింగ్ చేయడం లేదు. ఫిర్యాదు చేస్తే రేపు, మాపు అని మాట దాటవేస్తున్నారు. సాయంత్రం అయ్యిందంటే దోమల బాధతో ఇళ్లలో ఉండలేక పోతున్నాం. - ఎస్. గోపాల్, రావినారాయణరెడ్డినగర్

కష్టంగా మారిన వ్యాధి నిర్ధారణ

- పెరుగుతున్న సీజనల్ వ్యాధులు
- ల్యాబ్‌టెక్నీషియన్లు లేక అవస్థలు
- హెల్త్ అసిస్టెంట్లూ అరకొరే..
- కాంట్రాక్ట్ సిబ్బందే దిక్కు

హైదరాబాద్ సిటీ, జూలై 16 (ఆంధ్రజ్యోతి): దోమల స్వైరవిహారంతో సీజనల్ వ్యాధులు జడలు విప్పుకుంటున్నాయి. డెంగీ కేసులు ఎక్కువవుతున్నాయి. కేసులు పెరగకుండా చూడడం, ప్రజలకు అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలను చేపట్టడానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ వద్ద అవసరమైన మేరకు సిబ్బంది లేరు. రక్తపరీక్షలు చేసి మలేరియా, డెంగీలను గుర్తించే సిబ్బంది తక్కువగా ఉండడంతో సకాలంలో వైద్యం అందడం లేదు.

ల్యాబ్ టెక్నీషియన్లు తప్పనిసరి

జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ పరిధిలో ల్యాబ్‌టెక్నీషియన్లు దాదాపు లక్ష మంది నుంచి రక్తపరీక్షలు సేకరించాల్సి ఉంటుంది. వర్షాకాలం కావడం వల్ల ల్యాబ్ టెక్నీషియన్ల అవసరం చాలా ఉంది. రోజుకు వందల సంఖ్యలో రక్త నమూనాలు వివిధ మలేరియా

మిగతా 8వ పేజీలో..

బీబీకా ఆలం ఊరేగింపు సందర్భంగా..

నేడు ట్రాఫిక్ ఆంక్షలు, మళ్లింపులు



హైదరాబాద్ సిటీ, జూలై 16(ఆంధ్రజ్యోతి): మొహర్రం, బీబీకా ఆలం ఊరేగింపు సందర్భంగా నగరంలో బుధవారం ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉంటాయని ట్రాఫిక్ అడిషనల్ సీపీ విశ్వప్రసాద్ తెలిపారు. మధ్నాహ్నం 12 నుంచి రాత్రి 10గంటల వరకు ఆంక్షలు ఉంటాయని సూచించారు. ఉమ్మడి సౌత్‌జోన్ పరిధిలో దారి మళ్లింపులుంటాయని అన్నారు. వాహనాలను సునార్‌గల్లీ టీ జంక్షన్ నుంచి డబీర్‌పురా దర్వాజ, యాకుత్‌పురా వైపు మళ్లిస్తారని తెలిపారు. అలాగే షేక్ ఫయాజ్ కమాన్ నుంచి వచ్చే వాహనాలను జబ్బార్ హోటల్, డబీర్‌పురా, చంచల్‌గూడ వైపు, ఇత్తెబార్ చౌక్ నుంచి వచ్చే వాహనాలను బడాబజార్, కోట్ల అలీజా, పురానీహవేలీ వైపు, గంగానగర్ నాలా, మొఘల్‌పురా నుంచి వచ్చే వాహనాలను బీబీ బజార్ ఎక్స్‌రోడ్, పారిస్ కేఫ్ మీదుగా తలాబ్‌కట్ట వైపు మళ్లిస్తారని తెలిపారు. ఇవేకాకుండా గుల్జార్‌హౌస్, మిట్టికాషేర్, మదీనా ఎక్స్‌రోడ్, సాలార్‌జంగ్ రోటరీ, చాదర్‌ఘాట్ రోటరీ, శివాజీ బ్రిడ్జ్, నయాపూల్ ప్రాంతాలలో ట్రాఫిక్ ఆంక్షలుంటాయని తెలిపారు. ఆర్టీసీ అధికారులు ట్రాఫిక్ మళ్లింపులను దృష్టిలో ఉంచుకొని ప్రత్నామ్నాయ మార్గాల ద్వారా బస్సులను నడపాలని, వాహనదారులు కూడా ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకుని పోలీసులకు సహకరించాలని ట్రాఫిక్ అడిషనల్ సీపీ సూచించారు.



సమీక్షలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, కమిషనర్ ఆమ్రపాలి తదితరులు

శాంతిభద్రతలపై దృష్టిసారించాలి

- కలెక్టర్లు, సీపీల సమీక్షలో సీఎం రేవంత్ ఆదేశాలు

హైదరాబాద్ సిటీ, జూలై 16 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నగరంలో శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి సారించాలని, మానవ అక్రమ రవాణా నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి కలెక్టర్, సీపీలకు సూచించారు. రాష్ట్ర సచివాలయంలో మంగళవారం జిల్లా కలెక్టర్లు, పోలీస్ ఉన్నతాధికారులతో సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ కలెక్టర్లు, ఎస్పీలు జిల్లా ప్రతినిధులు సమన్వయంతో పని చేయాలన్నారు. సమీక్షలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సీపీలు కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి, సుధీర్‌బాబు, అవినాష్‌మహంతి పాల్గొన్నారు.



నాగోల్‌లోని ఎస్టీపీ

దేశంలో అతిపెద్ద ఎస్టీపీగా నాగోల్

- 320 ఎంఎల్డీ సామర్థ్యంతో నిర్మాణం

హైదరాబాద్ సిటీ, జూలై 16 (ఆంధ్రజ్యోతి): దేశంలో అతిపెద్ద ఎస్టీపీగా నాగోల్ నిలిచిందని, ఇప్పటికే రోజుకు 170మిలియన్ లీటర్ల (మిలియన్ లీటర్స్ పర్ డే-ఎంఎల్డీ) సామర్థ్యంతో ఎస్టీపీ ఉండగా.. అదనంగా మరో 320 ఎంఎల్డీల సామర్థ్యంతో మరో ఎస్టీపీని నిర్మించామని రామ్‌కీ ఇన్‌ఫ్రా చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ ఎన్ఎస్ రావు తెలిపారు. ఎలాంటి దుర్వాసన లేకుండా పూర్తిగా పర్యావరణహితంగా దీనిని నిర్మించినట్లు తెలిపారు. నాగోల్ ఎస్టీపీ పనులు పూర్తిచేయడంతో పాటు ట్రయల్ రన్ ప్రారంభించారు. ఈ నేపథ్యంలో మంగళవారం నాగోల్ ఎస్టీపీతో పాటు కోకాపేట, అత్తాపూర్, మీర్ ఆలంలో చేపడుతున్న ఎస్టీపీలపై రాంకీ ఇన్‌ఫ్రా ప్రతినిధులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ నిర్వహించారు. క్షేత్రస్థాయిలో ఎస్టీపీ నిర్వహణ తీరును ఇన్‌ఫ్రా డైరెక్టర్ పీ.రవిప్రసాద్‌తో కలిసి చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ ఎన్ఎస్ రావు మాట్లాడారు. మూసీ పరివాహక ప్రాంతంలో అతిపెద్ద ఎస్టీపీని

మిగతా 8వ పేజీలో..

ఆశచూపి.. నిలువునా ముంచేసి

- రెచ్చిపోతున్న సైబర్ నేరగాళ్లు
- రిటైర్డ్ ఉద్యోగికి రూ.45.78లక్షల టోకరా

8



8 ఏళ్లుగా నగరంలోనే నైజీరియన్ స్మగ్లర్

48 గంటల్లో ఆ సమస్యను పరిష్కరించండి

లేదంటే శ్రమదానం చేస్తాం ● నెటిజన్ పోస్ట్‌పై కేటీఆర్



హైదరాబాద్ సిటీ, జూలై 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక సమస్యలపై పౌరులు ఫిర్యాదు చేసినా జీహెచ్ఎంసీ పట్టించుకోకపోవడంపై బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాలనీలో సమస్యలపై ఓ నెటిజన్ చేసిన ట్వీట్‌పై ఆయన స్పందించారు. సమస్యలను పరిష్కరించాలని మేయర్ గద్వాల్ విజయలక్ష్మిని కోరుతూ.. 48 గంటల్లో పరిష్కరించని పక్షంలో స్థానికులతో కలిసి తామే శ్రమదానం చేస్తామని పేర్కొన్నారు. ఫిర్యాదులను వెనువెంటనే పరిష్కరించడంలో ఎందుకు విఫలమవుతున్నారని ప్రశ్నించారు. కాలనీలో భారీగా చెట్లు పెరగడం.. చెత్తా చెదారం పేరుకుపోవడం వల్ల పాముల బెడద ఉందని, మేయర్‌కు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 50 కుటుంబాలున్న కాలనీలో రోడ్లు, తాగునీటి సౌకర్యం లేదని, దొంగతనాలూ జరుగుతున్నాయని పేర్కొన్నారు. సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు. ప్రస్తుత ప్రభుత్వం ఫిరాయింపులపై పెట్టిన దృష్టిని ప్రజాసమస్యల పరిష్కారంలో చూపడం లేదని కేటీఆర్ అభిప్రాయపడ్డారు.

ప్రజావాణికి 535 దరఖాస్తులు

6

ఎస్ఐ, ఏఎస్ఐ, ఇద్దరు కానిస్టేబుళ్ల సస్పెన్షన్

డబ్బుల విషయంలో ఓ వ్యక్తిని ఇతర ప్రాంతానికి తీసుకెళ్లి బెదిరించిన ఘటనలో టప్పాచబుత్ర ఎస్ఐ, ఇద్దరు కానిస్టేబుళ్లు, సివిల్ తగాదాల్లో తలదూర్చి ఒకరికి మద్దతుగా వ్యవహరించారన్న కారణంతో ఓ ఏఎస్ఐ సస్పెన్షన్‌కు గురయ్యారు. ఈ మేరకు హైదరాబాద్ సీపీ శ్రీనివాస్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

కార్వాన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): టప్పాచబుత్ర పోలీస్‌స్టేషన్‌కు చెందిన ఎస్ఐ ఆదిల్ రియాజ్ ఖాన్‌తో పాటు మరో ఇద్దరు కానిస్టేబుళ్లు రాజేశ్, బాలరాజును సస్పెండ్ చేస్తూ సీపీ ఉత్తర్వులు జారీ చేశారు. సుల్తాన్‌బజార్‌లోని ఓ మెడికల్ షాప్ నిర్వాహకుడు కొంతకాలంగా ఇల్లీగల్‌గా ఇంజక్షన్లు, మందులు అమ్ముతున్నట్లు ఎస్ఐ, కానిస్టేబుళ్లు తెలుసుకుని, డబ్బుల కోసం ఈనెల 4న అతన్ని బెదిరించేందుకు యత్నించారని, అంతేకాకుండా ఇతను మరొకరికి ఇవ్వాల్సిన డబ్బులు కూడా వసూలు చేసేందుకు ప్రయత్నించారని తెలిసింది. దీంతో సదరు షాపు నిర్వాహకుడిని పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి అక్కడినుంచి వేరే ప్రాంతానికి తీసుకెళ్లి విచారించడంతో భయపడ్డ బాధితుడు, ఆయన బంధువులు సుల్తాన్ బజార్ పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఉన్నతాధికారులు

మిగతా 8వ పేజీలో..

బండ్లగూడలో ఏఎస్ఐ..



ఏఎస్ఐ మహబూబ్

మదీన, జూలై 16 (ఆంధ్రజ్యోతి): బండ్లగూడ పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్ఐగా మహబూబ్ పనిచేస్తున్నాడు. నెలరోజుల క్రితం గౌస్‌నగర్‌హిల్స్ ప్రాంతంలో ఓ ప్రార్థనా స్థలం విషయంలో ఫిర్యాదు అందింది. ఓ ఇంటి యజమాని మసీదు స్థలంలోకి జరిగి నిర్మాణం చేపడతున్నట్లుగా పోలీసులకు కొందరు ఫిర్యాదు చేశారు. దీంతో ఏఎస్ఐ మహబూబ్ సంఘటనా స్థలానికి వెళ్లి పరిస్థితిని సమీక్షించారు. వివాదాన్ని సద్దుమణిగించే క్రమంలో అక్రమ నిర్మాణం చేపడుతున్న వ్యక్తికి అనుకూలంగా వ్యవహరించినట్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు అందింది. దీంతో అధికారులు విచారణ చేపట్టారు. ఏఎస్ఐ మహబూబ్ వ్యవహరించిన తీరు సరిగ్గా లేదని నిర్ధారణ కావడంతో అతన్ని సస్పెండ్ చేస్తూ సీపీ ఉత్తర్వులు జారీ చేశారు. ఏఎస్ఐ మహబూబ్ గతంలో ఆయన సొంత వ్యక్తిగత వివాదంలో కూడా ఒకసారి సస్పెన్షన్‌కు గురైనట్లు తెలిసింది.

విద్యుత్ సమగ్ర సమాచారంతో టీజీఎయిమ్స్ యాప్

త్వరలో డిస్కం అధికారులకు అందుబాటులో..

- తుది దశకు చేరిన అప్‌లోడింగ్..
- గ్రేటర్‌లోని 3,381 ఫీడర్లలో 2,220 ప్రాంతాల్లో సర్వే పూర్తి
- 26 డివిజన్లలో 3 లక్షలకు పైగా సర్వే పాయింట్లు
- టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ పర్యవేక్షణలో యాప్ రూపకల్పన

హైదరాబాద్ సిటీ, జూలై 16 (ఆంధ్రజ్యోతి): దక్షిణ తెలంగాణ విద్యుత్‌పంపిణీ సంస్థ (టీజీఎస్పీడీసీఎల్) సమగ్ర సమాచారం ఉన్నతాధికారులకు క్షణాల్లో తెలిసేలా ఓ యాప్ రాబోతుంది. గ్రేటర్‌జోన్‌లో విద్యుత్ వ్యవస్థ సమగ్ర సమాచారాన్ని నిక్షిప్తం చేస్తూ ప్రత్యేక యాప్‌ను రూపొందిస్తోంది. టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూకీ ప్రత్యక్ష పర్యవేక్షణలో ఐటీ వింగ్ అధికారులు టీజీఎయిమ్స్ (టీజీఎస్పీడీసీఎల్ జీఐఎస్ అసెట్ ఇన్‌స్పెక్షన్ మెయింటెన్స్ సిస్టం) పేరిట యాప్‌ను రూపకల్పన చేశారు. ఇందులో వివరాల నమోదుకు మెట్రో, రంగారెడ్డి, మేడ్చల్ జోన్ల పరిధిలో 3,381 ఫీడర్ల పరిధిలో సర్వే చేపట్టారు. శనివారం నాటికి 2,200 ఫీడర్ల సర్వే పూర్తిచేసిన అధికారులు ఆ వివరాలను ఫొటోలతో కలిపి యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు.



క్షేత్రస్థాయిలో సర్వే తీరును పరిశీలిస్తున్న సీఎండీ ముషారఫ్ ఫరూకీ, మెట్రోజోన్ సీఈ కె.నర్సింహులు

యాప్‌లో సమగ్ర సమాచారం

టీజీఎయిమ్స్ యాప్‌లో సబ్‌స్టేషన్లు, విద్యుత్‌స్తంభాల లోకేషన్, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల స్ట్రక్చర్, రింగ్ మెయిన్ యూనిట్, ఆటో రీక్లోజర్, లైన్ ఏబీ స్విచ్‌ల జీఐఎస్ మ్యాపింగ్ చేయడంతో పాటు విద్యుత్‌స్తంభాల పరిస్థితి (సిమెంట్, ఐరన్, రైల్వే ట్రాక్‌పోల్), డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ స్ట్రక్చర్ ఎలా ఉన్నాయనే వివరాలు ఫొటోలతో అప్‌లోడ్ చేస్తారు. విద్యుత్ తీగల పరిస్థితి, స్తంభాల మధ్య గ్యాప్, ఎక్కడైనా లూజు లైన్లు ఉంటే ఇలా.. ప్రతి అంశం యాప్‌లో అప్‌లోడ్ చేయడంతో ఎక్కడ ఎలాంటి సమస్యలు తలెత్తినా వాటిని గుర్తించి పరిష్కరించడం సులభతరమవుతుంది.

మరో మూడు రోజుల్లో సర్వే పూర్తి

గ్రేటర్‌జోన్ 9 సర్కిళ్ల పరిధిలో 3.20 లక్షల సర్వే పాయింట్లతో ఈ సర్వే నిర్వహిస్తున్నారు. క్షేత్రస్థాయిలో

మిగతా 6వ పేజీలో..


ప్రజావాణి ద్వారా అందిన దరఖాస్తులకు ప్రాధాన్యం ఇవ్వాలని మంగళవారం తన కార్యాలయంలో జరిగిన సమావేశంలో పోలీస్ కమిషనర్లు, ఎస్పీలను డీజీపీ జితేందర్ ఆదేశించారు

ప్రజావాణికి 535 దరఖాస్తులు

బేగంపేట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మహాత్మా జ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో మంగళవారం జరిగిన ప్రజావాణికి 535 దరఖాస్తులు వచ్చాయి. రెవెన్యూకు సంబంధించిన 116, పౌరసరఫరాలు 88, విద్యుత్ శాఖవి 62, హౌసింగ్ సంబంధించి 57, పంచాయతీరాజ్ శాఖవి 36, ఇతర శాఖలకు సంబంధించిన 176 దరఖాస్తులు వచ్చినట్లు ప్రజావాణి అధికారులు తెలిపారు. ప్రజావాణిలో ప్రజల నుంచి వినతిపత్రాలను తీసుకోవడంతో పాటు వారి సమస్యలు తెలుసుకున్నారు. సాధ్యమైనంత త్వరగా సమస్యలు పరిష్కరిస్తామని అధికారుల తెలిపారు.


సమావేశంలో మాట్లాడుతున్న జోగిని శ్యామలాదేవి

ఆషాఢ బోనాలు తీసుకురాం

● ఇళ్లలోనే చేసుకుంటాం : జోగిని శ్యామల
● జోగినులు, పోతరాజులపై లాఠీచార్జీకి నిరసనగా నిర్ణయం

పంజాగుట్ట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): బల్కంపేట ఎల్లమ్మ కల్యాణం, బోనాల సందర్భంగా శివశక్తులు, జోగినులు, పోతరాజులపై పోలీసులు ఎందుకు లాఠీచార్జ్ చేశారని తెలంగాణ శివశక్తుల సంక్షేమ సంఘం అధ్యక్షురాలు కొలిపాక శ్యామలాదేవి(జోగిని శ్యామల) ప్రశ్నించారు. దీనిపై ప్రభుత్వం స్పందించాలని, సంబంధిత పోలీసులపై చర్యలు తీసుకోవాలని కోరారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో శివశక్తులు, పోతరాజులు, జోగినులతో కలిసి ఆమె మాట్లాడారు. తమపై అకారణంగా లాఠీచార్జ్ చేశారని, దెబ్బలు తగిలాయని ఎస్ఆర్ నగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోవడం లేదని అన్నారు. సంవత్సరాలుగా తాము వివక్షకు గురవుతున్నామని, ప్రభుత్వం తరపున తమకు ఏమి చేయదల్చుకున్నారో స్పష్టమైన ప్రకటన చేయాలని ఆమె సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. తమపై లాఠీచార్జ్‌కు నిరసనగా ఈ సంవత్సరం మహాకాళి, ఇతర అమ్మవార్లకు బోనాలు తేవడం లేదని, ఇళ్లల్లోనే చేసుకుంటామని తెలిపారు. తమకు ప్రత్యేకంగా గుర్తింపు కార్డు ఇవ్వాలని, ఆలయాల వద్ద ప్రత్యేకలైన్ ఏర్పాటు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో శివశక్తులు, జోగినులు హంస, శిరీష, నిఖిత, తదితరులు పాల్గొన్నారు.


విరాహత్ అలీని గజమాలతో సన్మానిస్తున్న టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాలరాజు, వెంకట్రామిరెడ్డి

అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలను మంజూరు చేసేలా కృషి : విరాహత్ అలీ

కూకట్‌పల్లి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): అర్హులైన జర్నలిస్టులకు జిల్లా, మండల కేంద్రాల వారీగా పరిగణలోకి తీసుకొని ప్రభుత్వం ఇళ్ల స్థలాలను మంజూరు చేసే విధంగా యూనియన్ కృషి చేస్తుందని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ తెలిపారు. అర్హులైన ప్రతీ జర్నలిస్టుకు అక్రెడిటేషన్ ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచించారు. యూనియన్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా శాఖ, కూకట్‌పల్లి ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో కూకట్‌పల్లిలోని శేషాద్రినగర్ కమ్యూనిటీహాల్‌లో మంగళవారం నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. మీడియా అకాడమీ ఆధ్వర్యంలో సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో విలేకరుల సమస్యలపై తరచూ చర్చలు, సమావేశాలు జరుగుతున్నాయని చెప్పారు. రాష్ట్రంలో పనిచేసే జర్నలిస్టులు ట్రేడ్ యూనియన్ల విధివిధానాలపై అవగాహన పెంచుకోవడంతోపాటు వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన విరాహత్ అలీతో పాటు రాష్ట్ర కమిటీలో గ్రేటర్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న పలువురిని ఘనంగా సన్మానించారు. జిల్లా అధ్యక్షుడు గడ్డమీది బాలరాజు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి వెంకట్రామిరెడ్డి, కూకట్‌పల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షకార్యదర్శులు కరీం, రంజిత్, జిల్లా, నియోజకవర్గ ప్రెస్ క్లబ్ ప్రతినిధులు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

విద్యుత్ సమగ్ర సమాచారంతో

టీజీఎయిమ్స్ యాప్

(5వ పేజీ తరువాయి)

సీఎండీ ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తూ సర్వే తీరుపై అధికారులకు పలు సూచనలు చేస్తున్నారు. మరో రెండు, మూడు రోజుల్లో సర్వేపూర్తిచేసి గ్రేటర్‌జోన్ పరిధిలోని విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, సబ్‌స్టేషన్ల సమగ్ర సమాచారం యాప్‌లోకి అప్‌లోడ్ చేయనున్నారు. గ్రేటర్‌జోన్ 9 సర్కిళ్ల 26 డివిజన్లలో విద్యుత్ లైన్లు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల వివరాలు అందుబాటులోకి వస్తే ఏ ఫీడర్‌లో ఎక్కడ సమస్యలు తలెత్తినా ఆ వివరాలు ఉన్నతాధికారులు యాప్‌లో సులువుగా చూసుకునే పరిస్థితి ఉంటుంది. ప్రస్తుతం ఏ ఫీడర్‌లో ఎంత సమయం విద్యుత్‌సరఫరా నిలిచిపోయింది..? ఎక్కడ సాంకేతిక సమస్యలు తలెత్తాయనే వివరాలు క్షేత్రస్థాయి సిబ్బంది ఇచ్చే సమాచారంతోనే ఉన్నతాధికారులకు తెలుస్తోంది. యాప్ అందుబాటులోకి వస్తే గ్రేటర్‌జోన్‌లో ఎలాంటి విద్యుత్ సమాచారమైనా ఉన్నతాధికారులు క్షణాల్లో నేరుగా తెలుసుకునే అవకాశం ఏర్పడుతుంది. దాంతోపాటు క్షేత్రస్థాయిలో విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకునే అవకాశాలుంటాయి.

గ్రేటర్‌లో డివిజన్ల వారీగా ఫీడర్లు.. సర్వే పాయింట్లు

డివిజన్	ఫీడర్లు	సర్వే పాయింట్లు
బంజారాహిల్స్	189	14,941
గ్రీన్‌ల్యాండ్స్	122	7,170
గచ్చిబౌలి	133	10,563
ఇబ్రహీంబాగ్	179	12,034
కొండాపూర్	109	12,106
హబ్సిగూడ	121	12,897
సైనిక్‌పురి	146	20,338
కీసర	113	17,095
సైఫాబాద్	130	7,552
అజామాబాద్	70	6,055
మెహిదీపట్నం	106	11,577
చార్మినార్	147	8,632
అస్మాన్‌ఘడ్	116	8,381
బేగంబజార్	58	4,211
జీడిమెట్ల	110	12,492
కూకట్‌పల్లి	139	15,805
మేడ్చల్	212	28,382
రాజేంద్రనగర్	160	18,090
షాద్‌నగర్	180	7,006
కందుకూరు	243	16,422
సరూర్‌నగర్	108	15,819
చంపాపేట	69	13,575
ఇబ్రహీంపట్నం	152	13,166
బోయిన్‌పల్లి	80	8,319
ప్యారడైజ్	95	6,101
కంటోన్మెంట్	94	11,865



అత్తాపూర్ వద్ద మూసీలో గుర్రపు డెక్కను పరిశీలిస్తున్న దక్షిణ మండలం సీనియర్ ఎంటమాలజిస్ట్ నామాల శ్రీనివాస్

మూసీని సందర్శించిన అధికారులు

రాజేంద్రనగర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): దోమలు బాబోయ్.. దోమలు అనే శీర్షికతో ఈ నెల 6వ తేదీన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి స్పందించిన అధికారులు మంగళవారం మూసీని సందర్శించారు. గ్రేటర్ దక్షిణ మండలం సీనియర్ ఎంటమాలజిస్ట్ నామాల శ్రీనివాస్, రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్ఎంసీ ఈఈ నరేందర్‌గౌడ్, ఏఈ నర్సింహ మూర్తి అత్తాపూర్, హైదర్‌గూడ పరిసరాలలో మూసీ నదిని సందర్శించారు. రెండు రోజుల్లో మూసీలో పేరుకుపోయిన గుర్రపు డెక్కను తొలగించడానికి అంచనాలు తయారు చేసి జోనల్ కమిషనర్ అనుమతి తీసుకుని తొలగించడానికి కార్యాచరణ సిద్ధం చేస్తామని అధికారులు తెలిపారు. డ్రోన్‌ల ద్వారా యాంటీ లార్వా ఆపరేషన్ చేపడతామన్నారు. దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు.

త్వరలో పేట్లబురుజు ఆస్పత్రిలో సంతాన సాఫల్య కేంద్రం

చార్మినార్ జూలై 16 (ఆంధ్రజ్యోతి): పేట్లబురుజు ప్రభుత్వ ప్రసుతి ఆస్పత్రిలో త్వరలో ప్రారంభమయ్యే సంతాన సాఫల్య కేంద్రాన్ని (ఐవీఎస్), టెలి మెడిసన్ కాన్ఫరెన్స్ కేంద్రాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఆస్పత్రి సూపరిటెండెంట్ రజనిరెడ్డి అన్నారు. మంగళవారం ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం మహిళలకు ప్రసుతి ఆస్పత్రులలో అన్ని సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. ఆస్పత్రికి వచ్చే గర్భిణులకు అన్ని రకాల వైద్య పరీక్షలు ఆస్పత్రి లోనే జరుగుతున్నాయని, మందులు కూడ అందుబాటులో ఉన్నాయని తెలిపారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న షేక్ జహంగీర్ తదితరులు

బోనాల చెక్కుల పంపిణీలో రాజకీయాలు వద్దు

పహడిషరీఫ్ జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఆర్కేపురం బోనాల చెక్కుల పంపిణీ వ్యవహారంలో ఎమ్మెల్యే సబితారెడ్డి రాద్ధాంతం చేస్తున్నారని జల్‌పల్లి మున్సిపాలిటీ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ షేక్ జహంగీర్, లాల్ సతీష్ గౌడ్, ఆదిల్ల జంగయ్యలు అన్నారు, మంగళవారం వారు మీడియాతో మాట్లాడుతూ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డికి ప్రోటోకాల్ ప్రకారం గౌరవించి చెక్కుల పంపిణీకి ఆహ్వానించినా కొంతమంది బీఆర్ఎస్ నేతలు రాజకీయాలు చేస్తున్నారనన్నారు. మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మ రెడ్డి కార్యక్రమంలో పాల్గొనడంతో గొడవ చేసి నీచ రాజకీయాలు చేస్తున్నారన్నారు. కిచ్చన్న గారి లక్ష్మారెడ్డిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహేశ్వరం ఇన్‌చార్జిగా ప్రకటించారన్నారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో ఆయన ఉంటారన్నారు. బీఆర్ఎస్ నాయకులు నిజాలు తెలుసుకుని మాట్లాడాలన్నారు. రాజకీయ లబ్ధికోసం ఇలాంటి రాజకీయాలు చేయకుండా నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేస్తే బాగుంటుందన్నారు.

ప్రభుత్వ స్థలంలో కంటైనర్ కూల్చివేత

నార్సింగ్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): గండిపేట మండలం పుప్పాల్‌గూడ గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 324లో ప్రభుత్వ భూమిలో అక్రమంగా ఏర్పాటు చేసిన కంటైనర్‌లను గండిపేట తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో కూల్చివేశా రు. ఇది ప్రభుత్వ స్థలమైనప్పటికీ తమదంటూ కొంతమంది అక్రమంగా కంటైనర్ ఏర్పాటు చేయడంతో ఈ చర్యలు తీసుకున్నామన్నారు.



కంటైనర్‌ను కూల్చివేస్తున్న ఎక్స్‌కవేటర్

ఎన్ఎండీసీలో ఘనంగా పీఆర్ దినోత్సవం

పీఆర్ నిపుణులు కొత్త నైపుణ్యాలను అందింపుచ్చుకోవాలన్న వక్తలు

హైదరాబాద్ సిటీ, జూలై 16 (ఆంధ్రజ్యోతి): పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా (పీఆర్ఎస్ఐ), నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఎండీసీ) సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ ప్రజా సంబంధాల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు కమ్యూనికేషన్ నిపుణులు, జర్నలిజం విద్యార్థులు పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఓక్సన్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ లా డీన్ ప్రొఫెసర్ జామవా మాట్లాడుతూ పీఆర్ నిపుణులు కొత్త నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. సమాచార సునామీతో పాటు వచ్చే నకిలీ వార్తలు, తప్పుడు సమాచారం పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. పీఆర్ నిపుణులు తమ సంస్థల యొక్క ప్రతిష్టను కాపాడేందుకు వ్యూహాత్మక కమ్యూనికేషన్, చట్టపరమైన వివేకం కలిగి ఉండాలని సూచించారు. పీఆర్ఎస్ఐ హైదరాబాద్ చాప్టర్ చైర్మన్ డాక్టర్ ఎస్. రాము మాట్లాడుతూ.. వేగంగా మారుతున్న కమ్యూనికేషన్ రంగంలో లీగల్ డిగ్రీలు పొందిన పీఆర్ నిపుణులు బాగా రాణిస్తున్నారని అన్నారు.

కార్పొరేట్ కమ్యూనికేషన్ హెడ్ జయప్రకాష్ మాట్లాడుతూ సమాచార ప్రవాహం ద్వారా ఎదురయ్యే అనేక సవాళ్లను ఎదుర్కోవడానికి మల్టీ టాస్కింగ్ అలవాటును పెంపొందించుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా పీఆర్ వాయిస్ 70వ ఎడిషన్ విడుదల చేశారు. కార్యక్రమంలో దక్షిణమధ్య రైల్వే పీఆర్‌వో రాజేశ్, ఎన్ఎండిసి ఏడీజీ శ్రీనివాసరావు, పీఆర్ఎస్ఐ కార్యదర్శి కె.యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



ప్రపంచ పీఆర్ దినోత్సవంలో కమ్యూనికేషన్ నిపుణులు, జర్నలిజం విద్యార్థులు



రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ డాక్టర్ రియాజ్‌ను సత్కరిస్తున్న అడ్వకేట్‌లు విశాల్, మల్లేష్ గౌడ్

గ్రంథాలయ అభివృద్ధికి కృషి: రియాజ్

గోషామహల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్‌గా డాక్టర్ రియాజ్ పదవీ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా మంగళవారం అఫ్జల్‌గంజ్ కేంద్ర గ్రంథాలయంలోని చైర్మన్ కార్యాలయంలో డాక్టర్ రియాజ్‌ను న్యాయవాదులు గలిబి విశాల్, మల్లేష్ గౌడ్‌లు శాలువాతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్ డాక్టర్ రియాజ్ మాట్లాడుతూ రాష్ట్రంలోని వివిధ పోటీల పరీక్షలకు హాజరయ్యే నిరుద్యోగ అభ్యర్థులకు కావాల్సిన అన్ని విభాగాల స్టడీ మెటీరియల్ అందుబాటులో తీసుకొచ్చేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. గ్రంథాలయ శాఖలో ఖాళీగా ఉన్న ఉద్యోగులను దశల వారీగా భర్తీ చేస్తామన్నారు. ప్రస్తుతం లైబ్రరీ పూర్తిగా డిజిటైలేషన్‌లో కొనసాగుతుందని... ప్రతి నిరుద్యోగి సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కుందే గిరీష్, పి.వెంకటేశ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



బ్రహ్మోత్సవాల్లో భాగంగా గోపూజలో ఆలయ చైర్మన్ శంకర్ యాదవ్, అధ్యక్షుడు కిషన్ యాదవ్, పాండు యాదవ్

విఠలేశ్వర, రుక్మాబాయి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

అఫ్జల్‌గంజ్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): జంగల్ విఠోబా దేవస్థానం ఆధ్వర్యంలో విఠలేశ్వర, రుక్మాబాయిల బ్రహ్మోత్సవాలు మంగళవారం గౌలిగూడ విఠల్‌నగర్ ఆలయ ప్రాంగణంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాలకు ఆలయ కమిటీ చైర్మన్ జి.శంకర్ యాదవ్, అధ్యక్షులు వి.కిషన్ యాదవ్, కోశాధికారి వి.పాండు యాదవ్, ఉపాధ్యక్షులు సత్యప్రకాశ్ రెడ్డి, కె.గోవింద్‌రాజ్ మహరాజ్, జనరల్ సెక్రటరీ పి.మాణిక్ రావు, సలహాదారులు జి.రఘునందన్ యాదవ్, బోయిని వెంకటేశ్ యాదవ్‌లు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా శంకర్ యాదవ్, కిషన్ యాదవ్‌లు మాట్లాడుతూ ఈ నెల 16 నుంచి 24 వరకు దేవాలయ ఆవరణలో ప్రత్యేక పూజలతో పాటు ప్రతిరోజు మధ్యాహ్నం వేలాది మంది భక్తులతో తీర్థప్రసాదాలు, అన్నదానం నిర్వహించడం జరుగుతుందన్నారు. 17న సాయంత్రం రథోత్సవం నిర్వహించనున్నామని తెలిపారు.

రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతీ ఒక్కరి బాధ్యత

- ట్రాఫిక్ ఏసీపీ శంకర్ రాజు

చార్మినార్ జూలై 16 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ బేగంపేట, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ జి. శంకర్ రాజు అన్నారు. మంగళవారం సీటీసీ చెల్లాపూర్ పోలీస్ ట్రైనీ విద్యార్థులకు, వారి సిబ్బందికి రోడ్డు ప్రమాదాలు-నివారణ అనే అంశంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారులపై ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. యువత ఓవర్ స్పీడ్, రాంగ్ రూట్, సిగ్నల్ జంపింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేస్తున్నారన్నారు. సిగ్నల్ జంపింగ్ అతి ప్రమాదకరం, ముఖ్యంగా రెడ్ సిగ్నల్ పడినప్పుడు తప్పనిసరిగా వాహనం ఆపాలన్నారు. లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ చేస్తే రూ.5000 వరకు జరిమానా, మూడు నెలల జైలు శిక్ష కూడా విధిస్తారన్నారు. ప్రతి ఒక్కరు వాహనం నడిపే వ్యక్తి, వెనక కూర్చున్న వ్యక్తి కూడా తప్పని సరిగా హెల్మెట్ ధరించాలి. కార్యక్రమంలో సుమారు 300 మంది పోలీస్ ట్రైనీ విద్యార్థులు, ప్రిన్సిపాల్ బి.కిష్టయ్య, అదనపు డీసీపీ, వైస్ ప్రిన్సిపాల్ ప్రసన్న లక్ష్మి, ఏసీపీ ఎం.అచ్యుతరావు, ఆర్.ఐ, ఆర్.ఎస్.ఐ. దేవేందర్ రెడ్డి, శరవాణి సీటీసీ చెల్లాపూర్ వారి సిబ్బంది పాల్గొన్నారు.



రోడ్డు భద్రతపై సీటీసీ చెల్లాపూర్ పోలీస్ ట్రైనీ విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఏసీపీ శంకర్ రాజు

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్‌ఎల్ https://ejyothy.com/hbMUs60 లో చదవండి.
Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు.
నోట్: htpps://epaper.andhrajyothy.comలో లాగిన్ అయిన తరువాత క్యూఆర్‌కోడ్‌ని స్కాన్ చేయగలరు.



గోపీకృష్ణ దంపతులను సత్కరిస్తున్న అతిథులు తనికెళ్లభరణి, తదితరులు

సంగీతం సర్వరోగ నివారిణి

రవీంద్రభారతి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): చక్కటి స్వరాలతో తెలుగు సినీ గీతాలను ఆలపించిన గాయనీగాయకులు వీనులవిందును పంచారు. మంగళవారం రవీంద్రభారతిలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో మనిష కల్చరల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో పాటే నా ప్రాణం శీర్షికన సంగీత విభావరి నిర్వహించారు. ఈ సందర్భంగా కళాపోషకులు గోపికృష్ణ దంపతులకు ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ సినీ నటుడు తనికెళ్ల భరణి హాజరై కళాకారులతో పాటు గోపికృష్ణను సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కళలు, కళాకారుల్ని ప్రోత్సహించే కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. సంగీతం సర్వరోగ నివారిణి అని అన్నారు. కార్యక్రమంలో ప్రముఖ సంగీత దర్శకుడు సాలూరి కోటి, తుమ్మలపల్లి రామసత్యనారాయణ, కె.శ్రీనివాస్, చంద్రశేఖర్, దైవజ్ఞశర్మ తదితరులు పాల్గొని కళాకారులను సత్కరించి అభినందించారు. సభకు ముందు ప్రముక గాయకుడు మధుబాపు నేతృత్వంలోని గాయకులు బృందం పాటే నాప్రాణం పేరిట ఆలపించిన గీతాలాపన ప్రేక్షకుల్ని మైమరిపించాయి. మధురమైన గీతాలు ఆలపిస్తూ అలరించారు.

డ్రగ్స్ కేసులో ఐదుగురికి 14 రోజుల రిమాండ్

నార్సింగ్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): హైదర్షాకోట్‌లో పట్టుబడిన డ్రగ్స్ ముఠా సభ్యులను నార్సింగ్ పోలీసులు మంగళవారం ఉప్పర్‌పల్లి కోర్టులో హాజర్‌పర్చగా జడ్జి 14 రోజుల రిమాండ్ విధించారు. ఈ కేసులో ఏ1గా నైజీరియాకు చెందిన అనూహా బ్లెస్సింగ్, ఏ2గా నైజీరియాకు చెందిన నోహిమ్, ఏ3గా బెంగళూర్‌కు చెందన సత్య వెంకటగౌతమ్, ఏ4గా ఈస్ట్‌గోదావరి బొమ్మిడివరంకు చెందిన సానబోయిన వరున్‌కుమార్, ఏ5గా కొత్తగూడెం భద్రాద్రికి చెందిన మహ్మద్ మహబూబ్ షరీఫ్ ఉన్నట్లు పోలీసులు తెలిపారు. వీరికి కోర్టు 14 రోజుల రిమాండ్ విధించడంతో చంచల్‌గూడ జైలుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.



కోర్టు నుంచి జైలుకు తరలిస్తున్న దృశ్యం

పాములపై అవగాహన

మదీన, జూలై 16 (ఆంధ్రజ్యోతి): వరల్డ్ స్నేక్ డే ను పురస్కరించుకుని సోమవారం జూపార్కులో సిబ్బందికి అవగాహన కల్పించారు. క్యూరేటర్ డాక్టర్ సునీల్ ఎస్.హిరెమత్ ఆదేశాల మేరకు డిప్యూటీ క్యూరేటర్ ఎ.నాగమణి, జూ ఎడ్యుకేషన్ ఆఫీసర్ దీపక్ తరుణ్‌లు సిబ్బందికి పాము కాటు గురించి అవగాహన కల్పించారు. జూలోని వివిధ విభాగాలలో పనిచేస్తున్న 300 మంది యానిమల్ కీపర్లు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాముల్లో కోబ్రా, తాచుపాము, రక్తపింజర, కట్ల పాము అనే కేవలం నాలుగు రకాలు మాత్రమే విషపూరితమైనవన్నారు. మిగతావన్నీ విషం లేని పాములేనన్నారు. సిబ్బంది పనిచేసే సమయంలో పాము కాటుకు గురికాకుండా ఎలాంటి చిట్కాలు పాటించాలో వారికి వివరించారు.



అవగాహన కల్పిస్తున్న వలంటీర్



రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీసీపీ శ్రీనివాస్ గుప్తా

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

నార్సింగ్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మాదాపూర్ ఎస్‌వోటీ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో సైబరాబాద్ ఎస్ఓటీ డీసీపీ శ్రీనివాస్ గుప్తా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రౌడీ షీటర్లపై ప్రత్యే నిఘా పెడుతున్నామని ఆయన తెలిపారు. గంజాయి స్మగ్లింగ్ చేస్తే తాట తీస్తామన్నారు. భూ కబ్జాలు, దువిన్మలు, గ్యాంగులు ఏర్పాటు చేస్తే పీడీ యాక్టు క్రింద కేసు నమోదు చేసి జైల్లో పెడతామని ఆయన హెచ్చరించారు. కౌన్సెలింగ్‌లో దాదాపు 92 మంది రౌడీ షీటర్లు పాల్గొన్నారు.





మొహర్రంను పునస్కరించుకొని మంగళవారం, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, మాజీ రాజ్యసభ సభ్యుడు, వి.హనుమంతరావు బీబీకా అలవ చేరుకొని దట్టి సమర్పించారు, ముతవల్లిలు వారికి సన్మానించి ప్రసాదం అందజేశారు. -చార్మినార్ ఆంధ్రజ్యోతి



జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలోని కట్టమైసమ్మ కల్యాణం-బోనాల వేడుకల్లో పూజలు నిర్వహించిన మేయర్ గద్వాల్ విజయలక్ష్మి


బస్టాప్‌లో ఉన్న మహిళ మెడలోంచి చైన్ చోరీ

రాజేంద్రనగర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): డ్యూటీ ముగించుకుని ఇంటికి వెళుతున్న ఓ నర్స్ మెడలోంచి మూడు తులాల మంగళసూత్రాన్ని గుర్తు తెలియని ఇద్దరు యువకులు లాక్కొని పారిపోయారు. ఈ సంఘటన రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బుద్వేల్ బస్సీలాల్‌నగర్ చౌరస్తాలోని బస్టాప్ వద్ద మంగళవారం సాయంత్రం జరిగింది. బుద్వేల్‌కు చెందిన మమత(30) స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో నర్స్‌గా పనిచేస్తుంది. మంగళవారం సాయంత్రం డ్యూటీ ముగించుకుని ఇంటికి వెళ్లడానికి బస్సీలాల్‌నగర్ చౌరస్తా వద్ద గల బస్ స్టాప్ లో నిలబడి ఉంది. ఆ సమయంలో అటుగా నడుచుకుంటు వచ్చిన ఇద్దరు యువకులు ఆమె మెడలో నుంచి మూడు తులాల బంగారు మంగళసూత్రాన్ని లాక్కెళ్లారు. ఈ పెనుగులాటలో మమత క్రింద పడిపోయినా దుండగులు వదలకుండ బంగారు మంగళసూత్రాన్ని లాక్కొని పారిపోయారు. చైన్ స్నాచింగ్ గురించి సమాచారం తెలియగానే రాజేంద్రనగర్ డీసీపీ సీహెచ్ శ్రీనివాస్, ఏసీపీ తుల శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ క్యాస్ట్రో, డీఐ గంగాధర్‌లతో పాటు అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్ వెంకట్రామిరెడ్డిలు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. చైన్ స్నాచింగ్‌లకు పాల్పడిన వారిలో ఒకరు వైట్ షర్ట్, వైట్ పాయింట్ ధరించి ఉండగా, మరొకరు రెడ్ టీ షర్ట్, బ్లాక్ పాయింట్ ధరించి ఉన్నట్లు చూసిన వారు చెబుతున్నారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు

- 12 కేజీల సరుకు స్వాధీనం

హైదరాబాద్ సిటీ, జూలై 16 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 12 కేజీల గంజాయి, ద్విచక్రవాహనం, సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. మొత్తం విలువ రూ.3.45 లక్షలు ఉన్నట్లు తెలిపారు. టాస్క్‌ఫోర్స్ డీసీపీ సుదీంద్ర తెలిపిన వివరాల ప్రకారం.. కాలాపత్తార్‌కు చెందిన అబ్దుల్ ఖదీర్, ఫలక్‌నుమాకు చెందిన మహ్మద్ అర్షద్ ఆటో డ్రైవర్‌లు. డబ్బు సంపాదించడం కోసం గంజాయి విక్రయించాలని నిర్ణయించుకున్నారు. అర్ధరాత్రి ద్విచక్రవాహనంపై గుట్టుగా కస్టమర్లకు గంజాయి విక్రయిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం అందుకున్న సౌత్‌వెస్ట్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు నిఘా పెట్టి ఇద్దరిని పట్టుకున్నారు. ఆసిఫ్‌నగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



క్షత్రియరాజ్‌పుత్ సభ ఎలక్షన్ కమిటీని మార్చాలని సొసైటీ రిజిస్ట్రేషన్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న క్షత్రియరాజ్‌పుత్ సభ ప్రతినిధులు

క్షత్రియరాజ్‌పుత్ సభ ఎలక్షన్ కమిటీని రద్దు చేయాలి

రాంనగర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఆగస్టు 11న జరిగే క్షత్రియరాజ్‌పుత్ సభ నూతన కమిటీ ఎన్నికలు సజావుగా, నిష్పాక్షపాతంగా జరగాలంటే ప్రస్తుతం ఉన్న ఎన్నికల కమిటీని రద్దు చేసి ఎన్నికల కమిటీని నియమించాలని కోరుతూ క్షతియ రాజ్‌పుత్ సభ, వివిధ బస్తీ శాఖల ప్రతినిధులు మంగళవారం రెడ్‌హిల్స్‌లోని సొసైటీ రిజిస్ట్రేషన్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ శాఖల ప్రతినిధులు విజయ్‌సింగ్, సాయినాథ్‌సింగ్, మురళీమోహన్‌సింగ్, శక్తిసింగ్‌లు మాట్లాడుతూ పదేళ్ల కాలంలో ఇప్పటి వరకు మూడు దఫాలుగా నిర్వహించిన ఎన్నికల్లో ప్రస్తుతం ఉన్న ఎన్నికల కమిటీ అనేక అవకతవకలకు పాల్పడిందని ఆరోపించారు. ఆగస్టు 11న జరిగే ఎన్నికల నిర్వహణ కమిటీలో అదే సభ్యులు ఉండడం వల్ల ఎన్నికల్లో అవకతవకలు జరుగుతాయని, కొత్త కమిటీని వేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సొసైటీ అధికారులకు వారు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో చంద్రకిషన్‌సింగ్, భగత్‌సింగ్ తదితరులుపాల్గొన్నారు.

రైతుల పేరిట మాట్లాడే హక్కు బీఆర్ఎస్ నాయకులకు లేదు

గోషామహల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేయడంతో అందరి రైతులకు ఎంతో ప్రయోజనం జరిగే విధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకున్న నిర్ణయాన్ని హర్షిస్తున్నామని టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్ అన్నారు. మంగళవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రాన్ని పదేళ్లు పరిపాలించిన బీఆర్ఎస్ నాయకులు ఏనాడు కూడా రైతుల కష్టాలు పట్టించుకున్న పాపన పోలేదన్నారు. రైతులు వరి వేస్తే ఉరి అన్నట్లు రాష్ట్రంలో 7,750 మంది వివిధ కారణాలతో చనిపోతే ఏ ఒక్క బీఆర్ఎస్ ప్రజాప్రతినిధి వారి కుటుంబాలను పరామర్శించకపోవడం దారుణమన్నారు. ప్రస్తుతం రైతుల కోసం మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులకు నైతిక హక్కు లేదన్నారు. ఎమ్మెల్యే హరీష్ రావు చేసిన శపతం ప్రకారం తన పదవీకి రాజీమానా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు హామీలను అన్నీ అమలు చేస్తూ ముందుకెళుతుందన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గౌరీ సతీష్



అమ్మంగి వేణుగోపాల్‌కు మగ్దూమ్ మొహియుద్దీన్ జాతీయ పురస్కారం ప్రదానం చేస్తున్న అతిథులు

అమ్మంగి వేణుగోపాల్‌కు మగ్దూం జాతీయ అవార్డు ప్రదానం

● కార్యక్రమంలో పాల్గొన్న ముదిగంటి సుజాతారెడ్డి, కవి యాకూబ్ తదితరులు

హైదరాబాద్ సిటీ, జూలై 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో మత సామరస్యాన్ని పెంపొందించేందుకు సాహిత్యం ద్వారా అమ్మంగి వేణుగోపాల్ తనవంతు కృషి చేశారని ప్రముఖ రచయిత్రి ముదిగంటి సుజాతారెడ్డి కొనియాడారు. భావ వైవిధ్యం, భాషా ప్రయోగాల్లో నవ్యత ఆయన రచనల్లో బాగా కనిపిస్తాయని ప్రశంసించారు. కవిగా, రచయితగా, అనువాదకుడిగా విశేష కృషి చేస్తున్న సుప్రసిద్ధ కవి అమ్మంగి వేణుగోపాల్‌ను స్వాతంత్ర్య సమరయోధుడు, ప్రఖ్యాత ఉర్దూ కవి మగ్దూం మొహియుద్దీన్ జాతీయ పురస్కారంతో సత్కరించడం ముదావహం అన్నారు. ప్రభుత్వ సిటీ కళాశాల వేదికగా మంగళవారం అమ్మంగి వేణు గోపాల్‌కు సుజాతారెడ్డి చేతుల మీదుగా అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన్ను శాలువా, జ్ఞాపికతో ఘనంగా సన్మానించారు. పదివేల నగదు పురస్కారాన్ని అందించారు. ఆత్మీయ అతిథిగా పాల్గొన్న హైదరాబాద్ బుక్ ఫెయిర్ సొసైటీ అధ్యక్షుడు, కవి యాకూబ్ మాట్లాడుతూ... కులమతాలకు అతీతంగా సమసమాజ నిర్మాణం కోసం తుది వరకు ఉద్యమించిన మగ్దూం ఆదర్శాలను ఈతరం కొనసాగించాల్సిన అవసరం ఉందని నొక్కిచెప్పారు. సభాధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ బాలభాస్కర్ మాట్లాడుతూ మగ్దూం సాహిత్య వ్యక్తిత్వాన్ని, ఉద్యమ కృషిని, అధ్యాపకుడిగా బోధించిన జ్ఞాన తత్వికతను ఈతరానికి తెలియజేయాలనే సంకల్పంతో ప్రతి ఏటా ఉత్తమ సాహిత్యకారులకు ఈ పురస్కారాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. పురస్కార గ్రహీత వేణుగోపాల్ మాట్లాడుతూ... మగ్దూం జీవిత విశేషాలు వింటూ పెరిగిన తనకు ఈ అవార్డు అత్యంత ప్రత్యేకమైనదంటూ ఆనందం వ్యక్తం చేశారు. హనుమంతుడి గుడిలో చదువుకున్న మగ్దూం మొహియుద్దీన్ జీవితం గంగా జమున తెహజీబ్ సంస్కృతికి నిదర్శనమని అన్నారు. కార్యక్రమంలో నగర సిటీ కళాశాల అధ్యాపకులు కోయి కోటేశ్వర రావు, విప్లవ్ దత్ శుక్లా, నీరజ, యాదయ్య తదితరులు పాల్గొన్నారు. ప్రముఖ కవి ఏనుగు నరసింహారెడ్డి, కందుకూరి శ్రీరాములు, ఓయూ విశ్రాంత ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ తదితరులు సభకు హాజరయ్యారు. అమ్మంగి వేణుగోపాల్ సాహిత్య కృషి గురించి ఆయన రచనలపై పీహెచ్‌డీ పరిశోధన చేసిన రాయారావు సూర్యప్రకాశ్‌రావు వివరించారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

లక్షలాది మెదళ్లను కదిలించిన "సుద్దాల" పాటలు

● "ప్రజాకవి సుద్దాల హనుమంతు సమగ్ర సాహిత్యం - జీవితం" పుస్తకావిష్కరణ

హైదరాబాద్ సిటీ, జూలై 16(ఆంధ్రజ్యోతి): పెన్నుతో పాటు గన్ను కూడా పట్టి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి దన్నుగా నిలిచిన యోధుడు సుద్దాల హనుమంతు అంటూ వక్తలు శ్లాఘించారు. ఆయన పాట ఆనాడు ఎంతో మందిని ఉత్తేజితుల్ని చేసిందని వారంతా గుర్తు చేసుకున్నారు. మంగళవారం బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సీపీఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి, సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు బీవీ రాఘవులు కలిసి నవతెలంగాణ ప్రచురించిన "ప్రజాకవి సుద్దాల హనుమంతు సమగ్ర సాహిత్యం - జీవితం" పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ... హనుమంతు పాటలు కొన్ని లక్షల మెదళ్లను కదిలించాయి, వారందరినీ పోరు బాటకు బాసటగా మలిపించాయని గుర్తు చేశారు. కుల, మతాలకు అతీతంగా అన్ని వర్గాల్లోని పీడితుల ఐక్యమత్యానికి నిదర్శనం తెలంగాణ సాయుధ పోరాటమని అన్నారు. బీవీ రాఘవులు మాట్లాడుతూ... సాహిత్యం, కళలను జీవితంలో అంతర్భాగం చేసుకోవడం ద్వారానే మంచి మనిషి కానీ, మంచి రాజకీయ నాయకులు కానీ కాగలరని అన్నారు. కళాకారులకు, రచయితలకు సమాజాన్ని విశ్లేషించే శక్తి అవసరం అని, దాని వల్లే వారు సృజించిన కళలు, సాహిత్యం పది కాలాల పాటు నిలుస్తుందని అన్నారు. ఆ విధంగా సుద్దాల హనుమంతు పాటలు దోపిడీ పీడనల నుంచి మానవాళిని విముక్తి చేయడంలో జయ కేతనాలై ప్రజల గుండెల్లో రెపరెపలాడుతుంటాయని వివరించారు. సాంస్కృతిక జాతీయ వాదాన్ని ఓడించేందుకు కవులు, కళాకారులు సమాయత్తం కావాలని రాఘవులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కొత్తగూడెం ఎమ్మెల్యే కూనమనేని సాంబశివ రావు మాట్లాడుతూ సీపీఐ, సీపీఎం పార్టీలు ఒక్కటి కావాలని తన ఆకాంక్షను వెలిబుచ్చగా, ఇప్పుడు కూటమిలో కలిసే ఉన్నాంగా అని రాఘవులు బదులివ్వడంతో సభలో నవ్వులు పూశాయి. సినీనటుడు ఉత్తేజ్ తన తాతయ్య (మాతా మహుడు) సుద్దాల హనుమంతుతో ఉన్న అనుబంధాన్ని కళ్ళకు కడుతూ ఉద్విగ్నభరితంగా మాట్లాడారు. ఆయుర్వేద వైద్యుడిగా తాన తాతయ్య హనుమంతు జీవితానుభవాలను కొన్నింటిని వెల్లడించారు. కవి, విమర్శకుడు కోయి కోటేశ్వరరావు క్లుప్త సుందరంగా పుస్తకాన్ని పరిచయం చేశారు. సి. ఆనందాచారి సభాధ్యక్షత వహించగా, ప్రజా గాయని విమలక్క, సుద్దాల హనుమంతు - జానకమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సుద్దాల అశోక్ తేజ, సుద్దాల హనుమంతు కుమార్తె భారతితో పాటు ఇతర కుటుంబ సభ్యులు, ఎన్వీకే బాధ్యుడు వినయ్ కుమార్, భూపతి వెంకటేశ్వర్లు, రాపోలు సుదర్శన్, అనంతోజు మోహన్ కృష్ణ, పల్లె నర్సింహ తదితరులు సుద్దాల హనుమంతు పాటలు, పోరాట జీవిత విశేషాల గురించి మాట్లాడారు. ప్రజానాట్యమండలి కళాకారులు ప్రదర్శించిన యక్షగానం సభికులను ఆకట్టుకుంది.

8 ఏళ్లుగా నగరంలోనే నైజీరియన్ స్మగ్లర్

- ● ఇప్పటి వరకూ పోలీసులకు చిక్కని ఫ్రాంక్లిన్ ఉచ్చెన్నా
- ● నగరంలో పదుల సంఖ్యలో భారీ నెట్‌వర్క్
- ● కిలోల కొద్ది కొకైన్ విక్రయించి.. రూ. కోట్లు కొల్లగొట్టారు
- ● అమన్ ప్రీత్‌సింగ్ సీడీఆర్‌పై పోలీసుల ఆరా..
- ● సినీ ఇండస్ట్రీలో లింకులపై ప్రత్యేక దృష్టి

హైదరాబాద్ సిటీ, జూలై 16(ఆంధ్రజ్యోతి): నగరంలో సోమవారం పట్టుబడ్డ అంతర్జాతీయ డ్రగ్స్ రాకెట్‌ను విచారించిన క్రమంలో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చినట్లు తెలిసింది. ఇద్దరు నైజీరియన్లు సహా.. ఐదుగురిని అరెస్టు చేసిన తెలంగాణ నార్కోటిక్ బ్యూరో పోలీసులు.. వారిని విచారించిన అనంతరం మంగళవారం మధ్యాహ్నం కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించారు.

సన్‌సిటీలో తిష్ఠ..

డ్రగ్స్ స్మగ్లింగ్ కేసులో పరారీలో ఉన్న ఎజియోనిలి ఫ్రాంక్లిన్ ఉచ్చెన్నా అలియాస్ కలేషి 8 ఏళ్ల క్రితం (2017) నగరానికి వచ్చి బండ్లగూడ పరిధిలోని సన్‌సిటీలో ఉంటున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. ప్రస్తుతం ఆయన హైదర్షాకోట్‌లోని విశాఖనగర్ వ్యూ అపార్టుమెంట్‌లో నివాసం ఉంటున్నట్లు తేలింది. అంతకు ముందే నగరానికి వచ్చిన నైజీరియేన్ ఘరానా స్మగ్లర్స్ డైవిన్ ఎబూకా సుజీ అలియాస్ ఎబూకా అలియాస్ లిబూకా అలియాస్ ఇమ్మాన్యుయల్ అలియాస్ లెవల్ నగరంలో పెద్ద నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసినట్లు తేలింది. అతని ద్వారానే ఎజియోనిలి ఫ్రాంక్లిన్ ఉచ్చెన్నా నగరానికి వచ్చి స్మగ్లింగ్ కార్యకలాపాలను చక్కబెట్టేవాడు. బెంగళూరులో పరిచయమైన నైజీరియన్ మహిళా స్మగ్లర్లు ఒనూహ బ్లెస్సింగ్ అలియాస్ జోయానాగోమ్స్ అలియాస్ జోను అతని వద్ద చేరి గోవా, ఢిల్లీ, బెంగళూరు తదితర ప్రాంతాల్లో డ్రగ్స్ సరఫరా చేసేది. హైదరాబాద్ నగరంలో పటిష్ఠమైన నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసిన తర్వాత ప్రధాన స్మగ్లర్ డైవిన్ ఎబూకా సుజీ తిరిగి నైజీరియాకు వెళ్లిపోయాడు. అప్పటి నుంచి పూర్తి స్మగ్లింగ్ బాధ్యతలు ఎజియోనిలి ఫ్రాంక్లిన్ ఉచ్చెన్నా అలియాస్ కలేషి తీసుకున్నాడు. నైజీరియా నుంచి ప్రధాన నిందితుడు కొకైన్ డ్రగ్స్‌ను సముద్రమార్గం గుండా ఢిల్లీకి చేరేలా సరుకు పంపేవాడు. సరుకు ఢిల్లీకి చేరిన తర్వాత బ్లెస్సింగ్ వెళ్లి తీసుకునేది. అక్కడి నుంచి ప్రధాన నిందితుని ఆదేశాల మేరకు హైదరాబాద్‌లో ఉన్న ఎజియోనిలి ఫ్రాంక్లిన్ ఉచ్చెన్నా అలియాస్ కలేషికి అందజేయడంతో పాటు ఇతర నగరాల్లోనూ సరఫరా చేసేదని పోలీసుల దర్యాప్తులో తేలింది. ఇదిలా ఉండగా.. హైదరాబాద్‌లోని టోలిచౌకి, సన్‌సిటీ, బండ్లగూడలో నైజీరియన్లు అప్పుడప్పుడు కలుసుకునేవారు. ఈ క్రమంలో ఉస్మానియా యూనివర్సిటీలో ఉన్నత చదువుల కోసం 2014లో నగరానికి వచ్చిన అజీజ్ నోహీమ్ అడెషోలాకు ఎజియోనిలి ఫ్రాంక్లిన్ ఉచ్చెన్నా అలియాస్ కలేషికి పరిచయం అయ్యాడు. అయితే, ఫేక్ డీడీ సమర్పించిన సమయంలో జైలుకెళ్లిన అజీజ్‌కు ఫ్రాంక్లిన్ ఉచ్చెన్నా సహాయం చేశాడు. అలా అతనితో స్నేహం కుదిరిన తర్వాత అతని సలహాతో స్మగ్లర్‌గా మారినట్లు తేలింది.

కేజీల కొద్ది కొకైన్ విక్రయం..

2017లో నగరానికి వచ్చిన ఎజియోనిలి ఫ్రాంక్లిన్ ఉచ్చెన్నా అలియాస్ కలేషి ఇప్పటి వరకు కేజీల కొద్ది కొకైన్ విక్రయించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఒక్క బ్లెస్సింగ్ మాత్రమే ఢిల్లీ నుంచి సరుకు డెలివరీ తీసుకున్న తర్వాత 25 నుంచి 30 సార్లు హైదరాబాద్‌కు వచ్చి సరుకు అందజేసి వెళ్లినట్లు తేలింది. ఈ ఎనిమిదేళ్లలో ఫ్రాంక్లిన్ కిలోల కొద్ది కొకైన్‌ను విక్రయించి రూ. కోట్లలో డబ్బులు సంపాదించినట్లు తేలింది. తన నెట్‌వర్క్‌లో భాగంగా ఇటీవల పెడ్లర్‌గా అవతారం ఎత్తిన అల్లం సత్యవెంకట గౌతమ్ కేవలం 7 నెలల్లోనే 2.6కేజీల కొకైన్ కస్టమర్స్‌కు సప్లై చేసి కమీషన్ రూపంలో రూ.13.24లక్షలు సంపాదించాడు. మరో నిందితుడు వరుణ్‌కుమార్ సత్యగౌతమ్ ద్వారా ఒక గ్రాము కొకైన్ రూ.8 వేల చొప్పున కొనుగోలు చేసి, నగరంలోని కస్టమర్స్‌కు రూ. 12వేలకు విక్రయించేవాడు. ఇలా 7 నెలల్లోనే వరుణ్‌కుమార్ రూ.6లక్షలు సంపాదించినట్లు పోలీసుల విచారణలో తేలింది. దీన్ని బట్టి ప్రధాన స్మగ్లర్స్ 8 ఏళ్లలో ఎంత సంపాదించారో అర్థం చేసుకోవచ్చని పోలీసులు పేర్కొన్నారు. ఇంత పెద్ద ఎత్తున 8 ఏళ్లుగా నగరంలో డ్రగ్స్ దందా నిర్వహిస్తున్నా.. ఇప్పటి వరకు నైజీరియన్ ఘరానా స్మగ్లర్స్ డైవిన్ ఎబూకా సుజీ, ఎజియోనిలి ఫ్రాంక్లిన్ ఉచ్చెన్నా పోలీసులకు చిక్కకపోవడం గమనార్హం. దాంతో ఎలాగైనా వారిని పట్టుకోవాలనే ఉద్దేశ్యంతో వారిపై రూ. 2లక్షల రివార్డును టీజీ న్యాబ్ అధికారులు ప్రకటించారు.



నైజీరియన్ స్మగ్లర్ ఎజియోనిలి ఫ్రాంక్లిన్ ఉచ్చెన్నా

అమన్ ప్రీత్‌సింగ్ కాంటాక్టులపై..

డ్రగ్స్ స్మగ్లర్స్‌తో పాటు... పోలీసులు 13 మంది వినియోగదారులను అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. వారిలో ప్రముఖ సినీనటి రకుల్ ప్రీత్‌సింగ్ తమ్ముడు అమన్ సింగ్ పోలీసులకు చిక్కాడు. డ్రగ్స్ తీసుకున్నట్లు తేలడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. అతని మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్న పోలీసులు కాంటాక్టులపై దృష్టి సారించారు. సీడీఆర్ తీసి ఎవరెవరితో కాంటాక్టులు ఉన్నాయి. డ్రగ్స్‌కు సంబంధించిన ఇండస్ట్రీలో ఎవరెవరితో లింకులు ఉన్నాయి..? ఎప్పటి నుంచి డ్రగ్స్ తీసుకుంటున్నాడు..? ఎవరి ద్వారా తీసుకుంటున్నాడు..? అనే కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు. ప్రస్తుతం బంజారా హిల్స్‌లోని లోటస్ పాండులో ఉంటూ.. ఇండస్ట్రీలో అవకాశాల కోసం చూస్తున్నట్లు తెలిసింది. ఈ క్రమంలోనే అతనికి డ్రగ్స్ అలవాటు అయినట్లు పోలీసుల విచారణలో తేలింది. ఇంకా పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని పేర్కొన్నారు. కాల్‌లిస్టు, వాట్సాప్ చాట్, ఇతర ఆన్‌లైన్ అప్లికేషన్స్‌ను పోలీసులు చెక్ చేస్తున్నట్లు తేలింది. అమన్‌తో పాటు.. డ్రగ్స్ వినియోగదారులు ఫిల్మ్‌నగర్‌కు చెందిన కిషన్ రాతి, బంజారాహిల్స్‌కు చెందిన అనికేత్, గచ్చిబౌలికి చెందిన యశ్వంత్, జూబ్లీహిల్స్‌కు చెందిన ఆలుగడ్డల రోహిత్, గండిపేటకు చెందిన శ్రీ చరణ్, బంజారాహిల్స్‌కు చెందిన ప్రసాద్, ఫిల్మ్‌నగర్‌కు చెందిన హృతిక్ కుమార్, పంజాగుట్టకు చెందిన నిఖిల్ దావన్, గచ్చిబౌలికి చెందిన మదురాజు, రఘు, కనుమూరి కృష్ణంరాజు, వెంకట సత్యనారాయణను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరందరి కాంటాక్టులు, కాల్‌లిస్టులు, డ్రగ్స్ లింకులపై ఆరా తీస్తున్నారు.

వివాహితపై రేప్ కేసులో నిందితుల అరెస్ట్

అత్యాచారానికి పాల్పడింది ఒక్కరే ● వివరాలు వెల్లడించిన డీసీపీ కోటిరెడ్డి

అల్వాల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): వివాహితపై అత్యాచారం కేసులో ప్రధాన నిందితుడితో పాటు సహకరించిన మరొకరిని అల్వాల్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మంగళవారం అల్వాల్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మేడ్చల్ జోన్ డీసీపీ కోటిరెడ్డి వివరాలను వెల్లడించారు. రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధికి చెందిన వివాహిత కుటుంబ కలహాల కారణంగా శుక్రవారం రాత్రి భర్తపై ఫిర్యాదు చేయడానికి అల్వాల్ పోలీస్‌స్టేషన్‌కు ఆటోలో వెళ్లింది. ఫిర్యాదు చేసిన అనంతరం అక్కడి నుంచి ఆటోలో లోతుకుంటలోని దుర్గాబార్ అండ్ రెస్టారెంట్ సమీపంలో ఆగింది. బార్‌లో ప్రతీరోజు మద్యం తాగడానికి రంగపాక సాయికిరణ్ అలియాస్ నాని(28), మహ్మద్ సలీం(40) ఆటో డ్రైవర్‌లు వస్తుంటారు. అదే సమయంలో ఆటోలో రెస్టారెంట్ వద్దకు వచ్చిన సదరు మహిళను చూసిన సాయికిరణ్ (ప్రధాన నిందితుడు) ఆమెను లోబర్చుకోవాలని నిర్ణయించుకున్నాడు. తోటి డ్రైవరైన మహ్మద్ సలీంకు సాయికిరణ్ తన ఉద్దేశాన్ని వివరించాడు. దీంతో సలీం సదరు మహిళతో మాట్లాడాడు. అనంతరం రంగపాక సాయికిరణ్ సదరు మహిళను ఆమె వచ్చిన ఆటో డ్రైవర్‌ను బెదిరించి అదే ఆటోలో ఎక్కించాడు. లోతుకుంట గణేశ్ టెంపుల్ ప్రాంతం సమీపంలో ఉన్న శ్మశాన వాటిక వద్ద ఉన్న నిర్మానుష్యప్రాంతానికి తీసుకెళ్లారు. అక్కడ ఆ మహిళకు బలవంతంగా మద్యం తాగించి అక్కడ ఉన్న బొలేరో వాహనంలోకి ఆమెను రంగపాక సాయికిరణ్ తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. అనంతరం అక్కడి నుంచి సాయికిరణ్ పారిపోయాడు. అక్కడి నుంచి అర్ధరాత్రి 12, 1గంటల సమయంలో రోడ్డు మీదకు వచ్చిన బాధిత మహిళ డయల్100కి ఫోన్ చేయడంతో బొల్లారం పోలీసులు అక్కడికి వచ్చారు. బాధిత మహిళ ఫిర్యాదు మేరకు బొల్లారం పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అనంతరం సంబంధిత ఎఫ్ఐఆర్‌ను అల్వాల్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. అల్వాల్ స్టేషన్ హౌజ్‌ఆఫీసర్ రాహుల్‌దేవ్ డీఐ రాజేందర్‌గౌడ్ సాంకేతిక ఆధారాలు సేకరించి ప్రధాన నిందితుడితో పాటు సహకరించిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు డీసీపీ కోటిరెడ్డి వివరించారు.

ఆశ చూపి.. నిలువునా ముంచేసి..



సైబర్ నేరగాళ్లు రోజుకో కొత్తరకం మోసంతో నగరవాసుల నుంచి లక్షలు, కోట్లలో దోచేస్తున్నారు. దీంతో సిటీ సైబర్ క్రైమ్ పోలీసుల వద్దకు బాధితులు క్యూ కడుతున్నారు.

రిటైర్డ్ ఉద్యోగికి రూ.45.78 లక్షలకు టోకరా

● సహకరించిన వ్యక్తి అరెస్ట్

హైదరాబాద్ సిటీ, జూలై 16 (ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన రిటైర్డ్ ఉద్యోగి నుంచి రూ. 45.78 లక్షలు కొల్లగొట్టిన కేసులో రాజస్థాన్‌కు చెందిన నిందితున్ని సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం డీసీపీ కవిత కేసు వివరాలు వెల్లడించారు. నగరానికి చెందిన రిటైర్డ్ ఉద్యోగి షబ్బం భక్షికి గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేశాడు. పంజాబ్ నేషనల్ బ్యాంకు మెట్‌లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ నుంచి మాట్లాడుతున్నాను అంటూ పరిచయం చేసుకున్నాడు. ఆయన పాలసీకి సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడించాడు. 'మీ పాలసీ టాప్ ఆప్ ప్రీ మెచ్యూర్డ్ సెటిల్‌మెంట్ చేస్తున్నాము. దాంతో మీకు రూ.కోట్లలో డబ్బు చేతికి అందుతుంది' అని నమ్మించాడు. అందుకు బాధితుడు సరే అనడంతో స్టాంప్ పేపర్స్, స్టేట్ ట్యాక్స్, సెంట్రల్ ట్యాక్స్, ప్రభుత్వ చార్జీల పేరుతో విడతల వారీగా మొత్తం రూ. 45,78,760లు కొల్లగొట్టారు. అయినా ఇంకా డబ్బులు డిమాండ్ చేయడంతో అనుమానం వచ్చిన బాధితుడు సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రంగంలోకి దిగిన పోలీసులు రాజస్థాన్‌కు చెందిన తరుణ్ సచ్‌దేవా ఖాతాలో డబ్బులు పడినట్లు గుర్తించి అతన్ని అరెస్టు చేశారు. అయితే, అసలు సైబర్ నేరగాళ్లు వేరే ఉన్నారని, వారికి అవసరమైన బ్యాంకు ఖాతాలు మాత్రమే కమిషన్ తీసుకొని తాను సప్లై చేస్తుంటానని నిందితుడు పోలీసులకు తెలిపాడు. దాంతో అతన్ని అరెస్టు చేశారు. అసలైన సైబర్ నేరగాళ్లు ఢిల్లీకి చెందిన సత్పాల్ సింగ్, అభిషేక్, ఆశిష్ ముఠాగా గుర్తించారు. త్వరలోనే వారిని అరెస్టు చేస్తామని డీసీపీ తెలిపారు.

డేటింగ్ పేరుతో చీటింగ్ లక్షల్లో డబ్బులు వసూళ్లు

● నంద్యాల యువకుడి అరెస్టు

హైదరాబాద్ సిటీ, జూలై 16(ఆంధ్రజ్యోతి): డేటింగ్ యాప్‌లలో చాటింగ్ చేస్తూ... యువతులను చీటింగ్ చేస్తున్న యువకుడిని సైబరాబాద్ సైబర్ క్రైం పోలీసులు అరెస్టు చేశారు. నంద్యాల జిల్లా, సంజమల మండలానికి చెందిన చిన్నిరెడ్డి శ్రీనాథ్‌రెడ్డి (23) తనను తాను గూగుల్ లాంటి పెద్ద కంపెనీల్లో యాప్ డెవలపర్‌గా పరిచయం చేసుకుంటాడు. టిండర్, నీతో వంటి యాపుల్లో నకిలీ ఐడీలు సృష్టించి పెళ్లి సంబంధాలు చూస్తున్నట్లు నటిస్తాడు. అమాయక యువతులను ఎంచుకుని వారికి ఫొటోలు పంపించి, చాటింగ్ చేస్తాడు. వారిని పూర్తిగా నమ్మించిన తరువాత డ్రామా స్టార్ట్ చేస్తాడు. 'నా కుటుంబానికి ఆపద వచ్చింది... సమయానికి నా బ్యాంకు ఖాతా హ్యాక్ అయింది' అంటూ చెప్పిన కారణం చెప్పకుండా యువతులను డబ్బులు అడుగుతాడు. 2-3 రోజుల్లో తిరిగి ఇచ్చేస్తానంటూ నమ్మిస్తాడు. ఎటుతిరిగీ పెళ్లి చేసుకుంటున్నాం కదా అని నమ్మే యువతులు అతను చెప్పినట్లు డబ్బులు పంపిస్తుంటారు. ఇలా పలువురిని మోసం చేశాడు.

తెరపైకి వచ్చిన మోసం

సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో నివసించే ఓ యువతి అతని మాటలకు మోసపోయింది. సందీప్, సన్ని పేర్లతో టిండర్, నీతో యాప్‌లలో పరిచయం అయిన ఈ మోసగాడు చెప్పిన కట్టు కథలు ఆమె నమ్మింది. అతను అత్యవసరమన్న ప్రతిసారీ డబ్బులు పంపించింది. అలా మొత్తం రూ.6.42 లక్షలు సమర్పించుకుంది. లక్షల్లో సొమ్ములు నొక్కేసిన తరువాత అతన్నుంచి మాటల్లేవు. మాట్లాడుకోవడాలూ లేవు. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. నిందితుడిని గుర్తించిన పోలీసులు అరెస్టు చేశారు. ఓ మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. రిమాండ్‌కు పంపించారు. కాజేసిన సొమ్ముతో ఆన్‌లైన్ వీడియో గేమ్స్ ఆడుతుండని ఖాకీల విచారణలో తెలిసింది.

రెండు నెలల్లో రూ. 3.41కోట్లు దోపిడీ

● తాజాగా నగర వ్యాపారి నుంచి రూ. 1.23కోట్లు దోచేసిన వైనం

హైదరాబాద్ సిటీ, జూలై 16(ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో ఇన్వెస్ట్‌మెంట్ చేస్తే.. 50 శాతం లాభాలు వస్తాయంటూ.. బురిడీ కొట్టించి అమాయకులను అడ్డంగా దోచేస్తున్న రాజస్థాన్ సైబర్ నేరగాడిని సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. అతన్ని విచారించిన క్రమంలో సైబర్ నేరాల ద్వారా కేవలం రెండు నెలల్లోనే రూ. 3.41 కోట్లు కొల్లగొట్టినట్లు పోలీసులు గుర్తించారు. కాగా.. నగరానికి చెందిన వ్యాపారి నుంచి రూ. 1.23కోట్లు కొల్లగొట్టిన కేసులో నిందితున్ని అరెస్టు చేసినట్లు డీసీపీ కవిత తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. నగరానికి చెందిన వ్యాపారి వికాస్ అగర్వాల్‌కు వాట్సాప్‌లో ఒక మెసేజ్ వచ్చింది. ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో పెట్టుబడి పెడితే 50 శాతం లాభాలు ఇస్తామని లింకు పంపారు. లింక్ ఓపెన్ చేసి వివరాలు నమోదు చేయగానే అలియాన్స్ ఇన్వెస్టర్స్ క్లబ్ 449 గ్రూపులో అగర్వాల్‌ను యాడ్ చేశారు. ప్రారంభంలో రూ.5లక్షలు పెట్టుబడి పెడితే 50 శాతం లాభాలు వస్తాయని నమ్మించాడు. అలా పెట్టుబడి పెట్టిన తర్వాత వచ్చిన లాభాలకు విత్‌డ్రా అప్షన్ కల్పించారు. అలా ముగ్గులోకి దింపిన సైబర్ క్రిమినల్స్ లాభాల ఆశ చూపించి విడతలవారీగా రూ, 1,23,14,500 పెట్టుబడి పెట్టించారు. ఆ తర్వాత విత్‌డ్రా ఆప్షన్ తొలగించారు. దాంతో మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు సిటీ సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసిన పోలీసులు సాంకేతిక ఆధారాలు సేకరించి రాజస్థాన్‌కు చెందిన యస్ దూదిని అరెస్టు చేశారు. అతన్ని విచారించిన క్రమంలో ఈ సైబర్ క్రైమ్‌లో జైపూర్‌కు చెందిన మోహిత్‌గెట్, ఆదిత్య దయాల్ ప్రధాన నిందితులుగా తేలింది. ఈ ముగ్గురు కలిసి కేవలం 2 నెలల వ్యవధిలోనే సైబర్ నేరాల ద్వారా రూ.3.41కోట్లు కొల్లగొట్టినట్లు పోలీసులు గుర్తించారు. మిగిలిన నిందితుల కోసం గాలిస్తున్నామని డీసీపీ కవిత తెలిపారు.

ఉద్యోగాల పేరిట టోకరా.. సీతయ్య అరెస్ట్

హైదరాబాద్ సిటీ, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగాల పేరిట వరుస మోసాలకు పాల్పడుతున్న ఓ వ్యక్తిని సైబరాబాద్ సైబర్ క్రైం పోలీసులు అరెస్టు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసిన పోలీసులు ఎట్టకేలకు నిందితున్ని గుర్తించారు. ఎన్‌టీఆర్ జిల్లా, నందిగామ ప్రాంతానికి చెందిన కిలారు సీతయ్య (35)ను అరెస్టు చేశారు. అతన్ని విచారించగా హైదరాబాద్, సైబరాబాద్ కమిషనరేట్ల పరిధిలో పలువురిని మోసం చేసినట్లు ఒప్పుకున్నాడు. అతని అరెస్టుతో రెండు కమిషనరేట్లలో నమోదైన 7కేసులకు సంబంధించిన చిక్కుముడి వీడింది.

ఇలా మోసం చేస్తాడు..

ఎన్‌టీఆర్ జిల్లా, నందిగామ ప్రాంతానికి చెందిన కిలారు సీతయ్య తనను తాను ఎరిక్‌సన్ గ్లోబల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో సీనియర్ ఉద్యోగిగా పరిచయం చేసుకుంటాడు. నౌకరీ.కామ్, లింకెడిన్ లాంటి యాప్‌లలో నిరుద్యోగుల నంబర్లను సేకరించి.. తన సంస్థలో ఉద్యోగాలున్నాయంటూ ప్రచారం కల్పిస్తాడు. నమ్మి వచ్చిన వారికి పెయిడ్ సర్వీస్ అని కొంత మొత్తంలో తీసుకుంటాడు. ఆ తర్వాత వారికి ఓ నకిలీ ఆఫర్ లెటర్ పంపించి భారీగా డబ్బులు సేకరిస్తాడు. నగరంలో పలువురిని మోసం చేసిన కిలారు సీతయ్యపై పోలీసులకు 7ఫిర్యాదులు అందాయి. వారి నుంచి రూ.5.65 లక్షలు కాజేసిన సీతయ్య ఆ డబ్బును స్టాక్ మార్కెట్‌లో, ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో గేమ్స్ ఆడుతుంటాడని పోలీసులు తెలిపారు. అతని వద్ద నుంచి ఓ ల్యాప్‌టాప్, ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు సైబర్‌క్రైం పోలీసులు తెలిపారు.

దోమలు బాబోయ్.. దోమలు

(5వ పేజీ తరువాయి)

ఆరోపణలున్నాయి. గతంలో ఖైరతాబాద్, చార్మినార్ జోన్లలో ఈ తరహా అక్రమాలను ఉన్నతాధికారులు గుర్తించారు.

మురుగునీరు, గుర్రపు డెక్క..

నగరంలోని మెజార్టీ చెరువులు, కుంటల్లో మురుగునీరు చేరుతోంది. దీంతో గుర్రపుడెక్క పెరిగి దోమలు వృద్ధి చెందుతున్నాయి. రూ.లక్షలు వెచ్చించి గుర్రపు డెక్కను తొలగించినా.. యేడాదిలోపు తిరిగి యథాస్థితి. నేరుగా మురుగునీరు చెరువుల్లోకి చేరుతుండడమూ దోమల తీవ్రతకు ప్రధాన కారణం. దీంతో చెరువులు, నాలాల పక్కనుండే ప్రాంతాల్లో దోమకారక వ్యాధుల నమోదు పెరుగుతోంది. రోడ్ల పక్కన చెత్తా చెదారం, మురుగునీటి నిల్వతో అపరిశుభ్ర వాతావరణం నెలకొంటోంది. ఇది కూడా దోమల వ్యాప్తికి దారి తీస్తోంది.

నిర్లక్ష్యం.. పొంచి ఉన్న ముప్పు

2021, 22తో పోలిస్తే ఈ సంవత్సరం డెంగీ కేసుల తీవ్రత అధికంగా కనిపిస్తోంది. ఇందుకు క్షేత్రస్థాయిలో దుస్థితి కారణమన్న అభిప్రాయం వ్యక్తమవుతున్నది. ఈ నేపథ్యంలో నివారణ చర్యలను ముమ్మరం చేయాల్సిన ఎంటమాలజీ విభాగం.. గతేడాది కంటే తక్కువ కేసులే ఉన్నాయంటూ నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నది. బస్తీ దవాఖానాలు, ఫీవర్, నిలోఫర్, గాంధీ, ఉస్మానియాతో సహా పలు ప్రైవేట్ ఆస్పత్రుల్లో నమోదవుతోన్న డెంగీ కేసుల వివరాలను మాత్రమే జీహెచ్‌ఎంసీ పరిగణనలోకి తీసుకుంటోంది. అధికారుల దృష్టికి రాని కేసులు వందల్లో ఉంటుండడం గమనార్హం.

దోమల నివారణ చర్యలిలా..

- ● కాలనీలు, బస్తీల్లో నిర్వహించే ఏఎల్‌ఓలో టిమోపాస్ ద్రావకం వినియోగిస్తున్నారు. పది లీటర్ల నీటిలో ఐదు మిల్లీలీటర్ల టిమోపాస్ కలపాలి.
- ● నాలాలు, చెరువులు, మురుగు కాలువల వెంట మస్కిల్ లార్విసైడ్ ఆయిల్ (ఎంఎల్‌ఓ) పిచికారి చేయాలి. పలు ప్రాంతాల్లో బాల్స్ కూడా వేస్తారు.
- ● డెంగీ కేసులు నమోదైన చోట పైరిథ్రామ్ వినియోగిస్తున్నారు. డీజిల్‌లో కలిపి స్పేస్ స్ప్రే చేయాలి.
- ● పౌరులకు ఇబ్బంది లేకుండా ఇంటి లోపల అల్ఫో సైపర్ మెథ్రిన్ పౌడర్‌ను నీటిలో కలిపి పిచికారి చేస్తున్నారు. 10లీటర్ల నీటిలో 250గ్రాముల పౌడర్ కలపాలి.
- ● ఫాగింగ్ కోసం మలాథిన్ టెక్నికల్‌ను ప్రస్తుతం వినియోగిస్తున్నారు. 19 లీటర్ల డీజిల్‌లో లీటర్ మలాథిన్ కలిపి ఫాగింగ్ చేయాలి.

ఈ ప్రాంతాల్లో..

- ● ఐఎస్‌సదన్ డివిజన్ సింగరేణి కాలనీ, సరస్వతీనగర్, సింగరేణి గుడిసెలు, వాంబేకాలనీ, పూర్ణోదయ కాలనీ, వాణినగర్‌లో ఎంఎల్‌ఓ, ఫాగింగ్ ప్రక్రియను సక్రమంగా చేయడం లేదు.
- ● మురికి కూపంగా మారిన సరూర్‌నగర్, ఎర్రగుంట చెరువుల్లో దోమల తీవ్రత పెరిగింది. ఆయిల్‌బాల్స్, ఏఎల్‌ఓ పనులను మొక్కుబడిగా చేస్తున్నారు.
- ● అల్లాపూర్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో ఇటీవల ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పర్యటించారు. దోమల తీవ్రత ఎక్కువగా ఉందని స్థానికులు ఫిర్యాదు చేయడంతో విషయాన్ని ఆయన సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. మరునాడు ఏఎల్‌ఓ, ఫాగింగ్ చేసిన అధికారులు తరువాత పట్టించుకోవడం లేదు.
- ● హయత్‌నగర్ డివిజన్‌లోని బంజారాకాలనీ, పద్మావతి కాలనీ, కట్టమైసమ్మకాలనీ, వెంకటాద్రినగర్ కాలనీలు, రాంనగర్, పార్శీగుట్ట ప్రాంతాల్లో దోమలు విపరీతంగా ఉన్నాయి. నెల రోజులుగా బంజారాకాలనీ, పద్మావతి కాలనీల్లో ఏఎల్‌ఓ నిర్వహించలేదని స్థానికులు చెబుతున్నారు.
- ● గాయత్రీపురం, సత్యానగర్, మోహన్‌నగర్ రాజీవ్‌గాంధీనగర్, కొత్తపేట విలేజ్, భరత్‌నగర్, సమతాపురి, స్నేహపురి కాలనీల్లో గతంలోలా ఏఎల్‌ఓ నిర్వహించడం లేదు.
- ● బన్సీలాల్‌పేటలోని సీసీ నగర్, హమాల్‌బస్తీ, ఐడీహెచ్ కాలనీల్లో రోడ్ల పక్కన చెత్త పేరుకుపోయింది. పబ్లిక్ టాయిలెట్ల వద్ద మురుగు నీరు నిలిచి దోమలు వృద్ధి చెందుతున్నాయి.
- ● అంబర్‌పేట చెన్నారెడ్డినగర్, బాపూనగర్, పటేల్‌నగర్ తదితర ప్రాంతాల్లో దోమల నివారణ చర్యలు అంతంత మాత్రమే. రోడ్లపై వర్షపు నీరు రోజుల తరబడి నిలిచినా పట్టించుకునే వారు లేరు.
- ● లంగర్‌హౌస్‌లోని ప్రశాంత్‌నగర్, జానకీనగర్, బాపూఘాట్, సాయిబాబా కాలనీ, వినాయక్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఇటీవల దోమల తీవ్రత పెరిగింది.
- ● శేరిలింగంపల్లిలోని తారానగర్, హుడా ట్రేడ్ సెంటర్, పాపిరెడ్డి కాలనీ, ఆదర్శనగర్, గోపీనగర్, నెహ్రూనగర్, డోయన్స్ కాలనీ, గుల్‌మొహర్ పార్కు, నల్లగండ్ల తదితర ప్రాంతాల్లో దోమలు అధికంగా ఉన్నాయి.

కష్టంగా మారిన వ్యాధి నిర్ధారణ

(5వ పేజీ తరువాయి)

సబ్ యూనిట్లకు వస్తాయి. అక్కడ ల్యాబ్‌టెక్నీషియన్లు లేకపోతే డెంగీ, మలేరియా, చికున్‌గున్యా వంటి వ్యాధులను గుర్తించడం కష్టమవుతుంది. ప్రస్తుతం ల్యాబ్‌టెక్నీషియన్ల కొరత ఉంది. డీఎం అండ్‌హెచ్‌ఓ పరిధిలో 17మంది ల్యాబ్‌టెక్నీషియన్లు ఉండగా అన్ని పోస్టుల్లో శాశ్వత సిబ్బందిని భర్తీ చేయలేదు. దీంతో కాంట్రాక్ట్ సిబ్బందిపైనే ఆధారపడుతున్నారు.

హెల్త్ అసిస్టెంట్ల కొరత

డీఎంఅండ్‌హెచ్‌ఓ పరిధిలో హెల్త్ అసిస్టెంట్ల కొరత తీవ్రంగా ఉంది. జిల్లా వైద్య,ఆరోగ్య శాఖలో 107 మంది హెల్త్ అసిస్టెంట్లు ఉండాలి. కానీ ప్రస్తుతం రెగ్యులర్ సిబ్బంది లేకపోవడంతో కాంట్రాక్ట్ పద్ధతిలో వారిని నియమించారు. వ్యాధులపై అవగాహన పెంచడానికి, శిబిరాల్లో రక్త నమూనాల సేకరణ సమయంలో హెల్త్ అసిస్టెంట్ల అవసరం ఉంటుంది. ముఖ్యంగా కలరా, డెంగీ, మలేరియా, వైరల్ జ్వరాల నియంత్రణకు ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాల్సి ఉంటుంది. ఇంటింటికి వెళ్లి ప్రజలకు రోగాలపై అవగాహన కల్పిస్తూ కరపత్రాలు పంపిణీ చేయాలి. వైద్య శిబిరాలు నిర్వహించి ఆరోగ్య పరీక్షలు చేయాలి. కానీ తగినంత సిబ్బంది లేకపోవడంతో అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం లేదు.

ఎస్ఐ, ఏఎస్ఐ, ఇద్దరు కానిస్టేబుళ్ల సస్పెన్షన్

(5వ పేజీ తరువాయి)

ఎస్ఐని, కానిస్టేబుళ్లను పిలిపించి విచారించగా ఎలాంటి కేసు నమోదు చేయలేదని తెలిసింది. దీనిపై ఉన్నతాధికారులు విచారణ జరిపి కమిషనర్‌కు రిపోర్టును అందజేశారు. దీంతో ఎస్ఐని, ఇద్దరు కానిస్టేబుళ్లను సస్పెండ్ చేస్తూ సీపీ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే ఈ కేసులో బాధితుడు ఫిర్యాదు చేసేందుకు ముందుకు రాలేదు. ఉన్నతాధికారులకు సమాచారం అందించి చేతులు దులుపుకొన్నాడు. మెడికల్‌షాప్ నిర్వాహకుడిని సుల్తాన్‌బజార్ నుంచి తీసుకొస్తున్న సమయంలో అతడు అపస్మారక స్థితిలో ఉన్నట్లు బాధితుడి కుటుంబ సభ్యులు తెలిపారు.

దేశంలో అతిపెద్ద ఎస్టీపీగా నాగోల్

(5వ పేజీ తరువాయి)

నిర్మించడంతో పాటు మరో మూడు ప్రాంతాల్లో నాలుగు ఎస్టీపీలు మూసీనది వెంట రూ.1297కోట్లతో నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఇందులో రూ.908కోట్లు నిర్మాణం కోసం కాగా, మిగిలిన రూ.389కోట్లు తదుపరి 15ఏళ్లకు ఎస్టీపీల నిర్వహణకు వ్యయం చేయనున్నట్లు తెలిపారు. నాగోల్, కోకాపేట, మీర్ ఆలంలో గల ఎస్టీపీలు నిర్మాణం పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేసినట్లు తెలిపారు. అత్తాపూర్‌లో రెండు ఎస్టీపీల పనులు పురోగతిలో ఉన్నాయని చెప్పారు. హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ కింద చేపడుతున్న ఈ పనులకు ప్రభుత్వం 40శాతం చెల్లింపులు చేయగా, మిగతా 60శాతం విడుతల వారీగా తమకు చెల్లింపులు చేస్తుందని వివరించారు. ఈ ప్రాజెక్టును సీక్వెన్సింగ్ బ్యాచ్ రియాక్టర్ టెక్నాలజీతో నిర్మించామని, ఇది ప్లాంట్ ఏర్పాటుకు అవసరమైన ఫుట్ ప్రింట్‌ను గణనీయంగా తగ్గించటంతో పాటుగా విద్యుత్ వినియోగాన్ని తగ్గిస్తుందని వివరించారు.

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
బుధవారం • 17 జూలై 2024

యువర్ ఆనర్

పెళ్లి తరువాత భర్త ఇంటి పేరు జత అవుతుంది... సహజమే. కానీ ఆ పేరుతోనే తనను పిలుస్తానంటే ఒప్పుకోనంటోంది తహీరా కశ్యప్ ఖురానా. బాలీవుడ్ హీరో ఆయుష్మాన్ ఖురానా సతీమణి అయిన ఆమె... ఇటీవల విడుదలైన 'శర్మాజీకీ బేటీ'తో తొలిసారి ఓ చిత్రానికి దర్శకత్వం వహించింది. ఈ సందర్భంగా 'మిసెస్ ఖురానా'గా తనను సంబోధించడంపై అభ్యంతరం తెలిపిన ఆమె... 'నన్ను నన్నుగా గుర్తించండి' అంటూ అసహనం వ్యక్తం చేసింది.



నేను మిసెస్ ఖురానా ...కాదు

"ఆయుష్మాన్ భార్య సినిమా చేసింది' అని ఎందుకు రాస్తున్నారు? 'శర్మాజీ కీ బేటీ' చిత్రం నా కష్టానికి ఫలితం. కథ నాదే. దర్శకత్వం వహించిందీ నేనే. ఆయుష్మాన్ నా భర్త అన్నది తప్ప... తనకు ఈ సినిమాతో ఏ విధమైన సంబంధం లేదు' అంటూ సినిమా ప్రచార కార్యక్రమంలో ఒకింత ఆవేదన వ్యక్తం చేసింది తహీరా కశ్యప్. 'అయినా పేరు చివరన ఈ తోకలు ఎందుకని ప్రశ్నించింది. ఆయుష్మాన్, తహీరా చిన్ననాటి స్నేహితులు. చదువుకొనే రోజుల నుంచీ వారి స్నేహం... ప్రేమగా వికసించింది. కొన్నేళ్ల సాన్నిహిత్యం తరువాత 2008లో ఇరువురూ వివాహ బంధంతో ఒక్కటయ్యారు. బాలీవుడ్‌లోని ముచ్చటైన జంటల్లో వీరిది ఒకటిగా చెప్పుకొంటారు. ఇప్పటికీ ఒకరంటే ఒకరికి తరగని ప్రేమ. నమ్మకం. వీరికి ఒక అబ్బాయి... ఒక అమ్మాయి.

'భగవంతుడి దయవల్ల మా ఇద్దరి మధ్య చాలా విషయాల్లో సారూప్యతలు ఉన్నాయి. కలిసి వాటిని ఆస్వాదిస్తాం. వయసుతోపాటు పరిణతి కూడా సహజం. దానివల్ల మన ఆసక్తులు, ఆలోచనల్లో మార్పులు సంభవించడం కూడా అంతే సహజం. ఒకరి అభిప్రాయాలను ఒకరు గౌరవించుకొంటూ ప్రేమగా సాగిపోతున్నాం. అదే మా బంధానికి బలమైన పునాది. ఇది వ్యక్తిగత జీవితం. కానీ వృత్తిగతంగా ఎవరి కష్టం వారిది' అంటుందామె.

అయితే తాను సినీ రంగం వైపు రావడానికి కారణం తన నిజజీవిత కథానాయకుడు ఆయుష్మాన్ కాదంటుంది తహీరా. కాలేజీ రోజుల్లో ఇద్దరూ కలిసి థియేటర్ వర్క్‌షాపుల్లో పాల్గొనేవారు. కొన్ని నాటకాలు కూడా వేశారు. ఒకరితో ఒకరు పోటీపడేవారు. ఆ నేపథ్యమే తనను సినిమా నిర్మాణం వైపు నడిపించిందంటోంది ఆమె.

మొహాలీలోని 'యాదవీంద్ర పబ్లిక్ స్కూల్‌లో పాఠశాల విద్యాభ్యాసం పూర్తి చేసిన తహీరా... చండీఘడ్‌లోని 'పంజాబ్ విశ్వవిద్యాలయం' నుంచి జర్నలిజమ్ అండ్ మాస్ కమ్యూనికేషన్స్‌లో డిగ్రీ చదివింది. అదే యూనివర్సిటీ నుంచి



మాస్‌కమ్యూనికేషన్‌లో మాస్టర్స్ చేసింది. ముంబయి వెళ్లి 'బిగ్ 92.7 ఎఫ్‌ఎం'లో ప్రోగ్రామింగ్ హెడ్‌గా కెరీర్ ప్రారంభించింది. కొంత కాలం 'మిథిబాయి కాలేజీ'లో ప్రొఫెసర్‌గా మాస్ కమ్యూనికేషన్స్ పాఠాలు చెప్పింది. తరువాత అన్నిటినీ వదిలేసి రచన వైపు మళ్లింది. 2011లో 'ఐ ప్రామిస్' అనే పుస్తకం రాసింది. అది మొదలు 'సోల్డ్ అవుట్, క్రాకింగ్ ద కోడ్, 12 కమాండ్‌మెంట్స్ బీయింగ్ ద ఉమన్' తదితర పుస్తకాలు రాసి, రచయితగా పేరు తెచ్చుకుంది. అంతటితో ఆమె ఆగలేదు. 2017లో 'టోఫీ' అనే షార్ట్ ఫిలిమ్ తీసి దర్శకురాలయింది తహీరా. 2020లో 'జిందగీ ఇన్‌షార్ట్'తో పాటు మరో

> "ఆఖరికి రివ్యూల్లో కూడా నన్ను 'దర్శకురాలు ఆయుష్మాన్ భార్య తహీరా' అంటూ రాశారు. నన్ను నన్నుగా ఎందుకు చూడరు? నేను తహీరా... తహీరా కశ్యప్. తహీరా ఖురానా లేదా మిసెస్ ఖురానా కాదు."

లఘుచిత్రం చేసింది.

ఇక తొలిసారి ఆమె రచించి, దర్శకత్వం వహించిన చలనచిత్రం 'శర్మాజీ కీ బేటీ'. ఈమధ్యనే ఓటీటీలో విడుదలైంది. మొదటి సినిమాతోనే ఆకట్టుకున్న తహీరా పనితనానికి ఎన్నో ప్రశంసలు అందుతున్నాయి.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలోనే తనను 'మిసెస్ ఖురానా'గా పేర్కొనడంపై ఆవేదన వ్యక్తం చేసింది.

"ఆఖరికి రివ్యూల్లో కూడా నన్ను 'దర్శకురాలు ఆయుష్మాన్ భార్య తహీరా' అంటూ రాశారు. నన్ను నన్నుగా ఎందుకు చూడరు? నేను తహీరా... తహీరా కశ్యప్. తహీరా ఖురానా లేదా మిసెస్ ఖురానా కాదు. ఒకప్పుడు ఇలాంటివి చూసి బాధపడేదాన్ని. కానీ ఇప్పుడు వాటన్నిటినీ దాటి, ఒక మహిళగా స్వయంశక్తితో నన్ను నేను అభివృద్ధి చేసుకొనేందుకు ప్రయత్నిస్తున్నాను. ఎవరు ఎలా సంబోధించినా పట్టించుకోదలుచుకోలేదు' అంటుంది తహీరా. కాగా, ఆమె చిత్రం పోస్టర్‌ను తన ఇన్‌స్టాలో షేర్ చేసిన ఆయుష్మాన్... తనను తాను 'తహీరా భర్త' అంటూ రాసుకున్నాడు. తద్వారా తన జీవిత భాగస్వామికి తగిన గౌరవం ఇచ్చాడు.

ఎప్పుడూ ఉల్లాసంగా, సంతోషంగా సాగిపోయే తహీరా జీవితాన్ని 2018లో బ్రెస్ట్ కేన్సర్ కుదిపేసింది. కానీ దాన్ని ధైర్యంగా ఎదుర్కొంది. ఆ మహమ్మారిని జయించింది. గత ఫిబ్రవరిలో ప్రపంచ కేన్సర్ దినం సందర్భంగా తహీరా పోరాటాన్ని అభిమానులతో పంచుకున్నాడు. 'ధీశాలి' అంటూ అభివర్ణించాడు.

'ద 12 కమాండ్‌మెంట్స్ ఆఫ్ బీయింగ్ ఏ ఉమన్' పుస్తకంలో కేన్సర్‌తో తాను ఎలా పోరాడిందీ వివరించింది తహీరా. తద్వారా కేన్సర్ బాధితుల్లో స్ఫూర్తి నింపేందుకే ఆ పుస్తకం రాసినట్టు ఓ సందర్భంలో చెప్పుకొచ్చిన తహీరా... జీవితంలో తనకంటూ ఒక ప్రత్యేకత ఉండాలని తపించేవారిలో ముందుంటుంది. •



న్యూస్ మేకర్

అగ్రరాజ్యం అమెరికా ఉపాధ్యక్ష పదవి అభ్యర్థిగా డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన జె.డి వ్యాన్స్ అర్ధాంగి, ఉష చిలుకూరి మన తెలుగమ్మాయే! వృత్తిపరంగా లాయర్ అయిన ఉష గురించి, భర్త జె.డి వ్యాన్స్ రాజకీయ ఎదుగుదల వెనకున్న ఆవిడ ప్రమేయం గురించి తెలుసుకుందాం!

అమెరికాలో ఉషోదయం

మాజీ అమెరికా అధ్యక్షుడు, డొనాల్డ్ ట్రంప్, ఓహియో సెనేటర్, జెడి వ్యాన్స్‌ను, నవంబరులో జరగబోయే అధ్యక్ష ఎన్నికల్లో ఉపాధ్యక్ష పదవికి అభ్యర్థిగా ప్రకటించడంతో, అందరి దృష్టి ఆయన సతీమణి ఉష చిలుకూరి మీదకు మళ్లింది. ఒకవేళ ఎన్నికల్లో ట్రంప్ గెలిస్తే, జెడి వ్యాన్స్ అమెరికా ఉపాధ్యక్షుడిగా ఎన్నికవుతాడు. 39 ఏళ్ల వ్యాన్స్ ఆంధ్రప్రదేశ్, కృష్ణా జిల్లా, పామర్రుకు చెందిన ఉష చిలుకూరిని, 2014లో పెళ్లి చేసుకున్నాడు. ఉష తండ్రి డాక్టర్, తల్లి గృహిణి. ట్రయల్ లాయర్, జ్యుడీషియల్ క్లర్క్ అయిన ఉష, వ్యాన్స్ రాజకీయ జీవితంలో కీలక పాత్ర పోషించడమే కాకుండా, సామాజిక కార్యక్రమాల్లో కూడా చురుకైన పాత్రను పోషించడం విశేషం.

లా స్కూల్‌లో లవ్

క్యాలిఫోర్నియాలోని శాండియాగోలో పెరిగిన ఉష, ఏల్ జోర్నల్ ఆఫ్ లా అండ్ టెక్నాలజీకి మేనేజింగ్ ఎడిటర్‌గా, ఏల్ లా జోర్నల్‌కు డెవలప్‌మెంట్ ఎడిటర్‌గా పని చేసింది. ఏల్ లా స్కూల్‌లో విద్యను అభ్యసించే సమయంలోనే వ్యాన్స్‌కూ, ఉషకూ పరిచయం ఏర్పడింది. తర్వాత 2014లో, కెంటకీలో వాళ్లిద్దరూ పెళ్లితో ఒక్కటయ్యారు. వీళ్లకు ముగ్గురు పిల్లలు. సెనేటర్ జెడి వ్యాన్స్ తన విజయంలో భార్య ఉష పాత్ర గురించి ఎన్నో సందర్భాల్లో కొనియాడుతూ ఉంటారు. 2016లో రాసిన తన మెమొయిర్, హిల్‌బిల్లీ ఎలిజీలో, జెడి వ్యాన్స్ తన భార్య గురించి వివరిస్తూ, ఆవిడను... "సెల్ఫ్ స్పిరిట్ గైడ్" అని పేర్కొనడం విశేషం. 'నేను ఎలా ప్రశ్నించాలో తెలియని ప్రశ్నలను ఆవిడ వెంటనే అర్థం చేసుకోగలుగుతుంది. అవకాశాలను అందిపుచ్చుకోవడంలో ఆవిడ నన్నెంతో ప్రోత్సహిస్తూ ఉంటుంది' అని రాసుకున్నారాయన.

ఆధ్యాత్మిక ప్రయాణంలో అండగా...

తన ఆధ్యాత్మిక, వృత్తి జీవితాల మీద ఉష ప్రభావం ఎంతో ఉందని జెడి వ్యాన్స్ కొన్ని ఇంటర్వ్యూల్లో స్పష్టం చేశాడు. ఒక సందర్భంలో వ్యాన్స్ మాట్లాడుతూ... 'నేను దేవుడిని నమ్మేవాడిని. కానీ నేనెలాంటి మతానికి చెందను. అప్పుడప్పుడూ ఇవాంజెలికల్ చర్చ్‌కు వెళ్తూ ఉండేవాడిని. కానీ 2010లో ఏల్‌లో అడుగు పెట్టినప్పుడు, నేను చర్చికి, దేవుడికీ దూరమయ్యాను. నిజానికి నన్ను నేను నాస్తికుడిగా చెప్పుకునేవాడిని. కానీ ఏల్‌లో ఉషను కలిసిన తర్వాత, తిరిగి భగవంతుని మళ్లీ విశ్వసించడం మొదలుపెట్టాను. 2014లో మా పెళ్లి హిందూ పూజారి సమక్షంలోనే జరిగింది. గత ఏడాది నుంచి నేను మళ్లీ చర్చికి వెళ్లడం మొదలుపెట్టాను. 2018లో కాథలిక్ చర్చిలో బాప్తిసం తీసుకున్నాను' అంటూ ఆధ్యాత్మిక ప్రయాణంలో భార్య తోడ్పాటు గురించి వ్యాన్స్ ఒక సందర్భంలో చెప్పుకొచ్చాడు. 'నేను క్రైస్తవుడిగానే పెరిగినా, ఎప్పుడూ బాప్తిసం తీసుకోలేదు. ఉష క్రైస్తవురాలు కాదు. అయినా భగవంతుని మీద నాకున్న విశ్వాసాన్ని ఆవిడ ప్రోత్సహించింది' అంటూ వ్యాన్స్ మరో సందర్భంలో వివరించాడు. భర్తకు తానందించిన తోడ్పాటు గురించి విష వివరిస్తూ... 'నేను మతపరమైన కుటుంబంలో పుట్టాను. మా తల్లితండ్రులు హిందువులు. నా జీవితంలో ఆధ్యాత్మిక ప్రభావాన్ని స్వయంగా చవి చూశాను. జెడి దేని కోసం వెతుకుతున్నాడో నాకు తెలుసు. కాబట్టే ఆయన విశ్వాసానికి దన్నుగా నిలిచి, ప్రోత్సహించాను' అంటూ చెప్పుకొచ్చింది ఉష. •

రాజకీయ సహచరిగా...

తన భర్త రాజకీయ జీవితంలో కీలక పాత్ర పోషించిన ఉష, భర్తతో రాజకీయ వేడుకలకు హాజరవడంతో పాటు, 2016, 2022లో జెడి వ్యాన్స్ రాజకీయ ప్రచార కార్యక్రమాల్లో పాల్గొని, ఆయనకు నిరంతర సహాయసహకారాలు అందిస్తూ ఉండేది. ఉష తల్లితండ్రులు సైతం వ్యాన్స్ రాజకీయ ప్రస్థానానికి మద్దతిస్తూ, ప్రచార వేడుకల్లో పాల్గొంటూ ఉంటారు. ఉష 2015 నుంచి 2017 వరకూ ముంగర్ టోల్స్ ఓల్సన్ ఎల్ఎల్‌పిల్లో న్యాయవాదిగా పని చేసింది. ఆ తర్వాత, 2018లో యుఎస్ సుప్రీం కోర్టులో లా క్లర్క్‌గా కూడా సేవలందించింది.



వివక్షను దాటి... సాధికారత వైపు

విద్యార్థినుల్లో నెలసరి సమస్యలపై అవగాహన పెంచడం నుంచి... పర్యావరణ పరిరక్షణ, ఉపాధి కల్పన వరకూ... అహంగర్ జహీదాది స్ఫూర్తిమంతమైన ప్రయాణం. కట్టుబాట్లు, వివక్షల వలయాల్ని దాటి... మహిళా సాధికారతకు సారథిగా నిలుస్తున్నారు ఈ 27 ఏళ్ల కశ్మీరీ మహిళ.



"ఒకవైపు ఉగ్రవాద భయం... మరోవైపు సామాజికమైన కట్టుబాట్లు... ఇంటా, బయటా వివక్ష. వీటన్నిటిమధ్యా నా బాల్యం ఎంతో గందరగోళంగా సాగింది. మాది కశ్మీర్‌లోని బారాముల్లా జిల్లా పట్టాన్ గ్రామం. ఆడపిల్లలను బడికి పంపడానికి కూడా చాలా కుటుంబాలు ఇష్టపడేవి కావు. ఇలాంటి పరిస్థితుల మధ్య... హైస్కూల్‌లో అడుగుపెట్టాను. అప్పుడే ప్రారంభమైన నెలసరి సమస్య నన్ను ఎంతో ఇబ్బంది పెట్టేది. నేను, నా తోటి విద్యార్థినులు పాత వస్త్రాలనే శానిటరీ నేప్‌కిన్లుగా వాడేవాళ్లం. చాలామంది నెలసరి రోజుల్లో స్కూల్‌కు వచ్చేవారు కాదు. ఇళ్లలో ఆంక్షల కారణంగా... కొందరు చదువు మానేసేవారు. నిజం చెప్పాలంటే... ఇంట్లో పెద్దవాళ్లు కూడా పీరియడ్స్ గురించి మాట్లాడడానికి ఇష్టపడేవారు కాదు. ఏమైనా అడిగితే కసురుకొనేవారు. అత్యంత సాధారణమైన రుతుక్రమం గురించి బాలికల్లో అవగాహన కలగకపోవడానికి ఇదే ప్రధాన కారణం. అందుకే... కాలేజీ రోజుల నుంచి పలు స్వచ్ఛంద సంస్థలతో కలిసి వివిధ కార్యక్రమాల్లో పాల్గొనేదాన్ని.

రోజుకో గ్రామంలో...

చదువు పూర్తయ్యాక... మహిళల కోసం, యువత కోసం సొంతంగా ఏదైనా చెయ్యాలనుకున్నాను. 2016లో 'స్టాండ్ ఫర్ కశ్మీరీ యూత్' (స్కై) అనే స్వచ్ఛంద సంస్థను స్థాపించాను. ఇది ప్రభుత్వేతర, రాజకీయేతర సంస్థ. కొందరు స్నేహితులతో కలిసి... పాఠశాలలకు వెళ్లి... నెలసరిపై ఉండే అపోహల గురించి అమ్మాయిలకు వివరించడం ద్వారా మా కార్యక్రమాలు మొదలయ్యాయి. క్రమంగా మాతో కలిసి పని చెయ్యడానికి చాలామంది ఉత్సాహంగా ముందుకు వచ్చారు. ఒక రోజుకో, ఒక వారానికో ఆ ఉత్సాహం వారిలో తగ్గిపోయేది. దాంతో సేవను సీరియస్‌గా తీసుకొనేవాళ్లనే ఎంపిక చేసుకోవాలని నిర్ణయించుకున్నాను. కనీసం మూడు నెలల నుంచి ఏడాది వరకూ వాళ్లు గ్రామాల్లో పని చెయ్యడానికి వీలుగా ప్రణాళిక రూపొందించాను. మహిళల శారీరక, మానసిక ఆరోగ్యం, సాధికారత, పర్యావరణ పరిరక్షణ, ఉపాధి అవకాశాలు తదితర అంశాలపై అవగాహన కల్పించడం ప్రధాన లక్ష్యంగా నిర్ణయించుకున్నాం. ఇప్పుడు బారాముల్లా, బుద్గాం, బండిపొరా తదితర జిల్లాల్లో 150 మందికి పైగా వాలంటీర్లు మా 'స్కై' తరఫున పని చేస్తున్నారు. వీరు ప్రతి రోజూ ఒక గ్రామాన్ని సందర్శించి... మహిళలను కలుసుకుంటారు. నెలసరి సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి చెబుతారు. మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, గృహహింసను ఎదుర్కోవడంపై సూచనలు చేస్తారు.



> మహిళలు, యువత కోసం సొంతంగా ఏదైనా చెయ్యాలను కున్నాను. 2016లో 'స్టాండ్ ఫర్ కశ్మీరీ యూత్'(స్కై) అనే స్వచ్ఛంద సంస్థను స్థాపించాను. కొందరు స్నేహితులతో కలిసి... పాఠశాలలకు వెళ్లి... నెలసరిపై అపోహల గురించి అమ్మాయిలకు వివరిస్తున్నాను.

ప్రభుత్వ సంస్థలు, ఎన్జీవోలతో కలిసి వర్క్‌షాపులు, సెమినార్లు, శిక్షణ శిబిరాలు కూడా నిర్వహిస్తున్నాం. మాతో కలిసి పనిచేసేలా ఔత్సాహికులను ప్రోత్సహిస్తున్నాం. వారికి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం. వ్యక్తిగతంగా ఎంత చైతన్యం ఉన్నా... ఆర్థికంగా స్థిరపడడం ప్రధానమనేది నా నమ్మకం. మహిళలకోసం ఎన్నో ప్రభుత్వ పథకాలు ఉన్నాయి. కానీ వాటి ప్రయోజనాలను అందుకోవడం అతి పెద్ద సవాల్. దీనికోసం ప్రభుత్వ శాఖలు, స్థానిక సంస్థలతో సమన్వయం చేసుకోవడానికి చాలా కష్టపడాల్సి వచ్చింది. ప్రతి ఒక్కరికీ కనీస ఆదాయం ఉండేలా మేము చేస్తున్న ప్రయత్నాలు మంచి ఫలితాలను ఇస్తున్నాయి. ఇక... బారాముల్లా జిల్లాలోని అన్ని అప్పర్ సెకెండరీ పాఠశాలల్లో ఉచిత శానిటరీ ప్యాడ్ వెండింగ్ మిషన్లను ఏర్పాటు చేయాలంటూ నేను వేసిన పిటిషన్‌కు సానుకూల స్పందన వచ్చింది. ఇప్పటికే దాదాపు వందకు పైగా పాఠశాలల్లో అవి ఏర్పాటయ్యాయి. మరికొన్ని చోట్ల రాబోతున్నాయి. నాకూ, మా సంస్థకూ ఎన్నో అవార్డులు, అభినందనలు దక్కాయి. కానీ చిన్నప్పుడు నేను పడినలాంటి ఇబ్బందులు... ఆ బడుల్లోని పిల్లలకు ఇక ఉండవనే ఆలోచనకన్నా ఎక్కువ సంతృప్తి కలిగించినది మరేదీ లేదు.

సౌర విద్యుత్ దిశగా...

కశ్మీర్ పర్యావరణం విలక్షణమైనది. కానీ కాలుష్యం కారణంగా వాతావరణ మార్పులు వేగంగా సంభవిస్తున్నాయి. వాటిని నిరోధించడం కోసం క్లైమెట్ ఫ్రెండ్స్ ఫెలోషిప్'ను ప్రారంభించాం. వాతావరణ మార్పులు మన జీవితాలపైనా, భవిష్యత్ తరంపైనా ఎలాంటి దుష్ప్రభావాలు కలిగిస్తాయో ప్రజలకు వివరిస్తున్నాం. గ్రామాల్లో సౌర విద్యుత్ వాడకాన్ని ప్రోత్సహించడానికి 'గ్రీన్ ఎంటర్‌ప్రెన్యూర్' అనే కార్యక్రమాన్ని మొదలుపెట్టాం. బిందీ ఇంటర్నేషనల్ సంస్థ ద్వారా సోలార్ ప్యానెల్స్ తయారీలో, వాటిని అమర్చడంలో, నిర్వహణలో స్థానిక మహిళలకు శిక్షణ ఇప్పించాం. నేను కూడా శిక్షణ పొంది, మరికొందరికి నేర్పుతున్నాను. ఇది స్థానిక మహిళల ఉపాధికి దోహదపడుతోంది. మరోవైపు సౌర విద్యుత్ వినియోగం కూడా పెరుగుతోంది. పర్యావరణ పరిరక్షణ దిశగా ఇంకా చేయాల్సింది ఎంతో ఉంది. అవగాహన పెంచుకోవడం, అవకాశాలు అందిపుచ్చుకోవడం... ద్వారానే సాధికారత సాధ్యమవుతుంది. సమాజం అభివృద్ధి సాధించాలంటే... యువతకు, మహిళలకు తగిన అవకాశాలు అందాలి. అందుకే నేను చేపట్టే కార్యక్రమాలన్నీ ప్రధానంగా వారి కోసమే." •



ఫ్యాషన్

ఒంటికి హత్తుకున్నట్టు కనిపించే దుస్తుల ట్రెండ్ క్రమంగా మారుతోంది. తాజాగా వదులుగా ఉండే, ఓవర్‌సైజ్ డ్రస్సుల ట్రెండ్ ఊపందుకుంటోంది. దాన్లో ఓవర్‌సైజ్ బ్లేజర్స్ లేటెస్ట్ ఫ్యాషన్. ఆలియా భట్, ప్రియాంకా చోప్రా లాంటి బాలీవుడ్ అగ్ర తారలు అనుసరిస్తున్న ఈ తాజా ట్రెండ్ మీద ఓ లుక్కేద్దాం!

ఓవర్‌సైజ్ మీద ఓ లుక్కేద్దాం!

పవర్ డ్రస్సింగ్‌లో భాగంగా....

పవర్ డ్రస్సింగ్ కాలక్రమేణా కొత్త పుంతలు తొక్కుతోంది. లాంగ్ స్కర్ట్, ట్రౌజర్స్, ఈవినింగ్ గౌన్‌లను ఓవర్‌సైజ్ బ్లేజర్స్‌తో జత చేయడం ఫ్యాషన్‌గా మారింది. అటు ఆఫీస్ వేర్‌గా, ఇటు ఫ్యాషన్ స్టేట్‌మెంట్‌గా రెండు విధాలా మహిళల ఆదరణకు నోచుకుంటోంది ఓవర్‌సైజ్ బ్లేజర్స్ ట్రెండ్. సౌకర్యంగా ఉండడంతో పాటు, చూపులకు ఫ్యాషనబుల్‌గా కనిపిస్తూ ఉండడంతో వర్కింగ్ విమెన్ వీటి మీద మక్కువ చూపుతూ ఉండడం విశేషం.

యాక్సెసరీస్ ఇలా...



ఓవర్‌సైజ్ బ్లేజర్స్ తయారీలో ప్రముఖ కంపెనీలన్నీ కొత్త పోకడలను అనుసరిస్తూ ఉన్నాయి. మరీ ముఖ్యంగా ననూష్క, ఎంపొరియో అర్మానీ, కామెడెస్ గార్కన్స్, బ్యాలెన్సియాగా కంపెనీలు మహిళలు ధరించే ఓవర్‌సైజ్డ్ బ్లేజర్ల తయారీలో ముందంజలో ఉంది. షార్ట్స్, ట్రౌజర్స్, లాంగ్ గౌన్స్‌తో కలిపి ధరించే ఈ బ్లేజర్స్ హుందాగా, ఆధునికంగా కనిపిస్తాయి. వీటికి తోడుగా హీల్స్, బూట్స్ ధరించవచ్చు. చేతిలో హ్యాండ్ బ్యాగ్, బ్రీఫ్ కేస్ నిండుదనాన్ని అందిస్తాయి. ఈ రకం దుస్తులతో సింపుల్ జ్యువెలరీ చక్కగా మ్యాచ్ అవుతుంది. •





దిక్సూచి

గుంటూరు-లాంలోని ఆచార్య ఎన్.జీ.రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ(ఏఎన్‌జీఆర్ ఏయూ)- 'అగ్రిసెట్ 2024' నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీనిని వ్యవసాయ విభాగాల్లో పాలిటెక్నిక్ డిప్లొమా పూర్తిచేసిన అభ్యర్థులకు ఉద్దేశించారు. ఈ ఎగ్జామ్‌లో సాధించిన స్కోర్ ద్వారా నాలుగేళ్ల వ్యవధి గల 'బీఎస్సీ(ఆనర్స్) అగ్రికల్చర్ ప్రోగ్రామ్‌లో అడ్మిషన్స్ ఇస్తారు. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

ఎన్.జీ.రంగా వర్సిటీ అగ్రిసెట్



విభాగాలు: అగ్రికల్చర్, సీడ్ టెక్నాలజీ, ఆర్గానిక్ ఫార్మింగ్

అర్హత: ఏఎన్‌జీఆర్‌ఏయూ/పీజేటీఎస్‌ఏయూ నుంచి రెండేళ్ల వ్యవధి గల డిప్లొమా(అగ్రికల్చర్/సీడ్ టెక్నాలజీ/ఆర్గానిక్ ఫార్మింగ్) పూర్తిచేసి ఉండాలి. అభ్యర్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి 17 ఏళ్లు నిండి ఉండాలి. జనరల్ అభ్యర్థులకు 22 ఏళ్లు; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 25 ఏళ్లు; దివ్యాంగులకు 27 ఏళ్లు మించకూడదు.

అగ్రిసెట్ వివరాలు: అభ్యర్థులు తమ డిప్లొమా స్ట్రీమ్‌లోనే అగ్రిసెట్ ఎగ్జామ్ రాయాలి. ఇది కంప్యూటర్ బేస్డ్ టెస్ట్. ఇందులో మొత్తం 120 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఇస్తారు. డిప్లొమా(అగ్రికల్చర్/సీడ్ టెక్నాలజీ/ఆర్గానిక్ ఫార్మింగ్) ప్రోగ్రామ్‌లకు ఏఎన్‌జీఆర్‌ఏయూ నిర్దేశించిన సిలబస్ ప్రకారం ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్న పత్రం తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో ఉంటుంది. ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం మార్కులు 120. నెగెటివ్ మార్కులు లేవు. పరీక్ష సమయం గంటన్నర. ఈ ఎగ్జామ్‌లో అర్హత సాధించాలంటే జనరల్ అభ్యర్థులకు కనీసం 25 శాతం(30)మార్కులు రావాలి.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 31
- **ఏఎన్‌జీఆర్‌ఏయూ అగ్రిసెట్ తేదీ:** ఆగస్టు 27 ● **వెబ్‌సైట్:** angrau.ac.in

HDFC Bank Parivartan's ECSS Programme

Description: HDFC Bank invites applications from students studying in Class 1 to the post-graduate level. The scholarship supports meritorious and needy students belonging to underprivileged sections of society.

Eligibility: The scholarship is open to Indian nationals only. The students must be studying in Class 1 to 12, or pursuing diploma, ITI, polytechnic, undergraduate or postgraduate (including general and professional) courses. The applicants must have passed their previous qualifying examination with at least 55% marks, and their annual family income must be less than or equal to INR 2.5 lakh. Preference will be given to applicants who have experienced personal or family crises in the past three years, preventing them from continuing to bear the cost of education and putting them at risk of dropping out.

Prizes & Rewards: Up to INR 75,000

Last Date to Apply: 04-09-2024

Application mode: Online applications only

Short Url: www.b4s.in/aj/HDFC54

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్‌ఎల్ https://ejyothy.com/uf9LiJmలో చదవండి.

SCHOLARSHIP ALERT

Panasonic Ratti Chhatr Scholarship

Description: Panasonic Life Solutions India (PLSIND) invites applications from students enrolling in B.E./B.Tech. courses at the Indian Institutes of Technology (IITs).

Eligibility: Open for students across India who have cleared the entrance for admission into B.E./B.Tech. courses at any of the IITs (Indian Institute of Technology) in 2024-25. Applicants must have cleared their Class 12 examination or be awaiting final results. Applicants must have scored more than 75% marks in Class 12. The annual family income of the applicant must not be more than INR 8,00,000 from all sources. Only candidates from 2024-25 batch are eligible to apply.

Prizes & Rewards: Scholarship amount: INR 70,250 per year for four years

Last Date: 15-08-2024 *Application:* Online only

Short Url: www.b4s.in/aj/RCSP56

buddy4study.com

కొత్త పుస్తకం

పోటీ పరీక్షల దిక్సూచి

భారత రాజ్యాంగం - రాజకీయ వ్యవస్థ

మరి కొద్ది నెలల్లో తెలంగాణలో గ్రూప్-1 మెయిన్స్, గ్రూప్-2, గ్రూప్-3 పరీక్షలు నిర్వహించబోతున్నారు. అటు ఏపీలోనూ ఇటీవల కొలువు తీరిన కొత్త ప్రభుత్వం భారీ స్థాయిలో ప్రభుత్వ ఉద్యోగాల నియామకానికి సమాయత్తం అవుతోంది. పోటీ పరీక్షలు ఏవైనా..ఇండియన్ పాలిటీ ప్రాధాన్యం ఎనలేనిది. పైగా అన్ని సబ్జెక్టుల్లో కన్నా ఎక్కువ మార్కులు తెచ్చిపెట్టే సబ్జెక్టు కూడా ఇదే. ఈ నేపథ్యంలో పోటీ పరీక్షల శిక్షణలో చాలా అనుభవం ఉన్న డాక్టర్ సుంకర రమాదేవి రచించిన 'భారత రాజ్యాంగం - రాజకీయ వ్యవస్థ' 15వ ఎడిషన్ మార్కెట్‌లోకి విడుదల అయ్యింది. దాదాపు 333 పోటీ పరీక్షల ప్రశ్న పత్రాలను అధ్యయనం చేసి ఈ పుస్తకానికి రూపకల్పన చేశారు. శాసన వ్యవస్థల కార్యనిర్వాహక, న్యాయవ్యవస్థ, రాజ్యాంగ, రాజ్యాంగేతర సంస్థల్లో వచ్చిన అన్ని పరిణామాలను, చట్టాలను, కోర్టుల తీర్పులను ఈ పుస్తకంలో పొందుపరిచారు. రాజ్యాంగ నిర్మాణ వివరాలతోపాటు ఉద్యమ చరిత్ర, రాజ్యాంగ చరిత్రలో ముఖ్య ఘట్టాలు, రాజ్యాంగం ఏర్పడటానికి దారితీసిన చారిత్రక పోరాటాలు - పరిణామాలు, బ్రిటిష్ పాలకులు అనుసరించిన వ్యూహాలు తదితర వివరాలన్నీ ఈ పుస్తకంలో ఉన్నాయి. భారత రాజకీయ వ్యవస్థకు సంబంధించిన ప్రతి అంశాన్నీ సంపూర్ణంగా, వాద ప్రతివాదాల సమాచారంతో ఎంతో ప్రామాణికంగా రూపొందించారు. అదేవిధంగా ఇండియా వర్సెస్ భారత్, ఉమ్మడి పౌర స్మృతి- ఒకే దేశం ఒకే చట్టం, పౌరసత్వ సవరణ చట్టం- విమర్శ, ఆర్టికల్ 370 రద్దు- సుప్రీంకోర్టు తీర్పు, కొత్త పార్లమెంట్ భవనం- సెంగోల్ స్థాపన, జమిలీ ఎన్నికలు - రామ్‌నాథ్ కోవింద్ కమిటీ, కొత్త నేర న్యాయ చట్టాలు, సాధారణ ఎన్నికల ఫలితాలు- 2024పై విశ్లేషణ, ఎలక్టోరల్ బాండ్స్ వంటి సమకాలీన అంశాలను వివరంగా చర్చించారు. సమగ్రమైన రాజ్యాంగ విశ్లేషణను, భారత రాజకీయాలకు సంబంధించిన సమాచారాన్ని, చారిత్రక పరిణామాలను వివిధ పట్టికల రూపంలో చక్కగా అందించారు. ఈ పుస్తకం కేవలం ఏపీపీఎస్సీ, టీజీపీఎస్సీ, ఇతర పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న అభ్యర్థులకే కాదు విద్యార్థులకు, అధ్యాపకులకు, న్యాయవాదులకు, స్వచ్ఛంద సేవా సంస్థలు నిర్వహించే వారికి కరదీపిక వలె ఉపయోగపడుతుంది.



పుస్తకం పేరు: భారత రాజ్యాంగం - రాజకీయ వ్యవస్థ (15వ ఎడిషన్)
పేజీలు: 1202(రెండు వాల్యూమ్స్ కలిపి)
వెల: రూ.899/-
ప్రతులకు: శ్రీ తేజ పబ్లికేషన్స్, గాంధీనగర్, హైదరాబాద్-500080
ఫోన్ నెం: 8686430054, 8686430055

నవ్య | చిత్రజ్యోతి

బ్రహ్మరాక్షసుడిలా...



తమిళ కథానాయకుడు ధనుష్ 50వ చిత్రం 'రాయన్'. ఈ సినిమాకు ఆయనే దర్శకుడు కూడా. సందీప్‌కిషన్, కాళిదాస్ జయరామ్ కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా ట్రైలర్‌ను మంగళవారం విడుదల చేశారు. 'బ్రహ్మరాక్షసుడిలా వస్తాడు.. దహనం చేస్తాడు' అంటూ ధనుష్ పాత్రను పరిచయం చేశారు. యాక్షన్ ప్యాక్డ్ ఎలిమెంట్స్‌తో ట్రైలర్ అదిరిపోయింది. ఇందులో నటించిన సందీప్‌కిషన్, ప్రకాశ్‌రాజ్, ఎస్.జె.సూర్య, కాళిదాస్ జయరామ్ ముఖ్య పాత్రలో కనిపించారు. ఆస్కార్ విన్నర్ ఏ.ఆర్.రెహమాన్ నేపథ్యం సంగీతం అలరించింది. పీటర్ హెయిన్ యాక్షన్ కొరియోగ్రఫీ స్పెషల్ ఎట్రాక్షన్‌గా నిలిచింది. ఈ నెల 26న 'రాయన్' చిత్రం విడుదల కానుంది. తెలుగు వెర్షన్‌ను ఏషియన్ సురేశ్ సురేశ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ విడుదల చేయనుంది.



ఆ రోజులు మళ్లీ రాకూడదు


'గడచిన మూడేళ్ల ఎన్నో ఆటుపోట్లు చవిచూశాను. నా జీవితం తీవ్రమైన ఒడిదుడుకులతో గడిచింది. ఆ రోజులు నా జీవితంలో మళ్లీ రాకూడదు అని కోరుకుంటున్నాను' అని హీరోయిన్ సమంత అన్నారు. ఆమె ఇటీవలే ఓ మీడియా ఇంటర్వ్యూలో తన సినిమాలు, వ్యక్తిగత జీవితం గురించి మాట్లాడారు. 'మన జీవితాల్లో కొన్ని సంఘటనలు చేదు అనుభవాలుగా విగిలిపోతాయి. ఎంత ప్రయత్నించినా మనం వాటిని ఆపలేం. అలాంటప్పుడు వాటిని అంగీకరించి, అధిగమిస్తూ ముందుకెళ్లడమే మనం చేయాల్సింది. కష్టకాలంలో ఆధ్యాత్మికత నాకు స్ఫూర్తినిచ్చింది. వ్యక్తిగతంగా, కెరీర్ పరంగా నాలో మంచి మార్పులకు కారణమైంది. ఈతరం ఎక్కువగా మానసిక అనారోగ్యానికి గురవుతోంది. ఆధ్యాత్మిక చింతన అలవరుచుకోవడం వల్ల ప్రశాంతంగా ఉండొచ్చు. ప్రస్తుతం నా జీవితం బావుంది. నేను మునుపటికన్నా బావున్నాను' అని సమంత చెప్పారు. కొత్త సినిమాల గురించి మాట్లాడుతూ 'ఈ ప్రపంచంలో నాకు బాగా ఇష్టమైన విషయం కెమెరా ముందు నిల్చోవడమే. ఆగస్టు నుంచి కొత్త సినిమా షూటింగ్‌లో పాల్గొంటాను. నా పాత్ర కోసం తర్ఫీదు అవుతున్నాను. విలువిద్య, గుర్రపు స్వారీలో శిక్షణ తీసుకుంటున్నాను. నేను నేర్చుకోవాల్సింది ఇంకా చాలా ఉంది. అందుకే కొత్త నైపుణ్యాలు నేర్చుకునే అవకాశం ఉన్న కథలనే ఎంపిక చేసుకుంటున్నాను' అని ఆమె చెప్పారు. సమంత స్వీయ నిర్మాణంలో తెరకెక్కుతోన్న చిత్రం 'మా ఇంటి బంగారం'లో నటిస్తున్నారు. ఆమె నటించిన 'హనీ-బన్నీ' వెబ్ సిరీస్ త్వరలో స్ట్రీమింగ్ అవనుంది.

ఇది సెలబ్రేట్ చేసుకోవాల్సిన విజయం




'నా సినీ జీవితంలో 200కు పైగా సినిమాలు చేశాను. అయితే వాటిలో అన్ని సినిమాలు ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించి ఉండకపోవచ్చు. కానీ 'కల్కి 2898 ఏడీ' విజయాన్ని మాత్రం కచ్చితంగా సెలబ్రేట్ చేసుకోవాలి. సినిమా విడుదలైనప్పటి నుంచి నాకు ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి' అని నటుడు కమల్‌హాసన్ అన్నారు. ప్రభాస్ కథానాయకుడిగా నాగ్ అశ్విన్ దర్శకత్వం వహించిన 'కల్కి 2898 ఏడీ' చిత్రం బాక్సాఫీసు దగ్గర సంచలన విజయాన్ని అందుకోవడంతో పాటు రూ. వెయ్యికోట్ల వసూళ్లను అధిగమించిన సందర్భంగా ఈ చిత్రంలో కీలకపాత్ర పోషించిన కమల్‌హాసన్ ఓ వీడియోను విడుదల చేశారు. అందులో ఆయన మాట్లాడుతూ "కల్కి చిత్రానికి వసూళ్ల పరంగా వస్తున్న ఆదరణ చూస్తుంటే చాలా ఆనందంగా ఉంది. ఈ చిత్రంలో యాస్కిన్ పాత్ర కోసం చాలా కసరత్తు జరిగింది. చాలా కష్టపడ్డాం. మేకప్ కోసం లాస్ ఏంజెల్స్ వెళ్లాం. మొదట్లో నా గెటప్ చూసి నాకే ఎబ్బెట్టుగా అనిపించినా, క్రమంగా ఉత్సాహం కలిగింది. రెండో భాగంలో నా పాత్ర నిడివి ఎక్కువగా ఉంటుంది. భారతీయ చిత్ర పరిశ్రమలోని దిగ్గజాలు అంతా ఈ చిత్రంలో కలసి నటించారు. ఒకప్పుడు సింగీతం శ్రీనివాసరావులా ఇప్పుడు నాగ్ అశ్విన్ కూడా ప్రేక్షకులను మాయ చేశారు. చిన్నపిల్లలు ఆటలో లీనమైపోయినట్లు పాత్రధారులందరూ తమ తమ పాత్రల్లో జీవించారు. సినిమా చూసిన ప్రేక్షకులు ఎంత సంతోషిస్తే మేము అంతగా సంతోషిస్తాం' అని పేర్కొన్నారు.

విలన్‌గా అభిషేక్ బచ్చన్



బాలీవుడ్‌లో ఒక్కో హీరో ఇప్పుడు విలన్‌గా మారుతున్నారు. సంజయ్‌దత్, సైఫ్ అలీఖాన్, రణ్‌వీర్ సింగ్, బాబీ డియోల్... ఇలా . తాజాగా ఈ జాబితాలోకి అభిషేక్ బచ్చన్ చేరబోతున్నారు. షారుఖ్‌ఖాన్ కొత్త చిత్రం 'కింగ్'లో అభిషేక్ విలన్‌గా నటిస్తున్నారు. ఈ విషయాన్ని ఆయన తండ్రి అమితాబ్ స్వయంగా వెల్లడించడం విశేషం. 'ఇదే సమయం' అంటూ తనయుడు అభిషేక్‌కు అభినందనలు తెలుపుతూ సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టారు అమితాబ్. గత ఏడాది 'జవాన్', 'పఠాన్' చిత్రాలతో బ్యాక్ టు బ్యాక్ హిట్స్ ఇచ్చిన షారుఖ్ ఖాన్ ఇప్పుడు 'కింగ్' చిత్రం కోసం సిద్ధమవుతున్నారు. ఆయన కుమార్తె సుహానా ఈ సినిమాలో మరో కీలక పాత్ర పోషించనున్నారు. తండ్రీ కూతుళ్లు కలసి నటిస్తున్న తొలి చిత్రం ఇదే. యాక్షన్ థ్రిల్లర్‌గా రూపుదిద్దుకుంటున్న 'కింగ్' చిత్రానికి సుజయ్ ఘోష్ దర్శకత్వం వహిస్తున్నారు.

మాస్‌ను ఆకట్టుకునేలా...



రామ్ పోతినేని ప్రస్తుతం పూరి జగన్నాథ్ దర్శకత్వంలో పాన్ ఇండియా సినిమాగా తెరకెక్కుతోన్న 'డబుల్ ఇస్మార్ట్'లో నటిస్తున్నారు. ఇది 2019లో విడుదలై బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్‌ను అందుకున్న 'ఇస్మార్ట్ శంకర్'కు సీక్వెల్. ఈ సినిమాలో హీరోయిన్‌గా కావ్య థాపర్ నటిస్తున్నారు. బాలీవుడ్ నటుడు సంజయ్‌దత్, అలీ, గెటప్ శ్రీను కీలక పాత్రలు పోషిస్తున్నారు. పూరి కనెక్ట్ బ్యానర్‌పై పూరి జగన్నాథ్, చార్మి కౌర్ నిర్మిస్తున్నారు. ఆగస్టు 15న విడుదలవుతోంది. ఇటీవలే విడుదలైన టీజర్ అందరికీ నచ్చడమే కాకుండా.. సినిమాపై అంచనాలను పెంచింది. మంగళవారం ఈ సినిమా నుంచి సెకండ్ సింగిల్ 'మార్ ముంతా చోడ్ చింత'ను మేకర్స్ విడుదల చేశారు. మాస్‌ను ఆకట్టుకునేలా ఈ సాంగ్‌లోని లిరిక్స్, డాన్స్ మూమెంట్స్ సాగాయి. ఈ పాటకు శ్యామ్ సాహిత్యం అందించగా రాహుల్ సిప్లిగంజ్, ధనుంజయ్ సీపాన, కీర్తన శర్మ ఆలపించారు. మణిశర్మ సంగీతం అందించారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రాఫర్: సామ్ కె నాయుడు, జియాని జియాన్నెలి

ముద్దు సీన్‌కు మూడు కట్స్



'యానిమల్' సినిమాలో బోల్డ్ సీన్స్‌లో పాల్గొని అందరి దృష్టినీ ఆకర్షించిన హాట్ గర్ల్ త్రిప్తి డిమ్రీ నటించిన తాజా చిత్రం 'బ్యాడ్ న్యూజ్'. విక్కీ కౌశల్ హీరోగా నటించిన ఈ రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్ ఈ నెల 19న విడుదల కానుంది. వాస్తవ సంఘటనల ఆధారంగా రూపుదిద్దుకున్న ఈ చిత్రంలో హీరోహీరోయిన్ల మధ్య ముద్దు సీన్లు మూడు ఉన్నాయట. ఈ మధ్యకాలంలో కిస్సింగ్ సీన్లను చూసీ చూడనట్లు వదిలేస్తున్న సెన్సార్ వారు 'బ్యాడ్ న్యూజ్' చిత్రం మీద కన్నెర్ర చేసి, కత్తెరకు పని చెప్పారట. విక్కీ, త్రిప్తి పై చిత్రీకరించిన ముద్దు సీన్లు మోతాదు మించి ఉన్నాయనీ, తగ్గించాలని సెన్సారు అధికారి చెప్పడంతో చేసేదేమీ లేక వాటిని తగ్గించి విడుదల చేస్తున్నారు. త్రిప్తి అభిమానులకు ఇది బ్యాడ్ న్యూసే కదూ!

పవర్‌ఫుల్ పాత్రలో




పీఎస్ మిత్రన్ దర్శకత్వంలో కార్తి కథానాయకుడిగా రూపొందుతున్న తెలుగు, తమిళ ద్విభాషా చిత్రం 'సర్దార్ 2'. వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన 'సర్దార్' చిత్రానికి ఇది కొనసాగింపు. కొన్ని రోజుల క్రితమే రెగ్యులర్ చిత్రీకరణ ప్రారంభమైంది. తాజాగా చిత్రబృందం అప్‌డేట్ ఇచ్చింది. నటుడు, దర్శకుడు ఎస్‌జే సూర్య ఈ చిత్రంలో పవర్‌ఫుల్ రోల్‌లో నటిస్తున్నట్లు మంగళవారం తెలిపింది. ఎస్. లక్ష్మణ్‌కుమార్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి యువన్ శంకర్‌రాజా సంగీతం అందిస్తున్నారు.

ఆ రోజులు గుర్తొస్తున్నాయి



'ప్రతి సినిమాను ఎంతో ప్యాషన్‌తో తీసే నిర్మాత వేణుగోపాల్. ఆయనకు మంచి టేస్ట్ ఉంది. లవ్ స్టోరీస్ మీద పట్టుంది. ఈ సినిమా టీమ్‌ను, హీరోలను చూస్తుంటే నాకు 'ఈ నగరానికి ఏమైంది' రోజులు గుర్తుకు వస్తున్నాయి' అన్నారు హీరో విష్వక్‌సేన్. 'రోటీ కపడా రొమాన్స్' చిత్రంలోని 'గలీజ్' సాంగ్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. సృజన్ కుమార్ బొజ్జం తో కలసి బెక్కం వేణుగోపాల్ ఈ చిత్రాన్ని నిర్మించారు. హర్ష నర్రా, సందీప్ సరోజ్, తరుణ్ హీరోలుగా నటించిన ఈ చిత్రానికి విక్రమ్ రెడ్డి దర్శకుడు. నిర్మాత బెక్కం వేణుగోపాల్ మాట్లాడుతూ 'ఓ కొత్త పాయింట్‌ను ప్రేక్షకులకు చెప్పాలని ఈ యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌ని నిర్మించాం. ఇటీవల కొంతమంది యూత్‌కి ఈ సినిమా చూపించాం. వారు ఇచ్చిన ఫీడ్ బ్యాక్‌తో మా కాన్ఫిడెన్స్ మరింత పెరిగింది' అన్నారు. ఆగస్టు 2న ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు మరో నిర్మాత సృజన్‌కుమార్ చెప్పారు.

ఆకట్టుకునే విజువల్స్‌తో... 'మా ఊరి జాతరలో'



అల్లరి నరేశ్, అమృత అయ్యర్ జంటగా నటిస్తున్న చిత్రం 'బచ్చల మల్లి'. సుబ్బు మంగదేవి దర్శకత్వంలో రాజేశ్ దండా, బాలాజీ గుత్తా నిర్మించారు. ఇటీవలే విడుదలైన ఫస్ట్ లుక్, గ్లింప్స్ సినిమాపై ఆసక్తిని రేకెత్తించాయి. మంగళవారం ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్ 'మా ఊరి జాతరలో' పాటను మేకర్స్ రిలీజ్ చేశారు. ఈ ఫోక్ సాంగ్‌లో లీడ్ పెయిర్ కెమిస్ట్రీ, విజువల్స్ ఆకట్టుకునేలా ఉన్నాయి. సింధూరి విశాల్, హరిగౌర ఆలపించగా, విశాల్ చంద్రశేఖర్ సంగీతం అందించారు. ఈ చిత్రానికి ఎడిటర్ : చోటా కె ప్రసాద్, డీఓపీ : ఎం. రిచర్డ్ నాథన్.

రాజ్ తరుణ్‌కు నోటీసులు ?



సినిమా హీరో రాజ్ తరుణ్‌పై లావణ్య చేసిన ఫిర్యాదులో రాజ్ తరుణ్‌ను విచారించేందుకు నార్సింగ్ పోలీసులు సిద్ధమయ్యారు. రేపు విచారణకు హాజరు కావాలని రాజ్‌తరుణ్‌కు నోటీసులు జారీ చేసినట్లు తెలుస్తోంది. ఆయన వాంగ్మూలాన్ని రికార్డ్ చేయడంతో పాటు పలు అంశాలపై ఆరా తీయ్యనున్నారు. రాజ్ తరుణ్‌కు నోటీసులు ఇచ్చినట్లు మంగళవారం ప్రచారం జరిగింది. అయితే ఈ కేసులో నోటీసుల విషయం పై నార్సింగ్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డిని వివరణ కోసం సంప్రదించగా ఆయన స్పందించలేదు.

- నార్సింగ్ (ఆంధ్రజ్యోతి)

ముగ్గురు స్నేహితుల కథ



మక్కా శ్రీను, సుచిత్ర రాథోడ్, దిల్ రమేశ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'ఎస్.ఐ.కోదండపాణి'. రెంటాల నాగేంద్ర దర్శకత్వంలో మక్కా శ్రీదేవి నిర్మిస్తున్నారు. మంగళవారం ఈ సినిమా ప్రీమియర్ షోను మీడియాకు ప్రదర్శించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ రెంటాల నాగేంద్ర మాట్లాడుతూ "కొన్ని వాస్తవ సంఘటనల ఆధారంగా సినిమాను తెరకెక్కించాను. ముగ్గురు స్నేహితులు ఓ మర్డర్ మిస్టరీలో ఇరుక్కుని ఎలా బయటపడారనేది సినిమా కథ" అని అన్నారు. "కుటుంబ సమేతంగా చూడాల్సిన సినిమా ఇది. అందరినీ తప్పకుండా ఆకట్టుకుంటుంది" అని నిర్మాత శ్రీదేవి అన్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: ఉదయ్, కెమెరామెన్: నబరి, సంగీతం: సాల్మన్.

సమాజానికి అవసరమైన ఇండియా ఫైల్స్



తెలంగాణ కాంగ్రెస్ ఎమ్మెల్యే అద్దంకి దయాకర్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'ఇండియా ఫైల్స్', ఇంద్రజ, సుమన్, శుభలేఖ సుధాకర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. డాక్టర్ బొమ్మకు మురళి స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్నారు. మంగళవారం ఈ సినిమా ఆడియో వేడుకను నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ "ఈ చిత్రంలో నటిస్తున్న ప్రతీ ఒక్కరికీ నా అభినందనలు. ఈ మూవీ టీమ్‌తో నాకు మంచి అనుబంధం ఉంది. ప్రస్తుత సమాజానికి ఇలాంటి చిత్రం అవసరం" అని చెప్పారు. "ఈ సినిమా విడుదల తర్వాత ఇలాంటి తరహా కథలు మరిన్ని తెరకెక్కుతాయి. మంచి కంటెంట్ ఉన్న చిత్రమిది" అని ఎమ్మెల్యే అద్దంకి దయాకర్ చెప్పారు. "ప్రపంచంలో ప్రతీ మూలకు వెళ్లగలిగేది సినిమా మాత్రమే" అని దర్శకుడు బొమ్మకు మురళీ తెలిపారు. ఈ చిత్రానికి ఎడిటర్: కార్తీక్, డీఓపీ: జి.ఎల్.బాబు, సంగీతం:ఎమ్.ఎమ్.కీరవాణి.

మంచి కంటెంట్‌తో రేవు

వంశీ రామ్ పెండ్యాల, అజయ్, స్వాతి భీమిరెడ్డి, ఏపూరి హరి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'రేవు'. హరినాథ్ పులి దర్శకత్వం వహించిన ఈ చిత్రానికి డాక్టర్ మురళీ గింజుపల్లి, నవీన్ పారుపల్లి సంయుక్తంగా నిర్మిస్తున్నారు.



తాజాగా, ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను డైరెక్టర్ బాబీ చేతుల మీదుగా రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "ఈ సినిమా విజువల్స్ బాగున్నాయి. మంచి కంటెంట్ ఉన్న ఈ సినిమా అందరినీ ఆకట్టుకుంటుంది" అని అన్నారు. "ఇదొక విభిన్న తరహా సినిమా. అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చేలా ఉంటుంది" అని దర్శకుడు హరినాథ్ పులి చెప్పారు. ఈ సినిమాకు ఎడిటర్: శివ శర్వాని, డీఓపీ: రేవంత్ సాగర్, నిర్మాణ పర్యవేక్షణ: సీనియర్ జర్నలిస్ట్ ప్రభు, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: పర్వతనేని రాంబాబు.

హై రిస్క్ పెట్టుబడుల కోసం
కొత్త అసెట్ క్లాస్

● కనీస పెట్టుబడి రూ.10 లక్షలు ● గరిష్ఠం రూ.50 లక్షలు
● ఎంఎఫ్, పీఎంఎస్ మధ్య అంతరాన్ని పూడ్చేందుకే..

ప్రవేశపెట్టే యోచనలో సెబీ



న్యూఢిల్లీ: మ్యూచువల్ ఫండ్స్ (ఎంఎఫ్), పోర్ట్‌ఫోలియో మేనేజ్‌మెంట్ సర్వీసెస్ (పీఎంఎస్) మధ్య అంతరాన్ని పూడ్చేందుకు కొత్త అసెట్ క్లాస్‌ను ప్రవేశపెట్టాలని క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ మంగళవారం ప్రతిపాదించింది. అధిక రిస్క్ తీసుకోగలిగే ఇన్వెస్టర్ నుంచి కనీసం రూ.10 లక్షల నుంచి రూ.50 లక్షల స్థాయి పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ఈ అసెట్ క్లాస్‌ను ఏర్పాటు చేయాలనుకుంటోంది.అయితే, రూ.10 లక్షల కనీస పెట్టుబడి పరిమితి ద్వారా అధిక రిస్క్ తీసుకోలేని చిన్న మదుపరులను ఈ అసెట్ క్లాస్‌కు దూరంగా ఉంచనుంది. అనధికారిక, అన్ రిజిస్టర్డ్ పీఎంఎస్ ప్రొవైడర్ల సేవలందుకుంటున్న వారి పెట్టుబడులను కొత్త అసెట్ క్లాస్ వైపు మళ్లించడమే తమ ఉద్దేశమని చర్చా పత్రంలో సెబీ పేర్కొంది. ఎంఎఫ్ నిర్మాణంలోనే కొత్త అసెట్ క్లాస్‌ను ప్రవేశపెట్టనున్నట్లు, క్రమానుగత పెట్టుబడుల (సిప్) వెసులుబాటు కూడా కల్పించనున్నట్లు తెలిపింది. అంతేకాదు, నూతన అసెట్ క్లాస్ ఇన్వెస్టర్లు డెరివేటివ్‌ల్లోనూ పెట్టుబడులు పెట్టే అవకాశం కల్పించాలనుకుంటోంది.

రీట్స్, ఇన్విట్స్ నిబంధనల సవరణ

రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్ (రీట్స్), ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్ (ఇన్విట్స్).. యూనిట్ బేస్డ్ ఎంప్లాయ్‌మెంట్ బెనిఫిట్ పథకాన్ని అమలు చేసేందుకు సెబీ విధివిధానాలను జారీ చేసింది. రీట్స్, ఇన్విట్స్ ఎంప్లాయీ బెనిఫిట్ ట్రస్ట్‌కు ఏ విధంగా యూనిట్లను కేటాయించాలి.. ట్రస్ట్‌లు ఏ విధంగా యూనిట్లను స్వీకరించాలనే విషయాలను కొత్త నియమావళి ద్వారా తెలియజేసింది.

పేటీఎంకు సెబీ హెచ్చరిక

డిజిటల్ చెల్లింపుల ప్లాట్‌ఫామ్ పేటీఎం బ్రాండ్ యాజమాన్య సంస్థ వన్97 కమ్యూనికేషన్స్‌కు సెబీ హెచ్చరిక లేఖ జారీ చేసింది. ఆడిట్ కమిటీ లేదా షేర్‌హోల్డర్ల ఆమోదం లేకుండానే పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ (పీపీబీఎల్)తో 2021-22 ఆర్థిక సంవత్సరంలో నెరిపిన రిలేటెడ్ పార్టీ ట్రాన్సాక్షన్స్‌కు సంబంధించి సెబీ ఈ లేఖలో హెచ్చరించింది. దాంతో పేటీఎం షేరు బీఎస్ఈలో 2 శాతం క్షీణించి రూ.459.75 వద్ద ముగిసింది.

గూగుల్ చేతికి విజ్?

న్యూయార్క్:సైబర్ సెక్యూరిటీ కంపెనీ విజ్‌ను కొనుగోలు చేసేందుకు గూగుల్ మాతృసంస్థ ఆల్ఫాబెట్ చర్చలు జరుపుతున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఈ డీల్ విలువ 2,300 కోట్ల డాలర్లు (రూ.1.93 లక్షల కోట్లు) ఉండవచ్చని అంచనా. ఇంటర్నెట్ దిగ్గజం ఆల్ఫాబెట్ చరిత్రలోనే ఇది అతి పెద్ద డీల్ కానుంది. ఎక్కువ మొత్తం నగదు రూపంలో చెల్లించే విధంగా ఈ డీల్ ఖరారు కావచ్చని ఈ వ్యవహారంతో సంబంధమున్న వర్గాలు వెల్లడించాయి. ఇజ్రాయెల్‌లో ఏర్పాటై ప్రస్తుతం న్యూయార్క్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న విజ్ ప్రపంచంలో వేగంగా వృద్ధి చెందుతున్న సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో ఒకటి. కృత్రిమ మేధ (ఏఐ) ఆధారంగా సైబర్ భద్రతకు సంబంధించిన ముప్పులను గుర్తించి, క్లౌడ్ ఆధారితంగా తక్షణ పరిష్కారాలు ఈ కంపెనీ అందిస్తుంది. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ నాయకత్వంలో టెక్నాలజీ పరిశ్రమపై నియంత్రణాపరమైన నిఘా పెరిగిన వాతావరణంలో ఆల్ఫాబెట్ కుదుర్చుకోబోతున్న ఈ డీల్ అసాధారణమైనదిగా నిలుస్తుందంటున్నారు.

తెలంగాణలో విన్ గ్రూప్ స్మార్ట్‌సిటీ ప్రాజెక్ట్?

హైదరాబాద్: వియత్నాంకు చెందిన విన్ గ్రూప్ తెలంగాణలో స్మార్ట్ సిటీ ప్రాజెక్ట్‌ను అభివృద్ధి చేసే ఆలోచనలో ఉన్నట్లు తెలిసింది. హైదరాబాద్‌లో లేదా నగరానికి దగ్గర్లో 1,000 ఎకరాల్లో మెగా స్మార్ట్ సిటీని అభివృద్ధి చేయాలనుకుంటోంది. అనువైన స్థలం కోసం అన్వేషిస్తున్నట్లు సమాచారం. విన్‌గ్రూప్‌కు చెందిన ఎలక్ట్రిక్ కార్ల తయారీ కంపెనీ విన్‌ఫాస్ట్ ఇప్పటికే తమిళనాడులో ఇంటిగ్రేటెడ్ ఈవీ ప్లాంట్ నిర్మాణానికి శంకుస్థాపన కూడా చేసింది. కాగా, తెలంగాణలో స్మార్ట్ సిటీ అభివృద్ధితోపాటు ఈవీ విడిభాగాలను సైతం తయారు చేయాలనుకుంటోంది. ఇందుకోసం విన్‌ఫాస్ట్ ఇండియా మేనేజ్‌మెంట్ గతవారం తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డీ శ్రీధర్ బాబును కలిసినట్లు తెలిసింది.

త్వరలో జికా, కేఎఫ్‌డీ వ్యాక్సిన్లు : ఐఐఎల్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రభుత్వ రంగంలోని ఇండియన్ ఇమ్యునోలాజికల్స్ లిమిటెడ్ (ఐఐఎల్) మరో రెండు సరికొత్త వ్యాక్సిన్లను అభివృద్ధి చేస్తోంది. జికా, కేఎఫ్‌డీ వ్యాక్సిన్లను అభివృద్ధి చేస్తున్నట్టు కంపెనీ తెలిపింది. ఇందులో జికా వ్యాక్సిన్‌ను విష క్రిముల కాటు కారణంగా గర్భస్థ శిశువుల్లో ఏర్పడే బుద్ధి మాంద్యం నివారణకు ఉపయోగిస్తారు. ఇక అంటువ్యాధుల బారిన పడిన జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే ప్రాణాంతక వ్యాధుల కట్టడికి కేఎఫ్‌డీ (క్రైసనూర్ ఫారెస్ట్ డిసీజ్) వ్యాక్సిన్లను ఉపయోగిస్తారు. కాగా వియత్నాంలోని ఐదు రాష్ట్రాల్లో వినియోగం కోసం 10,000 డోసుల యాంటీ రేబిస్ వ్యాక్సిన్‌ను అందించిన సందర్భంగా విడుదల చేసిన ఒక ప్రకటనలో ఐఐఎల్ చైర్మన్ డాక్టర్ మీనేశ్ షా, ఎండీ డాక్టర్ ఆనంద్ కుమార్ ఈ విషయాలు వెల్లడించారు.

సీఏల కోసం ఏఐ సర్టిఫికెట్ కోర్సు

ఐసీఏఐ ప్రెసిడెంట్ రంజిత్ అగర్వాల్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) కూడా కృత్రిమ మేధ (ఏఐ) బాట పట్టింది. తన సభ్యుల (సీఏ) కోసం ప్రత్యేక ఏఐ సర్టిఫికెట్ కోర్సు ప్రారంభించింది. హైదరాబాద్‌లో ఐసీఏఐ నిర్వహిస్తున్న ఏఐ ఇన్నోవేటివ్ సదస్సు (ఏఐఎస్ 2024)కు హాజరైన ఆ సంస్థ జాతీయ అధ్యక్షుడు రంజిత్ కుమార్ అగర్వాల్ విలేకరులతో ఈ విషయం చెప్పారు. అకౌంటింగ్, ఆడిటింగ్‌కు సంబంధించి ఒక జాతీయ సంస్థ ఏఐ సర్టిఫికెట్ కోర్సు ప్రారంభించడం ప్రపంచంలో ఇదే తొలిసారని తెలిపారు. ఈ కోర్సు ద్వారా ఐసీఏఐ సభ్యులకు అకౌంటింగ్, ఆడిటింగ్‌కు సంబంధించిన సమకాలీన ఏఐ టూల్స్‌పై అవగాహన ఏర్పడుతుందన్నారు.

ఏఐ ఆధారిత అకౌంటింగ్ టూల్స్ ఎన్ని అందుబాటులోకి వచ్చినా అవి సీఏలకు ప్రత్యామ్నాయం కావని అగర్వాల్ స్పష్టం చేశారు. సరైన నిర్ణయాలు తీసుకోవడం, కంపెనీల అకౌంటింగ్, ఆడిటింగ్‌లో జరిగే మోసాలను వెంటనే గుర్తించడం, నిబంధనల అమలు విషయంలో సీఏలకు సాయపడేందుకు త్వరలో ఒక ఆడిట్ టూల్‌ను తీసుకురాబోతున్నట్టు వెల్లడించారు. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖతో కలిసి పని చేస్తున్నట్టు తెలిపారు. ఐసీఏఐ సీఏ జీపీటీ టూల్ దేశంలో సీఏ కోర్సు చేసే విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందని అగర్వాల్ చెప్పారు.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	74,020 ▲	67,850 ▲	99,500 ▼
ముంబై	73,339 ▲	67,179 ▲	92,014 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

17వ తేదీ			
హైదరాబాద్	540	విజయవాడ	555
వరంగల్	542	గోదావరి	555
చిత్తూరు	573	విశాఖపట్నం	575
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	102	విజయవాడ	110
వరంగల్	102	గుంటూరు	110
కరీంనగర్	102	ఒంగోలు	110
మహబూబ్‌నగర్	102	చిత్తూరు	117
కర్నూలు	102	నెల్లూరు	117
విశాఖపట్నం	102	అనంతపురం	110
గోదావరి	110		

ఎస్‌బీఐకి సాయిశ్రీ ఇంజనీర్స్ రూ.15 కోట్లు టోకరా

సంస్థ ఎండీ నుంచి రూ.3 కోట్లు జప్తు చేసిన ఈడీ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలో వ్యవసాయేతర భూమిని సెక్యూరిటీగా చూపి నకిలీ పత్రాలతో రూ.15 కోట్లు రుణం తీసుకుని ఎస్‌బీఐ (గతంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్)ను మోసం చేసిన కేసులో నిందితుడి నుంచి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు రూ.3.11 కోట్ల స్థిరాస్తులు జప్తు చేశారు. సాయిశ్రీ ఇంజనీర్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ఎస్ఈపీఎల్) యాజమాన్యం కుట్రపూరితంగా నకిలీ పత్రాలతో ఈ రుణం తీసుకుంది. వ్యాపార అవసరాలకు కాకుండా ఆ నిధులు దారి మళ్లించి తిరిగి చెల్లించకుండా మోసగించారని ఎస్‌బీఐ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీబీఐ చెన్నై బ్రాంచ్ ఎకనామిక్స్ అఫెన్స్ వింగ్ కేసు నమోదు చేసింది. సాయిశ్రీ ఇంజనీర్స్‌పై అవినీతి నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసిన సీబీఐ చెన్నై అధికారులు దర్యాప్తు చేపట్టారు. నిధుల మళ్లింపుపై 2020 డిసెంబర్ 21న చార్జిషీట్ నమోదు చేశారు. మనీలాండరింగ్ కోణంలో ఈడీ విచారణ చేపట్టింది. బ్యాంకు నుంచి రుణంగా తీసుకున్న మొత్తాన్ని కంపెనీ ఎండీ సాగిరాజు సూర్యనారాయణ రాజు ఆంధ్రా బ్యాంక్ ఖాతాలోకి మళ్లించినట్టు ఈడీ అధికారులు గుర్తించారు.

బజాజ్ ఆటో లాభం రూ.1,942 కోట్లు

న్యూఢిల్లీ: బజాజ్ ఆటో.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.1,942 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలం (రూ.1,644 కోట్లు)తో పోల్చితే లాభం 18 శాతం వృద్ధి చెందింది. దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లలో అమ్మకాలు గణనీయంగా పెరగటం ఎంతగానో కలిసివచ్చిందని కంపెనీ పేర్కొంది. కాగా త్రైమాసిక సమీక్షా కాలంలో కంపెనీ మొత్తం రెవెన్యూ రూ.10,312 కోట్ల నుంచి రూ.11,932 కోట్లకు పెరిగింది.

ఫేమ్-3 సిద్ధమవుతోంది..

కేంద్ర మంత్రి కుమారస్వామి

న్యూఢిల్లీ: దేశంలో విద్యుత్ వాహనాల (ఈవీ) వినియోగాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఫేమ్-3 పథకం రూపొందిస్తున్నదని, సమీప భవిష్యత్తులోనే దాన్ని అమలుపరిచే ఆస్కారం ఉన్నదని కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖా మంత్రి హెచ్‌డి కుమారస్వామి చెప్పారు. అయితే రాబోయే బడ్జెట్లో మాత్రం దీన్ని ప్రతిపాదించబోరని ఆయన స్పష్టం చేశారు. భారత ఆటోమొబైల్ తయారీదారుల సంఘం (సియామ్) నిర్వహించిన ఒక కార్యక్రమంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ మూడో దశ ఫేమ్ పథకం రూపకల్పన పనులు జరుగుతున్నాయని, వివిధ మంత్రిత్వ శాఖలు తమ తమ సిఫారసులు అందించాయని మంత్రి చెప్పారు. హైబ్రిడ్ వాహనాలపై పన్ను తగ్గింపు అంశం గురించి ప్రస్తావించగా ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో రోడ్ మ్యాప్‌పై చర్చించి తగు నిర్ణయం తీసుకుంటారని, ఆ తర్వాత దాన్ని ఆర్థిక మంత్రిత్వ శాఖ అమలుపరుస్తుందని తెలిపారు.

2 లక్షల మంది నిపుణులు అవసరం: 2030 నాటికి ఈవీల వినియోగం 30 శాతానికి పెంచాలన్న ప్రభుత్వ విజన్ సాకారం కావాలంటే 2 లక్షల మంది నిపుణులైన కార్మిక శక్తి అవసరమని సియామ్ అంటోంది. కార్మిక శక్తిని నియమించుకుని శిక్షణ ఇవ్వడంపై రూ.13,552 కోట్లు పెట్టుబడి అవసరం కావచ్చని అంచనా వేసింది.

మూడో రోజూ రికార్డుల మోత

● 81,000 దిశగా సెన్సెక్స్ ● 24,600 ఎగువకి నిఫ్టీ

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా మూడో రోజూ సరికొత్త శిఖరాలను అధిరోహించాయి. ఎఫ్ఎంసీజీ, టెలికాంతోపాటు కొన్ని ఐటీ రంగ షేర్లలో కొనుగోళ్లు, విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల కొత్త పెట్టుబడులు ఇందుకు దోహదపడ్డాయి. మంగళవారం ట్రేడింగ్‌లో సెన్సెక్స్ ఒక దశలో 233.44 పాయింట్లు ఎగబాకి 80,898.30 వద్ద ఆల్‌టైం ఇంట్రాడే రికార్డును నమోదు చేసింది. చివరికి 51.69 పాయింట్ల లాభంతో 80,716.55 వద్ద స్థిరపడింది. సూచీకిది సరికొత్త జీవితకాల గరిష్ఠ ముగింపు కూడా. నిఫ్టీ సైతం ఆరంభ సెషన్‌లో 74.55 పాయింట్లు పెరిగి 24,661.25 వద్ద ఆల్‌టైం ఇంట్రాడే రికార్డును, చివర్లో 26.30 పాయింట్ల లాభంతో 24,613 వద్ద కొత్త జీవితకాల గరిష్ఠ ముగింపును నమోదు చేసింది. రిలయన్స్ ఇండస్ట్రీస్, కోటక్ బ్యాంక్ షేర్లలో అమ్మకాలు మార్కెట్ లాభాలను పరిమితం చేశాయి. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 18 లాభపడ్డాయి.

● ఢిల్లీ బులియన్ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి (24 క్యారెట్లు) బంగారం ధర రూ.550 పెరిగి రూ.75,700 వద్దకు చేరుకోగా.. కిలో వెండి రూ.400 పెరుగుదలతో రూ.94,400 పలికింది.

నేడు మార్కెట్లకు సెలవు

మొహర్రం సందర్భంగా బీఎస్ఈ, ఎన్ఎస్ఈ బుధవారం సెలవు పాటించనున్నాయి. గురువారం నుంచి మార్కెట్లు యధావిధిగా పనిచేస్తాయి.

స్పోర్ట్స్

టీ20 కెప్టెన్‌గా సూర్యకుమార్?

వన్డే సిరీస్‌కు హార్దిక్ దూరం



న్యూఢిల్లీ: భారత టీ20 జట్టు కెప్టెన్ ఎంపికపై జాతీయ సెలెక్టర్లు ఆచితూచి వ్యవహరిస్తున్నారు. టీ20 వరల్డ్‌కప్‌లో వైస్‌కెప్టెన్‌గా వ్యవహరించిన హార్దిక్ పాండ్యానే కెప్టెన్‌గా కొనసాగిస్తారని అంతా భావించినా.. కోచ్ గంభీర్, చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ ఆలోచనలు మరోలా ఉన్నాయి. పాండ్యా ఫిట్‌నెస్ సమస్యలను దృష్టిలో ఉంచుకోవడంతో పాటు దీర్ఘకాలిక ప్రయోజనాల రీత్యా డాషింగ్ బ్యాటర్ సూర్యకుమార్ యాదవ్‌వైపే వీరు మొగ్గు చూపుతున్నారు. ఈనెలాఖరున ఆరంభమయ్యే శ్రీలంక సిరీస్‌తో పాటు 2026 టీ20 మెగా టోర్నీ వరకు సూర్యకే పగ్గాలు అప్పగించే అవకాశం ఉంది. ఈ విషయాన్ని ఇప్పటికే హార్దిక్‌కు కూడా చెప్పినట్టు సమాచారం. గతేడాది సూర్య ఆసీస్, దక్షిణాఫ్రికాలపై ఎనిమిది మ్యాచ్‌లకు కెప్టెన్‌గా వ్యహరించిన అనుభవం ఉంది. అలాగే తను డ్రెస్సింగ్‌రూమ్‌లో సహచరులతో కలివిడిగా ఉంటాడనే పేరుంది. మరోవైపు లంకతో వన్డే సిరీస్‌కు పాండ్యా వ్యక్తిగత కారణాలతో అందుబాటులో ఉండడం లేదు.

స్టార్ క్రికెటర్లు దేశవాళీల్లో ఆడాల్సిందే..

స్టార్ క్రికెటర్లు కూడా దేశవాళీ టోర్నీలకు అందుబాటులో ఉండాలని బీసీసీఐ కార్యదర్శి జైషా స్పష్టం చేశాడు. అయితే రోహిత్, విరాట్, బుమ్రా మాత్రం వారికిష్టమైతే ఆడవచ్చని తెలిపాడు. ఇతర టెస్టు స్పెషలిస్టులు మాత్రం దులీప్ ట్రోఫీలో కనీసం ఓ మ్యాచ్‌లోనైనా ఆడాల్సిందేనన్నాడు. ఈసారి దులీప్ ట్రోఫీ ఆటగాళ్లను జోనల్ సెలెక్షన్ కమిటీ కాకుండా జాతీయ సెలెక్షన్ కమిటీనే ఎంపిక చేయనుంది.

పసిడి పంచ్ పడేనా?



పారిస్ ఒలింపిక్స్‌కు మొత్తం ఆరుగురు భారత బాక్సర్లు అర్హత సాధించారు. వీరిలో నలుగురు మహిళా బాక్సర్లు కాగా.. ఇద్దరు పురుషులు. మేరీకోమ్ శకం ముగియడంతో.. తమదైన ముద్ర వేయడానికి యువ బాక్సర్లకు ఇదో సువర్ణావకాశం. ముఖ్యంగా మేరీ వల్ల ఎన్నో అవకాశాలను కోల్పోయిన తెలుగు బాక్సర్ నిఖత్ జరీన్.. అంతర్జాతీయస్థాయిలో మెరుగైన ప్రదర్శన కనబరుస్తోంది. ఈ క్రమంలో ఆమెపై భారీ అంచనాలుండగా.. టోక్యో కాంస్య పతక విజేత లవ్లీనా బోర్గొహైన్ ఈసారి పతకం రంగుమార్చాలన్న పట్టుదలతో ఉంది. అమిత్ పంగల్, నిషాంత్ దేవ్ కూడా సత్తా చాటాలనుకొంటున్నారు. మొత్తమ్మీద మన 'సూపర్ సిక్స్' బంపర్ హిట్ కొట్టాలన్న సంకల్పంతో ఉన్నారు.

నిఖత్ జరీన్

మేరీ కోమ్ శకం ముగియంతో.. నిఖత్ జరీన్ భారత బాక్సింగ్‌కు ముఖచిత్రంగా మారింది. 50 కిలోల విభాగం బరిలోకి దిగుతున్న నిఖత్‌పై భారీ అంచనాలున్నాయి. గతంలో ఇదే కేటగిరీలోకి మేరీ రావడంతో జరీన్‌కు చాన్సులు దక్కలేదు. మేరీ ఈసారి దూరమవడంతో.. 28 ఏళ్ల నిఖత్‌కు తొలిసారి ఒలింపిక్స్ ఆడే చాన్స్ లభించింది. ఆసియా క్రీడల్లో కాంస్యం నెగ్గడంతో జరీన్‌కు పారిస్ బెర్త్ ఖరారైంది. ప్రపంచ చాంపియన్‌షిప్‌లో వరుసగా 2 స్వర్ణాలు నెగ్గి జోరు మీదున్న నిఖత్ విశ్వక్రీడల్లోనూ సత్తా చాటేందుకు సిద్ధమైంది.

ప్రీతి పవార్



హరియాణాకు చెందిన 20 ఏళ్ల ప్రీతి పవార్ సంచలనాలు సృష్టించాలన్న పట్టుదలతో ఉంది. అంతగా అనుభవం లేకున్నా.. పెద్ద ఈవెంట్లలో మెరుగైన ప్రదర్శన చేస్తోంది. ఆసియా క్రీడల క్వార్టర్స్‌లో మూడు సార్లు వరల్డ్ చాంపియన్ జైనా షెకర్‌బెకోవాను ఓడించి సెమీస్ చేరడం ద్వారా.. పారిస్ బెర్త్ పట్టేసింది. ఖేలో ఇండియా, ఆసియా యూత్ చాంపియన్‌షిప్‌లో పతకాలు కొల్లగొట్టిన ప్రీతి.. 54 కిలోల విభాగం నుంచి పారిస్‌లో పోటీపడుతోంది.

నిషాంత్ దేవ్



పురుషుల్లో పారిస్ ఒలింపిక్ బెర్త్ సాధించిన తొలి భారత బాక్సర్ నిషాంత్ . వరల్డ్ క్వాలిఫయర్స్-2లో 71 కిలోల విభాగం క్వార్టర్స్‌లో గెలిచి విశ్వక్రీడలకు ఎంపికయ్యాడు. గాయాలతో ఇబ్బందులు పడినా వెరవకుండా పోరాడి పారిస్ టికెట్ సాధించిన ఈ ఆర్మీ కుర్రాడు.. ఒలింపిక్స్‌లోనూ పతకం నెగ్గాలన్న పట్టుదలతో ఉన్నాడు.

లవ్లీనా బోర్గొహైన్



టోక్యో విశ్వక్రీడల్లో కాంస్యం దక్కించుకొన్న అసోం బాక్సర్ లవ్లీనా.. వరుసగా రెండోసారి మెగా ఈవెంట్‌కు అర్హత సాధించింది. గతంలో 69 కిలోల విభాగంలో లవ్లీనా తలపడగా.. ఈ ఒలింపిక్స్‌లో ఆ వెయిట్ కేటగిరీని రద్దు చేశారు. దీంతో ఆమె 75 కిలోల విభాగంలో ఆసియాడ్ రజతంతో విశ్వక్రీడల చాన్స్ పట్టేసింది. ఇటీవలి కాలంలో ఆసియా, వరల్డ్ చాంపియన్‌షిప్ స్వర్ణాలతో మెరిసిన లవ్లీనా.. పారిస్‌లో తన పతకరంగును మార్చాలనుకుంటోంది.

పారిస్ ఒలింపిక్స్ 9 రోజుల్లో

జాస్మిన్ లంబోరియా



హరియాణా అమ్మాయి జాస్మిన్ లంబోరియాకు అదృష్టవశాత్తూ పారిస్ చాన్స్ లభించింది. 57 కిలోల కేటగిరీలో బెర్త్ దక్కించుకొన్న పర్వీన్ హుడా డోపింగ్ నిబంధనల్ని ఉల్లంఘించడంతో ఆమెపై వేటు పడింది. ఈ పరిస్థితుల్లో పర్వీన్ స్థానంలో జాస్మిన్ 60 కిలోల కేటగిరీ నుంచి 57 కిలోల విభాగానికి మారి ఒలింపిక్స్ క్వాలిఫయర్స్‌లో తలపడి పారిస్ బెర్త్ పట్టేసింది. ఇక, ఈ చాన్స్‌ను వదలొద్దనుకుంటోంది.

అమిత్ పంగల్



ఆశలు వదులుకొన్న సమయంలో అమిత్‌కు అనూహ్యంగా అవకాశం దక్కింది. వాస్తవంగా భారత బాక్సింగ్ సమాఖ్య దీపక్ బోరియావైపు మొగ్గుచూపింది. అయితే, తొలి క్వాలిఫయర్స్‌లో దీపక్ విఫలమవడంతో పంగల్‌కు చాన్స్ లభించింది. రెండో క్వాలిఫయర్స్‌లో అమిత్ క్వార్టర్స్ చేరి 51 కిలోల విభాగంలో ఒలింపిక్స్‌కు ఎంపికయ్యాడు. ఇతడు పతకం నెగ్గుతాడన్న నమ్మకం క్రీడా వర్గాల్లోనూ బలంగా ఉంది. టోక్యో క్రీడల్లోనూ పాల్గొన్న ఈ హరియాణా బాక్సర్.. పారిస్ నుంచి కచ్చితంగా పతకంతోనే రావాలనుకుంటున్నాడు.

మురికి నదిలో స్విమ్మింగ్ ఎలా?



పారిస్: ఫ్రాన్స్ రాజధాని పారిస్‌ను రెండుగా చీల్చుకుంటూ వెళ్లే సెన్ నదిపై ఇప్పుడు అందరి దృష్టీ నెలకొంది. ఒలింపిక్స్‌లో భాగంగా ఇందులోనే ట్రయాథ్లాన్, మారథాన్ స్విమ్మింగ్ పోటీలు జరగాల్సి ఉంది. అయితే అదే ఇప్పుడు సమస్యగా మారింది. ఎందుకంటే.. ఓ శతాబ్దానికి పైగా సెన్ నదిలో ఈత కొట్టడంపై నిషేధం కొనసాగుతోంది. ఆ నదిలో నీటి నాణ్యత అత్యంత ప్రమాదకర స్థాయిలో ఉండడమే దీనికి కారణం. వరద, మురికి నీరు అధికంగా చేరుతుండడంతో 1923 నుంచే ఇందులోకి ఎవరినీ అనుమతించడం లేదు. బ్యాక్టీరియాతో నిండిన ఆ జలాలు పొరపాటున నోట్లోకి వెళితే మనిషి తీవ్ర అనారోగ్యానికి గురవడం ఖాయం. ఈనేపథ్యంలో ఈత కోసం స్విమ్మర్లను అందులోకి ఎలా అనుమతిస్తారనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఈ సమస్య పరిష్కారం కోసం నది ప్రక్షాళనకై పారిస్ వేల కోట్లను ఖర్చు చేసినా నాణ్యత విషయంలో ఆశించిన ఫలితం కనిపించలేదు. ఇందులోకి మురికి నీటిని రాకుండా ఆపేందుకు ఆస్టర్లిట్జ్ రైల్వే స్టేషన్ పక్కన భారీ భూగర్భ నీటి నిల్వ బేసిన్‌ను సైతం నిర్మించారు. ఇది 20 ఒలింపిక్ స్విమ్మింగ్‌పూల్‌లకు సమానంగా ఉంటుంది. అందులో మురికి నీటిని శుద్ధి చేయనున్నారు. ఒకవేళ భారీ వర్షాలు కురిస్తే సెన్ ప్రవాహం ఎక్కువగా ఉంటుంది కాబట్టి ట్రయాథ్లాన్ వేదికను మార్చే ఆలోచనలో నిర్వాహకులున్నారు.

యశ్వంత్ మరో సాహసం

మౌంట్ కాంగ్ యాట్సేను అధిరోహించిన తెలంగాణ కుర్రాడు



హైదరాబాద్: పర్వతారోహణలో ఇప్పటికే ఎన్నో రికార్డులు సాధించిన తెలంగాణకు చెందిన భూక్యా యశ్వంత్ మరో ఘనత అందుకున్నాడు. తాజాగా లద్దాఖ్ ప్రాంతంలోని 6,250 మీటర్ల ఎత్తులో ఉన్న మౌంట్ కాంగ్ యాట్సే 2 పర్వతాన్ని విజయ వంతంగా అధిరోహించాడు. ఈ సాహసయాత్రను 8 రోజుల్లో ముగించాడు. మహబూబాబాద్ జిల్లా మరిపెడ ప్రాంతంలోని భూక్యా తండాకు చెందిన గిరిజన యువకుడైన యశ్వంత్.. ఇప్పటికే దక్షిణాఫ్రికాలోని కిలిమంజారో, రష్యాలోని ఎల్‌బ్రస్, ఆస్ట్రేలియాలోని కొసిజ్‌స్కో, హిమాచల్‌లోని యునమ్‌లాంటి పర్వతాలతో పాటు ఎవరెస్ట్ బేస్‌క్యాంప్‌ను అధిరోహించాడు. అలాగే మౌంట్ ఎవరెస్ట్‌ను కూడా అధిరోహించడం తన లక్ష్యమని యశ్వంత్ తెలిపాడు.

కెప్టెన్ అయ్యాక కోహ్లీ మారిపోయాడు!

అమిత్ మిశ్రా



న్యూఢిల్లీ: విరాట్ కోహ్లీ కెప్టెన్ అయ్యాక చాలా మారాడని, అతడికి స్నేహితులు కూడా తక్కువేనని వెటరన్ స్పిన్నర్ అమిత్ మిశ్రా వ్యాఖ్యానించాడు. కానీ తాజా కెప్టెన్ రోహిత్ శర్మ మాత్రం అలా కాదని, ఎవరితోనైనా సరదాగా ఉంటాడని కితాబిచ్చాడు. 'నాకు విరాట్ చిన్నప్పటినుంచే తెలుసు. కానీ జట్టు కెప్టెన్ అయ్యాక అతనిలో చాలా మార్పు కనిపించింది. నేనిప్పుడు తనతో గతంలో ఉన్నంత చనువుగా లేను. దాదాపుగా మాట్లాడుకోవడమే లేదు. అయితే క్రికెటర్‌గా విరాట్‌ను గౌరవిస్తాను. ఓ వ్యక్తికి పేరు, డబ్బు వచ్చాక అతడి దగ్గరికి ఇతరులు ఏదో ఆశించే వెళతారని భావిస్తారు. కానీ రోహిత్ స్వభావం విరాట్‌కు పూర్తి భిన్నం. నేను చాలా ఏళ్లుగా జట్టులో లేకపోయినా.. కెరీర్ ఆరంభంలో నాతో ఎలా ఉన్నాడో ఇప్పటికీ అలాగే ఉంటాడు. ఐపీఎల్‌లో కానీ బయట ఎక్కడ కనిపించినా సరదాగా మాట్లాడుతాడు' అని అమిత్ వివరించాడు. అలాగే గతేడాది ఐపీఎల్‌లో లఖ్‌నవూ పేసర్ నవీనుల్‌ను కోహ్లీనే మొదట దుర్భాషలాడాడని, అలాంటి వ్యక్తిని అతడు మున్ముందు ఎలా గౌరవిస్తాడని ప్రశ్నించాడు.

హర్భజన్ క్షమాపణ



న్యూఢిల్లీ: 'తౌబా తౌబా' పాటకు దివ్యాంగులను అనుకరిస్తూ చేసిన వీడియో వివాదస్పదమవడంతో మాజీ ఆఫ్ స్పిన్నర్ హర్భజన్ సింగ్ క్షమాపణ చెప్పాడు. ఇటీవల ముగిసిన వరల్డ్ చాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్ (డబ్ల్యూసీఎల్) టోర్నీ ఫైనల్లో పాకిస్థాన్‌పై గెలిచిన ఆనందంలో భారత వెటరన్స్ జట్టు సభ్యులైన యువరాజ్ సింగ్, సురేష్ రైనా, హర్భజన్ 'తౌబా తౌబా' పాటకు దివ్యాంగుల రీతిలో స్టెప్పులేశారు. ఈ వీడియోపై సోషల్ మీడియాలో పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. వీరిపై చర్యలు తీసుకోవాలని దివ్యాంగ న్యాయవాదులు, సామాజిక కార్యకర్తలు మండిపడడంతో హర్భజన్ 'ఎక్స్' వేదికగా క్షమాపణ కోరాడు. 'ఈ వీడియో ఎవరినీ కించపర్చడానికి చేయలేదు. మేమెంత అలసిపోయామో తెలియజేయడానికి పెట్టింది. ఒకవేళ ఎవరినైనా బాధిస్తే అందుకు క్షమాపణ చెబుతున్నా. నా సోషల్ మీడియా ఖాతా నుంచి ఆ వీడియోను తొలగించా. ఈ విషయాన్ని ఇంతటితో వదిలేయండి' అని హర్భజన్ అన్నాడు.

నిరుద్యోగుల సమస్యలపై మోదీకి జేఏసీ లేఖ

గ్రూప్ 2, 3 పోస్టులను పెంచాలని జంతర్‌మంతర్ వద్ద ధర్నా

న్యూఢిల్లీ, జూలై 16 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించకుండా రాజకీయం చేస్తోందని ప్రధాని మోదీకి తెలంగాణ నిరుద్యోగ జేఏసీ మంగళవారం లేఖ రాసింది. అంతకు ముందు.. గ్రూప్ 2, 3 పోస్టులను పెంచాలని, డీఎస్సీ పరీక్షలను 45 రోజుల పాటు వాయిదా వేయాలని జంతర్‌మంతర్ వద్ద జేఏసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. గ్రూప్ 1 మెయిన్స్‌కు 1:100 చొప్పున అభ్యర్థులను ఎంపిక చేయాలని జేఏసీ చైర్మన్ డి. మోతీలాల్ నాయక్ డిమాండ్ చేశారు. తమ డిమాండ్ల పరిష్కారం కోసం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఇంటిని ముట్టడించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ తీరు వల్ల 12 ఏళ్లుగా ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

గల్ఫ్ కార్మిక కుటుంబాలకు పథకాలు అందించాలి

- ముఖ్యమంత్రికి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి లేఖ

హైదరాబాద్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): విదేశాల్లో ఉపాధి పొందుతూ రాష్ట్ర ఖజానాకు ఆదాయాన్ని సమకూర్చుతున్న గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం చర్యలు తీసుకోవాలని, గల్ఫ్ కార్మికుల కుటుంబాల మృతులకు రూ. 5లక్షలు ఎక్స్‌గ్రేషియా అందించి ఆదుకోవాలని కాంగ్రెస్ ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన సీఎం రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. రాష్ట్రానికి చెందిన నిరుద్యోగ యువత సుమారు 10శాతం వరకు గల్ఫ్ దేశాల్లో ఉపాధి పొందుతున్నట్టు లేఖలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాల్లో గల్ఫ్ కార్మికుల కుటుంబాలకు ప్రాధాన్యత కల్పించాలని కోరారు. రాష్ట్రంలో ఉపాధి లేకపోవడంతో గత్యంతరం లేక తెలంగాణ నుంచి సుమారు 15 లక్షలకు పైగా యువత గల్ఫ్ దేశాలకు వలస వెళ్లినట్టు పేర్కొన్నారు.

నాడు.. రేవంత్, సీతక్కలను సచివాలయంలోకి రానిచ్చారా?: ఆది శ్రీనివాస్

హైదరాబాద్, జూలై 16(ఆంధ్రజ్యోతి): ప్రొటోకాల్ గురించి ఇప్పుడు మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు.. పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు అమలు చేశారా అంటూ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రశ్నించారు. ఎంపీ హోదాలో రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే హోదాలో సీతక్కలను కనీసం సచివాలయంలోకి రానిచ్చారా అన్నారు. తాము ఎమ్మెల్యేలను కొనుగోలు చేస్తున్నామంటున్న కేటీఆర్.. గతంలో ఇతర పార్టీలకు చెందిన 60 మంది ఎమ్మెల్యేలను తీసుకున్నప్పుడు ఎంతకు కొనుగోలు చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. సాంకేతిక అంశాల ఆధారంగానే విద్యుత్తు కొనుగోళ్లపై వేసిన విచారణ కమిషన్ చైర్మన్‌ను మార్చాలంటూ సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని, గులాబీ తమ్ముళ్లు దీన్ని చూసి సంబరపడాల్సిన అవసరం లేదని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ గాంధీభవన్‌లో అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేస్తుంటే.. బీఆర్ఎస్ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారని కిసాన్ కాంగ్రెస్ జాతీయ ఉపాధ్యక్షుడు కోదండ రెడ్డి అన్నారు. రైతులకు ఏకకాలంలో రూ. 2 లక్షల రుణాన్ని మాఫీ చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డిని రైతుల మర్చిపోలేరని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ అన్నారు.

సీఎం రేవంత్ సాయంతోనే పర్వతారోహణ

భూక్యా యశ్వంత్

హిమాలయాల్లోని 6250 మీటర్ల ఎత్తైన పర్వతం మౌంట్ కాంగ్ యాట్సే-2ను మహబూబాబాద్ జిల్లా ఉల్లేపల్లి భూక్యా తండాకు చెందిన యువకుడు భూక్యా యశ్వంత్ విజయవంతంగా అధిరోహించాడు. భారత త్రివర్ణ పతాకంతోపాటు సీఎం రేవంత్ రెడ్డి చిత్రాన్ని శిఖరంపై నిలబెట్టాడు. ఈ సందర్భంగా భూక్యా యశ్వంత్ సీఎంకు ధన్యవాదాలు తెలుపుతూ లేఖ రాశాడు. ముఖ్యమంత్రి ఆర్థిక సహాయంతోనే ఈ ఘనత సాధ్యమైందని లేఖలో పేర్కొన్నాడు. గత నెలలో యశ్వంత్ ఆసక్తిని, ప్రతిభను గుర్తించిన సీఎం రేవంత్ తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ నుంచి రూ.5 లక్షల ఆర్థిక సాయం అందించారు.

పెండింగ్ అంశాలపై సభలో నిలదీస్తాం: చామల

న్యూఢిల్లీ, జూలై 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విభజన చట్టంలోని పెండింగ్ అంశాలపై పార్లమెంటులో నిలదీస్తామని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రానికి చెందిన మొత్తం 31 అంశాలు కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్నాయని, వాటి పరిష్కారం కోసం రాష్ట్రానికి చెందిన కాంగ్రెస్ ఎంపీలతో పాటు బీజేపీ ఎంపీలు పార్లమెంటులో గళమెత్తాలని కోరారు. బీజేపీ తెలంగాణ ఎంపీలు ఎంతసేపు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని దూషించడమే తప్ప రాష్ట్ర ప్రజలకు వారు చేసేదేమిటో చెప్పడం లేదని విమర్శించారు.

రుణమాఫీ బేషరతుగా అమలు చేయాలి: ఈటల

హైదరాబాద్, జూలై 16(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు హామీ ఇచ్చినట్లుగా రైతులకు రూ.2లక్షల రుణమాఫీని బేషరతుగా అమలు చేయాలని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ పథకం నిబంధనలు రైతులకు ఉరితాడుగా మారాయని విమర్శించారు. రేషన్ కార్డు పేరుతో సగం మందికి, ఆదాయ పన్ను పేరుతో 20 శాతం మందికి, రీ షెడ్యూల్ పేరుతో ఇంకొంత మందికి మొత్తంగా రుణమాఫీ ఎగ్గొడుతున్నారని ఆరోపించారు. రూ.34 వేల కోట్ల రుణమాఫీని ఒకేసారి బేషరతుగా అమలు చేస్తామని చెప్పిన రేవంత్.. ఇప్పుడు నిబంధనల పేరుతో ఇవ్వబోమని చెప్పకనే చెబుతున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపులు ప్రోత్సహించడంలో రేవంత్.. కేసీఆర్‌ను మించిపోయారని విమర్శించారు. జేఎన్‌టీయూలో భవనం ప్రారంభోత్సవం సందర్భంగా స్థానిక ఎంపీగా తనను ఆహ్వానించాల్సిన సంస్కారం అధికారులకు ఉండాలని ఈటల అన్నారు. రాష్ట్రంలో దేవాదాయ శాఖ భూముల పరిరక్షణకు ప్రభుత్వం విధాన నిర్ణయం తీసుకోవాలని బీజేపీ సీనియర్ నేత పేరాల శేఖర్‌రావు డిమాండ్ చేశారు. రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం సీతారాంపురం గ్రామంలోని సీతారామస్వామి ఆలయానికి సంబంధించి 1,148 ఎకరాల భూమిని బీఆర్ఎస్ ప్రభుత్వం టీఎస్ఐఐసీకి కేటాయించి, దాని ద్వారా తమకు అనుకూలంగా ఉన్న పారిశ్రామిక వేత్తలకు ధారాదత్తం చేసిందని చెప్పారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే వైఖరి అనుసరిస్తోందని ఆరోపించారు.

సుప్రీం వ్యాఖ్యలు రేవంత్‌కి చెంపపెట్టు:వేముల

హైదరాబాద్, జూలై16(ఆంధ్రజ్యోతి): విద్యుత్ విచారణ కమిషన్ చైర్మన్‌పై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ చేసిన వ్యాఖ్యలు సీఎం రేవంత్‌రెడ్డికి చెంపపెట్టు లాంటివని మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కక్షసాధింపుతోనే కేసీఆర్‌పై బురద జల్లుతోందని, సుప్రీంకోర్టు వ్యాఖ్యలు తమ వాదనకు బలంచేకూర్చేలా ఉన్నాయన్నారు.

బీజేపీలో బీఆర్ఎస్ విలీనమా..? పొత్తా..?: ఒవైసీ

హైదరాబాద్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఇటీవల బీఆర్ఎస్ నేత వినోద్ చేసిన ప్రకటన పలు అనుమానాలకు తావిస్తోందని, బీజేపీలో విలీనమా...? పొత్తా అనే విషయాన్ని బీఆర్ఎస్ నేతలే స్పష్టం చేయాలని మజ్లిస్ పార్టీ అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. మంగళవారం దారుల్‌సలాం పార్టీ కార్యాలయంలో అసదుద్దీన్ విలేకరులతో మాట్లాడారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైన తర్వాత అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్‌తో మజ్లిస్ మిత్ర పక్షంగా వ్యవహరించిందని ఆయన గుర్తుచేశారు. అయితే ఇటీవలి కాలంలో ఆ పార్టీ వ్యవహారాలు, నేతల తీరుపై ఒవైసీ సందేహం వ్యక్తం చేశారు. కాగా, జమ్ము కశ్మీర్‌లోని దోడాలో జరిగిన ఉగ్రదాడిని ఆయన ఖండించారు. సైనికులు.. ప్రాణాలు కోల్పోడానికి మోదీ ప్రభుత్వం వైఫల్యమే కారణమని విమర్శించారు. కాషాయ పాలకులు ఉగ్రవాదాన్ని నియంత్రించలేకపోతున్నారని విమర్శించారు.

రిజిస్ట్రేషన్ చార్జీల్లో మహిళలకు రాయితీకి విజ్ఞప్తి

- సీఎం దృష్టికి తీసుకువెళ్తానన్న మంత్రి సీతక్క

సాగు భూములను మహిళల పేరిట రిజిస్టర్ చేయించినప్పుడు రిజిస్ట్రేషన్ చార్జీల్లో రాయితీ కల్పించాలని 'మహిళా కిసాన్ అధికార్ మంచ్' చేసిన ప్రతిపాదనకు మంత్రి సీతక్క సానుకూలంగా స్పందించారు. విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి విధానపరమైన నిర్ణయం తీసుకునేలా ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. కిసాన్ అధికార్ మంచ్ ప్రతినిధులు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్కను మంగళవారం కలిశారు. సాగుభూమి రిజిస్ట్రేషన్ చార్జీల్లో మహిళా రైతులకు రాయితీ కల్పించాలని, మ్యుటేషన్ చార్జీలు, స్టాంప్ డ్యూటీ కూడా తగ్గించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు.



చిన్నారితో మొక్క నాటుతున్న మంత్రి సీతక్క

అంగన్‌వాడీలకు రిటైర్మెంట్ ప్రయోజనాలు

- టీచర్లకు రూ.2 లక్షలు, ఆయాలకు రూ.లక్ష వరకు లబ్ధి!
- రెండు, మూడు రోజుల్లో ఉత్తర్వులు..: సీతక్క

హైదరాబాద్, జూలై 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేసే టీచర్లు, ఆయాలకు ఉద్యోగ విరమణ ప్రయోజనాలు అందించనున్నట్లు మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. దీంతో టీచర్లకు రూ.2 లక్షలు, ఆయాలకు రూ.లక్ష వరకు లబ్ధి చేకూరుతుందని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన ఫైల్‌ను ఆర్థిక శాఖ ఇప్పటికే పరిష్కరించిందని, రెండు, మూడు రోజుల్లో ఉత్తర్వులు విడుదలవుతాయని చెప్పారు. మంగళవారం హైదరాబాద్ రహ్మత్‌నగర్‌లో 'అమ్మ మాట-అంగన్‌వాడీ బాట' కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అంగన్‌వాడీల్లో పని చేస్తూ రిటైర్ అయినవారికి ఆర్థిక ప్యాకేజీ ఇస్తామని చెప్పి బీఆర్ఎస్ ప్రభుత్వం మోసం చేసిందని విమర్శించారు. తమ ప్రభుత్వం మాత్రం ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉందన్నారు. అందులో భాగంగానే రిటైర్ అవుతున్న అంగన్‌వాడీలకు ప్రయోజనాలను ప్రకటించిందని వివరించారు. కాగా, అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల సంఖ్యను పెంచేందుకు చేపట్టిన 'అమ్మ మాట-అంగన్‌వాడీ బాట'ను విజయవంతం చేయాలని మంత్రి సీతక్క కోరారు. కార్పొరేట్ స్కూళ్లకు తీసిపోనివిధంగా అంగన్‌వాడీలను తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. పిల్లలను అంగన్‌వాడీలకు పంపండి.. వారి బాధ్యత ప్రభుత్వం చూసుకుంటుంది అని మంత్రి భరోసానిచ్చారు. మాతృత్వం, మానవత్వాన్ని మేళవించి పిల్లలను అక్కున చేర్చుకోవాలని టీచర్లు, ఆయాలకు సూచించారు. కార్యక్రమానికి ముందు పిల్లలతో కలిసి మంత్రి మొక్కలు నాటించారు.

స్వచ్ఛందంగా తప్పుకొన్నవారికీ ఇవ్వాలి..

స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేసిన అంగన్‌వాడీలకూ ప్రభుత్వం ప్రయోజనాలను వర్తింపజేయాలని, ఉత్తర్వుల్లో పొందుపర్చాలని సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్కను తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్-హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు నల్లా భారతి కోరారు. రాష్ట్ర ప్రభుత్వం టీచర్లు, ఆయాలకు ప్రకటించిన ప్రయోజనాల పట్ల ఆమె హర్షం వ్యక్తం చేశారు.

అనుమానమే తప్పు సుప్రీం తప్పుబట్టలేదు

విలేకరుల ముందు నేను అభిప్రాయం చెప్పలేదు.. ఊహాజనిత కథనాల వల్లే మాట్లాడాల్సి వచ్చింది

- విద్యుత్ ఒప్పందాలపై నివేదిక రెడీగా ఉంది
- కేసీఆర్ సుప్రీంకు వెళ్లడం వల్లే ఆగాను
- విలేకరులతో జస్టిస్ నర్సింహారెడ్డి వ్యాఖ్యలు

న్యూఢిల్లీ/హైదరాబాద్, జూలై 16(ఆంధ్రజ్యోతి): విలేకరుల సమావేశంలో తాను అభిప్రాయం వ్యక్తం చేసినట్లు సుప్రీంకోర్టు అనుమానం వ్యక్తం చేసిందే తప్ప నిర్ధారణకు రాలేదని జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి అన్నారు. సుప్రీంకోర్టు లోతుగా విచారిస్తే నిజం తెలిసేదని చెప్పారు. కొన్ని పత్రికలు ఊహాజనిత కథనాలు రాసుకుంటూ పోవడం వల్లే, వాటికి అడ్డుకట్ట వేయడం కోసం జరిగిన పరిణామాలను విలేకరుల సమావేశంలో వివరించానన్నారు. ఫలానా వాళ్లు అలా అంటున్నారని చెప్పానే తప్ప తన అభిప్రాయం చెప్పలేదని స్పష్టం చేశారు. తన ముందుకు వచ్చిన సమాచారాన్ని(ఫ్యాక్ట్స్) ఎక్కడా బయట పెట్టలేదన్నారు. కమిషన్ బాధ్యతల నుంచి తనను తప్పించాలని సుప్రీంకోర్టు నిర్ణయించిన నేపథ్యంలో జస్టిస్ నర్సింహారెడ్డి మంగళవారం విలేకరులతో మాట్లాడారు. కేసీఆర్ హైకోర్టులో కేసు వేయడంతో వారం రోజులు ఆగానని, ఆయన తప్ప మిగతా అందరూ సమాధానాలివ్వడంతో నివేదికను సిద్ధం చేశానని వెల్లడించారు. కేసీఆర్ సుప్రీంకోర్టుకు వెళ్లడంతో పూర్తిగా ఆగిపోయినట్లు చెప్పారు. అందరి అభిప్రాయాలను తీసుకొని సమగ్రంగా నివేదికను రూపొందించానన్నారు. ఎంతో కష్టపడి రూపొందించిన నివేదిక ఇప్పుడు మృతప్రాయమని, చెత్తబుట్టలో పడేయడానికి మినహా ఎందుకూ పనికిరాదని ఆవేదన వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు వ్యాఖ్యలపై స్పందించదలచుకోలేదని జస్టిస్ నర్సింహారెడ్డి అన్నారు. గతంలో కమిషన్ ఆఫ్ ఎంక్వైరీస్ చట్టం కింద ఏర్పాటైన కమిషన్‌లు విలేకరుల సమావేశం నిర్వహించకుండా పని చేసినవి ఏవైనా ఉంటే తనకు చెప్పాలని అడిగారు. తాను జడ్జిగా ఉన్న సమయంలో తీర్పులు ఇచ్చేముందు చాలాసార్లు ఉన్నత స్థాయి నుంచి బెదిరింపులు, మధ్యవర్తిత్వాలు ఎన్నెన్నో జరగాయని చెప్పారు. న్యాయవ్యవస్థలో ఉన్నందున వాటికి లొంగకుండా సరైన రీతిలో చేసుకుంటూ పోయానని అన్నారు. సుప్రీంకోర్టు తీర్పు తర్వాత తన పట్ల కొంతమంది అజ్ఞానంతో, అహంకారంతో మాట్లాడారని వ్యాఖ్యానించారు. తాను సమాజ శ్రేయస్సును కోరుకునే వ్యక్తినని చెప్పారు. అడ్డదారులు తొక్కడం, మిడిసిపడడం తన జీవితంలో లేదన్నారు. పెద్ద పెద్ద చక్రవర్తులే కాలగర్భంలో కలిసిపోయారని, తన పట్ల చేసిన వ్యాఖ్యలు వాళ్ల సంస్కారమేంటో తెలియజేస్తున్నాయని అన్నారు. డబ్బు అహంకారంతో మాట్లాడితే కాలమే సమాధానం చెబుతుందని వ్యాఖ్యానించారు. విచారణకు హాజరయ్యే క్రమంలో కవిత తీరును అందరూ చూశారని, ఇప్పుడు ఆమె ఎక్కడుందని ప్రశ్నించారు. విచారణలో భాగంగా తాను ఎవరికీ నోటీసులు ఇవ్వలేదని, 28 మందికీ లేఖలు మాత్రమే రాసినట్లు తెలిపారు. తప్పు చేసినట్లు కూడా లేఖల్లో ఎక్కడా పేర్కొనలేదన్నారు. తన లేఖలకు కేసీఆర్ తప్ప మిగతా వారంతా స్పందించి, అభిప్రాయాలు చెప్పారని వెల్లడించారు. విచారణకు హాజరు కావాలని ఏ ఒక్కరినీ అడగలేదన్నారు. అందరికీ అవకాశం మాత్రమే ఇచ్చామని తెలిపారు. కేసీఆర్ లేఖలో సమాజం అంగీకరించే భాష వాడలేదని జస్టిస్ నర్సింహారెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. విచారణ కమిషన్ చైర్మన్‌గా ఉన్న తనను తప్పుకోవాలని కేసీఆర్ లేఖ రాశారని ప్రస్తావించారు. కమిషన్లు ఏర్పాటు చేసేదే ప్రజలకు అన్ని విషయాలు తెలియజేయడం కోసమని గుర్తు చేశారు. సుప్రీం నిర్ణయం నేపథ్యంలో ఇక తన నివేదిక తన వ్యక్తిగతమని చెప్పారు. దానిపై ఎవరికీ హక్కు లేదన్నారు. "కమిషన్ ఇచ్చే నివేదికను రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించవచ్చు, తిరస్కరించవచ్చు. ఎవరైనా సవాల్ చేయవచ్చు" అన్నారు.



విచారణ మళ్లీ మొదటికి!

సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో విద్యుత్ విచారణ కమిషన్ బాధ్యతల నుంచి జస్టిస్ ఎల్.నర్సింహారెడ్డి తప్పుకోవడంతో విచారణ మళ్లీ మొదటికి వచ్చింది. ఇప్పటివరకు తాను రూపొందించిన నివేదిక మృతప్రాయమని, తన వ్యక్తిగతమని ఆయన ప్రకటించిన నేపథ్యంలో కొత్తగా వేసే కమిషన్ మళ్లీ సమాచార సేకరణ చేపట్టాల్సి ఉంటుందని భావిస్తున్నారు. పోటీ బిడ్డింగ్ లేకుండా ఛత్తీస్‌గఢ్‌తో విద్యుత్ ఒప్పందం చేసుకోవడం, నామినేషన్ ప్రాతిపదికన భద్రాద్రి, యాదాద్రి థర్మల్ ప్లాంట్‌ల నిర్మాణంపై గత మార్చి 14వ తేదీన జస్టిస్ ఎల్.నర్సింహారెడ్డితో ప్రభుత్వం కమిషన్ వేసింది. విచారణలో భాగంగా ఆయన 28 మందికి లేఖలు రాశారు. ఇతరులు కూడా తమకు తెలిసిన సమాచారం అందించాలన్నారు. విద్యుత్ నిపుణులు కంచర్ల రఘు, ఎం.తిమ్మారెడ్డి, ఎం.వేణుగోపాల్ రావు, గోపాలకృష్ణన్, టీజేఎస్ అధ్యక్షుడు కోదండరామ్‌లు కమిషన్ ముందుకు వచ్చి కేసీఆర్ ఆధ్వర్యంలో అవకతవకలు జరిగినట్లుగా ఆరోపించారు. ఆరోపణల్లో వాస్తవాలెంతో చెప్పాలని కమిషన్ మాజీ సీఎం కేసీఆర్‌కు లేఖ రాసింది. విచారణ తీరుతెన్నులను మీడియాకు జస్టిస్ ఎల్.నర్సింహారెడ్డి వివరించడాన్ని తప్పుపడుతూ 12 పేజీలతో కమిషన్‌కు కేసీఆర్ లేఖ రాశారు. కమిషన్‌ను రద్దు చేయాలని హైకోర్టులో పిటిషన్ వేశారు. అక్కడ ఊరట లభించలేదు. తాజాగా సుప్రీంకోర్టులో కేసు వేయగా, జస్టిస్ ఎల్.నర్సింహారెడ్డిని తప్పుకోవాలని ఆదేశించినా వారం రోజుల్లో కొత్త కమిషన్ వేయాలని చెప్పింది. సోమవారం నాటికల్లా కమిషన్‌కు చైర్మన్‌ను ప్రకటించనున్నారు.

సాగు చేయని భూములపై ఆరా!

(మొదటిపేజీ తరువాయి)

సీజన్‌లో రాష్ట్ర వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో క్రాప్ బుకింగ్ చేస్తున్నారు. ఏ గ్రామంలో.. ఏ సర్వే నంబరులో.. ఏ రైతు.. ఏ పంట సాగు చేస్తున్నారనే వివరాలను క్రాప్ బుకింగ్ పోర్టల్‌లో నమోదు చేస్తున్నారు. అయితే ధరణి రికార్డుల ప్రకారం రాష్ట్రంలో కోటిన్నర ఎకరాల్లో వ్యవసాయ భూములు ఉన్నాయి. కానీ, క్రాప్ బుకింగ్‌కు వచ్చేసరికి వానాకాలంలో కోటి 25 లక్షల ఎకరాల వరకు సాగవుతుండగా, యాసంగిలో 75 లక్షల ఎకరాలు దాటడంలేదు. మరోవైపు రాష్ట్రంలో శాశ్వత బీడు భూముల జాబితాలో 18.56 లక్షల ఎకరాలు ఉన్నాయి. వీటిలో రాళ్లు, రప్పలు, ముళ్లకంపలు ఉన్నప్పటికీ.. వ్యవసాయ భూముల జాబితాలో ఉండటంతో ప్రభుత్వం రైతుబంధు సాయం అందజేసింది. కాగా, ఏఈవోలు చేపట్టే క్రాప్ బుకింగ్‌లో ఇలాంటి భూములను 'నో క్రాప్' జాబితాలో రాస్తున్నారు. ప్రతి సీజన్‌లో ఈ భూములు నో క్రాప్ జాబితాలోనే ఉంటున్నాయి. అలాంటి వాటిపై ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం సర్వే చేయిస్తోంది. కరీంనగర్, హనుమకొండ, ఖమ్మం, సంగారెడ్డి, కామారెడ్డి జిల్లాల్లో పైలట్ ప్రాజెక్టు కింద సర్వే చేస్తున్నారు. అయితే పంట వేయని భూముల వివరాలను రాష్ట్ర వ్యవసాయ కమిషనర్ కార్యాలయం నుంచే పంపించారు. ఉదాహరణకు... కామారెడ్డి జిల్లాలో 35,368 సర్వే నెంబర్లను సర్వే కోసం ఇచ్చారు. ఈ సర్వే నంబర్లలో 15,075 ఎకరాల విస్తీర్ణంలో భూమి ఉంది. దీనిపై ఏఈవో, పంచాయతీ కార్యదర్శులు క్షేత్రస్థాయి సర్వే చేపట్టారు. ఇప్పటికే 35,365 సర్వే నంబర్లలో 15,068 ఎకరాల భూమిని పరిశీలించారు. ఇందులో 8,534 ఎకరాల్లో పంటలు వేస్తున్నారని, 6,535 ఎకరాల్లో సాగు చేయడంలేదని తేలింది. ఈ వివరాలను రాష్ట్ర కార్యాలయానికి పంపించారు. ఇదే పద్ధతిలో మరో 4జిల్లాల్లో కూడా సర్వే సాగుతోంది. అయితే మొత్తం సర్వే నంబర్లపై కాకుండా.. కేవలం ఎంపిక చేసిన సర్వే నంబర్లపైనే ఈ సర్వే జరుగుతోంది. ఈ వారంలో సర్వే పూర్తయ్యే అవకాశాలున్నాయి.

రేవంత్ ఎంపీగా ఉన్నప్పుడు..

మీరు ప్రొటోకాల్ పాటించారా?

- ఇప్పుడు అడగడంలో అర్థం ఉందా?
- సంగారెడ్డిలో గెలిచిన నన్ను కాదని ఓడిన నేతతో శంకుస్థాపనలు చేయించలేదా?
- కేటీఆర్, హరీశ్‌లకు జగ్గారెడ్డి సూటి ప్రశ్న

హైదరాబాద్, జూలై 16(ఆంధ్రజ్యోతి): రేవంత్‌రెడ్డి ఎంపీగా ఉన్నప్పుడు.. ఆయన నియోజకవర్గమైన మల్కాజిగిరిలో ప్రొటోకాల్‌ను పాటించని కేటీఆర్, హరీశ్‌రావులు.. ఇప్పుడు ప్రొటోకాల్ గురించి అడగడంలో అర్థం లేదని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి అన్నారు. సంగారెడ్డికి తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు.. అప్పటి మంత్రి హరీశ్ రావు.. తనను పక్కన పెట్టి ఓడిపోయిన బీఆర్ఎస్ అభ్యర్థితో శంకుస్థాపనలు, కొబ్బరి కాయలు కొట్టించలేదా అని ప్రశ్నించారు. గాంధీభవన్‌లో మంగళవారం మీడియా సమావేశంలో జగ్గారెడ్డి మాట్లాడుతూ.. గత నాలుగైదు రోజులుగా ప్రొటోకాల్‌కు సంబంధించి సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులపైన ఆరోపణలు చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ పాలన ముందు వారి అనుభవం, వయసు చాలా చిన్నదని విమర్శించారు. సంగారెడ్డి మునిసిపల్ చైర్మన్‌గా తాను ఉన్నప్పుడు.. అప్పటి సీఎం చంద్రబాబు సంగారెడ్డిలో ఏవైనా కార్యక్రమాలకు వస్తే.. ప్రొటోకాల్ ప్రకారం తనను పిలిచేవారన్నారు. అలాగే కాంగ్రెస్ ముఖ్యమంత్రులు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి నుంచి కిరణ్‌కుమార్‌రెడ్డి వరకు ప్రతిపక్ష నాయకులకు ప్రొటోకాల్ ప్రకారం అపాయింట్‌మెంట్లు ఇచ్చేవారన్నారని గుర్తు చేశారు. నాడు ఎంపీగా ఉన్న రేవంత్‌రెడ్డి మునిసిపల్ శాఖ ముఖ్య కార్యదర్శిని కలిసేందుకు సచివాలయానికి వెళ్తుండగా రోడ్డుమీదే ఆపేశారని, దీనికి జవాబు చెప్పి ప్రొటోకాల్ గురించి మాట్లాడితే బాగుంటుందని సూచించారు. తాను సంగారెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమాల్లో అప్పటి మంత్రి హరీశ్ రావు.. తనను పక్కన పెట్టి ఓడిపోయిన బీఆర్ఎస్ అభ్యర్థితో కొబ్బరికాయలు కొట్టించలేదా అని నిలదీశారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ప్రతిపక్షాలకు అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వలేదని విమర్శించారు.ప్రజా సమస్యల పరిష్కారం కోసం వచ్చిన వాళ్లతో సచివాలయంలోని తమ మంత్రుల చాంబర్లు కిటకిటలాడుతున్నాయని ఆయన అన్నారు.



గాంధీభవన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న జగ్గారెడ్డి

సబితను గౌరవించాం కదా!

మహేశ్వరం నియోజకవర్గంలోని ఓ కార్యక్రమంలో ప్రొటోకాల్ వివాదంపై జగ్గారెడ్డి స్పందిస్తూ.. "ఆ కార్యక్రమంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డికి కుర్చీ వేసి గౌరవించిన తర్వాతనే.. కాంగ్రెస్ నేత, మాజీ ఎమ్మెల్యే కేఎల్‌ఆర్‌కు కుర్చీ వేసి గౌరవించారు. ఇందులో తప్పేముంది? ప్రొటోకాల్ పాటించినం కదా?" అన్నారు. కేసీఆర్ ప్రొటోకాల్‌ను పాటించనప్పుడు మాట్లాడని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్.. ఇప్పుడు ప్రశ్నించడంలో అర్థం లేదన్నారు.

అత్తారిల్లు.. తల్లిగారిల్లులా రాజకీయాలు!

ప్రస్తుత రాజకీయాలు అత్తారిల్లు.. తల్లిగారిల్లులా మారాయని జగ్గారెడ్డి అన్నారు. నాయకులు పార్టీలు మారడం సాధారణంగా మారిపోయిందని, ఇది తీవ్రమైన విషయమే కాదని చెప్పారు. ప్రజలూ పెద్దగా పట్టించుకోవట్లేదని, ఇప్పుడున్న రాజకీయ పరిస్థితుల్లో దీనిపైన చర్చ కూడా వృథాయేనన్నారు.

ఆ పది మందిపై అనర్హత వేటు వేయండి

- పార్టీ మారిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోండి
- అసెంబ్లీ స్పీకర్‌కు బీఆర్ఎస్ ఎమ్మెల్యేల పిటిషన్లు

హైదరాబాద్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): తాజా రాజకీయ పరిణామాల నేపథ్యంలో ప్రతిపక్ష బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను ప్రత్యేకంగా కలిశారు. అధికారం కోల్పోయాక.. ప్రతిపక్ష హోదాలో ఆ పార్టీ ఎమ్మెల్యేలు మూకుమ్మడిగా స్పీకర్‌ను కలవడం ఇదే మొదటిసారి. అయితే ముందుగానే ఆయన అపాయింట్‌మెంట్ తీసుకున్న వారు.. మంగళవారం ఉదయం 11గంటల వరకు అసెంబ్లీ ప్రాంగణానికి చేరుకున్నారు. అంతకు ముందు పార్టీ ఎమ్మెల్యేలంతా బీఆర్ఎస్ఎల్పీలో సమావేశమై.. స్పీకర్‌తో ఏయే అంశాలు చర్చించాలి.. క్షేత్రస్థాయి పరిస్థితులను ఏవిధంగా వెల్లడించాలన్న దానిపై సమాలోచన చేశారు. అనంతరం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీలో స్పీకర్ వద్దకు వెళ్లి ఆయనకు పలు విజ్ఞాపనలు చేశారు. ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన 10మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలని, వారి శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేయాలని స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు పిటిషన్లు సమర్పించారు. బీఆర్ఎస్ బీ ఫామ్‌పై గెలిచి పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన వారిపై అనర్హత వేటు వేయాలని కోరారు. 2020లో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన వారిపై స్పీకర్ మూడు నెలల్లో చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని.. దాని ప్రకారం 10మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలని వారు విన్నవించారు. పలు నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు ప్రొటోకాల్ అమలు చేయడంలేదని, ఉద్దేశపూర్వకంగా చేస్తున్న ప్రొటోకాల్ ఉల్లంఘనను కట్టడి చేయాలని స్పీకర్‌కు విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు గెలిచిన చోట్ల ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం లేకుండా చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. వీటన్నింటిపై దృష్టి సారించి.. పరిష్కరించాలని వారు కోరారు. స్పీకర్‌ను కలిసిన వారిలో ఎమ్మెల్యేలు కేటీఆర్, హరీశ్‌రావు, సబితాఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, పద్మారావుగౌడ్, ప్రశాంత్‌రెడ్డి, మాధవరం కృష్ణారావు, మర్రి రాజశేఖర్‌రెడ్డి, కాలేరు వెంకటేశ్; ముఠాగోపాల్, మాగంటి గోపీనాథ్, కల్వకుంట్ల సంజయ్, కేపీ వివేకానంద ఉన్నారు.



స్పీకర్‌కు వినతి పత్రం ఇస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు

సుప్రీం కోర్టును ఆశ్రయిస్తాం: కేటీఆర్

ఢిల్లీలో బడేభాయ్ నరేంద్ర మోదీ రాజ్యాంగబద్ధ సంస్థలను ఉపయోగించుకున్నట్లుగానే.. ఇక్కడ చోటేభాయ్ రేవంత్‌రెడ్డి ప్రభుత్వ విభాగాలను ప్రయోగించి తమ పార్టీ ఎమ్మెల్యేలపై బెదిరింపులకు పాల్పడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. పార్టీ ఎమ్మెల్యేలతో కలిసి.. ఆయన మీడియాతో మాట్లాడారు. ఎమ్మెల్యేలు పార్టీ మారకపోతే వారి సొంత ఆస్తులను ధ్వంసం చేస్తున్నారని, విజిలెన్స్ దాడులతో బెదిరించడంతోపాటు భయభ్రాంతులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. పార్టీ మారిన ఎమ్మెల్యేల అనర్హత విషయంలో స్పీకర్ మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలని, లేదంటే సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని ఆయన చెప్పారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ తమ నియోజకవర్గాల్లో అధికార కాంగ్రెస్ పార్టీ నేతలకు ఇస్తున్న ప్రాధాన్యత.. ప్రజా ప్రతినిధులుగా తమకు ఇవ్వడం లేదన్నారు. కాంగ్రెస్ తరఫున పోటీచేసి ఓడిపోయిన అభ్యర్థులే అక్కడ ఎమ్మెల్యేలుగా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు.

షరతులు లేకుండా రుణమాఫీ చెయ్యాలి

- రైతుల సంఖ్య తగ్గించేందుకు సర్కారు కుట్ర:హరీశ్‌రావు

హైదరాబాద్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఎలాంటి షరతులు లేకుండా రైతులందరి రుణాలను ప్రభుత్వం మాఫీ చేయాలని మాజీ మంత్రి హరీశ్ రావు డిమాండ్ చేశారు. ప్రభుత్వం చేసిన కాలయాపన వల్ల 8 నెలలుగా రైతు రుణాలపై పడిన వడ్డీ భారాన్ని ప్రభుత్వమే భరించాలని అన్నారు. బ్యాంకులు పాస్‌పుస్తకాలు చూసి రైతులకు రుణాలిస్తే రేషన్ కార్డులు చూసి ప్రభుత్వం వాటిని మాఫీ చెయ్యడం ఏంటని ? మండిపడ్డారు. ప్రభుత్వం విడుదల చేసిన రుణమాఫీ మార్గదర్శకాలపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ప్రతీ రైతుకు రుణమాఫీ చేస్తామని ఇచ్చిన మాటను రేవంత్ రెడ్డి తప్పుతున్నారని ఆరోపించారు. మార్గదర్శకాలను చూస్తే అర్హుల సంఖ్యను తగ్గించడమే ప్రభుత్వ ఆలోచనగా కనిపిస్తుందని అన్నారు. రేషన్ కార్డు షరతును తొలగించి.. రుణాలు తెచ్చుకున్న అందరికీ రుణ మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం.. పీఎం కిసాన్ సమాచారాన్ని రుణమాఫీకి పరిగణనలోకి తీసుకుంటే దాదాపు 39లక్షల మంది రుణమాఫీకి దూరమవుతారని పేర్కొన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో చెప్పిన ప్రకారం రైతు పొందిన రుణాలపై 8 నెలల వడ్డీని కూడా ప్రభుత్వమే భరించి రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రైతులు అందరికీ రుణమాఫీ వర్తించేలా మార్పులు చేయాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

రైతులందరికీ మాఫీ వర్తింపజేయాలి:తమ్మినేని

రైతులకు రుణమాఫీకి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన జీవో 567లోని నిబంధనలు అమలు చేస్తే పెద్ద సంఖ్యలో రైతులు నష్టపోతారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. ఎక్కువ మంది రైతులకు రుణమాఫీ అందించేలా ప్రభుత్వం ఉత్తర్వులను సవరించాలని డిమాండ్ చేశారు. జీవో 567ను సవరించి రూ.2 లక్షల వరకు రైతులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలని కోరారు. రుణమాఫీ అమలు కోసం ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాలు ఆర్థిక భారాన్ని తప్పించుకునే విధంగా ఉన్నాయని, వీటి వల్ల ఎక్కువ మంది రైతులకు రుణమాఫీ ప్రయోజనాలు అందవని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి భాగం హేమంతరావు, పశ్యపద్మ పేర్కొన్నారు.

రుణమాఫీని సమర్థంగా అమలు చేస్తే..

డిప్యూటీ సీఎంతో 'లంచ్'!

కలెక్టర్లకు సీఎం రేవంత్‌రెడ్డి ఆఫర్

హైదరాబాద్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): పంట రుణాల మాఫీ పథకాన్ని సమర్థంగా అమలు చేసే జిల్లాల కలెక్టర్లకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లంచ్ ఆఫర్ ప్రకటించారు. అయితే అది తనతో కాదు.. డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్కతో! రుణమాఫీని సమస్యలు లేకుండా అమలయ్యేలా చేసిన టాప్-3 జిల్లాల కలెక్టర్లు ఉప ముఖ్యమంత్రితో కలిసి మధ్యాహ్న భోజనం చేయవచ్చన్నారు. "నాతో కూడా భోజనం చేయొచ్చు. కానీ, నా దగ్గర డబ్బులు ఉండవు. డిప్యూటీ సీఎం.. ఫైనాన్స్ మినిస్టర్ కూడా అయినందున ఆయనతో భోజనం చేయడంతోపాటు జిల్లాలకు సంబంధించిన నిధులు కూడా తీసుకెళ్లొచ్చు" అని సీఎం రేవంత్ చమత్కరించినట్లు సమాచారం. కాగా, గతంలో కలెక్టర్లతో సమావేశం నిర్వహించిన సమయంలో.. 'మీరు ఇంటికి వెళ్లేలోపు కొంతమందికి బదిలీలు ఉంటాయి' అని చెప్పిన సీఎం.. ఈసారి మాత్రం లంచ్ ఆఫర్ ప్రకటించడంపై కలెక్టర్లు చర్చించుకుంటున్నారు.

24న తెలుగు రాష్ట్రాలతో కేంద్రం సమావేశం

న్యూఢిల్లీ, జూలై 16 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల విభజన సమస్యలపై కేంద్రం దృష్టి సారించింది. ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకోని హామీల అమలుకు మార్గం సుగమం కాబోతున్నది. ఈనెల 24న ఢిల్లీలో కేంద్ర హోంశాఖ కార్యదర్శి ఆధ్వర్యంలో కీలక సమావేశం జరగనుంది. ఆ సమావేశానికి రావాలని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులకు కేంద్ర హోంశాఖ లేఖలు రాసింది. షెడ్యూల్ 13లోని అంశాలపై సమావేశంలో చర్చించే అవకాశం ఉన్నది. మూడోసారి ప్రధానిగా నరేంద్ర మోదీ బాధ్యతలు చేపట్టిన తర్వాత తెలుగు రాష్ట్రాల విభజన సమస్యలపై తొలిసారిగా సమావేశం జరగబోతున్నది.

రేవంత్‌తో ఛత్తీస్‌గఢ్ మాజీ సీఎం భూపేష్ భేటీ

హైదరాబాద్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఛత్తీస్‌గఢ్ మాజీ సీఎం భూపేష్ బఘేల్ మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం సచివాలయంలో రేవంత్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రేవంత్.. భూపేష్‌కు కళాకృతిని అందించారు. అనంతరం ఇరువురు పలు అంశాలపై చర్చించుకున్నట్లు సమాచారం. వీరివెంట డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఉన్నారు.

రేపటినుంచి 56 కేంద్రాల్లో డీఎస్సీ పరీక్షలు

ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం నిర్వహించే డీఎస్సీ పరీక్షలను 56 కేంద్రాల్లో నిర్వహించాలని నిర్ణయించారు. దీనికి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. రాష్ట్రంలో మొత్తం 11,062 టీచర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే. సుమారు 2.79 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తులు చేసుకున్నారు. ఈ నెల 18 నుంచి ఆగస్టు 5 వరకు ఈ పరీక్షలు జరగనున్నాయి. ఇప్పటికే హాల్ టికెట్లు జారీ చేశారు.

బడ్జెట్‌లో ఆరోగ్య రంగానికి ప్రాధాన్యమివ్వాలి

» అపోలో గ్రూప్ జేఎండీ డాక్టర్ సంగీతా రెడ్డి

హైదరాబాద్ సిటీ, జూలై 16 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం త్వరలో ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో ఆరోగ్య రంగానికి తగిన ప్రాధాన్యం ఇస్తుందన్న ఆశాభావంతో ఉన్నామని అపోలో ఆస్పత్రుల గ్రూప్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సంగీతా రెడ్డి అన్నారు. ఈ మేరకు మంగళవారం సంగీతా రెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. ఫిబ్రవరిలో 2024-25కు సంబంధించి ప్రవేశ పెట్టిన మధ్యంతర బడ్జెట్.. మహిళల ఆరోగ్యం, మౌలిక సదుపాయాల విస్తరణ, పిల్లల అభివృద్ధిపై దృష్టి పెట్టిందని వివరించారు. ఇది ఆరోగ్యకరమైన భవిష్యత్తును సూచిస్తోందని పేర్కొన్నారు. రాబోయే బడ్జెట్ ఈ విధానాన్నే కొనసాగిస్తుందన్న నమ్మకం ఉందన్నారు. గర్భాశయ క్యాన్సర్ నివారణకు 9 నుంచి 14 ఏళ్ల బాలికలకు వ్యాక్సినేషన్ ప్రోత్సహించడం వల్ల మహిళల ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుందన్నారు. యూ-విన్, మిషన్ ఇంద్రధనుష్ వంటి కార్యక్రమాలను మరింత ప్రోత్సహించాలని సూచించారు.

రాష్ట్రవ్యాప్తంగా రుణమాఫీ సంబురాలు రేపు

హైదరాబాద్, జూలై 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రుణమాఫీ అమలులో భాగంగా తొలి విడతగా రూ.లక్ష మేర రుణాలున్న రైతుల ఖాతాల్లో గురువారం నగదు జమ జరగనుంది. ఇందుకు సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా రైతు వేదికల వద్ద రుణమాఫీ లబ్ధిదారులతో కలిసి సంబురాలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమాల్లో పాల్గొంటారు. రుణమాఫీ సంబురాలు ఎలా నిర్వహించాలనే అంశంపై కార్యాచరణ రూపొందించేందుకు టీపీసీసీ కార్యవర్గం బుధవారం భేటీ కానుంది. ప్రజాభవన్‌లో జరిగే ఈ సమావేశంలో సీఎం రేవంత్, ఉప ముఖ్యమంత్రి భట్టి, ఇతర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, డీసీసీ అధ్యక్షులు పాల్గొననున్నారు.

2 నెలల్లో 267 కిలోలు

మలద్వారం ద్వారా బంగారం అక్రమ రవాణా!

విలువ రూ.167 కోట్లు.. చెన్నై యూట్యూబర్ గ్యాంగ్ అరెస్టు

కస్టమ్స్ అధికారుల కళ్లుగప్పేందుకు కొత్త ఎత్తుగడ

చెన్నై, జూలై 16: బంగారాన్ని పొడిగా, పేస్ట్‌గా మార్చి.. 300 గ్రాముల చొప్పున సిలికాన్ బాల్స్‌లో పెట్టి.. ఆ బాల్స్‌ను మలద్వారంలో పెట్టుకుని బంగారాన్ని దేశంలోకి అక్రమంగా రవాణా చేస్తున్న చెన్నై యూట్యూబర్ సాబిర్ అలీ(29) గ్యాంగ్‌ను కస్టమ్స్ అధికారులు పట్టుకున్నారు. కేవలం రెండు నెలల వ్యవధిలో ఆ గ్యాంగ్ ఇలా అడ్డదారిలో తరలించిన బంగారం అక్షరాలా 267 కిలోలు! దాని విలువ సుమారుగా రూ.167 కోట్లు ఉంటుందని అంచనా. సాబిర్ అలీకి 'షాపింగ్‌బాయ్స్' పేరుతో ఒక యూట్యూబ్ చానల్ ఉంది. దాని ద్వారా ఇంటర్నేషనల్ గోల్డ్ స్మగ్లింగ్ ముఠా అతడిని సంప్రదించి.. బంగారం అక్రమ రవాణాకు ఒప్పందం కుదుర్చుకున్నట్టు సమాచారం. నిజానికి ఇలా మలద్వారంలో బంగారం పెట్టుకుని అక్రమ రవాణా చేసేవారి గుట్టు బయటపెట్టడానికి కస్టమ్స్ అధికారులు ఓ టెక్నిక్‌ను అనుసరిస్తారు. అదేంటంటే.. అనుమానితులను స్క్వాటింగ్ పొజిషన్‌లో (అంటే మలవిసర్జన చేసే భంగిమలో) చాలా ఎక్కువసేపు కూర్చోబెడతారు. అసలే.. లోపల ఉన్న బంగారం కారణంగా వారికి నొప్పిగా ఉంటుంది. దీంతో వారు ఎక్కువసేపు అలా కూర్చోలేక, నొప్పిని తట్టుకోలేక నిజం చెప్పేస్తారు. ఒక్కోసారి ఆ బాల్స్ బయటకు వచ్చేస్తుంటాయి. కానీ, చెన్నై ఎయిర్‌పోర్టులో 'ఎయిర్‌హబ్' పేరుతో ఒక దుకాణాన్ని నడుపుతున్న సాబిర్ అలీ దీన్ని అధిగమించడానికి ఓ పద్ధతిని కనిపెట్టాడు. గోల్డ్ స్మగ్లింగ్‌కు ఏడుగురు ఉద్యోగులను నియమించుకుని.. మలద్వారంలో పసిడి పేస్ట్/పొడి ఉన్న సిలికాన్ బాల్స్ పెట్టుకుని, స్క్వాటింగ్ పొజిషన్‌లో గంటసేపు ఎలాంటి ఇబ్బందీ లేకుండా కూర్చోగలిగేలా వారికి కఠిన శిక్షణ ఇప్పించాడు. మొదట ఒకబాల్‌తో మొదలుపెట్టి.. మూడు బాల్స్‌ను సైతం లోపలపెట్టుకుని గంట సేపు స్క్వాటింగ్ పొజిషన్‌లో కూర్చునే స్థాయికి వారు చేరుకున్నారు. ఇలా బంగారాన్ని స్మగుల్ చేయాల్సిన ప్రతిసారీ.. పది రోజుల ముందే వారు ఈ విధానాన్ని ప్రాక్టీస్ చేయడం మొదలుపెడతారు. సాబిర్ వారికి నెలకు రూ.15 వేల జీతం ఇచ్చేవాడు. మలద్వారంలో బంగారం ఉన్న సిలికాన్ బాల్ పెట్టుకుని దాన్ని అక్రమ రవాణా చేసిన ప్రతిసారీ.. బాల్‌కు రూ.5 వేల చొప్పున ఇచ్చేవాడు. వీరి మోడస్ ఆపరెండీ ఎలా ఉంటుందంటే.. విదేశాల నుంచి బంగారాన్ని ఇదే పద్ధతిలో కొందరు చెన్నై ఎయిర్‌పోర్టు దాకా తీసుకువస్తారు. ఇలా తీసుకువచ్చేవారిని క్యారియర్లు అంటారు. వారు చెన్నై ఎయిర్‌పోర్టులో దిగగానే.. అక్కడ ట్రాన్సిట్ లాంజ్‌లో వారి నుంచి సాబిర్ అలీ ఉద్యోగుల్లో ఒకరు ఆ బంగారాన్ని తీసుకుంటారు. అక్కడ దాన్ని తమ మలద్వారంలో పెట్టుకుని.. ఆ నొప్పి ముఖంలో తెలిసేలోపే బయటకు వచ్చేస్తుంటారు. ఒకవేళ కస్టమ్స్ అధికారులు అనుమానించి స్క్వాటింగ్ పొజిషన్‌లో కూర్చోబెట్టినా.. గంటసేపు సునాయాసంగా కూర్చోగలుగుతారు. దీంతో కస్టమ్స్ అధికారులు వారిని వదిలేస్తారు. ఈ పద్ధతిలోనే వారు భారీగా బంగారాన్ని అక్రమంగా రవాణాచేస్తూ వచ్చారు. కానీ, ఎట్టకేలకు జూన్ 29న వీరి గ్యాంగ్‌లో ఒక వ్యక్తి తేదీల్లో అధికారులకు దొరికిపోయాడు. అతడి మలద్వారంలో దాచుకున్న సిలికాన్ బాల్స్ గుట్టు ఎక్స్‌రే ద్వారా రట్టయింది. అతడిచ్చిన సమాచారం ఆధారంగా సాబిర్ అలీని, మిగతా ఆరుగురినీ అరెస్ట్ చేశారు. ఈ దందా ద్వారా సాబిర్ అలీ రెండు నెలల్లో రూ.2.5 కోట్ల దాకా సంపాదించినట్టు సమాచారం.

లక్ష మాఫీ రేపే!

(మొదటిపేజీ తరువాయి)

స్పష్టం చేశారు. గురువారం ఉదయం 11 గంటలకు కలెక్టర్లు జిల్లా బ్యాంకర్లతో సమావేశం నిర్వహించాలని ఆదేశించారు. రుణమాఫీ కోసం ప్రభుత్వం విడుదల చేసే నిధులను రైతు రుణమాఫీకే వాడాలని, వ్యక్తిగత, ఇతర రుణాల మాఫీకి వినియోగించవద్దని బ్యాంకర్లకు సూచించాలన్నారు. గతంలో కొందరు బ్యాంకర్లు అలా చేసినందునే కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుందని, ఇప్పుడూ అలాంటి చర్యలే తీసుకుంటామని హెచ్చరించారు. ఆ రోజు సాయంత్రం 4 గంటలకు రూ.లక్ష వరకు రుణమాఫీ నిధులు రైతుల ఖాతాల్లో జమ అవుతాయని వెల్లడించారు. రుణమాఫీ జరిగే రైతులను రైతు వేదికల వద్దకు తీసుకురావాలని, అక్కడ ఆయా జిల్లాల మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు రైతులతో సంబరాలను నిర్వహించి, సంతోషాన్ని పంచుకోవాలని సూచించారు. రైతు రుణ మాఫీకి సంబంధించి సచివాలయంలో రెండు జిల్లాల (ఉమ్మడి జిల్లాల చొప్పున)కు ఒక ఉన్నతాధికారిని అందుబాటులో ఉంచుతామని, కలెక్టర్లకు ఏవైనా సందేహాలు వస్తే వారితో సంప్రదించి నివృత్తి చేసుకోవాలని అన్నారు.

అర్హులందరికీ ఆరోగ్యశ్రీ కార్డులు..

అర్హులందరికీ ఆరోగ్యశ్రీ హెల్త్ కార్డులు అందేలా చూడాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. రేషన్ కార్డుకు, ఆరోగ్యశ్రీ కార్డుకు లింక్ పెట్టొద్దన్నారు. రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికీ డిజిటల్ హెల్త్ ప్రొఫైల్‌ను రూపొందించాలని నిర్దేశించారు. మంగళవారం జిల్లాల కలెక్టర్లు, పోలీసు కమిషనర్లు, పోలీసు సూపరింటెండెంట్లతో సచివాలయంలో ముఖ్యమంత్రి సమావేశాన్ని నిర్వహించారు. ఉదయం 9.30 గంటలకు ప్రారంభమైన ఈ సమావేశం.. రెండు సెషన్లుగా రాత్రి 7.20 గంటల వరకు దాదాపు 10 గంటలపాటు సుదీర్ఘంగా సాగింది. ఉదయం పూట సమావేశంలో మొత్తం కలెక్టర్ల పనితీరు, వారికి దిశా నిర్దేశం చేయడంపైనే సీఎం దృష్టి పెట్టారు. సాయంత్రపు సమావేశంలో కూడా పలు పథకాలపై దిశా నిర్దేశం చేశారు. ఈ సమావేశంలో ప్రధానంగా ప్రజా పాలన, ధరణి సమస్యలు, ఖరీఫ్ సీజన్ వ్యవసాయం, ప్రజారోగ్యం-సీజనల్ వ్యాధులు, వన మహోత్సవం, మహిళా శక్తి, విద్య, శాంతిభద్రతలు, డ్రగ్స్ నియంత్రణపై చర్చ జరిగింది. తొలుత మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కలెక్టర్ల సదస్సును ప్రారంభించగా, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రారంభోపన్యాసం చేశారు. అనంతరం కలెక్టర్లను ఉద్దేశించి సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. "ప్రభుత్వానికి కళ్లు, చెవులు మీరే. మీలో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చినవారున్నారు. తెలంగాణ సంస్కృతిలో భాగస్వాములైతేనే మీరు ప్రజలకు సరైన సేవలు అందించగలుగుతారు. తెలంగాణను మీ సొంత రాష్ట్రంగా భావించి పని చేయాలి. మాజీ ఐఏఎస్‌లు ఒక శంకరన్, ఒక శ్రీధరన్‌లా సామాన్యులు గుర్తు పెట్టుకునేలా పని చేయాలి. ఏసీ గదులకు పరిమితమైతే మీకు కూడా ఎలాంటి సంతృప్తీ ఉండదు. క్షేత్ర స్థాయికి వెళ్లి, ప్రజల ఆలోచనలు ఏమిటో తెలుసుకోండి. ప్రజలకు ప్రయోజనం చేకూరేలా మానవీయ కోణంలో మీ నిర్ణయాలు ఉండాలి. మీ ప్రతి చర్య.. ఇది ప్రజా ప్రభుత్వమని ప్రజలకు తెలిసేలా ఉండాలి. పారదర్శక, ప్రజాహిత పాలనను అందించాలి. సంక్షేమం, అభివృద్ధిని బ్యాలెన్స్ చేస్తూ ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత మీపైనే ఉంది" అని కలెక్టర్లకు సీఎం దిశా నిర్దేశం చేశారు.

15లోగా 'ధరణి' సమస్యలకు పరిష్కారం

ధరణి సమస్యలను వీలైనంత తొందరగా పరిష్కరించాలని కలెక్టర్లను సీఎం ఆదేశించారు. కాగా, "ధరణి సమస్యల పరిష్కారానికి మార్చి 1 నుంచి 15 వరకు రాష్ట్ర ప్రభుత్వం స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహించింది. ఇందుకోసం ప్రత్యేకంగా కమిటీని ఏర్పాటు చేసింది. ఇప్పటివరకు 1,61,760 దరఖాస్తులను ప్రభుత్వం పరిష్కరించింది. కొత్తగా 1,15,308 దరఖాస్తులు వచ్చాయి" అని అధికారులు వివరించారు. దీంతో.. ధరణిలో దరఖాస్తులను తిరస్కరిస్తే అందుకు కారణాన్ని కూడా తప్పకుండా నమోదు చేసేలా చూడాలని సీఎం అన్నారు. పెండింగ్ దరఖాస్తులను ఆగస్టు 15లోగా పరిష్కరించాలని ఆదేశించారు.

ఆరు గ్యారెంటీల అమలు బాధ్యత కలెక్టర్లదే..

ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక పథకాలైన ఆరు గ్యారెంటీలను అమలు చేసే బాధ్యత కలెక్టర్లదేనని సీఎం రేవంత్ అన్నారు. "ప్రతి పేద విద్యార్థి కోసం ప్రభుత్వం ప్రతి నెలా రూ.85 వేలు ఖర్చు పెడుతోంది. తెలంగాణ పునర్నిర్మాణంలో అత్యంత కీలకమైన విద్యా వ్యవస్థ దెబ్బతినకుండా చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వ స్కూళ్లు, ప్రభుత్వ ఆస్పత్రులను పర్యవేక్షించాల్సిన బాధ్యత కలెక్టర్లు తీసుకోవాలి. కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్లు బదిలీ అయితే.. విద్యార్థులు ఆ టీచర్ల పట్ల సొంత కుటుంబ సభ్యుడిలా స్పందించారు.. కలెక్టర్లు బదిలీ అయినా ప్రజల నుంచి అలాంటి స్పందన వచ్చేలా పనితనం ఉండాలి" అని సీఎం అన్నారు. పారదర్శకంగా ప్రజాహిత పాలనను అందించటమే తమ ప్రభుత్వం ఎంచుకున్న మొదటి ప్రాధాన్యమని తెలిపారు. ఇటీవలే రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు సమర్థులైన యువ కలెక్టర్లను నియమించామని, రాజకీయ ఒత్తిళ్లు, రాగద్వేషాలు లేకుండా కలెక్టర్ల బదిలీలు చేపట్టామని తెలిపారు. ఐఏఎస్ అధికారుల సర్వీసులో జిల్లా కలెక్టర్లుగా పని చేయటమే అత్యంత కీలకమైన అవకాశమని పేర్కొన్నారు. ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలుండే బాధ్యతలతోపాటు క్షేత్ర స్థాయిలో అన్ని అంశాలపై అవగాహన వస్తుందని, భవిష్యత్తులో ఇది ఉపయోగపడుతుందని చెప్పారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ఐఏఎస్ అధికారులు ఇక్కడి భాషతోపాటు తెలంగాణ సంస్కృతిలో కూడా భాగస్వాములు కావాలని సూచించారు.

మహిళా గ్రూపుల్లో సభ్యులను చేర్చేందుకు స్పెషల్ డ్రైవ్..

మహిళా స్వయం సహాయక సంఘాలకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తుందని సీఎం రేవంత్ అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 64 లక్షల మంది సభ్యులున్నారని, కోటి మంది సభ్యులుగా చేరేలా స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని సూచించారు. మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలనేది ప్రభుత్వ సంకల్పమని, ఐదేళ్లలో రూ.లక్ష కోట్ల బ్యాంక్ లింకేజీ రుణాలు అందించే లక్ష్యంతో పని చేయాలని చెప్పారు. ఆర్టీసీలో కొత్తగా అవసరమయ్యే అద్దె బస్సులను కూడా మహిళా సంఘాలకు ఇచ్చే విషయాన్ని పరిశీలించాలన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోనూ ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలు అన్యాక్రాంతం కాకుండా కలెక్టర్లు కాపాడాలని సీఎం అన్నారు. అవసరమైతే వాటికి జియో ట్యాగింగ్ లాంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానం చేసి నిఘా ఉంచాలన్నారు.

అటవీ భూముల్లో డ్రోన్‌ల ద్వారా ఏరియల్ సర్వే..

అటవీ భూముల్లో పండ్ల మొక్కలు నాటడం వల్ల గిరిజనులకు ఆదాయం సమకూరుతుందని, మరోవైపు పచ్చదనం పెంపొందుతుందని సీఎం రేవంత్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. మూడు నుంచి నాలుగేళ్లలో పంట వచ్చే హైబ్రిడ్ మొక్కలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. పలు అటవీ ప్రాంతాల్లో ఎకరాల కొద్దీ ఖాళీ ప్రదేశాలు ఉన్నాయని, అక్కడ డ్రోన్ల ద్వారా ఏరియల్ సర్వే చేయించాలని సూచించారు. అనంతరం అక్కడ భూసార పరీక్షలు చేయించి, ఆ నేలల్లో పెరిగే పండ్ల మొక్కలను నాటించాలని ఆదేశించారు. పులుల సఫారీకి తెలంగాణ నుంచి పెద్ద సంఖ్యలో పర్యాటకులు మహారాష్ట్రలోని తడోబా అటవీ ప్రాంతానికి వెళుతున్నారని, మన దగ్గర ఆదిలాబాద్ జిల్లాలోనూ అటవీ ప్రాంతం ఉన్నా పులులు సంచారం లేదని, వాటికి అవసరమైన ఆవాసం, నీటి సౌకర్యం కల్పిస్తే అటవీ పర్యాటకం పెంపొందించవచ్చని అన్నారు. వన మహోత్సవంలో నాటే మొక్కలు 50 ఏళ్ల పాటు ఫలసాయం అందించేలా ఉండాలన్నారు. కలెక్టర్లు నెలకోసారి అటవీ ప్రాంతాల్లో పర్యటించాలని ఆదేశించారు. గతంలో మాదిరిగా ప్రభుత్వ భూమి లభ్యత లేనందున ప్రాజెక్టు కట్టలు, కాలువ కట్టలు, రహదారుల వెంట తాటి, ఈత చెట్లు నాటాలని, మూడు నాలుగేళ్లలో గీత వృత్తిదారులకు ఆదాయం వచ్చేలా హైబ్రిడ్ మొక్కలు నాటాలని ఆదేశించారు.

ఒకే చోట ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు..

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వసతి గృహాలు ఒకే చోట ఉండేందుకు వీలుగా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను ఏర్పాటు చేయనున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో 20 నుంచి 25 ఎకరాల్లో ఈ స్కూళ్లను ఏర్పాటు చేస్తామని, నియోజకవర్గంలో రహదారులకు అనుసంధానంగా ఉండే గ్రామాలు, పట్టణాల్లో వాటికి స్థలాలను ఎంపిక చేయాలని సూచించారు. రాష్ట్రంలోని 65 ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు(ఏటీసీ)గా అప్‌గ్రేడ్ చేస్తున్నామని తెలిపారు. కలెక్టర్లు తమ పరిధిలోని ఐటీఐలను సందర్శించి వాటిని ఏటీసీలుగా మార్చే ప్రక్రియ ఎలా సాగుతుందో పరిశీలించాలన్నారు. కలెక్టర్లు పాఠశాలలను తనిఖీ చేయాలని, డీఈవోలు, డిప్యూటీ ఈవోలు తరచూ పాఠశాలలను తనిఖీ చేసేలా చూడాలని ఆదేశించారు. మధ్యాహ్న భోజనం మరింత మెరుగ్గా అందించేందుకు హరే కృష్ణ మూవ్‌మెంట్ వంటి సంస్థల సహకారం తీసుకునే అంశంపై అధ్యయనం చేయాలని విద్యా శాఖ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ జి.చిన్నారెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, అన్ని శాఖల ముఖ్యకార్యదర్శులు, జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు.

క్షేత్ర స్థాయిలో పర్యటించాల్సిందే

జిల్లా కలెక్టర్లందరూ క్షేత్ర స్థాయిలో పర్యటించాల్సిందేనని ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రభుత్వ స్కూళ్లు, ఆస్పత్రులను పర్యవేక్షించాల్సిన బాధ్యత కలెక్టర్లు తీసుకోవాలన్నారు. చిన్న చిన్న సమస్యలను అక్కడిక్కడే పరిష్కరించాలని సూచించారు. " గతంలో పది పెద్ద జిల్లాలు ఉన్నప్పుడు పది మంది కలెక్టర్లే అద్భుతంగా నడిపించారు. ఇప్పుడు జిల్లాల పరిధి, జనాభా తగ్గిపోయింది. కానీ, కలెక్టర్ల అధికారాలు, బాధ్యతల్లో తేడా ఏమీ లేదు. 10మంది చేసిన పనిని 33 మంది కలెక్టర్లు ఎందుకు చేయలేరు? ఎవరికి వారుగా మీ ఆలోచనలు, మీ పనితీరును సమర్థతను చాటుకోవాలి" అని అన్నారు. కలెక్టరేట్లలో ప్రతి వారం నిర్వహించే ప్రజావాణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. జిల్లా స్థాయిలో సమస్యలు పరిష్కారమైతే, హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌కు వచ్చే అర్జీల సంఖ్య తగ్గిపోతుందని పేర్కొన్నారు. ఆరు గ్యారెంటీలను రాష్ట్రంలోని అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరవేయాలనేది ప్రభుత్వ ధ్యేయమన్నారు. అర్హులైనవారు ఎవరికైనా ఆయా పథకాలు వర్తించకపోతే.. దరఖాస్తుల్లో వివరాలు సరి చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం ఇచ్చిందని చెప్పారు. అన్ని జిల్లా కేంద్రాలు, మండల కేంద్రాల్లో ప్రజా పాలన సేవా కేంద్రాలు పని చేసేలా చూడాలని, అవసరమైతే ప్రజావాణి జరిగే రోజు కలెక్టరేట్లలోనూ సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్నారు.

ఆస్పత్రుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలి..

ఆస్పత్రుల నిర్వహణపై కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలని సీఎం సూచించారు. స్వచ్ఛంద సంస్థల సహకారం, పరిశ్రమల నుంచి సీఎస్ఆర్ నిధులు తీసుకోవాలని, వ్యాపార, వాణిజ్యవేత్తల సహకారంతో వాటి నిర్వహణను మెరుగుపరిచే విధానాన్ని అవలంబించాలని అన్నారు. అనుభవజ్ఞులైన స్పెషాలిటీ డాక్టర్లను ఆస్పత్రుల నిర్వహణ బాధ్యతల నుంచి తప్పించి, వైద్య సేవలకు వినియోగించుకోవాలని, మిగతా డాక్టర్లకు నిర్వహణ బాధ్యతలు అప్పగించాలని ఆదేశించారు. గిరిజన ప్రాంతాల్లో సరైన వైద్య సదుపాయం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో వైద్య సేవలందించే ఆర్ఎంపీలు, పీఎంపీలకు శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు ఇవ్వాలన్న డిమాండ్ ఉందని, దీనిపై అధ్యయనం చేసి అందుకు సంబంధించిన ఉత్తర్వులు ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో పని చేసే డాక్టర్లకు పారితోషికం అందించి ప్రోత్సహించాలన్నారు.బజిల్లాల్లో ఉన్న వనరులు, ప్రాంత పరిస్థితుల ఆధారంగా ప్రతి కలెక్టర్ ఒక్కో ఫ్లాగ్‌షిప్ కార్యక్రమానికి రూపకల్పన చేసి, అమలు చేయాలని నిర్దేశించారు. జిల్లా మంత్రులు, ఇన్‌చార్జి మంత్రుల కార్యక్రమాలకు సరైన ఏర్పాట్లు చేయాలన్నారు.

రేపు రైతుల ఖాతాల్లోకి

రూ.6,800 కోట్లు!

4వ తరగతి చిరుద్యోగులు, 10 వేలలోపు పింఛన్‌దారులకు కూడా రుణమాఫీ

ఆపై ఉద్యోగులకు, ఐటీ రిటర్న్స్ వేసేవారికి రాదు

అలా అర్హులు కానివారు 19 వేల మంది

వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల వెల్లడి

హైదరాబాద్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): రుణమాఫీకి అర్హులు కాని.. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, రాజ్యసభ సభ్యులు, మేయర్లు, జిల్లా పరిషత్ చైర్మన్లు, ప్రస్తుత, మాజీ ప్రజాప్రతినిధులు, సివిల్ సర్వీసెస్‌లో ఉన్నవారు, గ్రూప్-1, 2, 3 ఉద్యోగులు 19 వేల మంది దాకా ఉన్నట్లు గుర్తించామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. గ్రూప్- 4 ఉద్యోగులు, నెలకు రూ.10 వేలలోపు పెన్షన్లు పొందేవారికి మాత్రం రుణమాఫీ పథకాన్ని వర్తింపజేస్తామని వివరించారు. సెక్రటేరియట్‌లో మంగళవారం ఆయన రాష్ట్ర వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావుతో కలిసి మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. రుణమాఫీ పథకం తొలివిడతలో భాగంగా.. రాష్ట్రవ్యాప్తంగా 11.5 లక్షల మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ.6,800 కోట్లు గురువారం జమ చేస్తామని తెలిపారు. ఐటీ చెల్లింపుదారుల వివరాలకోసం కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాశామని.. ఢిల్లీ నుంచి సమాచారం రాగానే పూర్తి వివరాలు వెల్లడిస్తామని తెలిపారు. పొదుపు సంఘాల్లో ఉన్న మహిళలు గ్రూపులవారీగా తీసుకున్న రుణాలు, ఉద్యాన, ఇతరత్రా పంటలకోసం తీసుకున్న దీర్ఘకాలిక రుణాలు ఈ పథకం పరిధిలోకి రావని మంత్రి స్పష్టం చేశారు. అదే మహిళలు వ్యక్తిగతంగా పట్టాదారు పాస్ పుస్తకం పెట్టి బ్యాంకులో స్వల్పకాలిక పంట రుణాలు తీసుకుంటే మాత్రం మాఫీ వర్తిస్తుందని తెలిపారు. అలాగే.. గత ప్రభుత్వ హయాంలో రుణమాఫీ చేస్తామని చెప్పి ఎన్నికలకు ముందు సగం మందికే మాఫీ చేశారని.. వివిధ కారణాల వల్ల రూ. 1,400 కోట్ల నిధులు రైతుల ఖాతాల్లో జమచేయకుండా వెనక్కి తీసుకున్నారని మంత్రి తెలిపారు. అప్పుడు రుణమాఫీ కాని రైతులు బ్యాంకుల్లో ఉన్న తమ అప్పును రెన్యూవల్ చేసుకున్నారని, అలాంటివారికి కూడా రుణమాఫీ వర్తిస్తుందని తెలిపారు. రుణమాఫీకి సంబంధించి.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రెండు విడతల్లో అనుసరించిన విధానాలనే తాము అనుసరిస్తున్నామని, తామేమీ మార్గదర్శకాలను కొత్తగా తయారుచేయలేదని తెలిపారు. ఒక కుటుంబంలో ఇద్దరు లేదా అంతకన్నా ఎక్కువ మంది ఉన్నా రూ.2 లక్షల వరకూ అప్పు మాఫీ అవుతుందని తెలిపారు. ఈ ప్రక్రియలో మహిళలకు తొలి ప్రాధాన్యం ఉంటుందని.. భార్య పేరుమీద రూ.లక్ష, భర్త పేరు మీద మరో రూ.లక్ష అప్పు ఉంటే.. తొలుత భార్యపేరుమీద ఉన్న అప్పును మాఫీ చేస్తామని, తర్వాత భర్తపేరు మీద ఉన్న అప్పు మాఫీ చేస్తామని వివరించారు. పంట రుణాలు తీసుకొని చనిపోయిన రైతులు ఎవరైనా ఉంటే.. వారి ఖాతాలకు కూడా రుణమాఫీ వర్తింపజేస్తామని తెలిపారు. ఆర్‌వోఎఫ్ఆర్ పట్టాలతో పంట రుణాలు తీసుకున్నా మాఫీ చేస్తామని ప్రకటించారు.

డ్రగ్స్, సైబర్ నేరాలపై ఉక్కుపాదం

» డీజీపీ నుంచి కానిస్టేబుల్ వరకు క్షేత్రస్థాయిలో ఉండాలి

» డ్రైవ్ ఆన్ డ్రగ్స్‌ను నిర్వహించాలి

» రాత్రిళ్లు ఫుడ్ కోర్టులు నిర్వహించేవారిని ఇబ్బంది పెట్టొద్దు

» కమిషనర్లు, ఎస్పీల భేటీలో సీఎం రేవంత్


సీఎం సమావేశంలో పాల్గొన్న డీజీపీ, పోలీస్ అధికారులు

హైదరాబాద్, జూలై 16(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్, సైబర్ నేరాల విషయంలో ఉక్కుపాదం మోపాలని పోలీస్ శాఖను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. భద్రతపై ప్రజలకు భరోసా కల్పించేందుకు అన్ని చర్యలు చేపట్టాలని, అవసరమైతే డీజీపీ నుంచి కానిస్టేబుల్ వరకు క్షేత్ర స్థాయి (ఫిజికల్ పోలీసింగ్)లో ఉండాలని స్పష్టం చేశారు. పోలీస్ కళ్లెదుటే ఉన్నాడనేలా రహదారులపై కనిపించాలని సూచించారు. కమిషనర్లు, ఎస్పీలు తమ పరిధిలోని స్టేషన్లను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని, క్రమంతప్పకుండా సమీక్ష నిర్వహించాలని పేర్కొన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు, డ్రగ్స్ కట్టడి ఎజెండాగా డీజీపీ, పోలీస్ ఉన్నతాధికారులతో పాటు కమిషనర్లు, ఎస్పీలతో సీఎం రేవంత్ సచివాలయంలో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కీలక సూచనలు చేశారు. హైదరాబాద్‌లో కొద్ది రోజులుగా జరుగుతున్న పరిణామాల నేపథ్యంలో శాంతిభద్రతలపై దృష్టిసారించాలన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌తో పాటు డ్రైవ్ ఆన్ డ్రగ్స్ కూడా నిర్వహించాలని ఆదేశించారు. ప్రజలు, పోలీసులకు మధ్య వారధిగా ఉండేందుకు స్టేషన్ల పరిధిలో శాంతి కమిటీలను పునరుద్ధరించాలి.. బాధితుల పట్ల మాత్రమే స్నేహంగా ఉండాలని, నేరగాళ్లతో కాదన్నారు. రాత్రి వేళల్లో ఫుడ్ కోర్టులు నిర్వహించేవారిని ఆంక్షల పేరుతో ఇబ్బంది పెట్టొద్దని కోరారు. ఐటీ రంగంలో వారు రాత్రి వేళల్లో పని చేయాల్సి ఉంటుందని.. ఈ విషయం గుర్తుంచుకోవాలని సూచించారు. కాగా, గతంతో పోలిస్తే ఈ సంవత్సరం నేరాలు తగ్గాయని అధికారులు సీఎంకు వివరించారు. ఇదే వివరాలను గణాంకాలతో మీడియాకు వెల్లడించాలని సీఎం ఆదేశించారు.

విదేశీయులపై దృష్టిపెట్టండి

డ్రగ్స్ కేసుల్లో విదేశీయుల ప్రమేయం నేపథ్యంలో.. వారు ఏ పని మీద వస్తున్నారు? ఏం చేస్తున్నారనేదానిపై దృష్టిసారించాలని సీఎం నిర్దేశించారు. వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. డ్రగ్స్ బానిసలు, వాడకందారులను డీ అడిక్షన్ కేంద్రాల్లో ఉంచాలని, అందుకోసం చర్లపల్లి జైల్‌ను వినియోగించుకోవాలని సూచించారు. మాదకద్రవ్యాల నియంత్రణకు పోలీస్, ఎక్సైజ్ శాఖ సమన్వయంతో కదలాలన్నారు. మానవ అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు అన్ని విభాగాలు కదలాలని పేర్కొన్నారు. కాగా, కొల్లాపూర్ బీఆర్ఎస్ నాయకుడు శ్రీధర్‌రెడ్డి హత్య కేసు దర్యాప్తునకు సిట్‌ను ఏర్పాటు చేయాలని డీజీపీ జితేందర్‌ను సీఎం ఆదేశించారు. తనపై ఆరోపణలు వచ్చినందున సిట్ వేయాలని డీజీపీకి లేఖ రాసినట్లు మంత్రి జూపల్లి సీఎం దృష్టికి తీసుకెళ్లారు. కేసును వీలైనంత త్వరగా పరిష్కరించి నిందితులను పట్టుకోవాలని డీజీపీని సీఎం ఆదేశించారు. నకిలీ విత్తనాలు, ఎరువుల తయారీ, విక్రయంపై ఉక్కుపాదం మోపాలని కమిషనర్లు, ఎస్పీలకు స్పష్టం చేశారు.

ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యం

» కమిషనర్లు, ఎస్పీలకు డీజీపీ జితేందర్ ఆదేశం

క్షేత్రస్థాయి పోలీసింగ్ తెలుసుకునేందుకు త్వరలో జిల్లాల్లో పర్యటిస్తానని డీజీపీ జితేందర్ కమిషనర్లు, ఎస్పీలకు తెలిపారు. ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదుల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. సీఎం రేవంత్‌తో సమావేశానికి వచ్చిన అధికారులతో డీజీపీ తొలుత తన కార్యాలయంలో సమావేశమయ్యారు. ఆయన బాధ్యతలు చేపట్టాక నేరుగా భేటీ కావడం ఇదే మొదటిసారి. ప్రభుత్వ లక్ష్యాలు, పోలీస్ పనితీరు, అనుసరించాల్సిన విధానాలపై సుదీర్ఘంగా చర్చించారు. శాంతిభద్రతల పరిరక్షణ, డ్రగ్స్ తదితర అంశాలపై సమీక్షించారు. స్టేషన్లను ఆకస్మిక తనిఖీ చేయాలని.. ఆయుధ లైసెన్సుల జారీలో జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఎస్సీ, ఎస్టీలు, మహిళలకు సంబంధించిన కేసులను సత్వరం పరిష్కరించాలన్నారు. డ్రగ్స్ కట్టడిపై ప్రభుత్వం దృఢ నిశ్చయంతో ఉందని.. మీ పరిధిలో అన్ని చర్యలు తీసుకోవాలని కమిషనర్లు, ఎస్పీలకు డీజీపీ ప్రత్యేకంగా చెప్పారు. కాగా, డీజీపీగా తొలి సమావేశం కావడం, అదనపు డీజీపీ (శాంతిభద్రతలు)గా విధులు నిర్వహించిన అనుభవం ఉండడంతో జితేందర్ కొంత సీరియస్‌గా ఉన్నట్లు సమాచారం. చెప్పదలుచుకున్నది సూటిగా చెప్పడంతో పాటు ఎక్కడైనా నిర్లక్ష్యం బయటపడితే శాఖాపరమైన చర్యలుంటాయని హెచ్చరించినట్లు తెలిసింది. యూనిట్ ఆఫీసర్లుగా కింది అధికారులు, సిబ్బంది పనితీరును పర్యవేక్షించడంతో పాటు వారితో పనిచేయించాల్సిన బాధ్యత కూడా అధికారులపైనే ఉందన్నారు.

సచివాలయంలో నిలిచిన ఇంటర్నెట్, ఇంటర్‌కమ్!

3, 4 గంటలపాటు స్తంభించిన సేవలు

కలెక్టర్లతో రేవంత్ భేటీ సమయంలోనే !

హైదరాబాద్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సచివాలయంలో ఇంటర్నెట్, ఇంటర్‌కమ్ సేవల్లో అంతరాయం కలిగింది. ఏదో కొద్దిసేపు కాదు.. ఏకంగా మూడు నాలుగు గంటల పాటు ఈ సేవలు స్తంభించిపోయాయి. మంగళవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఇంటర్నెట్, ఇంటర్‌కమ్ పనిచేయలేదు. ఏ కారణంతో ఇంటర్నెట్ నిలిచిపోయిందన్నది కూడా ఉద్యోగులకు తెలియకపోవడం గమనార్హం. సచివాలయం లోపల ఉన్న అన్ని అంతస్తులకు అనుసంధానమై ఉండే ఇంటర్‌కమ్ (ల్యాండ్ ఫోన్లు)లు కూడా పనిచేయలేదు. దీంతో అధికారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మధ్యాహ్నం 2 గంటల తర్వాత ఇంటర్నెట్, ఇంటర్‌కమ్ సేవలు తిరిగి అందుబాటులోకి వచ్చాయి. సచివాలయంలోని ఏడో అంతస్తులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కలెక్టర్లు, కమిషనర్లు, ఎస్పీలతో సమావేశం నిర్వహించిన సమయంలోనే ఇంటర్నెట్, ఇంటర్‌కమ్ సేవల్లో అంతరాయం ఏర్పడింది. కాగా, సచివాలయానికి ఇంటర్నెట్ అందించే సంస్థకు సమయానికి ప్రభుత్వం బిల్లులు చెల్లించడం లేదని, అందుకే ఆ సంస్థ నెట్‌ను నిలిపివేసిందన్న ప్రచారం జరిగింది. సాంకేతిక కారణాలతోనే సేవల్లో అంతరాయం ఏర్పడిందని అధికార వర్గాలు పేర్కొన్నాయి.

పార్కింగ్ పకడ్బందీగా..

సాధారణ సమయాల్లోనే మంత్రులు, అధికారులు, వీఐపీల కార్లతో కిటకిటలాడే సచివాలయం పార్కింగ్ ఏరియా మంగళవారం కలెక్టర్ల సదస్సు జరిగినా ఎలాంటి హడావుడి లేకుండా దర్శనమిచ్చింది. సచివాలయ భద్రతా విభాగం సిబ్బంది కార్లలో వస్తున్నవారి వివరాలను సేకరించి, పరిశీలించిన తర్వాతే పార్కింగ్‌కు అవకాశం ఇచ్చారు. దీంతో ఎప్పుడూ లేని విధంగా పార్కింగ్‌లో ఖాళీ స్థలం కనిపించింది.


సచివాలయంలో ఖాళీగా ఉన్న పార్కింగ్ ప్రాంతం

బెదిరింపులతో షేర్ల బదిలీ కేసు.. పోలీసు కస్టడీకి రాధాకిషన్‌రావు

» రెండ్రోజుల కస్టడీకి కోర్టు అనుమతి
» మాజీ ఓఎస్డీ బెయిల్ పిటిషన్ దాఖలు

హైదరాబాద్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ కేసు నిందితుడు, టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ(ఓఎస్డీ) రాధాకిషన్‌రావును జూబ్లీహిల్స్ పోలీసులు కస్టడీకి తీసుకున్నారు. రాధాకిషన్‌రావు, మరో 8 మంది కలిసి.. తనను అపహరించి, బలవంతంగా షేర్లను బదిలీ చేయించారంటూ క్రియా హెల్త్‌కేర్ వ్యవస్థాపకుడు చెన్నుపాటి వేణుగోపాల్ ఇచ్చిన ఫిర్యాదుతో జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే.! జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న రాధాకిషన్‌రావును ఈ కేసుకు సంబంధించిన పలు వివరాలను రాబట్టేందుకు కోర్టు అనుమతితో రెండ్రోజులపాటు కస్టడీకి తీసుకున్నారు. మంగళవారం మధ్యాహ్నం 1.30 గంటలకు జూబ్లీహిల్స్ పోలీసులు చంచల్‌గూడ జైలు నుంచి రాధాకిషన్‌రావును తమ కస్టడీకి తీసుకున్నారు. గురువారం మధ్యాహ్నం 1.30 వరకు ఆయనను విచారించనున్నారు. మరోవైపు రాధాకిషన్‌రావు కోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై కోర్టు గురువారం విచారణ చేపట్టనుంది. కాగా.. హార్వర్డ్ యూనివర్సిటీలో ఎంబీఏ పూర్తిచేసి, వరల్డ్ బ్యాంకులో పనిచేసిన వేణుగోపాల్ 2011లో క్రియా హెల్త్‌కేర్ సర్వీసెస్ ఎను ప్రారంభించారు. ఉత్తరప్రదేశ్‌లో తమ హెల్త్‌కేర్ ప్రాజెక్టుకు సంబంధించి ఆయన పార్ట్‌టైమ్ డైరెక్టర్లుగా గోపాల్, రాజ్, నవీన్, రవిని, బాలాజీని సీఈవోగా నియమించారు. ఆ తర్వాత వారు షేర్లను తమ పేరిట బదిలీ చేస్తే.. కంపెనీని తామే నడుపుకొంటామని బెదిరించారని వేణుగోపాల్ జూబ్లీహిల్స్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. తాను అంగీకరించకపోవడంతో.. నిందితులు అప్పటి టాస్క్‌ఫోర్స్ డీసీపీ రాధాకిషన్ ద్వారా తనను కిడ్నాప్ చేయించి, బలవంతంగా రూ.100 కోట్ల విలువైన షేర్లను వారి పేరిట బదిలీ చేయించుకున్నారని పేర్కొన్నారు. ఈ వ్యవహారం నడిపినందుకు టాస్క్‌ఫోర్స్ పోలీసులకు నిందితుల నుంచి రూ.10లక్షలు అందినట్లు ఆరోపించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు ప్రారంభించిన జూబ్లీహిల్స్ పోలీసులు.. రాధాకిషన్‌రావును కస్టడీకి తీసుకుని విచారిస్తున్నారు.





అరుణాచల ప్రధాన అర్చకులకు శేషవస్త్రాలు అందజేస్తున్న కాళేశ్వర అర్చకుడు త్రిపురారి కృష్ణమూర్తి

కాళేశ్వరంలో అరుణాచలం అర్చకుల పూజలు

మహదేవపూర్, జూలై 16: భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని పవిత్ర పుణ్యక్షేత్రమైన కాళేశ్వర, ముక్తీశ్వరస్వామిని తమిళనాడులోని అరుణాచల పుణ్యక్షేత్ర ప్రధాన అర్చకుడు కార్తికేయ శర్మతోపాటు పలువురు ఇతర అర్చకులు మంగళవారం దర్శించుకున్నారు. స్వామివారికి మహారుద్రాభిషేకం చేశారు. శుభానందాదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాళేశ్వర ఆలయ అర్చకుడు త్రిపురారి కృష్ణమూర్తి అరుణాచల ప్రధాన అర్చకుల బృందాన్ని శేషవస్త్రంతో సన్మానించారు.

రూ.3వేల కోసం అమ్మమ్మని కొట్టి చంపాడు

ఖమ్మంక్రైం, జూలై 16: చెడు వ్యసనాలకు బానిసైన ఓ యువకుడు గంజాయి మత్తులో దారుణానికి పాల్పడ్డాడు. తాను అడిగిన వెంటనే రూ.3వేలు ఇవ్వలేదనే ఆగ్రహంతో చిన్నప్పుడు తన ఆలనాపాలనా చూసుకున్న అమ్మమ్మని కొట్టి చంపాడు. ఖమ్మంలో మంగళవారం ఈ ఘటన జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. ఖమ్మం రోటరీనగర్‌కు చెందిన అమరబోయిన రాంబాయమ్మ(80) భర్త విశ్వనాథం కొన్నేళ్ల క్రితం మరణించారు. ఆ దంపతులకు ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఓ కొడుకు మరణించగా మరో కుమారుడు హైదరాబాద్‌లో నివాసముంటున్నారు. అయితే, చిన్న కుమార్తె కొడుకు ఉదయ్‌కుమార్ చిన్నతనం నుంచి అమ్మమ్మ రాంబాయమ్మ వద్దే ఉంటున్నాడు. ఇంజనీరింగ్ చదివేటప్పుడు గుట్కా, మద్యం, గంజాయి వంటి వాటికి అలవాటు పడిన ఉదయ్ చదువు మధ్యలోనే వదిలిసి జులాయిగా తిరగడం మొదలుపెట్టాడు. ఇరుగుపొరుగుతో గొడవలు పడుతూ డబ్బు కోసం రాంబాయమ్మను వేధించేవాడు. ఈ క్రమంలో గంజాయి మత్తులో ఇంటికి వచ్చిన ఉదయ్ రూ.3వేలు కావాలని రాంబాయమ్మను అడిగాడు. ఆమె తన దగ్గర లేవని చెప్పడంతో ఆగ్రహంతో ఊగిపోయిన ఉదయ్ ఆమెను తీవ్రంగా కొట్టాడు. ఆ దెబ్బలకు కుప్పకూలిపోయిన రాంబాయమ్మ మరణించింది. రాంబాయమ్మ ఎలా చనిపోయిందని మంగళవారం ఉదయం స్థానికులు ప్రశ్నించగా... కాలు జారి పడి ప్రాణాలు కోల్పోయిందని ఉదయ్ నమ్మబలికాడు. స్థానికులు గట్టిగా నిలదీయడంతో తానే చంపేశానని అంగీకరించాడు. పోలీసులు ఉదయ్‌ను అదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు చేపట్టారు.

ఆర్టీసీ బస్సులో రూ. 36 లక్షల చోరీ

జడ్చర్ల, జూలై 16: హైదరాబాద్ నుంచి కర్నూల్ వెళ్లే ఆర్టీసీ బస్సులో రూ. 36 లక్షలు చోరీకి గురయ్యాయి. హైదరాబాద్‌లోని విద్యుత్‌శాఖలో విధులు నిర్వహిస్తున్న దామోదర్.. కర్నూల్‌లో ఉన్న తన సోదరికి డబ్బు అవసరమవడంతో మంగళవారం రూ. 38 లక్షలు తీసుకుని బస్సులో బయలుదేరారు. రూ. 36 లక్షలు ఓ బ్యాగులో పెట్టి దాన్ని తాను కూర్చున్న సీటు క్యారియర్‌పై ఉంచారు. మరో రూ. 2 లక్షలను తన వద్దే మరో బ్యాగులో ఉంచుకున్నారు. టిఫిన్ చేయడానికి జడ్చర్లలో బస్సును నిలపడంతో క్యారియర్‌పై ఉంచిన బ్యాగును వెంట తీసుకెళ్లేందుకు దాన్ని తీసుకున్నారు. అయితే బరువులో తేడా రావడంతో తెరిచి చూడగా అందులో ఉంచిన రూ. 36 లక్షలు చోరీకి గురయ్యాయని గుర్తించి వెంటనే జడ్చర్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రణీత్‌ను కస్టడీకి ఇవ్వండి.. సీఎస్‌బీ పిటిషన్

హైదరాబాద్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): తండ్రి, కుమార్తె బంధంపై హేయమైన కామెంట్లు చేసిన కేసులో యూట్యూబర్ ప్రణీత్ హన్మంత్‌ను కస్టడీకి ఇవ్వాలంటూ సైబర్ సెక్యూరిటీ బ్యూరో(సీఎస్‌బీ) కోర్టులో పిటిషన్ వేసింది. ప్రస్తుతం చంచల్‌గూడ జైలులో విచారణ ఖైదీగా ఉన్న ప్రణీత్‌ను 3 రోజులు కస్టడీకి ఇవ్వాలని కోరింది. ఈ కేసులో మరింత సమాచారాన్ని రాబట్టాల్సి ఉన్నందున ప్రణీత్‌ను విచారించాల్సి ఉందని వివరించింది. ఈ పిటిషన్‌పై కోర్టు విచారణ గురువారానికి వాయిదా పడింది.

ఏపీ శాసనమండలి సెక్రటరీగా ఖమ్మం వాసి ప్రసన్నకుమార్ నియామకం

ఖమ్మం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ శాసనమండలి సెక్రటరీ జనరల్‌గా ఖమ్మం నగరానికి చెందిన సూర్యదేవర ప్రసన్నకుమార్ కాంట్రాక్టు పద్ధతిలో నియమితులయ్యారు. ఏపీలో శాసనమండలి సెక్రటరీ జనరల్ పదవికి రామాచార్యులు రాజీనామా చేయడంతో ఆ పదవిలో ప్రసన్నకుమార్‌ను ఏపీ ప్రభుత్వం నియమించింది. ఖమ్మానికి చెందిన ప్రసన్నకుమార్ ప్రస్తుతం తెలంగాణ అసెంబ్లీ సలహాదారుగా వ్యవహరిస్తున్నారు. గతంలో ఆలిండియా రేడియో న్యూస్‌రీడర్‌గా పనిచేసిన ప్రసన్నకుమార్ ఆ తర్వాత ఢిల్లీలో పలు కీలక శాఖల్లో పని చేశారు.

త్యాగనిరతికి, సహనానికి ప్రతీక మొహర్రం

» గవర్నర్ రాధాకృష్ణన్, సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): త్యాగనిరతికి, అనిర్వచనీయ సహనానికి మొహర్రం ప్రతీకగా నిలుస్తుందని గవర్నర్ సీపీ రాధాకృష్ణన్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. మహమ్మద్ ప్రవక్త మనుమడు హజ్రత్ ఇమామ్ హుస్సేన్ బలిదానం సంస్మరణగా మొహర్రం జరుపుకొంటామని సీఎం గుర్తుచేసుకున్నారు. తరతరాలుగా గ్రామాల్లో హిందూ, ముస్లింలు కలిసి పీర్ల ఊరేగింపు నిర్వహిస్తారని పేర్కొన్నారు. రాష్ట్రంలో కులమతాలకు అతీతంగా ప్రజల మధ్య సఖ్యతకు, ఐక్యతకు వారధిగా మొహర్రం నిలుస్తుందని తెలిపారు. త్యాగాలకు ప్రతీక మొహర్రం అని, హిందూ, ముస్లిం సోదరులు కలిసి మెలిసి పీర్ల ఊరేగింపు జరుపుకోవడం సౌభ్రాతృత్వానికి నిదర్శనమని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు.

తొలి ఏకాదశి శుభాకాంక్షలు తెలిపిన సీఎం

రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తొలి ఏకాదశి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ప్రజల జీవితాల్లో సుఖ సంతోషాలు, సకల శుభాలు కలిగించాలని సీఎం ప్రార్థించారు. తొలకరికి తోడుగా వచ్చే ఈ శుభప్రదమైన తొలి ఏకాదశి తెలంగాణ ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలను తీసుకువస్తుందని మంత్రి కోమటిరెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

హైదరాబాద్‌లో వీధికుక్కల దాడి.. బాలుడి మృతి

జవహర్‌నగర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): వీధి కుక్కలు మరో పసిప్రాణాన్ని బలి తీసుకున్నాయి. హైదరాబాద్‌లో మంగళవారం జరిగిన ఘటనలో ఆరుబయట ఆడుకుంటున్న ఏడాదిన్నర వయస్సున్న ఓ బాలుడిని ఈడ్చుకెళ్లిన వీధికుక్కలు విచక్షణారహితంగా దాడి చేశాయి. తీవ్రగాయాలతో ఆస్పత్రిపాలైన ఆ చిన్నారి చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయాడు. స్థానికుల కథనం ప్రకారం.. సిద్దిపేట జిల్లా మిరుదొడ్డికి చెందిన భరత్ బతుకుదెరువు కోసం నెల రోజుల క్రితం హైదరాబాద్ వచ్చాడు. భరత్, తన భార్య లక్ష్మి, కొడుకు విహాన్(18 నెలలు)తో కలిసి జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని వికలాంగులకాలనీ ఆదర్శనగర్‌లోని తన మేనమామ ఇంట్లో ఉంటున్నాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి తొమ్మిదిన్నర గంటల సమయంలో ఇంటి బయట ఆడుకుంటున్న విహాన్‌పై నాలుగు వీధి కుక్కలు దాడి చేసి కొత్త దూరం లాక్కెళ్లాయి. దీంతో విహాన్ మొహం, శరీరమంతా తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన కుటుంబసభ్యులు విహాన్‌ను వెంటనే స్థానిక ఆస్పత్రికి తీసుకెళ్లగా.. పరిస్థితి విషమంగా ఉండడంతో గాంధీ ఆస్పత్రికి తరలించారు. కానీ, రాత్రి 12 గంటల సమయంలో విహాన్ మరణించాడు.

మాంసం ముక్క గొంతులో ఇరుక్కొని వ్యక్తి మృతి

తెలకపల్లి, జూలై 16: మాంసం ముక్క గొంతులో ఇరుక్కొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన నాగర్‌కర్నూలు జిల్లా తెలకపల్లి మండల కేంద్రంలో మంగళవారం జరిగింది. రాజు (38) అనే వ్యక్తి మధ్యాహ్నం తన ఇంట్లో అన్నం తింటుండగా మాంసం ముక్క గొంతులో ఇరుక్కొని ఊపిరాడక ఇబ్బంది పడ్డాడు. దీంతో అతన్ని కుటుంబసభ్యులు జిల్లా ఆస్పత్రికి తరలించారు. డాక్టర్లు పరిశీలించి రాజు అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు.

కాళేశ్వరానికి సీడబ్ల్యూసీ అనుమతులంటూ తప్పుడు ప్రచారం!

» కాళేశ్వరం డిజైన్లు రాష్ట్ర ప్రభుత్వానివే
» కాళేశ్వరం ప్లానింగ్, డిజైన్, నిర్మాణం, నిర్వహణలో కేసీఆర్ ప్రభుత్వం విఫలం
» జస్టిస్‌ఘోష్ కమిటీకి శ్రీరాం వెదిరె వివరణ

న్యూఢిల్లీ/హైదరాబాద్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టుకు కేంద్ర జలవనరుల సంఘం (సీడబ్ల్యూసీ) అనుమతులు లభించాయంటూ కేసీఆర్ ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేసిందని కేంద్ర జలవనరుల శాఖ సలహాదారుడు శ్రీరాం వెదిరె చెప్పారు. సీడబ్ల్యూసీ పేరు చెప్పి, ప్రాజెక్టును తుమ్మిడిహెట్టి నుంచి మేడిగడ్డకు మళ్లించారని తెలిపారు. చిల్లర కారణాలు చూపించి, ప్రాణహిత-చేవెళ్ల పథకాన్ని పక్కనపెట్టి, కాళేశ్వరం ప్రాజెక్టును తెరపైకి తీసుకొచ్చారని ఆక్షేపించారు. కాళేశ్వరం ప్రాజెక్టు డిజైన్ల ఆమోదానికి, కేంద్రానికి సంబంధం లేదని స్పష్టం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో జరిగిన అవకతవకలపై శ్రీరాం వెదిరె మంగళవారం జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్‌కు వివరించారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో 2015లో ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు కోసం రూ.12 వేల కోట్లతో చేపట్టిన పనులను కేసీఆర్ సర్కారు గాలికి వదిలేసి ప్రజాధనాన్ని వృథా చేసిందని శ్రీరాం తెలిపారు. తుమ్మిడిహెట్టి వద్ద 160 టీఎంసీల మేరకు జలాలు లభించవని సీ డబ్ల్యూసీ చెప్పిందన్న పేరుతో మేడిగడ్డకు ప్రాజెక్టును మళ్లించడం దారుణమని, సీడబ్ల్యూసీ ఎప్పుడూ అలా చెప్పలేదన్నారు. తుమ్మిడిహెట్టి వద్ద 165 టీఎంసీల మేరకు జలాలు లభిస్తాయని, 75% మేరకు ఆధారపడవచ్చనే జలసంఘం చెప్పిందని స్పష్టం చేశారు. మహారాష్ట్రలో భూములు ముంపునకు గురవుతాయన్న కారణంతో ప్రాజెక్టును మేడిగడ్డకు మళ్లించామని చెప్పడం హాస్యాస్పదమన్నారు. పొరుగు రాష్ట్రంతో చర్చించి సమస్యను పరిష్కరించుకోవచ్చని తెలిపారు. కాళేశ్వరానికి తమ సొంత డిజైన్ సంస్థ ద్వారా సర్టిఫికెట్ ఇచ్చుకుని, సీడబ్ల్యూసీ అనుమతి ఇచ్చిందని కేసీఆర్ సర్కారు తప్పుడు ప్రచారం చేసిందన్నారు.

డిజైన్,నిర్మాణంలో పూర్తిగా విఫలం..

జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ(ఎన్‌డీఎస్‌ఏ) ఇచ్చిన నివేదిక ప్రకారం కాళేశ్వరం ప్లానింగ్, డిజైన్, నాణ్యత, నిర్మాణం, నిర్వహణ విషయంలో కేసీఆర్ సర్కారు పూర్తిగా విఫలమైందని శ్రీరాం చెప్పారు. సరైన పరిశోధనలు లేకుండానే ప్రాజెక్టును నిర్మించారన్నారు. అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను కూడా పరిశీలించాల్సి ఉందని ఎన్‌డీఎస్‌ఏ చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. 2019లో ప్రాజెక్టును ప్రారంభించిన వెంటనే వైఫల్యాలు బయటపడ్డాయని, వాటిని సరిగా పరిష్కరించలేకపోవడంతో 2023లో మేడిగడ్డ కుంగిపోయిందని వివరించారు. డీపీఆర్ రూపొందించడానికి ముందే బ్యారేజీ నిర్మాణం ప్రారంభించారన్నారు. శాస్త్రీయ పరిశోధనలు లేకుండానే డిజైన్, నిర్మాణం జరిగిందని చెప్పారు. బ్యారేజీలు కట్టి.. స్టోరేజీ రిజర్వాయర్లుగా వాడుకోవడం అతిపెద్ద తప్పిదమని, మేడిగడ్డ స్థల ఎంపికలోనే లోపాలున్నాయని స్పష్టం చేశారు. తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ కట్టి ఉంటే గ్రావిటీతో నీరందేదని, మేడిగడ్డలో కట్టడం వల్ల ఏటా ఎత్తిపోతలకే రూ.11 వేల కోట్లు అవుతుందని చెప్పారు.

ఆ 25 మంది ఇంజనీర్లే కారణం!?

హైదరాబాద్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులో బ్యారేజీల వైఫల్యానికి 25 మంది ఇంజనీర్లే కారణమని జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ అంచనాకు వచ్చినట్లు సమాచారం. వారు విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించడమే ప్రాజెక్టులో లోపాలకు కారణమని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కూడా ప్రాథమిక నిర్ణయానికి రావడంతో ఆ నివేదికను తెప్పించుకొని, ఇంజనీర్లను ప్రశ్నించడంతో పాటు విధి నిర్వహణలో వైఫల్యాలపై విచారణ జరపాలని కమిషన్ నిర్ణయించినట్లు తెలిసింది. విజిలెన్స్ నివేదిక రాగానే ఆగస్టు రెండో వారంలో వీరిని విచారణకు పిలిపించడానికి సన్నాహాలు చేస్తోంది. ఇక కాళేశ్వరం పథకానికి సంబంధించిన పత్రాలన్నీ 10 రోజుల్లోగా అందించాలని జస్టిస్ పినాకి చంద్రఘోష్ ప్రభుత్వానికి సూచించారు. ఆ పత్రాలన్నీ అందితేనే విచారణలో వాస్తవాలు వెలుగులోకి వస్తాయని ఆయన భావిస్తున్నారు. ఇక ఆగస్టు 5లోపు అఫిడవిట్లు దాఖలు చేయాలని తాజాగా విచారణకు హాజరైన అధికారులకు కమిషన్ స్పష్టం చేసింది. విచారణలో భాగంగా క్రాస్ ఎగ్జామినేషన్‌కు సహకరించడానికి వీలుగా తెలంగాణ, బెంగాల్‌తో సంబంధం లేదని న్యాయవాదిని ఆగస్టు నుంచి కమిషన్‌కు అందుబాటులో ఉంచాలని జస్టిస్ ఘోష్ కోరారు.



నిజామాబాద్ శివాజీనగర్‌లో యూనియన్ బ్యాంకు

5 కోట్లు స్వాహా చేసిన యూనియన్ బ్యాంకు మేనేజరు

» రుణాల సొమ్మును తన ఖాతాలోకి బదిలీ
» ఆలస్యంగా వెలుగులోకి.. పరారీలో నిందితుడు

ఖిల్లా (నిజామాబాద్), జూలై 16: ఖాతాదారులకు ఇవ్వాల్సిన రుణాలు వాళ్లకు ఇవ్వకుండా.. తానే తీసుకొని ఘరానా మోసానికి పాల్పడ్డాడో బ్యాంకు మేనేజర్. రుణాల పేరిట దాదాపు 40 మంది ఖాతాల్లో నుంచి రూ.5 కోట్లకు పైగా డబ్బును తన ఖాతాలో జమ చేసుకుని మోసగించాడు. సదరు మేనేజర్‌ను బ్యాంకు ఉన్నతాధికారులు గుర్తించడం, బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మంగళవారం రాత్రి ఈ ఘటన వెలుగు చూసింది. అజయ్ అనే వ్యక్తి నిజామాబాద్ పట్టణంలోని శివాజీనగర్‌లో ఉన్న యూనియన్ బ్యాంకు మేనేజర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. కొంతమంది ఖాతాదారులకు ఎనిమిది నెలల క్రితం టర్మ్ లోన్‌తో పాటు సీసీ (క్రెడిట్ ఆన్ కరెంటు అకౌంట్) లోన్‌లను మంజూరు చేశాడు. 40 మంది ఖాతాల్లో మొదట టర్మ్‌లోన్ సొమ్ము ఖాతాల్లో జమ చేశాడు. అదేవిధంగా మరో సీసీ లోన్ కోసం ఖాతాదారుల నుంచి అవసరమైన బ్యాంకు చెక్కులను, ఆస్తి పత్రాలను తీసుకున్నాడు. అయితే రెండో లోన్ మంజూరు కాలేదని వారిని నమ్మించి.. వారి లోన్ డబ్బు రూ. 5 కోట్లను తన ఖాతాలోకి బదిలీ చేసుకున్నాడు. ఈ లావాదేవీలన్నీ గత జనవరి, ఫిబ్రవరి నెలల్లో జరిగాయి. అయితే ఇటీవల తనిఖీలకు వచ్చిన బ్యాంకు ఉన్నతాధికారులు... రుణాల మంజూరులో, లావాదేవీల్లో అవకతవకలు జరుగుతున్నట్లు గుర్తించారు. ఆ తర్వాత ఖాతాదారులను పిలిచి విచారించగా.. రుణాల స్వాహా వ్యవహారం బయటకు పొక్కింది. దీంతో బాధితులు లబోదిబోమంటూ మంగళవారం రాత్రి నగర సీఐ నరహరిని కలిశారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ జరిపి.. అజయ్‌పై కేసు నమోదు చేశారు. ప్రస్తుతం నిందితుడు అజయ్ పరారీలో ఉన్నాడు.

పిల్లి తిన్నాకే..

జేఎన్‌టీయూ హాస్టళ్లలో దారుణంగా ఆహార నిర్వహణ
కొద్దిరోజుల క్రితం సుల్తాన్‌పూర్‌లో.. చట్నీలో ఎలుక
ఇప్పుడు హైదరాబాద్‌లోని జేఎన్‌టీయూ మెస్‌లో పిల్లి
అధికారుల పర్యవేక్షణ కరవు.. విద్యార్థుల్లో ఆందోళన
రెగ్యులర్ వీసీ లేక.. ఇన్‌చార్జ్ వీసీ రాక.. సమస్యల తిష్ఠ



జేఎన్‌టీయూ మంజీరా హాస్టల్‌లోని ఆహారపాత్రలో మూతి పెట్టిన పిల్లి

హైదరాబాద్ సిటీ, జూలై16 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ అధికారుల నిర్లక్ష్యం కారణంగా హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. గతవారం సుల్తాన్‌పూర్ జేఎన్‌టీయూ మెస్‌లో.. చట్నీలో ఎలుక చక్కర్లు కొట్టిన ఘటన మరువక ముందే తాజాగా సోమవారం హైదరాబాద్ జేఎన్‌టీయూ హాస్టల్ మెస్‌లో వండిన ఆహార పదార్థాలను పిల్లి తింటున్న వైనం వెలుగులోకి వచ్చింది. దీనిపై ప్రిన్సిపాల్‌ను వివరణ కోరగా.. విద్యార్థులు భోజనం చేశాక మిగిలిన ఆహార పదార్థాలను సిబ్బంది అలాగే వదిలేశారని బదులిచ్చారు. ఆహారాన్ని భద్రంగా ఉంచేందుకు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా వార్డెన్లను ఆదేశించినట్లు తెలిపారు. అయితే.. వేలాదిమంది విద్యార్థులు ఉంటున్న హాస్టళ్లలోని భోజనశాలల్లో కనీస జాగ్రత్తలు తీసుకోకపోవడం దురదృష్టకరమని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మెస్‌ల్లో సిబ్బంది నిర్లక్ష్యంతో పాటు ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం కూడా స్పష్టంగా కనిపిస్తోందని విద్యార్థి సంఘాల ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వర్సిటీకి రెండు నెలలుగా రెగ్యులర్ వైస్ చాన్స్‌లర్ లేకపోవడం, ఇన్‌చార్జ్ వీసీగా ఉన్న ఐఏఎస్ అధికారి విద్యార్థులకు అందుబాటులో ఉండకపోవడంతో.. హాస్టళ్లలో సమస్యలన్నీ ఎక్కడవేసిన గొంగళి అక్కడేనన్న చందంగా మారాయి. జేఎన్‌టీయూ క్యాంటీన్‌లో కాలం చెల్లిన బియ్యం పిండితో ఆహారపదార్థాలు తయారు చేస్తున్న విషయం ఫుడ్‌సేఫ్టీ కమిషనర్ తనిఖీల్లో ఇటీవలే వెల్లడైంది. అయినా ఉన్నతాధికారులు దిద్దుబాటు చర్యలు చేపట్టలేదు. వర్సిటీ అనుబంధ కళాశాలల్లోని హాస్టల్ మెస్‌లు, క్యాంటీన్లలో ఆహారపదార్థాలను భద్రపరిచేందుకు అవసరమైన వసతులు లేవని కాంట్రాక్టర్లు సైతం వాపోతున్నారు. భోజనశాలల్లో వసతుల కల్పన గురించి పలుమార్లు అధికారులకు మొరపెట్టుకున్నప్పటికీ పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక.. జేఎన్‌టీయూ హాస్టళ్లలో విద్యార్థుల హాస్టళ్లు, మెస్‌లను పర్యవేక్షించాల్సిన వార్డెన్లకు.. వర్సిటీ ఉన్నతాధికారులు అదనపు బాధ్యతలను అప్పగించడం పలు విమర్శలకు తావిస్తోంది. వారంతా ఆయా బాధ్యతల నిర్వహణలో తలమునకలై.. హాస్టళ్లు, మెస్‌ల నిర్వహణను గాలికి వదిలేశారని విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఆధునీకరణ ప్రతిపాదనలు..

జేఎన్‌టీయూకు అనుబంధంగా ఉన్న ఐదు ఇంజనీరింగ్ కాలేజీల హాస్టళ్లను ఆధునీకరించేందుకు రూ.2.27కోట్లతో ప్రతిపాదనలను వర్సిటీ అధికారులు సిద్ధం చేశారు. హాస్టళ్లలో ప్లంబింగ్, సివిల్, ఎలక్ట్రికల్ పనులు, తాగునీటి కోసం ఆర్‌వో సిస్టమ్స్, ఇతర మౌలిక వసతులను కల్పించేందుకు అనుమతి కోరుతూ ప్రభుత్వానికి యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు లేఖ రాసినట్లు తెలిసింది. రిజిస్ట్రార్ పంపిన ప్రతిపాదనలకు ప్రభుత్వం నుంచి ఆమోదం లభించగానే హాస్టళ్ల ఆధునీకకరణ పనులను వెంటనే చేపడతామని ఇంజనీరింగ్ విభాగం అధికారులు పేర్కొన్నారు.

విజన్-47లోకి ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగం!

హైదరాబాద్-అమరావతి గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ రహదారి కూడా

» కేంద్ర క్యాబినెట్ ఆమోదం తర్వాత మొదలుకానున్న పనులు
» ఏపీ సీఎంగా చంద్రబాబు రాకతో తెరపైకి మళ్లీ గ్రీన్‌ఫీల్డ్ హైవే

హైదరాబాద్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు మంజూరు చేసిన రీజనల్ రింగ్‌రోడ్డు దక్షిణ భాగం పనుల్లో కదలిక వచ్చింది. ఆ పనులను, విభజన చట్టంలో పేర్కొన్న హైదరాబాద్-అమరావతి మధ్య గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేను, మరికొన్ని జాతీయ రహదారులను.. కేంద్ర ప్రభుత్వం తన 'విజన్ 2047' ప్రాజెక్టులో భాగం చేసినట్లు సమాచారం. కేంద్ర క్యాబినెట్ ఈ ప్రాజెక్టుకు ఆమోదం తెలగానే ఈ రహదారుల పనులు వేగవంతం కానున్నాయి. రీజినల్ రింగ్ రోడ్డును మంజూరు చేసినప్పుడే.. దాన్ని ఉత్తర, దక్షిణ భాగాలుగా నిర్మిస్తామని కేంద్రం తెలిపింది. అయితే, అప్పట్లో ఈ ప్రాజెక్టును భారత్‌మాల-1లో చేర్చింది. ఉత్తర భాగం నిర్మాణానికి అవసరమైన అనుమతులను ముందుగా ఇచ్చింది. దక్షిణ భాగం విషయంలో కొంత ఆలస్యం జరిగింది. దీంతో దాన్ని భారత్‌మాల-2లో చేర్చింది. ఆ తరువాతా సమాయానికి పనులు మొదలు కాకపోవడంతో దక్షిణ భాగాన్ని కేంద్రం తాజాగా విజన్-2047లోకి చేర్చినట్లు తెలిసింది. దక్షిణభాగం రోడ్డు చౌటుప్పల్ నుంచి మొదలై.. ఆమనగల్, షాద్‌నగర్, చేవెళ్ల మీదుగా సంగారెడ్డి వరకు 189 కిలోమీటర్ల మేర ఉండనుంది. రహదారి నిర్మాణానికి దాదాపు 2వేల హెక్టార్ల భూమి కావాల్సి ఉండగా, భూ పరిహారం, నిర్మాణ వ్యయానికి కలిపి రూ.16వేల కోట్లకు పైగా నిధులు అవసరంకానున్నాయి. భూ పరిహారానికే దాదాపు రూ. 6,500-7000 కోట్లు చెల్లించాల్సి ఉంటుందని అధికారులు ప్రాథమికంగా అంచనా వేసినట్లు సమాచారం.



చట్టంలో ఉన్నా..

హైదరాబాద్ అమరావతి నడుమ కొత్త (గ్రీన్‌ఫీల్డ్) ఎక్స్‌ప్రెస్ రహదారిని నిర్మించాలనే నిబంధన ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టంలోనే ఉంది. కానీ.. 2019 అసెంబ్లీ ఎన్నికల తరువాత ఏపీలో రాజకీయ పరిణామాలు మారిన నేపథ్యంలో ఈ రహదారి అంశం మరుగున పడిపోయింది. మళ్లీ ఇప్పుడు ఏపీలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక అలఈ గ్రీన్‌ఫీల్డ్ హైవేను తెరపైకి తెచ్చారు. చంద్రబాబు ఇటీవల ఢిల్లీ వెళ్లినపుడు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో భేటీ అయినప్పుడు.. ఈ రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు. విభజన చట్టంలోనూ ఈ అంశం ఉందనే విషయాన్ని గుర్తుచేశారు. స్పందించిన గడ్కరీ ఈ రహదారి నిర్మాణానికి సూత్రప్రాయంగా ఆమోదం తెలిపారు. ఈ ప్రాజెక్టును విజన్-2047 ప్రాజెక్టు డాక్యుమెంట్‌లోకి చేర్చాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించినట్టు తెలిసింది. ఈ రహదారిని నిర్మిస్తే ప్రస్తుతం ఉన్న హైదరాబాద్ -విజయవాడ జాతీయ రహదారి(ఎన్‌హెచ్-65)పై వాహనాల ఒత్తిడి తగ్గనుంది. అదే విధంగా కొత్త రోడ్డు అందు బాటులోకి వస్తే విజయవాడ (అమరావతి)-హైదరాబాద్ మధ్య దూరం కూడా దాదాపు 55-65 కిలోమీటర్ల మేర తగ్గుతుందని అంచనా. ఈ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) నుంచి ప్రారంభమై.. అమరావతి దగ్గర్లోని ఒక జాతీయ రహదారికి అనుసంధానం అవుతుందని అధికారిక వర్గాల ద్వారా తెలిసింది. కాగా ఈ రహదారి నిర్మాణానికి భూ సేకరణ పరిహారం, నిర్మాణ వ్యయం కలిపి దాదాపు రూ.10-15 వేల కోట్ల దాకా అవుతుందని అధికారులు ప్రాథమికంగా అంచనా వేసినట్లు సమాచారం.

8 ఏళ్లుగా కిలోల కొద్దీ కొకైన్ విక్రయం

» నైజీరియన్ స్మగ్లర్ ఫ్రాంక్లిన్ తీరు
» అయినా.. పట్టుబడని వైనం
» తాజా కేసులోనూ పరారీలోనే..



ఎజియోనిలి ఫ్రాంక్లిన్ ఉచ్చెన్నా అలియాస్ కలేషి

హైదరాబాద్ సిటీ, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఉచెన్నా.. ఎజియోనిలి ఫ్రాంక్లిన్ ఉచెన్నా అలియాస్ కలేషీ.! ఎనిమిదేళ్లుగా హైదరాబాద్ నగరంలోనే తిష్ట వేశాడు. నైజీరియా నుంచి డ్రగ్స్ తెప్పించి.. నగరంలో విక్రయించాడు. పకడ్బందీగా పెడ్లర్ల నెట్‌వర్క్ ఏర్పాటు చేసుకుని, ఈ ఎనిమిదేళ్లలో రూ. కోట్లు విలువ చేసే కిలోల కొద్దీ కొకైన్‌ను విక్రయించాడు. ఈ ఎనిమిదేళ్లలో ఎన్నడూ పోలీసులకు పట్టుబడకపోవడం గమనార్హం.! సోమవారం రాజేంద్రనగర్ పోలీసులు, టీజీ న్యాబ్ జాయింట్ ఆపరేషన్‌లో భారీ ఎత్తున డ్రగ్స్ నెట్‌వర్క్‌ను ఛేదించిన విషయం తెలిసిందే.! ఈ కేసులో అరెస్టయిన ఐదుగురిని పోలీసులు మంగళవారం కోర్టులో హాజరుపరిచి, రిమాండ్‌కు తరలించారు.

సన్‌సిటీలోనే మకాం..

2017లో ఉచెన్నా హైదరాబాద్ వచ్చాడు. అప్పటి నుంచి బండ్లగూడ పరిధిలోని సన్‌సిటీలో మకాం వేసి, డ్రగ్స్ విక్రయాలు చేసేవాడు. ఇటీవల హైదర్షాకోట్‌లోని విశాఖనగర్ వ్యూ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్నట్లు పోలీసులు గుర్తించారు. ఇతను నగరానికి వచ్చిన కొత్తల్లో నైజీరియాకు చెందిన ఘరానా స్మగ్లర్ డివైన్ ఎబూకా సుజీ అలియాస్ ఇమ్మాన్యుయేల్ నెట్‌వర్క్‌లో చేరాడు. నగరంలో డ్రగ్స్ స్మగ్లింగ్ వ్యవహారాలను పర్యవేక్షించేవాడు. ఇతనికి బెంగళూరులో పరిచయమైన నైజీరియన్ మహిళ ఒనూహ బ్లెస్సింగ్ అలియాస్ జోయానాగోమ్స్‌తో పరిచయం ఏర్పడింది. ఉచెన్నా ఆమెను గోవా, ఢిల్లీ, బెంగళూరు నగరాల్లో డ్రగ్స్ సరఫరాకు నియమించాడు. ఎబూకా నైజీరియాకు తిరిగి వెళ్లిపోయాక.. హైదరాబాద్ డ్రగ్స్ సామ్రాజ్యానికి ఉచెన్నా నాయకుడయ్యాడు. ఆ తర్వాత నగరంలో పకడ్బందీ నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసుకున్నాడు. నైజీరియా నుంచి సముద్రమార్గంలో వచ్చే కొకైన్‌ను తొలుత ఢిల్లీకి, ఆ తర్వాత జోయానాగోమ్స్ ద్వారా విమానాలు లేదా రైళ్లలో హైదరాబాద్‌కు తెప్పించేవాడు.

అరెస్టుకు ఆమడ దూరం?

ఉచెన్నా గడిచిన ఎనిమిదేళ్లలో హైదరాబాద్ నగరంలో రూ.కోట్లు విలువ చేసే కిలోల కొద్దీ కొకైన్‌ను విక్రయించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఇతని నెట్‌వర్క్‌లో ఉన్న ఒక పెడ్లర్– సత్య వెంకట గౌతమ్ కేవలం 7 నెలల్లో 2.6 కిలోల కొకైన్‌ను విక్రయించాడు. దీన్ని బట్టి ఉచెన్నా ఏ స్థాయిలో డ్రగ్స్‌ను విక్రయించాడో అంచనావేయవచ్చని పోలీసులు చెబుతున్నారు. అయినా.. ఇప్పటికీ ఉచెన్నా ఒక్కసారి కూడా పోలీసులకు పట్టుబడకపోవడం గమనార్హం..!

అమన్ ప్రీత్‌సింగ్ కాంటాక్టులపై నజర్

డ్రగ్స్ కేసులో వినియోగదారుడిగా పోలీసులకు పట్టుబడ్డ సినీ నటి రకుల్ ప్రీత్‌సింగ్ సోదరుడు అమన్ ప్రీత్ సింగ్ ద్వారా సినీ ఇండస్ట్రీ లింకులను రాబట్టేందుకు టీజీ న్యాబ్ పోలీసులు ప్రయత్నిస్తున్నారు. అతని సెల్‌ఫోన్ కాల్ డేటా రికార్డు(సీడీఆర్)ను సేకరించే పనిలో నిమగ్నమయ్యారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: K. Srinivas. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
హైదరాబాద్ ● బుధవారం 17 జూలై 2024
diksuchi@andhrajyothy.com

అగ్రిసెట్ 2024

గుంటూరు-లాంలోని ఆచార్య ఎన్.జీ.రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ(ఏఎన్‌జీఆర్ఏయూ)- 'అగ్రిసెట్ 2024' నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీనిని వ్యవసాయ విభాగాల్లో పాలిటెక్నిక్ డిప్లొమా పూర్తిచేసిన అభ్యర్థులకు ఉద్దేశించారు. ఈ ఎగ్జామ్‌లో సాధించిన స్కోర్ ద్వారా నాలుగేళ్ల వ్యవధి గల 'బీఎస్సీ(ఆనర్స్) అగ్రికల్చర్ ప్రోగ్రామ్‌లో అడ్మిషన్స్ ఇస్తారు. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్, అనుబంధ అగ్రికల్చరల్ కళాశాలల్లో నిర్దేశిత సీట్లు భర్తీ చేయనున్నారు. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

విభాగాలు: అగ్రికల్చర్, సీడ్ టెక్నాలజీ, ఆర్గానిక్ ఫార్మింగ్

సీట్ల వివరాలు

- పాలిటెక్నిక్ వ్యవసాయ డిప్లొమా అభ్యర్థుల కోసం ప్రభుత్వ వ్యవసాయ కళాశాలల్లో 196 సీట్లు, అనుబంధ కళాశాలల్లో 72 సీట్లు చొప్పున మొత్తం 268 సీట్లు నిర్దేశించారు.
- ప్రభుత్వ వ్యవసాయ కళాశాలల్లో అగ్రికల్చర్ అభ్యర్థులకు 161 సీట్లు, సీడ్ టెక్నాలజీ అభ్యర్థులకు 27 సీట్లు, ఆర్గానిక్ ఫార్మింగ్ అభ్యర్థులకు 8 సీట్లు ఉన్నాయి.
- అనుబంధ వ్యవసాయ కళాశాలల్లో కన్వీనర్ కోటా కింద అగ్రికల్చర్ అభ్యర్థులకు 59 సీట్లు, సీడ్ టెక్నాలజీ అభ్యర్థులకు 10 సీట్లు, ఆర్గానిక్ ఫార్మింగ్ అభ్యర్థులకు 3 సీట్లు ఉన్నాయి.

అర్హత: ఏఎన్‌జీఆర్‌ఏయూ/పీజేటీఎస్ఏయూ నుంచి రెండేళ్ల వ్యవధి గల డిప్లొమా(అగ్రికల్చర్/సీడ్ టెక్నాలజీ/ఆర్గానిక్ ఫార్మింగ్) పూర్తిచేసి ఉండాలి. అభ్యర్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి 17 ఏళ్లు నిండి ఉండాలి. జనరల్ అభ్యర్థులకు 22 ఏళ్లు; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 25 ఏళ్లు; దివ్యాంగులకు 27 ఏళ్లు మించకూడదు.

అగ్రిసెట్ వివరాలు: అభ్యర్థులు తమ డిప్లొమా స్ట్రీమ్‌లోనే అగ్రిసెట్ ఎగ్జామ్ రాయాలి. ఇది కంప్యూటర్ బేస్డ్ టెస్ట్. ఇందులో మొత్తం 120 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఇస్తారు. డిప్లొమా(అగ్రికల్చర్/సీడ్ టెక్నాలజీ/ఆర్గానిక్ ఫార్మింగ్) ప్రోగ్రామ్‌లకు ఏఎన్‌జీఆర్‌ఏయూ నిర్దేశించిన సిలబస్ ప్రకారం ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్న పత్రం తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో ఉంటుంది. ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం మార్కులు 120. నెగెటివ్ మార్కులు లేవు. పరీక్ష సమయం గంటన్నర. ఈ ఎగ్జామ్‌లో అర్హత సాధించాలంటే జనరల్ అభ్యర్థులకు కనీసం 25 శాతం(30)మార్కులు రావాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1500; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.750
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 31
- **ఆన్‌లైన్ దరఖాస్తు ఎడిట్ విండో ఓపెన్:** ఆగస్టు 7 నుంచి 8 వరకు
- **దరఖాస్తు హార్డ్ కాపీ చేరేందుకు చివరి తేదీ:** ఆగస్టు 14
- **హాల్ టికెట్స్ డౌన్‌లోడింగ్:** ఆగస్టు 16 నుంచి 23 తేదీల వరకు
- **అగ్రిసెట్ మాక్ టెస్ట్ తేదీలు:** ఆగస్టు 20 నుంచి 25 వరకు
- **ఏఎన్‌జీఆర్‌ఏయూ అగ్రిసెట్ 2024 తేదీ:** ఆగస్టు 27
- **చిరునామా:** కన్వీనర్-అగ్రిసెట్ 2024, అసోసియేట్ డీన్, ఎస్వీ అగ్రికల్చరల్ కాలేజ్, తిరుపతి-517502
- **వెబ్‌సైట్:** angrau.ac.in



ఎన్‌జీ రంగా వర్సిటీ

బీఎస్సీ ఆనర్స్, బీటెక్

గుంటూరులోని ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ(ఏఎన్‌జీఆర్ఏయూ)- వ్యవసాయ డిగ్రీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్, అనుబంధ వ్యవసాయ కళాశాలల్లో ప్రవేశాలు కల్పిస్తారు. బీఎస్సీ ఆనర్స్ అగ్రికల్చర్, బీటెక్(ఫుడ్ టెక్నాలజీ/అగ్రికల్చరల్ ఇంజనీరింగ్) ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. బైపీసీ స్ట్రీమ్, ఎంపీసీ స్ట్రీమ్ కేటగిరీల్లో అడ్మిషన్స్ నిర్వహిస్తారు. ఏపీ ఈఏపీసెట్ 2024 స్కోర్, కౌన్సెలింగ్ ద్వారా సీట్లు అలాట్ చేస్తారు. గ్రామీణ రైతు కుటుంబాలకు చెందిన అభ్యర్థుల కోసం 40 శాతం సీట్లు ప్రత్యేకించారు. ఈ సీట్లకు అప్లయ్ చేసుకోవాలంటే తల్లిదండ్రుల పేరుమీద గానీ, అభ్యర్థి పేరు మీద గానీ కనీసం ఒక ఎకరం భూమి ఉండాలి. గ్రామీణ పాఠశాలల్లో కనీసం నాలుగేళ్లు చదివి ఉండాలి. ప్రతి కాలేజీలో 85 శాతం సీట్లను స్థానికులకు కేటాయించారు. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

- వెబ్‌సైట్: angrau.ac.in

బీఎస్సీ ఆనర్స్ అగ్రికల్చర్ ప్రోగ్రామ్‌ను అందిస్తున్న ప్రభుత్వ కళాశాలలు

- అగ్రికల్చరల్ కాలేజ్, బాపట్ల
- అగ్రికల్చరల్ కాలేజ్, నైరా-శ్రీకాకుళం జిల్లా
- అగ్రికల్చరల్ కాలేజ్, రాజమహేంద్రవరం
- ఎస్వీ అగ్రికల్చరల్ కాలేజ్, తిరుపతి
- అగ్రికల్చరల్ కాలేజ్, మహానంది-నంద్యాల జిల్లా
- మేకపాటి గౌతమ్ రెడ్డి అగ్రికల్చరల్ కాలేజ్, ఉదయగిరి-ఎస్‌పీఎస్ఆర్ నెల్లూరు జిల్లా
- అగ్రికల్చరల్ కాలేజ్, పులివెందుల

బీటెక్(ఫుడ్ టెక్నాలజీ) ప్రోగ్రామ్‌ను అందిస్తున్న ప్రభుత్వ కళాశాలలు

- ఎన్‌టీఆర్ కాలేజ్ ఆఫ్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, బాపట్ల
- కాలేజ్ ఆఫ్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, పులివెందుల

బీటెక్(అగ్రికల్చరల్ ఇంజనీరింగ్) ప్రోగ్రామ్‌ను అందిస్తున్న ప్రభుత్వ కళాశాలలు

- డా.ఎన్‌టీఆర్ కాలేజ్ ఆఫ్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్, బాపట్ల
- కాలేజ్ ఆఫ్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్, మడకశిర

అనుబంధ కళాశాలలు

- శ్రీ కింజరపు ఎర్రం నాయుడు కాలేజ్ ఆఫ్ అగ్రికల్చరల్ సైన్సెస్, ఎచ్చెర్ల-శ్రీకాకుళం
- కదిరి బాబూరావు కాలేజ్ ఆఫ్ అగ్రికల్చర్, సీఎస్ పురం, ప్రకాశం జిల్లా
- ఎస్.ఎస్ అగ్రికల్చరల్ కాలేజ్, మార్కాపూర్-ప్రకాశం జిల్లా
- ఎస్‌బీవీఆర్ అగ్రికల్చరల్ కాలేజ్, బద్వేల్, వైఎస్సార్ జిల్లా
- శ్రీ కృష్ణదేవరాయ కాలేజ్ ఆఫ్ అగ్రికల్చరల్ సైన్సెస్, అనంతపురం
- జే.సీ. దివాకర్ రెడ్డి అగ్రికల్చరల్ కాలేజ్, తాడిపత్రి-అనంతపురం

బైపీసీ స్ట్రీమ్

- బీఎస్సీ ఆనర్స్ అగ్రికల్చర్ ప్రోగ్రామ్‌నకు సంబంధించి ప్రభుత్వ కాలేజీల్లో 980 సీట్లు(20 శాతం ఐకార్ సీట్లు సహా); అనుబంధ కళాశాలల్లో 252 సీట్లు ఉన్నాయి. ప్రైవేట్ యూనివర్సిటీలైన శ్రీ సత్య సాయి జిల్లాలోని భారతీయ ఇంజనీరింగ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఇన్నోవేషన్ యూనివర్సిటీ(బీఈఎస్‌టీఐయూ)లో 175; తిరుపతిలోని మోహన్ బాబు యూనివర్సిటీ(ఎంబీయూ)లో 63 సీట్లు ఉన్నాయి.
- బీటెక్(ఫుడ్ టెక్నాలజీ) ప్రోగ్రామ్‌నకు సంబంధించి ప్రభుత్వ కాలేజీల్లో 73 సీట్లు ఉన్నాయి.
- ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకోసం 10 శాతం సూపర్ న్యూమరరీ సీట్లు నిర్దేశించారు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఫిజికల్ సైన్సెస్, బయలాజికల్/నేచురల్ సైన్సెస్ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. అభ్యర్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి 17 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి. రిజర్వ్‌డ్ అభ్యర్థులకు వయోపరిమితి సడలింపు వర్తిస్తుంది.

దరఖాస్తు ఫీజు: జనరల్ అభ్యర్థులకు రూ.1000; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.500

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 2

ఎంపీసీ స్ట్రీమ్

- బీటెక్(అగ్రికల్చరల్ ఇంజనీరింగ్) ప్రోగ్రామ్‌నకు సంబంధించి డా.ఎన్‌టీఆర్ కాలేజ్ ఆఫ్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్-బాపట్లలో 27 సీట్లు; కాలేజ్ ఆఫ్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్-మడకశిరలో 20 సీట్లు ఉన్నాయి.
- బీటెక్(ఫుడ్ టెక్నాలజీ) ప్రోగ్రామ్‌నకు సంబంధించి ఫార్మర్స్ కోటా కింద డా.ఎన్‌టీఆర్ కాలేజ్ ఆఫ్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ-బాపట్లలో 21 సీట్లు; కాలేజ్ ఆఫ్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ-పులివెందులలో 11 సీట్లు ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి మేథమెటిక్స్, ఫిజికల్ సైన్సెస్ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. అభ్యర్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి 17 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి.

దరఖాస్తు ఫీజు: జనరల్ అభ్యర్థులకు రూ.2,000; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1000

ఆఫ్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జూలై 29

చిరునామా: రిజిస్ట్రార్, ఆచార్య ఎన్.జీ.రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్, లాం, గుంటూరు-522034

SCHOLARSHIP ALERT

HDFC Bank Parivartan's ECSS Programme 2024-25

Description: HDFC Bank invites applications from students studying in Class 1 to the postgraduate level. The scholarship supports meritorious and needy students belonging to underprivileged sections of society.

Eligibility: The scholarship is open to Indian nationals only. The students must be studying in Class 1 to 12, or pursuing diploma, ITI, polytechnic, undergraduate or postgraduate (including general and professional) courses. The applicants must have passed their previous qualifying examination with at least 55% marks, and their annual family income must be less than or equal to INR 2.5 lakh. Preference will be given to applicants who have experienced personal or family crises in the past three years, preventing them from continuing to bear the cost of education and putting them at risk of dropping out.

Prizes & Rewards: Up to INR 75,000

Last Date to Apply: 04-09-2024

Application mode: Online applications only

Short Url: www.b4s.in/aj/HDFC54

Panasonic Ratti Chhatr Scholarship



Description: Panasonic Life Solutions India (PLSIND) invites applications from students enrolling in B.E./B.Tech. courses at the Indian Institutes of Technology (IITs).

Eligibility: Open for students across India who have cleared the entrance for admission into B.E./B.Tech. courses at any of the IITs (Indian Institute of Technology) in 2024-25. Applicants must have cleared their Class 12 examination or be awaiting final results. Applicants must have scored more than 75% marks in Class 12. The annual family income of the applicant must not be more than INR 8,00,000 from all sources. Only candidates from 2024-25 batch are eligible to apply.

Prizes & Rewards: Scholarship amount: INR 70,250 per year for four years

Last Date to Apply: 15-08-2024

Application mode: Online applications only

Short Url: www.b4s.in/aj/RCSP56

Kotak Kanya Scholarship

Description: Under the CSR Project on Education & Livelihood of Kotak Mahindra Group Companies, Kotak Education Foundation invites applications for the Kotak Kanya Scholarship 2024-25 from meritorious girl students from low-income families to empower them to pursue higher studies in professional education after Class 12.

Eligibility: Open for meritorious girl students across India.

- Applicants must have scored 75% or more marks or equivalent CGPA in Class 12 board examinations.
- Applicant's annual family income must be less than INR 6,00,000.
- Meritorious girl students who have secured admission to the first year of graduation programs in the academic year 2024-25 in institutes of repute like NIRF/NAAC accredited for professional graduation degrees like Engineering, MBBS, BDS, Integrated LLB (5 Years), B.Sc. Nursing, B. Pharmacy, Integrated BS-MS/BS-Research in ISER, IISC (Bangalore), or other professional courses (Design, Architecture, etc.).

Prizes & Rewards: INR 1.5 lakh* per year

**Disclaimer:* The renewal of the scholarship every year will be at the sole discretion of the Kotak Education Foundation

Last Date to Apply: 30-09-2024

Application mode: Online applications only

Short Url: www.b4s.in/aj/KKGS3

buddy4study.com


కొత్త పుస్తకం

పోటీ పరీక్షల దిక్సూచి

భారత రాజ్యాంగం - రాజకీయ వ్యవస్థ

మరి కొద్ది నెలల్లో తెలంగాణలో గ్రూప్-1 మెయిన్స్, గ్రూప్-2, గ్రూప్-3 పరీక్షలు నిర్వహించబోతున్నారు. అటు ఏపీలోనూ ఇటీవల కొలువు తీరిన కొత్త ప్రభుత్వం భారీ స్థాయిలో ప్రభుత్వ ఉద్యోగాల నియామకానికి సమాయత్తం అవుతోంది. పోటీ పరీక్షలు ఏవైనా...ఇండియన్ పాలిటీ ప్రాధాన్యం ఎనలేనిది. పైగా అన్ని సబ్జెక్టుల్లో కన్నా ఎక్కువ మార్కులు తెచ్చిపెట్టే సబ్జెక్టు కూడా ఇదే. ఈ నేపథ్యంలో పోటీ పరీక్షల శిక్షణలో చాలా అనుభవం ఉన్న డాక్టర్ సుంకర రమాదేవీ రచించిన 'భారత రాజ్యాంగం - రాజకీయ వ్యవస్థ' 15వ ఎడిషన్ మార్కెట్‌లోకి విడుదల అయ్యింది. దాదాపు 333 పోటీ పరీక్షల ప్రశ్న పత్రాలను అధ్యయనం చేసి ఈ పుస్తకానికి రూపకల్పన చేశారు. శాసన వ్యవస్థల కార్యనిర్వాహక, న్యాయ వ్యవస్థ, రాజ్యాంగ, రాజ్యాంగేతర సంస్థల్లో వచ్చిన అన్ని పరిణామాలను, చట్టాలను, కోర్టుల తీర్పులను ఈ పుస్తకంలో పొందుపరిచారు. రాజ్యాంగ నిర్మాణ వివరాలతోపాటు ఉద్యమ చరిత్ర, రాజ్యాంగ చరిత్రలో ముఖ్య ఘట్టాలు, రాజ్యాంగం ఏర్పడటానికి దారితీసిన చారిత్రక పోరాటాలు - పరిణామాలు, బ్రిటిష్ పాలకులు అనుసరించిన వ్యూహాలు తదితర వివరాలన్నీ ఈ పుస్తకంలో ఉన్నాయి. భారత రాజకీయ వ్యవస్థకు సంబంధించిన ప్రతి అంశాన్నీ సంపూర్ణంగా, వాద ప్రతివాదాల సమాచారంతో ఎంతో ప్రామాణికంగా రూపొందించారు. అదేవిధంగా ఇండియా వర్సెస్ భారత్, ఉమ్మడి పౌరస్మృతి- ఒకే దేశం ఒకే చట్టం, పౌరసత్వ సవరణ చట్టం- విమర్శ, ఆర్టికల్ 370 రద్దు- సుప్రీంకోర్టు తీర్పు, కొత్త పార్లమెంట్ భవనం- సెంగోల్ స్థాపన, జమిలీ ఎన్నికలు - రామ్‌నాథ్ కోవింద్ కమిటీ, కొత్త నేర న్యాయ చట్టాలు, సాధారణ ఎన్నికల ఫలితాలు- 2024పై విశ్లేషణ, ఎలక్టోరల్ బాండ్స్ వంటి సమకాలీన అంశాలను వివరంగా చర్చించారు. సమగ్రమైన రాజ్యాంగ విశ్లేషణను, భారత రాజకీయాలకు సంబంధించిన సమాచారాన్ని, చారిత్రక పరిణామాలను వివిధ పట్టికల రూపంలో చక్కగా అందించారు. ఈ పుస్తకం కేవలం ఏపీపీఎస్సీ, టీజీపీఎస్సీ, ఇతర పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న అభ్యర్థులకే కాదు విద్యార్థులకు, అధ్యాపకులకు, న్యాయవాదులకు, స్వచ్ఛంద సేవా సంస్థలు నిర్వహించే వారికి కరదీపిక వలె ఉపయోగపడుతుంది.


పుస్తకం పేరు: భారత రాజ్యాంగం - రాజకీయ వ్యవస్థ (15వ ఎడిషన్)
పేజీలు: 1202(రెండు వాల్యూమ్స్ కలిపి)
వెల: రూ.899/-
ప్రతులకు: శ్రీ తేజ పబ్లికేషన్స్, గాంధీనగర్, హైదరాబాద్-500080
ఫోన్ నెం: 8686430054, 8686430055





పచ్చటి గుర్రం

చతురతకు, చమత్కారానికి మారుపేరైన బీర్బల్ అక్బరు కొలువులో కొత్తగా చేరిన కొన్నిరోజులకు ఇద్దరూ వేటకు వెళ్లారు. అక్కడి ప్రకృతిని చూసి, మైమరచిపోయిన బీర్బల్ 'ఇంత పచ్చని చెట్ల నడుమ, పచ్చటి కొండలలో ఒక ఆకు పచ్చని గుర్రం మీద వెళితే ఎంత మజాగా ఉంటుందో కదా' అన్నాడు ఏదో ఆలోచిస్తూ, ఆ మాటలు విన్న అక్బరు 'ఏదీ పచ్చటి గుర్రం అన్నావే వారం రోజుల్లోగా నువ్వునాకు, ఆ పచ్చటి గుర్రాన్ని తెచ్చి ఇవ్వాలి' అని ఆజ్ఞాపించి ఇదెలా సాధిస్తాడో చూద్దాం అని లోలోపల నవ్వుకుంటాడు. వారం రోజులు గడిచాక బీర్బల్ హడావుడిగా కొలువుకు వచ్చి 'జహాపనా.. ఒక చోట మీరడిగిన పచ్చటి గుర్రం. దొరి




కింది కానీఆ గుర్రం యజమాని మీరు స్వయంగా వస్తేనే, గుర్రం అమ్ముతా అంటున్నాడు' అని చెప్పాడు. అంత అరుదైన గుర్రం కోసం నేను రావడమే సముచితం, తప్పక వస్తాను అన్నాడు అక్బరు. (కానీ అతను మీకు ఆ గుర్రాన్ని వారంలో ఎనిమిదవ రోజు మాత్రమే అమ్ముతాడట' అన్నాడు బీర్బల్. అక్బరు ఇవాళ శుక్రవారం రేపు శనివారం ఎనిమిదవ రోజు ఏదంటే అని లెక్క వేస్తూ ఒక్కసారిగా నాలిక కరుచుకుని, "వారంలో ఎనిమిది రోజులు ఎలా ఉంటాయి నీ చమత్కారం కాకపోతే?' అన్నాడు. దానికి బీర్బల్ మరి ఆకు ప చ్చటి గుర్రం మాత్రం ఎలా ఉంటుంది జహాపనా? నేనేదో సరదాగా అంటే మీరు దాన్ని నిజంగా తీసుకు రమ్మంటే నేనేంచేయగలను? అన్నాడు బీర్బల్.

10 తేడాలు గుర్తించండి!





రంగులు వేయండి



సరైన నీడ ఏది?



డైలీ సుడోకు - 360

	2	3	7	1	8	4		
1						8		
	8	4	3	6		9	2	
			1			5	4	
			2		6			
	5	2			4			
	3	9		4	1	6	5	
		7						4
		8	5	2	7	1	3	

సుడోకు - 359 సమాధానం

2	8	5	6	7	4	9	1	3
1	4	3	8	5	9	7	2	6
9	7	6	1	2	3	4	8	5
8	3	9	5	6	7	1	4	2
7	6	4	3	1	2	5	9	8
5	1	2	4	9	8	3	6	7
3	5	8	9	4	6	2	7	1
4	2	1	7	8	5	6	3	9
6	9	7	2	3	1	8	5	4

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.

